సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 12

మంగళవారం 26-9-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



'డబుల్' ధమాకా...

ఆసియా క్రీడల్లో సోమవారం భారత్‌కు 2 స్వర్ణ పతకాలు, 4 కాంస్యాలు లభించాయి. పురుషుల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో భారత జట్టు ప్రపంచ రికార్డు నెలకొల్పి పసిడి పతకం నెగ్గింది. తొలిసారి బరిలోకి దిగిన భారత మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించింది. షూటింగ్‌లో రెండు కాంస్యాలు, రోయింగ్‌లో రెండు కాంస్యాలు దక్కాయి.

12లో



ప్రస్థానం ముగిసినట్లేనా!

'చంద్రయాన్‌-3' ల్యాండర్, రోవర్ స్లీప్‌మోడ్‌లోకి వెళ్లిపోయాయి. వీటి నుంచి సంకేతాలు అందడం లేదని ఇస్రో చెబుతోంది.

వివరాలు 6లో ▸



మోదీకి 50 లక్షల ఫాలోవర్లు

ప్రధాని మోదీ వాట్సాప్ చానల్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఆయన ఫాలోవర్ల సంఖ్య వారంలోనే 50 లక్షలకు చేరింది.

వివరాలు 6లో ▸



కరోనాను మించిన 'ఎక్స్' వైరస్!

కరోనాను మించిన వైరస్ 'ఎక్స్'.. త్వరలో ప్రపంచంలో కనీసం 5 కోట్ల మందిని బలి తీసుకోనుందని డబ్ల్యూహెచ్‌ఓ హెచ్చరిస్తోంది.

వివరాలు 6లో ▸



మరో 5 రోజులే..

రూ. 2 వేల నోట్ల మార్పిడికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుంది.

వివరాలు 6లో ▸

రాష్ట్రంలో భూ సంస్కరణలు ఓ విప్లవం

అన్ని ఆటంకాలనూ ఎదురొడ్డి సీఎం వైఎస్ జగన్ సంస్కరణలు తెచ్చారు

ఇవి పేదల జీవన స్థితిగతులను మారుస్తాయి.. గౌరవాన్ని పెంచుతాయి

- నాలుగేళ్లలోనే సీఎం జగన్ తెచ్చిన సంస్కరణలివి
- అసైన్డ్ భూములపై హక్కులు 15 లక్షల కుటుంబాల స్థితిని మారుస్తాయి.. 28 లక్షల ఎకరాలపై యాజమాన్య హక్కులు వస్తున్నాయి
- వందేళ్ల నాటి చుక్కల భూముల సమస్యను సీఎం జగన్ పరిష్కరించారు.. దళితవాడల్లో శ్మశానవాటికల ఏర్పాటుకు నిర్ణయం
- ఇళ్ల స్థలాలపైనా ఆటంకాల్లేవు.. 10 సంవత్సరాల తర్వాత అమ్ముకోవచ్చు.. 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలివ్వడం సామాన్యమైన విషయం కాదు
- భూమిని కొనేందుకే రూ.12 వేల కోట్లు ఖర్చు
- భూమి కొనడం కోసం ఇంత డబ్బు పెట్టిన ప్రభుత్వం ఎక్కడా లేదు.. సీఎం జగన్ చేపట్టిన రీ సర్వే కార్యక్రమం దేశానికే ఆదర్శం
- దేశంలో సమగ్ర సర్వే చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలవబోతోంది
- త్వరలో క్లియర్ టైటిల్‌తో ఉండే రాష్ట్రంగా ఏపీ
- కృశించిపోయిన రెవెన్యూ శాఖ రూపురేఖల్ని మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అసైన్డ్ భూముల చట్ట సవరణ, రీ సర్వేపై అసెంబ్లీలో జరిగిన చర్చలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు





సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన భూసంస్కరణలు ఓ విప్లవమని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అన్నింటినీ ఎదుర్కొని కేవలం నాలుగేళ్లలోనే ఈ సంస్కరణలు తెచ్చారని తెలిపారు. ఈ సంస్కరణలు రాష్ట్రంలోని లక్షలాది పేద కుటుంబాల జీవన స్థితిగతులను మారుస్తాయని, వారి గౌరవాన్ని పెంచుతాయని వివరించారు. సీఎం జగన్ చాలా దూరదృష్టితో ఆలోచించి

మిగతా 2వ పేజీలో ▶

'అసైన్డ్' రైతులకు యాజమాన్య హక్కులు


- 20ఏళ్లు దాటిన అసైన్డ్ భూ యజమానులకు సంపూర్ణ హక్కులు
- పదేళ్లు దాటిన ప్రభుత్వ ఇళ్ల పట్టాల బదిలీకి చట్ట సవరణ
- ఏపీ భూదాన్ బోర్డు ఏర్పాటుతో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ
- ఏపీపీఎస్సీ ద్వారా వర్సిటీల్లో అధ్యాపక, మినిస్టీరియల్ పోస్టుల భర్తీ
- బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కోరుతూ కేంద్రానికి తీర్మానం

2లో

అమరావతి.. ఓ ఆర్థిక అగాధమే

ఇప్పుడే కాదు.. భవిష్యత్తులోనూ గుదిబండే

చంద్రబాబు 'మాస్టర్' ప్లాన్‌ను ఎండగట్టిన కాగ్



- లోపభూయిష్ట భూ సమీకరణ విధానమే ప్రధాన కారణం
- విస్తారంగా దొరికే ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేట్ భూములా?.. రాజధానిపై నిపుణుల కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదు
- తగిన విధానం లేకుండా నామినేషన్‌పై మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ ఎంపిక.. ఆర్థిక ప్రణాళిక లేకుండా సీఆర్‌డీఏ రూ.33,476 కోట్ల ప్యాకేజీ ఒప్పందాలు
- నిబంధనలకు విరుద్ధంగా జలవనరుల పరిధిలో అనధికారిక గ్రీవెన్స్ సెల్ నిర్మాణం.. చేపట్టిన పనులను 2017 నుంచి 2019 ఫిబ్రవరి వరకు ప్రారంభించనే లేదు
- కాంట్రాక్టర్లకు 30 పనుల్లో రూ.1,282.83 కోట్లు అడ్డగోలుగా అడ్వాన్స్‌లు
- ఇంకా వసూలు చేయాల్సిన మొత్తం ఏకంగా రూ.944.36 కోట్లు
- నామినేషన్‌పై కన్సల్టెన్సీలు, కన్సల్టెంట్లకు ధారపోసింది రూ.28.96 కోట్లు
- లోపభూయిష్టంగా రూ.46,400 కోట్ల డీపీఆర్‌లు.. కేంద్రం వివరణ కోరినా స్పందించలేదు
- అమరావతిలో పేదలు, రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ అక్రమాలు
- టీడీపీ సర్కారు రాజధాని నిర్వాకాలను కడిగేసిన 'కాగ్' నివేదిక

2లో

న్యూస్‌రీల్

మంగుళూరు తీరంలో అరుదైన తిమింగలం



ప్రపంచంలోనే అత్యంత అరుదైన 'ఒమూరా వేల్' ఉనికిని కర్ణాటకలోని మంగుళూరు తీరంలో గుర్తించినట్లు ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ ఆర్.జయభాస్కరన్ వెల్లడించారు. భారత సముద్ర జలాల్లో వీటి ఉనికి ఇదే తొలిసారని చెప్పారు.

వివరాలు 14లో ▸

మూడు రోజులు వర్షాలే



రాష్ట్రంలో మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. కోస్తాంధ్రలో అనేక చోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

వివరాలు 5లో ▸

మానసిక క్షోభకు గురిచేస్తున్నారు



జైల్లో ఉన్న చంద్రబాబుతో ఆయన భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ములాఖత్ అయ్యారు. తన భర్తను ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేస్తోందని.. భోజనం చేసేందుకు టేబుల్ ఇవ్వడం లేదని నారా భువనేశ్వరి ఆరోపించారు.

వివరాలు 3లో ▸

ఉగ్రవాదానికి ఖలిస్తాన్..



భారత్‌లో ఖలిస్తాన్ కోసం వేర్పాటువాదం, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న సిఖ్స్ ఫర్ జస్టిస్ ఉగ్రసంస్థ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూ పెద్ద ప్రణాళికలే రచించారు. మతాల ప్రాతిపదికన భారత్‌ను విచ్ఛిన్నం చేసేందుకు సీఎఫ్‌జే కుట్ర పన్నిందని భారత నిఘా వర్గాల నివేదిక వెల్లడించింది.


వివరాలు 6లో ▸

మరో 5 రోజులు మా కస్టడీకి ఇవ్వండి

2 రోజుల కస్టడీలో విచారణకు చంద్రబాబు ఏ మాత్రం సహకరించలేదు

ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేసి.. సమయం వృథా చేశారు

- వీడియో చూస్తే బాబు కాలయాపన ఎత్తుగడలు అర్థమవుతాయి.. 2018–20 మధ్య పెద్దమొత్తంలో డబ్బు టీడీపీ ఖాతాల్లో జమైంది
- బాబు నుంచి కీలక సమాచారం సేకరించాల్సి ఉంది.. ఆయనను మా కస్టడీకి ఇవ్వండి
- ఏసీబీ ప్రత్యేక కోర్టును అభ్యర్థించిన సీఐడీ.. పిటిషన్ దాఖలు.. మంగళవారం విచారిస్తామన్న న్యాయస్థానం
- కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబుకు ఆదేశం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుని మరో 5 రోజులు తమ కస్టడీకి ఇవ్వాలంటూ సోమవారం విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ఇచ్చిన రెండు రోజుల కస్టడీలో తమ విచారణకు చంద్రబాబు ఏ మాత్రం సహకరించలేదని

మిగతా 5వ పేజీలో ▶

'గంటా' అంటే గయ్ గయ్!

- 'నారాయణ' పేరెత్తినా చంద్రబాబు చిర్రుబుర్రులు
- 'స్కిల్' స్కామ్ విచారణలో వారిద్దరి ప్రమేయంపై దాటవేత

3లో



పోలవరం జలాశయంతో ఎడమ కాలువను అనుసంధానం చేసే సొరంగం

పోలవరంలో మరో కీలక ఘట్టం

- జలాశయాన్ని ఎడమ కాలువతో అనుసంధానం చేసే సొరంగం పూర్తి
- 919 మీటర్ల పొడవు, 18 మీటర్ల వ్యాసం, 20వేల క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వకం
- టీడీపీ హయాంలో అంచనాలు పెంచి రూ.292.09 కోట్లకు కాంట్రాక్టర్‌కు కట్టబెట్టిన చంద్రబాబు
- దాన్నే కాంట్రాక్టు విలువగా నిర్ణయించి రివర్స్ టెండరింగ్ నిర్వహించిన సీఎం జగన్.. రూ.231.47 కోట్లకే ముందుకొచ్చిన అదే కాంట్రాక్టు సంస్థ
- ఖజానాకు రూ.60.62 కోట్లు ఆదా
- తద్వారా చంద్రబాబు కమీషన్ల బాగోతం గుట్టురట్టు

2లో

ఎన్డీయేను వీడిన అన్నాడీఎంకే



ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు ప్రధాన భాగస్వామ్య పక్షమైన అన్నాడీఎంకే పార్టీ ప్రకటించింది. తమిళనాడులో బీజేపీతో తమ స్నేహ బంధం ముగిసిందని ఆ పార్టీ నేతలు ప్రకటించారు. అన్నాడీఎంకే మనోభావాలకు వ్యతిరేకంగా బీజేపీ చర్యలు ఉన్నాయని.. అందుకే ఆ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించామన్నారు.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



..ఢిల్లీలోనే కదా సార్!

తిరుమలలో రథంపై భక్తులకు దర్శనమిస్తున్న మలయప్ప స్వామి



వైభవంగా మహారథోత్సవం

అశ్వవాహనంపై ఆనంద నిలయుడు

నేడు చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

5లో

ఓటుపై వేటు!

- సర్వేపల్లిలో సోమిరెడ్డి గ్యాంగ్ అడ్డదారులు
- ఆన్‌లైన్‌లో ఫారం 7 ద్వారా 11 వేలకుపైగా ఓట్ల తొలగింపు కోసం దరఖాస్తు.. ఈసారీ ఓటమి తప్పదనే భయంతో ప్రత్యర్థుల ఓట్లపై గురి
- స్పందనలో జేసీకి వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాజకీయ ప్రత్యర్థుల ఓట్లను తొలగించేందుకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో టీడీపీ పన్నిన కుట్రలు బట్టబయలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు తెలియకుండా వారి ఓట్లను తొలగించేందుకు ఆన్‌లైన్‌లో ఫారం 7 ద్వారా టీడీపీ నేతలు దరఖాస్తు చేయడం గమనార్హం. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, జేసీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్లు, పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశం మంగళవారం జరుగనున్నట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షించి..భవిష్యత్తులో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సీఎం జగన్ దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొంది.

ఏపీ విద్యా సంస్కరణలపై అధ్యయనం

- ఒక కమిటీ, రెండు వర్కింగ్ గ్రూపుల నియామకం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించడానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బకలారియెట్ (ఐబీ) సిలబస్‌ను ప్రవేశ పెడుతోంది. ఈ మేరకు ఐబీ సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఐబీ సిలబస్ అమలుపై అధ్యయనం చేసేందుకు మూడు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో ఒక స్టీరింగ్ కమిటీ, రెండు వర్కింగ్ గ్రూపులు ఉంటాయి. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సోమవారం జీవో 81 జారీ చేశారు. ఈ కమిటీలు ప్రస్తుతం ఉన్న ఎస్సెస్సీ బోర్డు, ఇంటర్మీడియట్ బోర్డుల్లో సంస్కరణలు తేవడం, ఐబీ సిలబస్‌కు అనుగుణంగా ఏటా తరగతుల పెంపుపై అధ్యయనం చేస్తాయి. 10 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఉమ్మడి సర్టిఫికెట్లు జారీ చేయడం వంటి కార్యక్రమాలపై మార్గదర్శకాలు రూపొందిస్తాయి.

పోలవరంలో మరో కీలక ఘట్టం



- జలాశయాన్ని ఎడమ కాలువతో అనుసంధానం చేసే సొరంగం పూర్తి
- 919 మీటర్ల పొడవు, 18 మీటర్ల వ్యాసం, 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వకం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల్లో మరో కీలక ఘట్టం పూర్తయింది. జలాశయాన్ని ఎడమ కాలువతో అనుసంధానం చేసే సొరంగం (టన్నెల్) తవ్వకం పనులు పూర్తయ్యాయి. 919 మీటర్ల పొడవుతో 18 మీటర్ల వ్యాసంతో 20 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఈ సొరంగం తవ్వకం పనులను పూర్తిచేశామని.. లైనింగ్ పనులను ప్రారంభించామని పోలవరం ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు 'సాక్షి'కి వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఈ పనుల అంచనా వ్యయాన్ని పెంచేసిన అప్పటి సీఎం చంద్రబాబు.. రూ.292.09 కోట్లకు కాంట్రాక్టు సంస్థకు అప్పగించి, కమీషన్లు వసూలుచేసుకున్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు ఆ కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసి.. రూ.292.09 కోట్లనే కాంట్రాక్టు విలువగా నిర్ణయించి.. రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. టీడీపీ సర్కార్ హయాంలో కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థే.. ఆ పనులను రూ.231.47 కోట్లకే చేయడానికి 2019, సెప్టెంబరు 19న ముందుకొచ్చింది. దీంతో ఖజానాకు రూ.60.62 కోట్లు ఆదా అయ్యాయి. దీని ద్వారా చంద్రబాబు కమీషన్ల బాగోతాన్ని సీఎం జగన్ రట్టుచేశారు. తక్కువ ఖర్చుతోనే సొరంగాన్ని పూర్తిచేయడం ద్వారా ప్రణాళికాబద్ధంగా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడంలో సీఎం మరో అడుగు ముందుకేశారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

అనుసంధానాల పనులు కొలిక్కి..

పోలవరం జలాశయం గరిష్ట నీటిమట్టం 45.72 మీటర్లు (194.6 టీఎంసీలు). కనిష్ట నీటిమట్టం 41.15 మీటర్లు (119.4 టీఎంసీలు). కుడి కాలువను 174 కిమీల పొడవున 17,633 క్యూసెక్కులు (1.52 టీఎంసీ) సామర్థ్యంతో తవ్వారు. ఈ కాలువ కింద మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తారు. ఈ కాలువను జలాశయంతో అనుసంధానం చేసేలా జంట సొరంగాలు (ఒక్కొక్కటి పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో), హెడ్ రెగ్యులేటర్‌ను 2020లో సీఎం జగన్ పూర్తిచేశారు. పోలవరం (గోదావరి)–ప్రకాశం బ్యారేజ్ (కృష్ణా)–బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీఆర్సీ) ద్వారా పెన్నాను అనుసంధానం చేసే పనుల్లో భాగంగా జంట సొరంగాల సామర్థ్యాన్ని 20 వేల నుంచి 40 వేల క్యూసెక్కులకు పెంచే పనులకు శ్రీకారం చుట్టారు. తాజాగా.. ఎడమ కాలువను అనుసంధానం చేసే సొరంగం తవ్వకం పనులు పూర్తి చేశారు. ఎడమ కాలువను 181.50 కిమీల పొడవున 17,561 క్యూసెక్కుల సామర్థ్యం (1.51 టీఎంసీ)తో చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటికే 91% పూర్తయ్యాయి. ఎడమ కాలువ కింద 4 లక్షల ఎకరాలకు నీళ్లందించాలి. పోలవరం ప్రాజెక్టులో నీటి మట్టం 40.54 మీటర్ల స్థాయిలో ఉంటే ఎడమ కాలువ.. 40.23 మీటర్ల స్థాయిలో ఉంటే కుడి కాలువ ద్వారా పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించవచ్చు. ఎడమ కాలువను అనుసంధానం చేసే సొరంగం పనులు తాజాగా పూర్తయ్యాయి. వరద తగ్గగానే హెడ్ రెగ్యులేటర్ పనులు ప్రారంభించి పూర్తిచేయనున్నారు.

ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసే దిశగా..

ఇక కమీషన్ల కోసం పోలవరం ప్రాజెక్టు పనులను అప్పటి సీఎం చంద్రబాబు అస్తవ్యస్తంగా మార్చితే.. సీఎం జగన్ వాటిని గాడిలో పెట్టి ప్రణాళికాబద్ధంగా చేపట్టి వడివడిగా పూర్తిచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్ వే, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేసి 2021, జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించారు. అలాగే, కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేపట్టిన పనులవల్ల గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు చక్కదిద్దే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ మేరకు వాటిని పూర్తిచేసి.. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టి ప్రాజెక్టు ఫలాలను శరవేగంగా రైతులకు అందించే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కాఫీ విత్ క్లాప్ మిత్ర

- సఫాయి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు
- పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

సాక్షి, అమరావతి: పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్ధి సాధించడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ ఎంతో ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ కొనియాడారు. వీరి సేవలను గౌరవిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు ప్రకటించారు. ఏలూరు జిల్లా భీమడోలులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్తంగా సోమవారం తాడేపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో 84 మంది పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. వీరి కృషిని, త్యాగాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి నిబద్ధతతో చర్యలు తీసుకుంటోందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల యోగ క్షేమాలను ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడే వారి ఆత్మ గౌరవానికి విలువ ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. సఫాయి కార్మికుల కోసం సంక్షేమ పథకాల రూపకల్పనలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిమగ్నమైందని వెల్లడించారు. కార్పొరేషన్ నుంచి నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ.. మహోన్నతమైన విశ్వ మానవ సౌధానికి సఫాయి కార్మికుల త్యాగాలే పునాదిరాళ్లని ప్రశంసించారు. కార్మికుల పిల్లల భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎండి చిన్నరాముడు, పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ సుధాకర్, సఫాయి కర్మచారి ఆందోళన్ ప్రతినిధి దీప్తి, బెజవాడ విల్సన్ పాల్గొన్నారు.

'అసైన్డ్' రైతులకు యాజమాన్య హక్కులు

- 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూ యజమానులకు సంపూర్ణ హక్కులు
- పదేళ్లు దాటిన ప్రభుత్వ ఇళ్ల పట్టాల బదిలీకి చట్ట సవరణ
- పది చట్ట సవరణ బిల్లులకు శాసన సభ ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నిరుపేద రైతులకు వారి అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కేటాయించి 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై వాటి యజమానులకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఏపీ అసైన్డ్ భూముల(ప్రొబిషన్ ట్రాన్స్‌ఫర్) చట్టం–1977 సవరణ బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది. దీనితో పాటు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు 10 ఏళ్ల తర్వాత యాజమాన్య హక్కులు బదిలీ చేసుకునే అవకాశాన్నిచ్చింది. సోమవారం శాసన సభ మూడో రోజు సమావేశాల్లో మంత్రులు ప్రవేశపెట్టిన 10 బిల్లులతో పాటు బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ చేసిన తీర్మానానికీ సభ ఆమోదం తెలిపింది.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య

రాష్ట్రంలోని విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు ప్రభుత్వం అనేక విద్యా సంస్కరణలు తీసుకొచ్చింది. తాజాగా ప్రైవేటు వర్సిటీలు కూడా అంతర్జాతీయంగా టాప్ 100 వర్సిటీలతో కలిసి సంయుక్త సర్టిఫికేషన్ తప్పనిసరిగా అందించేలా ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాలు (స్థాపన, క్రమబద్ధీకరణ) చట్టం–2016ను సవరించింది. ఇందులో కొత్తగా ఏర్పడే వర్సిటీల్లో 65 : 35 నిష్పత్తిలో ప్రభుత్వ కోటా (35శాతం సీట్లు) కింద పేద విద్యార్థులకు చదువుకొనే అవకాశాన్ని కల్పిస్తోంది. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లోని అధ్యాపక, మినిస్టీరియల్ పోస్టుల భర్తీకి రాతపూర్వక పరీక్షలను ఏపీపీఎస్సీ ద్వారా చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (వర్సిటీల్లో నియామకాలకు అదనపు ఫంక్షన్లు) చట్టం–2023లో సవరణ చేసింది.

నిరుపేదలకు భూ పంపిణీ

రాష్ట్రంలో భూదాన్–గ్రామదాన్ బోర్డును ప్రభుత్వమే స్వయంగా ఏర్పాటు చేసేలా చట్టాన్ని సవరించింది. భూదాన్ ఉద్యమకర్త వినోభా భావే, ఆయన నిర్దేశించిన వ్యక్తుల సమ్మతి ప్రకారమే భూదాన్ – గ్రామదాన్ బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వినోభా భావే మరణించి నాలుగు దశాబ్దాలు గడుస్తోంది. ఆయన నిర్దేశించిన వ్యక్తులు ఎవరనేది స్పష్టత లేకపోవడంతో బోర్డు ఏర్పాటుకు అవాంతరాలేర్పడుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వమే బోర్డును ఏర్పాటు చేసి భూదాన్ – గ్రామదాన్‌లోని భూమిని నిరుపేదలకు కేటాయించేలా చర్యలు చేపట్టేలా చట్టాన్ని సవరించింది.

డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి జఫ్రీన్‌కు ఉద్యోగం

రాష్ట్రానికి చెందిన డెఫ్ ఒలింపిక్ విజేత, అంతర్జాతీయ డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్‌కు వ్యవసాయ, సహకార శాఖలో సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌గా గ్రూప్–1 స్థాయి ఉద్యోగాన్ని కల్పిస్తూ ఏపీ పబ్లిక్ సర్వీసుల నియామకాలు క్రమద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూపాన్ని హేతు బద్ధీకరించే చట్టం–1994ను సవరించింది. జఫ్రీన్ క్రీడారంగంలో దేశానికి అందించిన విశిష్ట సేవలను గౌరవిస్తూ ఈ ఉద్యోగాన్ని ఇచ్చింది.

దేవదాయ ఆస్తుల ఆక్రమణలపై కఠిన చర్యలు

రాష్ట్రంలోని ఆలయాల ద్రవ్య పరిమితుల్లో ఎప్పటికప్పుడు మార్పులొస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ధార్మిక, హిందూమత సంస్థలు, ఎండోమెంట్లు చట్టం–1987 సవరణ చేసింది. చట్టంలో స్వల్ప మార్పు ద్వారా అధిక ఆదాయ పరిమితులను ఎప్పటికప్పుడు సవరించడానికి ప్రభుత్వానికి వీలుంటుంది. మరోవైపు కౌలు గడువు ముగిసినప్పటికీ, షాపుల లైసెన్స్ కాలం తీరినప్పటికీ ఎండోమెంట్ ఆస్తులను చాలా మంది వారి ఆధీనంలో పెట్టుకుంటున్నారు. వీరిపై కేసులు పెట్టినా చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకుని తప్పించుకుంటున్నారు. తాజా చట్ట సవరణ ద్వారా వీరిని ఆక్రమణదారులుగానే పరిగణిస్తారు. వీరిపై కఠిన చర్యలు తీసుకునేందుకు, ఇలాంటి కేసులను బెయిల్ లేని వారెంట్‌గా పరిగణించేలా చట్ట సవరణ చేసింది. దీంతో అసిస్టెంట్ కమిషనర్ పరిధులను కూడా చట్టంలో సవరించింది.

ఆర్టీసీకి చెందిన 50వేల మంది ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలకు కొత్త రూల్స్ వచ్చేలోగా పాత సీసీఏ రూల్స్‌ను కొనసాగించేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసులోకి చేర్చడం) చట్టం–2019 సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను విధింపు చట్టం –1963లో రెండు సవరణ బిల్లులను కూడా శాసన సభ ఆమోదించింది. కేంద్ర జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాల మేరకు జీఎస్టీ చట్టంలో మార్పులు చేస్తూ ఆంధ్రప్రదేశ్ వస్తువులు, సేవల పన్ను చట్టం–2017ను సవరించింది.

అమరావతి.. ఓ ఆర్థిక అగాధమే

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి రాష్ట్రంపై అంతులేని భారీ ఆర్థిక భారాన్ని మోపుతుందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తక్షణంతో పాటు భవిష్యత్తులోనూ మోయలేని ఆర్థిక భారాన్ని కలిగిస్తుందని స్పష్టం చేసింది. ఇందుకు ప్రధాన కారణం గత సర్కారు గ్రీన్ ఫీల్డ్ రాజధాని పేరుతో నిపుణుల కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, ప్రభుత్వ భూములు విస్తారంగా అందుబాటులో ఉండే ప్రదేశాలను వదిలేసి బయటి వ్యక్తుల నుంచి చాలా ఎక్కువ భూమిని పూలింగ్‌తో సేకరించడమేనని స్పష్టం చేసింది. ఈమేరకు కాగ్ సమర్పించిన తనిఖీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీకి సమర్పించింది. ఇందులో ప్రధానంగా అమరావతి విషయంలో టీడీపీ సర్కారు అనుసరించిన విధానాలను, భూ సమీకరణను కాగ్ తీవ్రంగా తప్పుబట్టింది.

అంతా అసమగ్రం

రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులపై మూడు సార్లు ఆడిట్ నిర్వహించినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది. గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని ఎంచుకునేటప్పుడు పరిగణనలోకి తీసుకున్న కీలక పరిమితులు, రాజధాని నగర అభివృద్ధికి భూమి వాస్తవ అవసరాన్ని అంచనా వేసేందుకు చేపట్టిన సాధ్యాసాధ్యాల అధ్యయన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించలేదని కాగ్ తప్పుబట్టింది. రాజధాని నగర అభివృద్ధికి సంబంధించిన మొత్తం ప్రాజెక్టు ప్రణాళిక వివరాల్లో సమగ్రత లేదని పేర్కొంది. అమరావతిలో ఏకరీతిలో భూ కేటాయింపుల విధానాన్ని అమలు చేయలేదని, వివిధ ప్రైవేట్ సంస్థలకు ఏకపక్షంగా కేటాయింపులు జరిగాయని కాగ్ నివేదిక ఎండగట్టింది. చేపట్టిన పనులన్నీ 2017 నవంబర్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు ప్రారంభించలేదని, దీంతో ఎల్‌పీఎస్ (ల్యాండ్ పూలింగ్ స్కీమ్) మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం సాధ్యం కాలేదని కాగ్ పేర్కొంది. రహదారి పనులతో కూడిన ప్రాధాన్యత కలిగిన మౌలిక సదుపాయాలను సరైన అంచనా, ప్రాథమిక సర్వే లేకుండా చేపట్టడంతో పనుల పురోగతి దెబ్బతిందని కాగ్ తెలిపింది. అమరావతి రాజధాని అభివృద్ధిలో నిపుణుల కమిటీ సిఫార్సులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని తప్పుబట్టింది. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెంట్లపై తగిన విధానాన్ని అనుసరించకుండా నామినేషన్ పద్ధతిలో ఎంపిక చేశారని కాగ్ పేర్కొంది.

ప్రణాళిక లోపం.. వ్యయంపై ప్రభావం

స్పష్టమైన ఆర్థిక ప్రణాళిక లేకుండా ఏపీ సీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌లు రూ.33,476.23 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్యాకేజీల కోసం ఒప్పందాలను కుదుర్చుకున్నాయని కాగ్ నివేదికలో ప్రస్తావించింది. రాజధాని నగర అభివృద్ధిపై విధానపరమైన మార్పు ఫలితంగా 2019 మే నుంచి కాల పరిమితి లేని ఒప్పందాల ప్యాకేజీలు అనిశ్చితిగా ఉన్నాయని తెలిపింది. గత సర్కారు హయాంలో నిబంధనలకు విరుద్ధంగా జలవనరుల పరిధిలో అనధికారికంగా గ్రీవెన్స్ సెల్ భవన నిర్మాణానికి ఏపీ సీఆర్‌డీఏ అనుమతి ఇవ్వడాన్ని కాగ్ తప్పుబట్టింది. రాజధాని నగరానికి భూమి వాస్తవ అవసరాలను అంచనా వేసేందుకు సాధ్యాసాధ్యాల అధ్యయనం రికార్డులను సీఆర్‌డీఏ అందించలేదని కాగ్ పేర్కొంది. పర్యవసానంగా ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం లేనందున ఎల్‌పీఎస్ ద్వారా సేకరించిన భూమి అవసరం హేతుబద్ధతను నిర్ధారించలేకపోయినట్లు కాగ్ వెల్లడించింది. దశలవారీ ప్రణాళిక లేకపోవడంతో ప్రాజెక్టుల వ్యయంపై ప్రభావం పడిందని, కార్యాచరణ ప్రణాళికను సూచించడానికి సలహా కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ కమిటీ సిఫార్సులను ఆడిట్‌కు అందుబాటులో ఉంచలేదని కాగ్ తెలిపింది.

కేంద్రం వివరణ కోరినా..

టీడీపీ సర్కారు నిర్దిష్ట విధివిధానాలను అనుసరించకుండా కన్సల్టెన్సీ సంస్థలు, కన్సల్టెంట్లను ఎంపిక చేసినట్లు కాగ్ నివేదిక పేర్కొంది. రాజధాని నగర ప్రణాళిక ప్రక్రియలో ఏపీ సీఆర్‌డీఏ టెండరింగ్, కాంపిటేటివ్ బిడ్డింగ్ విధివిధానాలను అనుసరించకుండా మూడు కన్సల్టెన్సీ సంస్థలకు రూ.28.96 కోట్ల ఒప్పంద విలువతో నామినేషన్ ప్రాతిపదికన ఇచ్చినట్లు కాగ్ తెలిపింది. రాజధాని నగరానికి సంబంధించి రూ.1,09,023 కోట్ల అంచనాతో డీపీఆర్‌లు రూపొందించినప్పటికీ వీటిలో రూ.46,400 కోట్ల మేర డీపీఆర్‌లను నీతి ఆయోగ్‌కు సమర్పించలేదని వెలుగులోకి తెచ్చింది. డీపీఆర్‌లు లోపభూయిష్టంగా ఉన్నాయని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం దీనిపై వివరణ కోరినా గత సర్కారు సమర్పించలేదని కాగ్ తెలిపింది.

రూ.44.24 కోట్లు రోడ్ల పాలు..!

అమరావతిలో భూమిలేని పేదలు, రైతులకు పెన్షన్ల చెల్లింపులు, యాన్యుటీ చెల్లింపుల్లోనూ అవకతవకలు జరిగాయని కాగ్ నివేదిక పేర్కొంది. 110 కేసుల్లో పెన్షన్లు, యాన్యుటీ రెండూ చెల్లించారని కాగ్ వెలుగులోకి తెచ్చింది. రాజధానిలో 30 పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు 2016–17 నుంచి 2018–19 మధ్య కాలంలో రూ.1,282.83 కోట్లు అడ్వాన్సులు ఇచ్చారని, ఇందులో రూ.338.57 కోట్లు మాత్రమే ఇప్పటివరకు వసూలు చేశారని, మిగతా రూ.944.36 కోట్లను వసూలు చేయలేదని కాగ్ పేర్కొంది. సీడ్ యాక్సెస్ రోడ్డును నాలుగు వరుసల నుంచి తొమ్మిది వరుసలు చేసేందుకు రహదారి విస్తరణ పనులు చేపట్టగా జాతీయ రహదారులకు అనుసంధానించకపోవడం, భూ సేకరణ సమస్య కారణంగా రూ.44.24 కోట్లు అనాలోచితంగా వ్యయం చేసినట్లు కాగ్ తప్పుబట్టింది.

రాష్ట్రంలో భూ సంస్కరణలు ఓ విప్లవం

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సంస్కరణలు తెచ్చారని తెలిపారు. భూమి యాజమాన్యం, వినియోగదారులకు సంబంధించి ఈ నాలుగేళ్లు ఎంతో ప్రత్యేకమని చెప్పారు. 'అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ – రాష్ట్రంలో భూముల సమగ్ర సర్వే – పేదల కోసం చుక్కల భూముల సంస్కరణలు' అనే అంశంపై సోమవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా 15 లక్షల కుటుంబాలకు మేలు జరుగుతుందని చెప్పారు. 28 లక్షల ఎకరాల భూమిపై ఒకేసారి యాజమాన్య హక్కులు రాబోతున్నాయని తెలిపారు. భూమి టైటిల్ ఫ్రీగా ఉంటే పెట్టుబడులు తెస్తుందని, దానివల్ల ఉద్యోగాలు వస్తాయని, తద్వారా జీడీపీ పెరిగి రాష్ట్రం వృద్ధిలోకి వస్తుందని తెలిపారు. భూమిని సరిగా వినియోగంలోకి తీసుకురాలేకపోతే అది సరైన పాలన కాదని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలూ భూమిని లిటిగేషన్ ఫ్రీ చేస్తున్నాయని చెప్పారు. భూమి వినియోగంలో లేకుండా చేస్తే చెడు ప్రభావాలు పెరుగుతాయన్నారు. అసైన్డ్ భూముల చట్ట సవరణ భూమిని అమ్మడానికి చేసినది కాదని, వాటిపై సర్వ హక్కులు కల్పించడం కోసమని చెప్పారు. ఎప్పుడైనా దాన్ని ఉపయోగించుకునేలా ప్రైవేటు భూమితో సరిసమానమైన హక్కులు కల్పించామన్నారు. సీఎం వైఎస్ జగన్ తెచ్చిన ఈ సంస్కరణలను ప్రజలు బాగా స్వీకరించారని, ఇంత పెద్ద సమస్యకు ఆర్డినెన్స్ ఇస్తే ఒక్క విమర్శ కూడా రాలేదన్నారు. అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు దాటితే యాజమాన్య హక్కులు లభిస్తాయన్నారు. ఈ భూముల యజమానులు ఎన్‌ఓసీ తెచ్చుకోవాల్సిన అవసరం లేదని, ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేదని చెప్పారు. అధికారులు వీటి జాబితాను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపుతారని, ప్రజలకు ఇబ్బంది లేకుండా అక్కడ ప్రక్రియ అంతా జరుగుతుందని చెప్పారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచిన వాడే నాయకుడు

ప్రజల కష్టాలను తగ్గించి, జీవన ప్రమాణాలు పెంచి, వారి గుండెల్లో చిరకాలం ఉండే వాడు, పెద్ద ఎత్తున జరిగే దాడిని తట్టుకుని సంస్కరణలు చేయగలిగిన వాడే నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడే వైఎస్ జగన్ అని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చే సమయానికి పేదలకు భూమి ఇస్తే, అది మళ్లీ ధనవంతుల దగ్గరకు చేరిపోయే పరిస్థితి ఉందని, అందుకే పేదలకిచ్చిన భూముల్ని అమ్మకూడదని, వ్యవసాయం మాత్రమే చేయాలని నిబంధన పెట్టారని తెలిపారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేనందున, ఇంకా భూమిని ప్రభుత్వం చేతుల్లోనే పెట్టుకోవడం సరికాదని, ఆ భూములపై వారికి సర్వ హక్కులు ఇవ్వాల్సిందేనని సీఎం జగన్ భావించారని తెలిపారు. పేద రైతుల గౌరవాన్ని పెంచడానికి అసైన్డ్ భూముల చట్టానికి సీఎం సవరణ చేశారని తెలిపారు. దీనివల్ల 15 లక్షల కుటుంబాల సామాజిక స్థితి మారి, వారికి గౌరవం ఏర్పడుతుందన్నారు. 28 లక్షల ఎకరాల భూమిపై ఒకేసారి యాజమాన్య హక్కులు రాబోతున్నాయని తెలిపారు. ఎవరూ కోరకుండానే సీఎం జగన్ ఈ సంస్కరణలు తెచ్చారని తెలిపారు. దీనిపై బాగా అధ్యయనం చేశామని, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు వెళ్లి చూశామని, అన్నింటిపైనా చర్చించిన తర్వాత అక్కడికంటే సరళంగా సీఎం చట్టాన్ని మార్చారని చెప్పారు.

వైఎస్సార్ తర్వాత మళ్లీ ఇప్పుడే భూ పంపిణీ

అనాధీన భూములను క్రమబద్ధీకరించి, వందేళ్లుగా ఉన్న చుక్కల భూముల సమస్యనూ సీఎం జగన్ పరిష్కరించారని చెప్పారు. దీనిద్వారా 2.50 లక్షల ఎకరాలు విముక్తి పొందాయని, ఆ రైతులకు హక్కులు వచ్చాయని తెలిపారు. దళితవాడల్లో భూమి కొని అయినా శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించినట్లు తెలిపారు. భూ పంపిణీ ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాంలో జరిగిందని, అప్పట్లో 7 లక్షల ఎకరాలు ఇచ్చామని తెలిపారు. మళ్లీ ఇప్పుడు భూ పంపిణీ చేయాలని సీఎం జగన్ నిర్ణయించారని తెలిపారు. సాగుకు యోగ్యమైన భూమిని గుర్తించారని, త్వరలో సభ పెట్టి పంపిణీ ప్రారంభిస్తారని చెప్పారు. అసైన్డ్ భూముల చట్టంలో ఇళ్ల స్థలాలపై ఉన్న ఆటంకాన్ని కూడా ముఖ్యమంత్రి ఎత్తివేశారని, 10 సంవత్సరాల తర్వాత ఆ స్థలాలను అమ్ముకోవచ్చని తెలిపారు.

గొప్ప విషయం

31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం గొప్ప విషయమని మంత్రి చెప్పారు. ఇందుకోసం భూమిని కొనడానికి రూ. 12 వేల కోట్లు ఖర్చయినా సీఎం జగన్ వెనకడుగు వేయలేదని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ 75 సంవత్సరాల్లో పేదల కోసం భూమి కొనడానికి రూ.12 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్ జగన్ ప్రభుత్వమేనని చెప్పారు. ఆ కాలనీల్లో సౌకర్యాలు కల్పించడానికి ఇంకా చాలా ఖర్చు పెడుతున్నామని తెలిపారు. ఈ స్థలాల లేఅవుట్లు, అక్కడ కల్పిస్తున్న వసతులు చూసి అక్కడికి వెళ్లాలని చాలామంది అనుకుంటున్నారని తెలిపారు. ఇదంతా కేవలం రెండేళ్లలోనే వచ్చిందన్నారు. ఈర్ష్యతో ఉన్న వాళ్లు తప్ప ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రశంసించకుండా ఎవరుంటారని ప్రశ్నించారు.

సర్వే జరక్కపోవడం వల్లే గ్రామాల్లో వివాదాలు

బ్రిటిషర్ల కాలంలో భూముల సర్వే జరిగిందని, అప్పటి నుంచి మళ్లీ సర్వే జరక్కపోవడం వల్ల గ్రామాల్లో ఎన్నో వివాదాలు నెలకొన్నాయని చెప్పారు. వీటన్నింటినీ పరిష్కరించడానికి సీఎం వైఎస్ జగన్ రీ సర్వే ప్రారంభించారని తెలిపారు. 17 వేల గ్రామాలకుగానూ 4 వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని, రెండు నెలలకు 2 వేల గ్రామాల్లో సర్వే పూర్తవుతుందని తెలిపారు. 15 శాతం మందికి ఖాతా నంబర్లు కూడా లేవని, 1.20 లక్షల మందికి ఎఫ్‌ఎంబీలు కూడా కనిపించడంలేదన్నారు. ఒక్క సర్వే జరిగితే ఇలాంటివన్నీ పరిష్కారమవుతాయన్నారు. 5 సెంటీమీటర్ల కచ్చితత్వంతో సర్వే చేస్తున్నామన్నారు. ఇందుకోసం 10 వేల మంది సర్వేయర్లను నియమించామని, పరికరాల కోసం ఇప్పటికే రూ.500 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. దేశంలో సమగ్రమైన సర్వే చేసిన రాష్ట్రంగా ఏపీ ఆదర్శంగా నిలవబోతోందన్నారు. దీనివల్ల ప్రయోజనం పొందుతున్న ఏ ఒక్క రైతు పైసా పెట్టక్కర్లేదన్నారు. ఇవన్నీ భవిష్యత్ తరాల కోసం చేసే పనులని, రాజనీతిజ్ఞులే ఈ పనులు చేస్తారని చెప్పారు.

ఇవన్నీ ఓట్ల కోసం చేసేది కాదు

ఒక స్కూల్ పిల్లాడికి అవసరమైన అన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్నారని మంత్రి చెప్పారు. పుస్తకాలు, బ్యాగ్, యూనిఫాం, బూట్లు, సాక్సులు ఇవ్వడం.. మంచి టీచర్‌ను పెట్టడం, వారికి భోజనం పెట్టడం.. ఒకవేళ వాళ్లమ్మ పనికి పంపేస్తుందనే భయంతో ఆమెకు డబ్బులివ్వడం.. ఇవన్నీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం సీఎం జగన్ చేస్తున్న కార్యక్రమాలని తెలిపారు. ఓట్ల కోసం కాదని చెప్పారు. తల్లితండ్రులు, పిల్లల కోసం దేశంలో ఎక్కడా లేని మంచి విద్యా వ్యవస్థను సీఎం జగన్ ఇక్కడ తెచ్చారన్నారు. టీచర్లంటే తనకు చాలా అభిమానం ఉందని, వారిపై వ్యతిరేకత లేదని చెప్పారు. వారు కోరకుండానే విద్యా వ్యవస్థలో మార్పు వచ్చిందని, దీన్ని అభినందిస్తూ ఒక తీర్మానం చేయాలని అన్నానని, దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. అవసరమైతే తన మాటలను ఉపసంహరించుకుంటానని చెప్పారు.

ప్రతి సెక్రటేరియట్ ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయం

సామాన్యులు త్వరతగతిన రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి సీఎం జగన్ కొత్తగా టైటిలింగ్ యాక్ట్ తెస్తున్నారని చెప్పారు. దీనిద్వారా రిజిస్ట్రేషన్‌తోపాటే మ్యుటేషన్ కూడా జరిగిపోతుందన్నారు. ప్రతి గ్రామ సెక్రటేరియేట్ ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయం కానుందన్నారు. కొత్త చట్టం వచ్చాక ఆర్ఓఆర్ చట్టం ఉండదన్నారు. ఒకే ఆస్తిని రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయడం వంటివి ఉండవన్నారు. క్లియర్ టైటిల్‌తో ఉండే రాష్ట్రంగా ఏపీ నిలవబోతోందన్నారు. వంద సంవత్సరాలుగా కృశించిపోయిన రెవెన్యూ శాఖను సీఎం జగన్ కోట్లాది మంది ఆకాంక్షలకు అనుగుణంగా మార్చారని తెలిపారు. వెబ్ ల్యాండ్‌లో తప్పులు సవరణకు తహశీల్దార్‌కి అధికారాలిచ్చినట్టు తెలిపారు. ఎస్సీ కోఆపరేటివ్ భూములకు పట్టాలివ్వడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. దేవాలయాల సర్వీస్ ఈనాం భూములపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

రెవెన్యూలో విప్లవాత్మక మార్పులు



రెవెన్యూ వ్యవస్థలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. అసైన్డ్ భూములపై హక్కులు నిరుపేదలకు వరం. రెవెన్యూ లోపాలపై వైఎస్ జగన్ ప్రభుత్వం గట్టిగా దృష్టి సారించి, వాటిని సవరిస్తోంది. హక్కుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తోంది. ఇది పేదల ప్రభుత్వమని మరోసారి నిరూపించింది.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసన వ్యవహారాల సమన్వయకర్త

అసైన్డ్ భూముల్ని బాబు దోచుకున్నారు..



చంద్రబాబు అసైన్డ్ భూములను దోచుకుంటే, సీఎం వైఎస్ జగన్ వాటిపై పేదలకు హక్కులు కల్పించారు. బాబు హయాంలో క్యాపిటల్ రీజియన్‌లో 1,400 ఎకరాల అసైన్డ్ భూములను దోచుకున్నారు. సీఆర్‌డీఏ పరిధిలో అసైన్డ్ రైతులను భయపెట్టి వారి భూముల్ని లాక్కున్నారు. చుక్కల భూములు, షరతుల గల భూములు వంటి లక్షల ఎకరాలపై హక్కులివ్వడం ఎప్పుడూ జరగలేదు. సమగ్ర భూ సర్వేను స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రభుత్వం చేపట్టలేదు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ఈ సర్వే జరుగుతోంది.

– డాక్టర్ ఎం జగన్మోహనరావు, నందిగామ ఎమ్మెల్యే

అసైన్డ్ హక్కులు చరిత్రాత్మకం



అసైన్డ్ భూములపై సీఎం వైఎస్ జగన్.. హక్కులు కల్పించడం చరిత్రాత్మకం. అనేక జటిలమైన సమస్యలకు సీఎం జగన్ ఈరోజు పరిష్కారాలు చూపిస్తున్నారు. చంద్రబాబు కార్పొరేట్ శక్తుల్ని ప్రేమిస్తే.. జగన్ కార్మికుల్ని ప్రేమిస్తారు. భూమాతను కొందరికే సొంతం చేసిన చరిత్ర బాబుది. అదే భూమిని పేదలకిచ్చి వారికి హక్కులు కల్పించిన చరిత్ర సీఎం జగన్‌ది. బాబు రాజమండ్రిలో ప్రజలను చంపిన చోటే దేవుడు జైల్లో పెట్టాడు.

– టీజేఆర్ సుధాకర్‌బాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే

అభినవ కొమరం భీం జగన్



అసైన్డ్ భూములకు సీఎం వైఎస్ జగన్ సంపూర్ణమైన యాజమాన్య హక్కులు కల్పించడం చరిత్రాత్మకం. ఈ నిర్ణయం లక్షలాది రైతుల జీవితాల్లో గొప్ప మార్పు తెస్తుంది. గిరిజన ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ భూములకు ఇప్పుడు రుణాలు ఇస్తున్నారు. గిరిజనులకు భూములపై సర్వ హక్కులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినవ అంబేద్కర్.. అభినవ కొమరం భీం.

– కె. భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే

క్లుప్తంగా...

ఉండవల్లిపై విమర్శలు చేస్తే టీడీపీకి తగిన శాస్త్రి

ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సీఎం నారా చంద్రబాబు తన కొడుకు లోకేశ్ చేసిన తప్పిదాల కారణంగానే జైలుకు వెళ్లారని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ అన్నారు. స్కిల్ స్కాంను సీబీఐ చేత విచారణ జరిపించాలని పిల్ దాఖలు చేసిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను టీడీపీ నాయకులు దుర్భాషలాడడాన్ని ఆయన ఖండించారు. ఆయన సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాంక్షించి ఉండవల్లి అరుణ్‌కుమార్ గతంలో పోలవరం, ప్రత్యేక హోదాపై సుప్రీంకోర్టులో కేసులు వేసినప్పుడు మాట్లాడని పెద్ద మనుషులు, ఈ రోజు విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఐవైఆర్ కృష్ణారావు, ఎల్వీ సుబ్రహ్మణ్యంపై ఇదే తీరుగా టీడీపీ నాయకులు విమర్శలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేని పక్షంలో ఎన్నికల్లో తగిన శాస్త్రి చేస్తామని హెచ్చరించారు. ప్రయాగ కృష్ణ, చల్లా సుధాకర్ పాల్గొన్నారు.

సాక్ష్యాధారాలతోనే సీఐడీ ముందడుగు: ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: మాజీ సీఎం చంద్రబాబు హయాంలో రూ.వేల కోట్ల విలువైన భారీ స్కామ్‌లు జరిగాయని, ఆయన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం చాలా చిన్నదని ఎంపీ మార్గాని భరత్ రామ్ చెప్పారు. ఎంపీ భరత్ సోమవారం రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారని టీడీపీ నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. ఈ కేసులో అన్ని సాక్ష్యాధారాలతోనే సీఐడీ ముందడుగు వేసిందని తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేస్తే కోర్టు రిమాండ్ విధిస్తుందా.. అని ప్రశ్నించారు. చంద్రబాబు సచ్ఛీలుడు అయితే సీఐడీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు.

రాజధాని అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి

1,093వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: చంద్రబాబు హయాంలో రాజధాని పేరుతో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేసి, ఈ ప్రాంతంలో నష్టపోయిన రైతులు, బహుజనులకు న్యాయం చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 1,093వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ పేద రైతులను బెదిరించి లంక, అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని చట్టబద్ధం చేసి రూ.కోట్లు కొల్లగొట్టిన చంద్రబాబు, ఆయన బినామీలను విచారిస్తే అసలు బాగోతం బయటపడుతుందన్నారు. నాయకులు బొలిమేర శామ్యూల్, మాదిగాని గురునాథం, పెరికె వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు, పుష్పరాజ్ పాల్గొన్నారు.

‘గంటా’ అంటే గయ్ గయ్!

‘నారాయణ’ పేరెత్తినా చంద్రబాబు చిర్రుబుర్రులు.. ‘స్కిల్’ స్కామ్‌లో వారిద్దరి ప్రమేయంపై దాటవేత

- గంటా సుబ్బారావుకు ఏకకాలంలో నాలుగు పోస్టులు
- రిటైర్డ్ అధికారి, బాబు బాల్య స్నేహితుడు లక్ష్మీనారాయణది కీలక పాత్ర
- వారిద్దరి ద్వారానే నకిలీ ఒప్పందంతో కుంభకోణం
- నిధుల తరలింపులో కీలకంగా పెండ్యాల, పార్థసాని, యోగేశ్ గుప్తా
- వారి ప్రస్తావన తేగానే ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: యాదృచ్ఛికమో.. తనకు కలిసొస్తుందని భావించారో తెలియదుగానీ మాజీ సీఎం చంద్రబాబు అక్రమాల పరంపర రెండు పేర్లతో ప్రత్యేకంగా ముడిపడి ఉండటం గమనార్హం. వీటిలో ఒక పేరు ‘గంటా’ అయితే మరోపేరు ‘లక్ష్మీనారాయణ’!! విచారణ సమయంలో ఈ పేర్లు వింటేనే మాజీ సీఎం చంద్రబాబు గయ్ గయ్‌మంటున్నారు! ఏదో చెప్పలేని గుబులు ఆయనలో మొదలవుతోంది! అటు అమరావతిలో అసైన్డ్ భూముల దోపిడీలో.. ఇటు స్కిల్ కుంభకోణంలోనూ ఈ రెండు పేర్లు ప్రధానంగా తెరపైకి వచ్చాయి. అసైన్డ్ భూముల వ్యవహారంలో మాజీ మంత్రులు, వియ్యంకులైన గంటా శ్రీనివాసరావు, పొంగూరు నారాయణ కీలకం కాగా స్కిల్ స్కామ్‌లో గంటా సుబ్బారావు, రిటైర్డ్ అధికారి లక్ష్మీ నారాయణ ద్వారా చంద్రబాబు ప్రజాధనాన్ని కొల్లగొట్టారు!



చిర్రుబుర్రులు..

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం సీఐడీ కస్టడీలో రెండు రోజుల పాటు విచారణ సందర్భంగా గంటా సుబ్బారావు, లక్ష్మీ నారాయణ పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించినప్పుడు చంద్రబాబు హడలిపోయారు! మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లుగా స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతి గుట్టు అంతా వారిద్దరి గుప్పిట్లోనే ఉంది మరి!! అందుకే వారి పేర్లను ఎందుకు ప్రస్తావిస్తున్నారంటూ చంద్రబాబు అంతెత్తున లేచారు. మరికొందరు పేర్లను ప్రస్తావిస్తూ వారిని ఎందుకు విచారించరంటూ దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారు. అక్రమ నిధుల తరలింపులో పాత్రధారులైన పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాల గురించి అధికారులు ప్రస్తావించగానే చంద్రబాబు చిర్రుబుర్రులాడుతూ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. ఇంతకీ గంటా సుబ్బారావు, లక్ష్మీ నారాయణలతోపాటు పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించగానే చంద్రబాబు ఎందుకు అంతగా బెంబేలెత్తిపోయారన్నది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే...??

అంతా ఒకే ఒక్కరే.. గంటా

2014లో అధికారంలోకి రాగానే ప్రజాధనాన్ని వేగంగా కొల్లగొట్టేందుకు చంద్రబాబు మార్గాలను అన్వేషించారు. అందుకోసం ఏర్పాటు చేసిందే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)! తన అక్రమాలకు అక్షయపాత్రగా భావించిన ఏపీఎస్ఎస్‌డీసీ పూర్తిగా తన సొంత మనుషుల చేతిలో ఉండాలని ఆయన భావించారు. అందుకే ఆ సంస్థను నిబంధనలకు విరుద్ధంగా తనకు సన్నిహితులైన ప్రైవేట్, రిటైర్డ్ వ్యక్తుల గుప్పిట్లో పెట్టారు. వారిలో ఒకరు గంటా సుబ్బారావు. ఆయన ప్రభుత్వ అధికారి కాదు. కానీ ఏకంగా ఏపీఎస్ఎస్‌డీసీతోపాటు ఆ సంస్థ వ్యవహారాలతో సంబంధం ఉన్న మరో మూడు పోస్టులూ కట్టబెట్టేశారు. గంటా సుబ్బారావును ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్–చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఎండీ–సీఈవో)గా నియమించారు. అంతటితో ఆగలేదు. మొదట్లో ఏపీఎస్ఎస్‌డీసీని ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీంతో సంస్థ బిల్లులను ఉన్నత విద్యా శాఖ ద్వారా పంపించాలి. ఈ క్రమంలో ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి వద్దకు ఫైళ్లు వెళ్లకుండా పాస్ చేసేందుకు మరో ఎత్తుగడ వేశారు. గంటా సుబ్బారావును ఉన్నత విద్యా శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియమించారు. అనంతరం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ అనే శాఖను ఏర్పాటు చేశారు. ఆ శాఖకు కూడా గంటా సుబ్బారావునే ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియమించారు. ప్రాజెక్ట్ ఆమోదం, బిల్లుల చెల్లింపు ఫైళ్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఆమోదం పొందాల్సి ఉంటుంది. అందుకే గంటా సుబ్బారావును నాడు చంద్రబాబు తన ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియమించారు. దాంతో ఏపీఎస్ఎస్ఎస్‌డీసీలో ప్రాజెక్ట్ ఫైళ్లు తయారు చేసేది, ఉన్నత విద్యా శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ శాఖల్లో పరిశీలించి ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపేది, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆ ఫైళ్లను పరిశీలించి తుది ఆమోదం తెలిపేది అంతా ఒకే ఒక్కరే ఆయనే గంటా సుబ్బారావు కావడం గమనార్హం. ప్రైవేట్ వ్యక్తికి నాలుగు పోస్టులు కట్టబెడుతూ ఫైళ్లపై స్వయంగా చంద్రబాబే సంతకాలు చేసి ఆమోదించారు.

ఆ ముగ్గురి ప్రస్తావనే రానివ్వకుండా

గంటా సుబ్బారావు, కె.లక్ష్మీనారాయణ ప్రధాన పాత్రధారులుగా చంద్రబాబు కొల్లగొట్టిన స్కిల్ ప్రాజెక్ట్ నిధులను అక్రమంగా తరలించడంలో బాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా కీలకంగా వ్యవహరించారు. సిట్ దర్యాప్తులో ఈ ముగ్గురి గురించి ప్రశ్నించే అవకాశాన్ని ఏమాత్రం ఇవ్వకుండా చంద్రబాబు జాగ్రత్త పడ్డారు. సిట్‌కు ఇచ్చిన రెండు రోజుల సమయాన్ని వీలైనంత వరకు వృథా చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఉదయం 9.30నుంచి సాయంత్రం 5గంటల వరకు విచారణ షెడ్యూల్ అని ముందే కోర్టు నిర్ణయించింది. అందులో ప్రతి గంటకు ఐదు నిముషాలు విరామం, భోజన విరామం కూడా ఉంటుంది. మొదటి రోజు శనివారం మధ్యాహ్నం 12గంటల వరకు అసలు విచారణ మొదలు కాకుండా అడ్డుకున్నారు. కస్టడీ కాపీ కావాలని అడిగి దాన్ని చదువుతూ కాలహరణం చేశారు. వివిధ పత్రాలను పరిశీలించాలంటూ సమయాన్ని వృథా చేశారు. రెండో రోజు తన రాజకీయ అనుభవం గురించి పాతచింతకాయ పచ్చడిలా కథలు చెబుతూ సమయాన్ని గడిపారు. గంటా సుబ్బారావు, లక్ష్మీ నారాయణ గురించి గానీ, పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాల గురించి ప్రస్తావించగానే చంద్రబాబు అధికారులపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం గమనార్హం. అంటే ఆ ఐదుగురితో ఈ కుంభకోణం ముడిపడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

బాబు బాల్య స్నేహితుడే..

విద్యార్థి దశలో తన స్నేహితుడైన రిటైర్డ్ అధికారి కె.లక్ష్మీ నారాయణను ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్‌గా చంద్రబాబు నియమించారు. తాను ఇతరత్రా కార్యక్రమాల్లో బిజీగా ఉన్నా తన స్వప్రయోజనాలకు అనుగుణంగా ఏపీఎస్ఎస్‌డీసీలో వ్యవహారాలు సాగేలా చూసేందుకే లక్ష్మీ నారాయణను తెచ్చారు. ఓ రకంగా చెప్పాలంటే ఆయన చంద్రబాబు ప్రతినిధిలా వ్యవహరించారు. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ప్రాజెక్ట్ రూపకల్పన, అందుకు అనుగుణంగా జీవో జారీ, నకిలీ ఒప్పందం ఆమోదం, షెల్ కంపెనీల ద్వారా నిధుల అక్రమ తరలింపు.. అంతా లక్ష్మీ నారాయణే పర్యవేక్షించారు. అంటే స్కిల్ స్కామ్ కీలక గుట్టు అంతా గంటా సుబ్బారావు, లక్ష్మీనారాయణ వద్దే ఉంది. ఈ క్రమంలో వారిద్దరిని ఎందుకు నియమించారు? వారితో సాగించిన వ్యవహారాలేమిటి? అని సిట్ అధికారులు అడిగేసరికి చంద్రబాబు కంగు తిన్నారు.

ఎవరిని విచారించాలో బాబే చెబుతారట..!

ఎక్కడైనా దర్యాప్తు అధికారులు చట్ట ప్రకారమే విచారణ నిర్వహిస్తారు. దీనిపై ముద్దాయిలు న్యాయస్థానంలో తమ వాదనలు వినిపించవచ్చు. చంద్రబాబు మాత్రం తాను చెప్పినట్లే దర్యాప్తు సాగాలనే రీతిలో వ్యవహరించారు. స్కిల్ స్కామ్‌లో సూత్రధారులు, పాత్రధారులుగా ఉన్న అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు, సంబంధిత కంపెనీల ప్రతినిధులను సిట్ అధికారులు ఇప్పటికే పలు దఫాలుగా విచారించారు. కానీ చంద్రబాబు మాత్రం వివిధ హోదాల్లో పనిచేసిన ఉన్నతాధికారులను ఎందుకు విచారించరంటూ ఎదురు ప్రశ్నించడం గమనార్హం. వాస్తవానికి ప్రేమచంద్రారెడ్డి ఆ పోస్టులోకి వచ్చేసరికే 90శాతం నిధులను టీడీపీ ప్రభుత్వం చెల్లించేసింది. దీంతో ఆయన మూడో పార్టీ నివేదిక కావాలని కోరారు. దీనిపై నాడు గంటా సుబ్బారావు, డిజైన్ టెక్ కంపెనీ ప్రతినిధులు సీఐటీడీ పేరుతో కనికట్టు చేశారు. స్కిల్ ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కేవలం పత్రాల్లో ఉన్న వివరాలను పొందుపరుస్తూ ఇచ్చిన ఓ నివేదికను మూడో పార్టీ మదింపు నివేదికగా మభ్యపుచ్చారు. ఈ విషయాలన్నీ సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా వెల్లడయ్యాయి. సీఐటీడీ ఆ విషయాన్ని సిట్‌కు లిఖితపూర్వకంగా వెల్లడించింది కూడా. సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా తెలియజేయడంతోపాటు న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం కూడా ఇచ్చింది. దీన్నిబట్టి సిట్ ఎంత పకడ్బందీగా నిబంధనల మేరకు దర్యాప్తు చేస్తోందన్నది వెల్లడవుతోంది.

బాబును మానసిక క్షోభకు గురిచేస్తున్నారు

- భోజనం చేసేందుకు టేబుల్ కూడా ఇవ్వడం లేదు: భువనేశ్వరి
- సీఐడీ ప్రశ్నలను విపులంగా ప్రజలకు తెలియజేస్తాం: అచ్చెన్న
- త్వరలోనే ఆగిన చోట నుంచే యువగళం మళ్లీ ప్రారంభం
- బాబుతో భువనేశ్వరి, బ్రాహ్మణి, అచ్చెన్నాయుడు ములాఖత్
- 16వ రోజుకు బాబు జైలు జీవితం

సాక్షి, రాజమహేంద్రవరం: తప్పుడు కేసులతో జైల్లో పెట్టి తన భర్త చంద్రబాబును ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేస్తోందని నారా భువనేశ్వరి ఆరోపించారు. బాబు భోజనం చేసేందుకు కనీసం టేబుల్ కూడా ఇవ్వడం లేదని, ప్రత్యేకంగా అనుమతులు తీసుకున్న అనంతరం ఇచ్చారని చెప్పారు. ఇలాంటి చిల్లర ఆలోచనలతో బాబును ఎవరూ బెదరించలేరన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుతో భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ములాఖత్ అయ్యారు. సుమారు 40 నిమిషాల పాటు వివిధ అంశాలు, రాజకీయ పరిస్థితులపై చర్చించారు. జైలు నిబంధనల మేరకు ముగ్గురికి మాత్రమే అనుమతి ఉండటంతో ప్రత్తిపాటి పుల్లారావు బయటే ఉండిపోయారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ.. ‘‘బాబు ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో ఉన్నారు. టీడీపీ కార్యకర్తలు మా బిడ్డలు. పార్టీకి వెన్నెముకలాంటి వాళ్లు. వాళ్లే లేకుంటే పార్టీలేదు. పోలీసులు ఏం చేసినా వారు బెదరరు. టీడీపీ కుటుంబానికి పెద్ద అయిన చంద్రబాబు కోసం బిడ్డల్లాంటి కార్యకర్తలు నిరాహార దీక్ష చేస్తుంటే లాఠీలతో కొట్టడం బాధాకరం. అండగా నిలుస్తున్న కార్యకర్తలందరికీ ధన్యవాదాలు’’ అని పేర్కొన్నారు.

సీఐడీవి పనికిమాలిన ప్రశ్నలు: అచ్చెన్నాయుడు



కస్టడీలో చంద్రబాబును సీఐడీ అడిగినవన్నీ పనికిమాలిన ప్రశ్నలేనని అచ్చెన్నాయుడు విలేకరుల సమావేశంలో విమర్శించారు. ఆధారం లేని కేసుల్లో ఇరికించారన్నారు. రెండు రోజుల విచారణలో ఏమైనా ఆధారాలు దొరికాయా? అంటే సమాధానం చెప్పడం లేదన్నారు. కస్టడీలో 33 ప్రశ్నలు పనికిమాలిన, స్కామ్‌కు సంబంధం లేని ప్రశ్నలు అడిగారన్నారు. ఆ ప్రశ్నలను తీసుకున్నామని, న్యాయ నిపుణుల సలహా సైతం తీసుకున్నామని, ప్రతి ప్రశ్నకు జవాబును విపులంగా ప్రజల ముందు ఉంచుతామన్నారు. చంద్రబాబు జైల్లో ధైర్యంగా, ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఆయన భద్రతపై భయంగా ఉందన్నారు. దోమలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బాబుకు జైల్లో ఏమైనా జరిగితే అందుకు కర్త, కర్మ, క్రియ జగనేనన్నారు. యువగళం పాదయాత్ర తిరిగి ప్రారంభించేందుకు అన్ని అనుమతులు తీసుకున్నామని, త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు.

16వ రోజుకు చేరిన చంద్రబాబు జైలు జీవితం

కాగా, సోమవారానికి చంద్రబాబు జైలు జీవితం 16వ రోజుకు చేరింది. మరో 10 రోజుల పాటు చంద్రబాబు రాజమండ్రిలోనే ఉండనున్నారు.

మా కంపెనీలో 2% వాటా అమ్మినా రూ.400 కోట్లు వస్తాయ్..

చంద్రబాబు సతీమణి భువనేశ్వరి

జగ్గంపేట/అన్నవరం: మా కంపెనీ(హెరిటేజ్)లో 2 శాతం వాటా అమ్మినా రూ.400 కోట్లు వస్తాయని.. బినామి కంపెనీ పేరుతో చంద్రబాబు కోట్లాది రూపాయలు కాజేశారన్న ఆరోపణల్లో నిజం లేదని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చెప్పారు. చంద్రబాబు అరెస్టుకు నిరసగా కాకినాడ జిల్లా జగ్గంపేటలో జరుగుతున్న నిరాహర దీక్షల శిబిరాన్ని ఆమె సోమవారం సందర్శించారు. శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సొమ్ము తమకు వద్దని.. తమ కుటుంబం ప్రజా సేవకే అంకితమైందని, తన భర్త చంద్రబాబు ఏ తప్పు చేయలేదని.. అయినా జైల్లో పెట్టారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఓట్లు పోకుండా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే అన్న సంతర్పణ కార్యక్రమాన్నీ ప్రారంభించారు. ఇదిలా ఉండగా, నారా భువనేశ్వరి రత్నగిరిపై సత్యదేవుని దర్శించుకున్నారు. చంద్రబాబు వెంటనే జైలు నుంచి విడుదలవ్వాలని పూజలు చేశారు. వేదపండితులు ఆమెకు ఆశీస్సులు అందజేశారు. ఆమె వెంట పార్టీ నేతలు యనమల రామకృష్ణుడు, వరుపుల సత్యప్రభ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులున్నారు.

బాబు బాటలోనే భువనేశ్వరి

- అబద్ధాలతో స్కిల్ స్కాంను కప్పిపుచ్చే పన్నాగం
- హెరిటేజ్ విలువను అమాంతంగా రూ.20,000 కోట్లకు పెంచేసి కనికట్టు

సాక్షి, అమరావతి: కళ్ల మూయకుండా అబద్ధాలు చెప్పడంలో సిద్ధహస్తుడిగా పేరొందిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బాటలోనే ఆయన సతీమణి భువనేశ్వరి కూడా ప్రయాణిస్తున్నారు. సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో తెలుగుదేశం పార్టీ నాయకులను కలిసి తొలిసారిగా రాజకీయ ప్రసంగం చేస్తూ అబద్ధాలను అలవోకగా వల్లెవేశారు. స్కిల్ కుంభకోణాన్ని కప్పిపుచ్చుకునేందుకు అమాంతంగా తమ హెరిటేజ్ కంపెనీ విలువను పెంచేశారు. రూ.371 కోట్ల కోసం తాము కక్కుర్తి పడునక్కర్లేదని, హెరిటేజ్‌లో రెండు శాతం వాటా అమ్ముకుంటే తమకు రూ.400 కోట్లు వస్తాయంటూ కార్యకర్తలను నమ్మించే ప్రయత్నం చేశారు. రెండు శాతానికి రూ.400 కోట్లు అంటే హెరిటేజ్ కంపెనీ విలువ రూ.20,000 కోట్లుగా ఉండాలి. కానీ సోమవారం స్టాక్ మార్కెట్ గణాంకాల ప్రకారం హెరిటేజ్ మార్కెట్ క్యాప్ అంటే కంపెనీ మొత్తం విలువ రూ.2,171 కోట్లు మాత్రమే. ఈ ప్రకారం చూస్తే రెండు శాతం వాటా విక్రయిస్తే భువనేశ్వరి చేతికి వచ్చేది కేవలం రూ.43.2 కోట్లు మాత్రమే. మరి రెండు శాతం అమ్మితే రూ.400 కోట్లు వస్తాయంటూ ఎలా చెప్పారంటూ స్టాక్ మార్కెట్ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మెన్షన్ చేసి రండి

- చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తేల్చి చెప్పిన సీజేఐ
- మంగళవారం మెన్షనింగ్ జాబితా ద్వారా రావాలని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్వాష్ పిటిషన్‌ను సోమవారం విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. మంగళవారం మెన్షన్ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ పిటిషన్‌ను విచారించాలంటూ చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సోమవారం ధర్మాసనం ముందు ప్రస్తావించగా, ఈరోజు కాదని, రేపు మెన్షనింగ్ జాబితా ద్వారా రావాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టంచేశారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను విచారించాలంటూ సిద్ధార్థ లూథ్రా సోమవారం మెన్షనింగ్ సమయంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంశమని, ప్రతిపక్షాలను అణచివేస్తున్నారంటూ సిద్ధార్థ లూథ్రా చెప్పబోతుండగా సీజేఐ వారించారు. ఎప్పుడు కస్టడీలోకి తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ నెల 8న అని లూథ్రా చెప్పగా.. ఎన్ని రోజులు రిమాండులో ఉన్నారని సీజేఐ మరోసారి ప్రశ్నించారు. వివరాలు చెప్పడానికి లూథ్రా ప్రయత్నిస్తుండగా.. మంగళవారం మెన్షనింగ్ జాబితా ద్వారా రావాలని ధర్మాసనం సూచించింది. లూథ్రా మరోసారి చెప్పడానికి యత్నించినప్పటికీ మంగళవారమే రావాలని సీజేఐ మరోసారి స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లో ‘175’ టార్గెట్‌తో పనిచేయాలి

- ప్రవాసాంధ్రులకు సజ్జల భార్గవ్‌రెడ్డి పిలుపు
- కువైట్, దుబాయ్‌లలో ఘనంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశాలు



దుబాయ్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సమావేశంలో పాల్గొన్న నేతలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నారని.. 2024లో జరిగే ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మీడియా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో మనమంతా జగనన్నకు అండగా నిలిచి పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కువైట్‌లో, యూఏఈ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, యూఏఈ ముఖ్య సలహాదారులు ప్రసన్న సోమిరెడ్డి ఆధ్వర్యంలో దుబాయ్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పేదల శ్రేయస్సే తన శ్రేయస్సుగా భావించే గొప్ప నాయకుడు సీఎం జగన్‌కి తోడుగా మనమందరం సైనికుల్లా కష్టపడి 175 టార్గెట్‌తో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి, ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి కూడా మాట్లాడారు.

చంద్రబాబు వ్యాజ్యం నిరర్థకం

కస్టడీ ఉత్తర్వులపై బాబు పిటిషన్‌ను మూసేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో విచారణ నిమిత్తం తనను రెండు రోజుల పాటు సీఐడీ కస్టడీకి ఇస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఈ కుంభకోణంలో కీలక నిందితుడైన నారా చంద్రబాబు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని నిరర్థకమైనదిగా హైకోర్టు ప్రకటించింది. స్కిల్ కుంభకోణంలో కీలక సమాచారాన్ని రాబట్టాల్సి ఉండటంతో సీఐడీ అభ్యర్థన మేరకు చంద్రబాబును రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు ఈ నెల 22న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ చంద్రబాబు ఈ నెల 23న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం జస్టిస్ శ్రీనివాసరెడ్డి ముందు విచారణకు వచ్చింది. కస్టడీ ముగిసిన నేపథ్యంలో ఈ వ్యాజ్యంలో విచారణ జరిపేందుకు ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ వ్యాజ్యాన్ని నిరర్థకంగా ప్రకటిస్తూ మూసివేశారు.

వినరా భారత వీర కుమారా..

దేశభక్తిని చాటేలా.. స్ఫూర్తి నింపేలా.. విద్యార్థులకు వీరగాథ 3.0 పోటీలు.. 30తో ముగుస్తున్న గడువు

రాయవరం: విద్యార్థుల్లో దేశభక్తిని నింపడంతో పాటు, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర విద్య, రక్షణ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా వీరగాథ 3.0 పోటీలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటికే ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మూడో తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియెట్) వరకూ విద్యార్థులకు నాలుగు అంశాల్లో ఈ పోటీలు చేపడుతున్నారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల గాథలను వివరించడం, వారి త్యాగాలను తెలిపే విధంగా పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన వంటి అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు ఉంది.

నాలుగు విభాగాల్లో పోటీలు

- ➢ ఈ పోటీలు పాఠశాలల వారీగా నాలుగు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 3–5, 6–8, 9–10, 11–12 తరగతుల వారిని వేర్వేరు కేటగిరీలుగా విభజించారు.
- ➢ 3–5 తరగతుల విద్యార్థులకు పద్యం, కథ (150 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్.
- ➢ 6–8 తరగతుల వారికి పద్యాలు/కథ (300 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన.
- ➢ 9–10 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన.
- ➢ 11–12 తరగతుల వారికి పద్యాలు, వ్యాసం (1,000 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.
- ➢ ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో దేశభక్తికి సంబంధించిన వీడియో రూపొందించడాన్ని మల్టీమీడియాగా పరిగణిస్తారు.

ఎంచుకోవాల్సిన అంశాలు

వీరగాథ 3.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకోవచ్చు. దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్‌మోడల్‌గా ఎంచుకుని, వారి నుంచి నేర్చుకున్న విలువలను ప్రస్తావించాలి. తమకు అవకాశం వస్తే ఏం చేయదలచుకున్నారో చెప్పాలి. ఉదాహరణకు ఝాన్సీ లక్ష్మీబాయి కలలోకి వచ్చి, దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తారో వివరించవచ్చు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు, తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్ర్య సమరయోధుల జీవిత కథలు తనపై ఎలాంటి ప్రభావం చూపిందో చెప్పాల్సి ఉంటుంది. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల తిరుగుబాటు, ఇతర అంశాలను కూడా ఎంపిక చేసుకోవచ్చు.



వీరగాథ 3.0 కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నమోదు చేసుకోవాలిలా..

ఆయా పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు కేటగిరీల వారీగా, తరగతుల వారీగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి, వారి వివరాలను ఇన్నోవేటివ్ ఇండియా.మైజీఓవీ.ఇన్/వీర్.గాథ 3.0 అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. సబ్‌మిట్ యువర్ ఎంట్రీ అని ఉన్న చోట క్లిక్ చేసి, వివరాలు నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి అత్యుత్తమమైన నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్ చేయాలి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమంగా ఎంపిక చేసిన వాటిని జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఒక్కో విభాగంలో 25 మంది చొప్పున అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందజేస్తారు. జిల్లావ్యాప్తంగా 2,030 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2.04 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా, కేటగిరీల వారీగా ఉపాధ్యాయులు ఇప్పటికే వీరగాథ 3.0 పోటీలు నిర్వహిస్తున్నారు. పలువురు విద్యార్థులు దేశభక్తిని పెంపొందించే విధంగా చిన్నచిన్న వీడియోలు సొంతంగా రూపొందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వీరగాథ 3.0 పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులూ సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుంది. విద్యార్థులకు నిర్వహించిన పోటీలు, మల్టీమీడియా వీడియోలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

– ఎం.కమలకుమారి, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా..



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసే చక్కటి కార్యక్రమం వీరగాథ 3.0. విద్యార్థుల ప్రతిభ జాతీయ స్థాయిలో మెరిసేలా ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం చేయాలి. దేశభక్తిని చాటేలా.. వీరుల గాథలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా పోటీలు నిర్వహించాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ఈ నెల 21వ తేదీకి జిల్లాల వారీగా వీరగాథ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జిల్లా	పాల్గొన్న విద్యార్థులు
కాకినాడ	1,674
కోనసీమ	9,202
తూర్పు గోదావరి	81,969



"మీ పట్ల మీరు కఠినంగా ఉండండి,
కానీ ఇతరులతో సౌమ్యంగా వ్యవహరించండి.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 26 సెప్టెంబర్ 2023

ఎట్టకేలకు కాసింత స్వేచ్ఛ!

ఒకటి కాదు... రెండు కాదు... 143 రోజుల తర్వాత మోక్షం లభించింది. కల్లోలిత మణిపూర్‌లోని బీరేన్‌సింగ్ సర్కార్ ఎట్టకేలకు శనివారం నుంచి మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించింది. అపరిమిత ఆలస్యం తరువాత్తై అయితేనేం, పాలకులు ఇన్నాళ్ళకు ఒక అడుగు ముందుకు వేసినట్టయింది. రాష్ట్రంలో సాధారణ స్థితి నెలకొల్పేందుకు తీసుకున్న చర్యగా ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణ నిర్ణయం హర్షించదగ్గ విషయం. మే 3న రెండు ప్రధాన వర్గాల మధ్య ఘర్షణలు మొదలైనప్పుడే నెట్ సేవలపై రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. ఆ తరువాత జూన్ 25న బ్రాడ్‌బ్యాండ్ సేవలను అనేక షరతులతో పాక్షికంగా పునరుద్ధరించినా, మొబైల్‌లో నెట్‌పై ఇప్పటి దాకా నిషేధం కొనసాగింది. నూటికి 95 మంది మొబైల్‌తోనే నెట్ సేవలందుకొనే మన దేశంలో ఇప్పుడీ ఎత్తివేత నిర్ణయం మణిపూర్‌లో అందరికీ సాంత్వన. కుంటుపడ్డ ఆర్థిక వ్యవస్థకూ, జీవనోపాధికీ పెద్ద ఊపిరి.

''రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగైనందు వల్ల'' ఇప్పుడు మొబైల్ నెట్ సేవల పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్నామన్నది సర్కారు వారి మాట. మణిపూర్‌లో పరిస్థితిపై ప్రభుత్వ కథనంలో నిజానిజాలు ఎంత అన్నది చర్చనీయాంశమే. అయితే, నిర్ణయం ఎందుకు తీసుకున్నప్పటికీ... జనజీవితాన్ని ప్రభావితం చేస్తూ, అసత్యాల వ్యాప్తికి కారణమవుతున్న నిషేధాన్ని ఎత్తివేయడం కచ్చితంగా సమంజసం. అందులో మరో మాట లేదు. మణిపూర్‌లో పర్యటించిన ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా బృందం సైతం ఇంటర్నెట్ సేవల నిషేధం చెడు చేసిందని పేర్కొన్న సంగతి మర్చిపోలేం. ఇంటర్నెట్ లేక, నిజనిర్ధారణకు వీలు లేక మీడియా చివరకు ప్రభుత్వపు గూటి చిలకగా మారి, ఆ గూటి పలుకులే పలికే దుఃస్థితి తలెత్తిందని విమర్శలు వచ్చాయి. సత్యనిష్ఠ గల మీడియా లేకపోవడంతో, అదే సందుగా పుకార్లు షికార్లు చేశాయి. విద్వేషవ్యాప్తితో అగ్నికి ఆజ్యం పోశాయి. అలాంటి ఓ పుకారే చివరకు ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన హేయమైన ఘటనకు దారి తీసిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇప్పటికే మణిపూర్ ఘర్షణల్లో 175 మందికి పైగా బలి కాగా, 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. జీవితాలు చెల్లాచెదరయ్యాయి. పరిస్థితిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు కాలయాపన చేశాయి. ఫేక్ న్యూస్ ఆపుతామంటూ పెట్టిన నెట్ నిషేధం అసలు న్యూస్ ఏమిటో ప్రపంచానికి అందకుండా చేసింది. అసలు సమస్య ఎక్కడుందో ముందే కనిపెట్టి, బలగాలు త్వరితగతిన చర్యలు చేపట్టే అవకాశాన్ని చేజార్చుకుంది. ఇవాళ ప్రజలు పూర్తిగా రెండు శిబిరాలుగా చీలిపోయే పరిస్థితిని కొనితెచ్చింది. గతంలో కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత దాదాపు రెండేళ్ళ పాటు ఇంటర్నెట్‌పై నిషేధం నడిచింది. ఆ తర్వాత మళ్ళీ ఇలా దాదాపు 5 నెలల దీర్ఘకాలం నెట్ సేవలపై కట్టడి కొనసాగింది మణిపూర్‌లోనే! గత అయిదేళ్ళలో ప్రపంచంలో మరే దేశమూ చేయనన్నిసార్లు భారత్ నెట్‌పై కట్టడి పెట్టింది. ఒక్క 2022లోనే 84 సార్లు నెట్ షట్‌డౌన్లు సాగాయి. ఏ కొద్ది నిరసన తలెత్తినా అణచివేసేందుకు నెట్ నిలిపివేత కొత్త రాజకీయ నియంత్రణ సాధనంగా మారడం విషాదం.

రష్యా, సూడాన్, ఇరాన్, మయన్మార్, ఇథియోపియా సహా నిరంకుశ పాలన సాగే అనేక దేశాల్లో కన్నా మన ప్రజాస్వామ్య భారతంలోనే ఇంటర్నెట్ సేవల్ని తరచూ ఆపేయడం విడ్డూరం. నిజానికి, ఇంటర్నెట్ సేవలను నిరవధికంగా సస్పెండ్ చేయడం చట్టవిరుద్ధమని 'అనురాధా భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (2020) కేసులో సుప్రీమ్ కోర్ట్ స్పష్టం చేసింది. వాక్ స్వాతంత్ర్యం, ఇంటర్నెట్‌ను ఉపయోగించి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛ అనేవి ప్రాథమిక హక్కులనీ, నెట్‌పై నిషేధం వాటికి భంగం కలిగించడమేననీ కోర్ట్ అప్పుడే తేల్చింది. అత్యవసరమై నిషేధం పెట్టినా దాన్ని పొడిగిస్తూ పోరాదనీ చెప్పింది. ప్రభుత్వాలు ఆ స్ఫూర్తిని అర్థం చేసుకోవట్లేదు. శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం మానేసి, దానికి ప్రత్యామ్నాయం నెట్‌పై నిషేధమే అన్నట్టు ప్రవర్తిస్తున్నాయి. ఇది పరిష్కారం కాదని సుప్రీమ్ తప్పుబట్టింది. కానీ, ఇప్పటి దాకా మణిపూర్ సర్కార్ చేసింది అదే. తాజాగా ఈ మార్చిలో పంజాబ్‌లో వేర్పాటువాద నేత పరారీ, జూలైలో హర్యానాలో మతఘర్షణల సమయంలో ఇతర ప్రభుత్వాలూ ఆ పనే చేశాయి.

మణిపూర్‌లో మైతేయ్‌లకూ, కుకీలకూ మధ్య పేరుకున్న విద్వేషాన్ని పోగొట్టాలంటే పాలకులు చేయాల్సిన పని వేరు. ముందు సమన్యాయం పాటించాలి. అందరితోనూ సుహృద్భావ పూర్వక చర్చలు జరపాలి. తీవ్రవాద వర్గాన్ని ఏకాకిని చేయాలి. సమాజంలో సహనం, శాంతి, పరస్పర విశ్వాసం నెలకొనేలా ఒక్కొక్క అడుగూ వేయాలి. కానీ, ఒక వర్గానికే కొమ్ము కాస్తూ, సొంత సహచరుల నమ్మకమే కోల్పోయిన పాలకుడికి అది కష్టమే!

ఇప్పటికీ మణిపూర్ సాధారణ స్థితికి రాలేదని వార్త. కానీ, అందుకు నెట్‌పై విరుచుకుపడడం సరికాదు. ఆ వివేకం ఇన్నాళ్ళకు మన పాలకులలో మేలుకొన్నట్టుంది. 'డిజిటల్ ఇండియా' స్వప్నంతో, నెలకు వెయ్యి కోట్ల సంఖ్యలో డిజిటల్ చెల్లింపులతో రొమ్ము విరుచుకుంటున్న దేశం తరచూ నెట్ ఆపేస్తే, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అది చెల్లదు. నెట్ నిషేధంతో మణిపూర్ 60 లక్షల డాలర్లు, దేశవ్యాప్తంగా 400 కోట్ల డాలర్లు నష్టం వచ్చిందని అంచనా. బ్రిటీషు కాలపు టెలిగ్రాఫ్ చట్టం–1885ను అడ్డం పెట్టుకొని కోర్టులకు చిక్కకుండా యథేచ్ఛగా నెట్‌పై నిషేధం పెట్టడం పాలకులకు శోభనివ్వదు. మణిపూర్ ఉదంతంతోనైనా మన ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకొని, తీరు మార్చుకుంటే మనుషులకూ, మానవ హక్కులకూ మేలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: శు.ద్వాదశి రా.11.14 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: శ్రవణం ఉ.7.44 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: ప.11.28 నుండి 12.04 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుండి 9.05 వరకు,తదుపరి రా.10.42 నుండి 11.31 వరకు, అమృతఘడియలు: రా.8.23 నుండి 9.54 వరకు

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వైద్యంలో వీరుడు

అఖిల భారత స్థాయి హోమియో వైద్యుడిగా పేరొందిన డాక్టర్ సోహన్ సింగ్ అచ్చమైన తెలుగువాడు. గదర్ వీరుడు సోహన్ సింగ్ జోషీ స్ఫూర్తితో ఆయనకు ఆ పేరు పెట్టారు. దానికి తగ్గట్టుగానే, రాష్ట్రంలోనూ, దేశ వ్యాప్తంగానూ ఉచిత హోమియో ప్రజా వైద్య శిబిరాలు నెలకొల్పుతూ, మందులు అందిస్తూ తాను చనిపోయేదాకా విశిష్ట సేవలు అందించారు సోహన్ సింగ్. వైద్యంలో వీరుడిగా నిలిచారు.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అఖిల భారత స్థాయి హోమియో వైద్యుడు, హోమియోలో కేంద్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సోహన్ సింగ్ వైద్య వృత్తిలోనూ 'గదర్' వీరుల వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న సామాజిక కార్యకర్త. నరనరాన ప్రజా సేవలోనే తరించుతూ ఈ నెల 24న తన 76వ ఏట కన్నుమూశారు. అభ్యుదయ కవి పండితులు, పాత్రికేయ కురువృద్ధు తాపీ ధర్మారావు మనవరాలు విమలను సోహన్ సింగ్ పెళ్లాడారు. ఈమె 'విశాలాంధ్ర' దినపత్రిక సంపాదకునిగా పనిచేసిన తాపీ మోహనరావు కుమార్తె. మా తరం అంతా తాపీ మోహనరావు ఆధ్వర్యంలో పాత్రికేయ వృత్తి మెలకువలు దిద్దుకున్న వాళ్లమే.

ఒక తెలుగువాడికి 'సోహన్ సింగ్' అని పేరు పెట్టడానికి కారణం, 'గదర్ పార్టీ' వీరులలో ఒకరైన 'సోహన్ సింగ్ జోషీ'. దరిశి చెంచయ్య స్థాపించిన ఈ పార్టీ తెలుగునాట విప్లవోద్యమ బీజాలు నాటిందని మరచిపోరాదు. ఇంతటి పూర్వ చరిత్ర స్ఫూర్తితో ఎదుగుతూ, రాష్ట్రంలోనూ, దేశ వ్యాప్తంగానూ ఉచిత హోమియో ప్రజా వైద్య శిబిరాలు నెలకొల్పుతూ, మందులు అందిస్తూ తాను చనిపోయేదాకా విశిష్ట సేవలు అందించారు సోహన్ సింగ్.

ఈ ఆచరణలో భాగంగానే 'ధర్మకిరణ్ హోమియో రీసెర్చి ఫౌండేషన్'ను, అదే పేరిట హోమియో వైద్యశాలను, ఆదర్శ హోమియో ఫార్మసీ, కళాశాలలను నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి హోమియో రీసెర్చి కేంద్రం ఏర్పాటుకు తన చొరవతో పథకం రచించగా దాన్ని కేంద్రం గుర్తించింది. పెక్కు శారీరక రుగ్మతలకు శాశ్వత పరిష్కారాలు చూపిన ఘనాపాఠి సోహన్ సింగ్. ఎన్నో కుటుంబాలకు, స్కూళ్లకు 1999 నుంచి 2022 దాకా హోమియో మందుల 'కిట్స్'ను అందించుతూ వచ్చారు. వైద్య సదుపాయాలు అందక పెక్కు రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసీ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించారు. పెక్కు దేశీయ, రాష్ట్రీయ కేంద్రాలలోని వైద్య శాఖల సమన్వయ కర్తగా అమూల్యమైన సేవలందించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ హోమియో మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు దాదాపు 26 సంవత్సరాలుగా సలహాదారుగా ఉన్నారు. హోమియో రీసెర్చి ఫౌండేషన్ ఫార్మా యూనిట్ ఆధ్వర్యంలో విదేశాల నుంచి దిగుమతి అయ్యే మందుల స్థానే దేశీయ నాణ్యమైన హోమియో మందుల ఉత్పత్తికి కృషి చేశారు. దేశీయ వృక్ష జాతుల నుంచి లభించే ముడి సరుకు ఆధారంగా హోమియో టించర్లను, టిష్యూ సాల్ట్స్‌ను ఉత్పత్తి చేయించారు.



డాక్టర్ సోహన్ సింగ్

''సోహన్ సింగ్ కర్మయోగి, పని.. పని.. పని... తప్ప మరో ధ్యేయం, యావ లేని వైద్యుడు. కొందరు రోజుకు 24 గంటలేనా అని బాధపడతారు, కొందరు జీవితాలకు లక్ష్యాలు ఏర్పరచుకుంటారు. అతి కొద్దిమంది మాత్రమే నెలలకు, సంవత్సరాలకూ కూడా లక్ష్యాలు పెట్టుకుంటారు. ఒకటి పూర్తవగానే ఇంకొకటి, అలా లక్ష్యాలను వెంటాడుతూనే ఉంటారు. పనే ప్రాణం, లేకపోతే వారికి ఊపిరాడదు! ఆ లక్ష్యాల నుండి ఎడబాటుండదు, తడబాటుండదు. వారికి వయస్సు విరోధి కాదు, రోగాలను గురించి తలచుకునే సమయం ఉండదు. వారెవరో కాదు, మన సోహన్ సింగ్. భారత హోమియోపతి వైద్యంలో సోహన్ సింగ్ చూడని లోతులూ లేవు, ఎక్కని ఎత్తులూ లేవు... తెల్లవారు జామున సుదూర ప్రయాణాలు చేసి ఆయన ఇచ్చే తెల్లపంచదార మాత్రల కోసం జనాలు చకోర పక్షుల్లా ఎదురుచూస్తుంటే ఎవరైనా ఆశ్చర్యపోవలసిందే. ఆయన ఇచ్చే మందులు తన వ్యవసాయ క్షేత్రంలో పెంచిన మూలికల నుంచే తీసుకుని తన సొంత ఫార్మసీలోనే తయారు చేసుకుంటారు. అత్యుత్తమమైన వైద్య సేవలు అందించిన సోహన్ సింగ్ వైద్యనారాయణుడు, వైద్యులందరికీ ఆదర్శనీయులు'' అని డాక్టర్ చెరుకూరి బాలచంద్రమోహన్, సతీమణి డాక్టర్ సత్యవతీ దేవిల అభిభాషణ. 'ధర్మకిరణ్ హోమియో పరిశోధనా సంస్థ' అధ్యక్షురాలు పి. నీలిమా సతీష్ మాటల్లో చెప్పాలంటే, ''చెట్లను, మొక్కల్ని కాపాడుకోగల్గితే, అవి తిరిగి మనల్ని రక్షించి, పక్కవాటు రోగాలు రాకుండా కాపాడతాయి.''

ఆరోగ్య ప్రదాయినిగా మన దేశంలో హోమియో వైద్య విధానాన్ని పెంచి పోషించి, ప్రజా బాహుళ్యం ఆరోగ్య భాగ్యానికి అనితర సాధ్యంగా దోహదకారి అయి, మనందరి ఆరోగ్య భావి భాగ్యోదయాల్ని కాంక్షిస్తూ శాశ్వతంగా సెలవు తీసుకున్న ప్రజా వైద్యుడు సోహన్ సింగ్‌కు ఇదే నివాళి!


abkprasad2006@yahoo.co.in

(సుప్రసిద్ధ హోమియో వైద్యుడు డాక్టర్ సోహన్ సింగ్ సెప్టెంబర్ 24న మరణించారు.)

రొమాంటిక్ హీరో

హిందీ సినిమా రంగంలో అయిదు దశాబ్దాలకు పైగా నటుడిగా కొనసాగారు దేవానంద్. ఆయన నటనే స్టైల్‌కు పర్యాయపదంగా నిలిచిపోయింది. నిర్మాతగా, రచయితగా, దర్శకుడిగా కూడా కొనసాగుతూ ఎంతోమంది ప్రతిభావంతుల్ని సినీతెరకు పరిచయం చేశారు. శతజయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయన సినిమాలు ప్రదర్శితమయ్యాయి.

సందర్భం




వారాల ఆనంద్

హిందీ ప్రధాన స్రవంతి సినిమాల్లో దేవానంద్‌కు ముందు హుందా అయిన నటులున్నారు. ఆయన తర్వాత కాలంలో కూడా ఎంతో మంది నటులు వచ్చారు. కానీ దేవానంద్ స్టైల్, స్టైల్ విలక్షణమయినవి. ఆయన కదలిక, ఆహార్యం మొత్తంగా ఆయన నటనే స్టైల్‌కు పర్యాయ పదంగా నిలిచిపోయింది. ఆయన సినిమాల్లోని పాటలు నేటికీ జనాన్ని మంత్రముగ్ధుల్ని చేస్తూనే ఉన్నాయి. 'మై జిందగీ కా సాత్ నిభాతా చలాగయా', 'కొయా కొయా చాంద్', 'గాతా రహే మేరా దిల్' లాంటి పాటల్ని ఎవరు మరిచిపోగలరు?

ఆ కాలంలో దిలీప్ కుమార్ విషాదాంత పాత్రలకు పర్యాయ పదంగా ఉండి, మధ్యతరగతి ప్రజల్ని, ఆనాటి మేధావుల్ని అలరిస్తున్నాడు. మరో వైపు చార్లీ చాప్లిన్ తరహా ట్రాంప్‌లా రాజ్ కపూర్ సామాన్య జన జీవితాల్లోకి చొచ్చుకు పోతున్నాడు. ఆ పరిస్థితుల్లో వారిద్దరికీ భిన్నంగా, తనదైన చేతనాత్మకమైన ధోరణితో నిలిచి గెలిచాడు దేవానంద్. సురయ్యా, మధుబాల, వైజయంతిమాల, హేమామాలిని, వహీదా రెహమాన్, నూతన్, గీతా దత్ లాంటి వాళ్ళతో ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించాడు.

1923లో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో దేవానంద్ జన్మించాడు. పంజాబ్ విశ్వ విద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసుకుని బొంబాయి బయలుదేరాడు. అప్పటికే సినీ రంగంలో కృషి చేస్తున్న సోదరుడు చేతన్ ఆనంద్‌తో కలిసి తన భవిష్యత్తును నిర్మించుకుందామని ఆలోచన. 1946లో ప్రభాత్ వాళ్ళు నిర్మించిన 'హమ్ ఏక్ హై'తో దేవ్ తన నట జీవితాన్ని ఆరంభించాడు. అప్పుడే గురుదత్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మిత్రులయ్యారు. తాను నిర్మాతగా మారి దర్శకుడిని చేస్తానని హామీ ఇచ్చాడు. రష్యన్ సినిమా 'ఇన్‌స్పెక్టర్ జనరల్' ప్రేరణతో చేతన్ ఆనంద్ తీసిన 'అఫ్సర్'తో ఎస్.డి.బర్మన్‌ను సంగీత దర్శకుడిగా పరిచయం చేశాడు. తర్వాత బాల్ రాజ్ సహానీ స్క్రిప్ట్ ఆధారంగా 'బాజీ' తీశాడు. గురుదత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉర్దూ కవి సాహిర్ లుధియాన్వీ మొదటిసారిగా గీతాలు రాశాడు. ఈ సినిమాతోనే కమెడియన్‌గా జానీ వాకర్ కూడా పరిచయం అయ్యాడు. గీతా రాయ్‌ను గురుదత్, కల్పనా కార్తీక్‌ను దేవానంద్ ఈ చిత్ర సమయంలోనే కలుసుకున్నారు. ఆ తర్వాత వాళ్ళు జంటలయ్యారు.



దేవానంద్

వహీదా రహ్మాన్‌తో దేవానంద్ అనేక విజయవంతమయిన సినిమాలు చేశాడు. వారిద్దరిదీ అప్పుడు హిందీ సినిమాల్లో గొప్ప హిట్ జంట. 'సోల్వా సాల్', 'గైడ్', 'కాలా బాజార్', 'బాత్ ఏక్ రాత్ కీ' వంటి సినిమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. 'గైడ్' మొట్ట మొదటి ఇండో అమెరికన్ సిన్మాగా రూపొందింది. ఆర్.కె.నారాయణ్ నవల ఆధారంగా తీసిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసల్ని అందుకుంది.

నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు ముగ్గురు త్రిమూర్తుల్ని– అంటే దేవానంద్, రాజ్‌కపూర్, దిలీప్ కుమార్‌లను తీన్‌మూర్తి భవన్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అయిదు దశాబ్దాలకు పైగా హిందీ సినిమా రంగంలో తనదయిన శైలిలో నటిస్తూ, నిర్మిస్తూ... రచయితగా, దర్శకుడిగా కూడా కొనసాగుతూ... మొండితనంతో, తృష్ణతో తన నిర్మాణ సంస్థ 'నవకేతన్'ను 52 ఏళ్ళకు పైగా సజీవంగా ఉంచుకున్నాడు దేవానంద్. 2001లో పద్మభూషణ్, 2002లో దాదా సాహెబ్ ఫాల్కే వరించాయి. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమెకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. నేషనల్ పార్టీ ఆఫ్ ఇండియా పేర రాజకీయ పార్టీని స్థాపించినప్పటికీ దాన్ని ఎక్కువ కాలం నడపలేదు. దేవానంద్ జన్మశతాబ్ది సందర్భంగా దేశ వ్యాప్తంగా 30 నగరాల్లో 55 టాకీసుల్లో ఆయన నటించిన సినిమాలతో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డి.సి. ఆర్కైవ్స్ ఆధ్వర్యంలో ఇది జరిగింది.

వ్యాసకర్త కవి, విమర్శకుడు. 94405 01281

(నేడు నటుడు దేవానంద్ శతజయంతి.)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దాంపత్యం లోకి...



బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ మీద మొదటి సంభాషణ జరిగిన క్షణం నుంచే మా హృదయాలకు తెలుసు... ఈ రోజు కోసం సుదీర్ఘకాలంగా నిరీక్షిస్తున్నాం... ఎట్టకేలకు శ్రీమతి, శ్రీ కాగలిగాం. మా శాశ్వతగాథ ఇప్పుడు మొదలైంది. ('ఆప్' నేత రాఘవ్ చడ్డాను పెళ్లాడారు.)

– పరిణీతి చోప్రా, నటి

వివరించాం



జెనీవా (స్విట్జర్లాండ్)లోని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల వేదిక (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) 54వ సమావేశంలో ఇండియా తరఫున నా జమ్ము కశ్మీర్ ప్రజల ప్రతినిధిగా పాల్గొన్నాను. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే), గిల్గిత్ బాల్టిస్తాన్‌లలో పాక్ ఆక్రమణ వల్ల మన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మాట్లాడాను.

– జావేద్ బేగ్, యాక్టివిస్ట్

చిత్రం



ఖలిస్తానీ గ్రూపునకు చెందిన నేతను చంపడంలో ఇండియా ప్రమేయం ఉందని నిరూపించే సమాచారం కెనడా వద్ద ఉందట; కానీ తన దేశంలో దశాబ్దాలుగా నివసిస్తున్న ఒక మనిషిని పార్లమెంటుకు ఆహ్వానించి గౌరవించే దాకా ఆయన నాజీ అని దానికి తెలియదట! భలే విడ్డూరం.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

బాలేదు



తన అత్యుత్తమ రోజుల్లో 'ఈ సైటు' (ట్విట్టర్/ఎక్స్) ఏం చేసిందో దానికి ట్విట్టర్ అనే పేరే పర్ఫెక్టుగా సరిపోతుంది. 'ఎక్స్' కాదు.

– స్టీఫెన్ కింగ్, రచయిత

ఇన్ బాక్స్

నవ్య చరితకు శ్రీకారం


'సమగ్ర అభివృద్ధి' అజెండాతో ముందుకు సాగుతోంది రాష్ట్ర ప్రభుత్వం. దీనిలో భాగంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణను రాష్ట్రంలో అమలు చేయాలని భావించింది. ఉదాత్త ఆశయంతో తీసుకున్న నిర్ణయంగా ఇది నిలుస్తుంది. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం వెనుక ఎంతో దార్శనికత ఉంది. తరతరాలుగా వెనకబాటుతనంతో జీవనం సాగిస్తోన్న ఉత్తరాంధ్ర సమగ్ర వికాసం, అభివృద్ధికి ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం దోహదం చేస్తుంది. రాష్ట్రంలో రోడ్డు, రైలు, విమాన, నౌకా రవాణా వ్యవస్థలతో అనుసంధానం కలిగిన నగరం విశాఖపట్నం. పర్యాటక, సాంస్కృతిక వారసత్వం కలిగి, ఆధునికత, చారిత్రక నేపథ్యాలను కలిగిన విశాఖ నగరం అన్ని వర్గాల ప్రజల జీవనానికి ఎంతో వెన్నుదన్నుగా ఉంటోంది. పరిశ్రమలు, విద్యాసంస్థలు, వైద్య సదుపాయాలతో నగరం ఇప్పటికే ఒక పరిపాలనా కేంద్రానికి ఉండాల్సిన హంగులన్నీ సంతరించుకున్నది.

మరికొద్ది రోజుల్లో విశాఖలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు కానుందనే వార్త ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో సంతోషాన్నిస్తోంది. త్వరలో ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన భవనాలను గుర్తించేందుకు కమిటీ వేయడం, ప్రభుత్వ కార్యాలయాల తరలింపుకు అధికారులతో మరొక కమిటీ వేయాలని నిర్ణయించడం శుభ పరిణామం. విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పాలన మొదలు పెట్టాలనే ముఖ్యమంత్రి ఆలోచన ఆయనకు మరిన్ని విజయాలను చేరువ చేస్తుంది. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యుత్తమ స్థానంలో నిలిచే ప్రక్రియకు ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం నూతన శకానికి నాందీవాచకంగా నిలవనుంది. విశాఖ నగరం ఎందరికో ఆశ్రయం ఇచ్చి, అద్భుత విజయాలను చేరువ చేసింది. ఇటువంటి మహానగరాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి పాలనా కేంద్రంగా చేసుకోవడం మరొక నూతన చరిత్రకు శ్రీకారం చుట్టడమే. మూడు ప్రాంతాల అభివృద్ధికి ఉపయుక్తంగా నిలచే 'విశాఖ నుంచి పరిపాలన' నిర్ణయం కార్యరూపం దాల్చడం ముదావహం. విశాఖ వేదికగా మరెన్నో విజయాలను సాకారం చేసుకోవాలనీ, రాష్ట్రం బహుముఖంగా ప్రగతి సాధించాలనీ మనసారా కాంక్షిద్దాం. విజయదశమి ముహూర్తంలో సీఎం విజయదుందుభి మోగించాలని ఆశిద్దాం.

– డా॥ టి. షారోన్‌రాజు, విశాఖపట్నం

ఆ ధర్మం సమస్త పీడితులకు వ్యతిరేకం

అభిప్రాయం



కంచ ఐలయ్య షెపర్డ్

బీజేపీ అగ్రశ్రేణి మంత్రులైన అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా తాము సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తున్నామని ప్రకటించారు. సనాతన ధర్మం బ్రాహ్మణిజానికి చెందిన పురాతన తత్వశాస్త్రం. దాని మూలాలు ఋగ్వేదంలో ఉన్నాయి. ఇది ఇతర సంస్కృత గ్రంథాల ద్వారా ఉద్భవించింది.

మనుధర్మాన్ని రచించిన బ్రాహ్మణ రచయితలు దాని రచనా సమయానికి... అభ్యాసం, ఆధ్యాత్మిక సిద్ధాంతాలనే సనాతన ధర్మంగా సంశ్లేషించారు. ఇది ఉత్పాదక శ్రమకు, ఉత్పత్తిలో పాల్గొనే సామాజిక ప్రజారాశు (శూద్ర, 'ఛండాల', వనవాసు)లకు వ్యతిరేకంగా నిలిచింది. ఆ తత్వాన్ని బీజేపీ అగ్రశ్రేణి మంత్రులు, నేతలు ఇప్పుడు తమ సొంతం చేసుకున్నారు.

ఇటీవలే ఈ అంశంపై విలేఖరుల సమావేశంలో ప్రసంగించిన బీజేపీ సీనియర్ అధికార ప్రతినిధి రవి శంకర్ ప్రసాద్, 'సనాతన ధర్మం ప్రతి ఒక్కరికీ శాశ్వతమైన చట్టం' అని నిర్వచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారు దాని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే శూద్రులు, దళితులు, ఆదివాసీలందరూ ఈ సనాతన ధర్మాన్ని ఎలా అంగీకరించగలరు?

చివరగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'దీనికి సరైన సమాధానం కావాలి' అని చెప్పారు. ఇప్పుడు అసలు రహస్యం బయటపడింది. సనాతన ధర్మం పక్షాన వీరంతా నిలిచారు. సనాతన ధర్మంలోనే ఉత్పత్తి కాలుష్యం అనే సిద్ధాంతానికి మూలాలు ఉన్నాయి. తాజాగా, 45 ఏళ్ల యువకుడైన ఉదయనిధి స్టాలిన్‌పై కేంద్రప్రభుత్వం యుద్ధం ప్రకటించినట్లు కనిపించింది. నిజానికి ఇది శూద్ర దళితులకు, ఆదివాసీలందరికీ వ్యతిరేకంగా సాగిన సంప్రదాయ యుద్ధ పద్ధతి మాత్రమే.

కొత్తగా పునరుద్ధరించిన ఈ పురాతన సనాతన భావజాలం... ఉదయనిధి స్టాలిన్‌పై, 'ఇండియా' కూటమిపై దాడి చేయడానికి బీజేపీకి ఒక ఆయుధమయ్యింది. కరుణానిధి మనవడూ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడూ అయిన ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మానికి వ్యతిరేకంగా అకస్మాత్తుగా అఖిల భారత ద్రవిడ సైద్ధాంతిక హీరో అయిపోయాడు. ఈ క్రమంలో ఉదయనిధి తలకి ఒక ఆలయ పూజారి వెల కట్టారు. దీనిపై బీజేపీ మౌనంగా ఉంది.

2023 సెప్టెంబరు 2న 'సనాతన నిర్మూలన' అనే అంశంపై 'తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' చెన్నైలో ఏర్పాటు చేసిన సదస్సులో ఉదయనిధి స్టాలిన్ ప్రసంగించారు. 'కొన్ని విషయాలను కేవలం వ్యతిరేకించలేము, వాటిని రద్దు చేయాల్సి ఉంటుంది. మనం డెంగ్యూ, దోమలు, మలేరియా లేదా కరోనా వైరస్‌ని వ్యతిరేకించి ఊరుకోలేం. వాటిని మనం నిర్మూలించాలి. సనాతనాన్ని వ్యతిరేకించే బదులు దానిని నిర్మూలించాల్సి ఉంది.' సనాతన ధర్మాన్ని కుల అసమానతతో కూడిన, సామాజిక వ్యతిరేక భావజాలంగా ఉదయనిధి నిర్వచించారు. బీజేపీ మంత్రులు సనాతన ధర్మాన్ని ఒక శాశ్వత చట్టంగా నిర్వచిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ హయాంలో గానీ, ఇప్పుడు బీజేపీ హయాంలో గానీ సనాతన ధర్మం అనే భావన భారత దేశంలోని శూద్ర, దళిత, ఆదివాసీలకు వ్యతిరేకమనే అర్థం చేసుకోవాలి. సనాతన ధర్మంలో అంటరానితనం, శ్రమ వ్యతిరేకత, స్త్రీల అసమానత వంటి వాటికి లోతైన మూలాలు ఉన్నాయి. వేద గ్రంథాల తరువాత, మనుధర్మం సనాతన ధర్మ భావజాలాన్ని సంశ్లేషించింది. డా॥ అంబేడ్కర్, పెరియార్ రామసామి నాయకర్ ఆ మొత్తం ప్రక్రియపై లోతైన



విశ్లేషణ చేశారు. దాంట్లో భాగంగానే పెరియార్ మనుధర్మంపై దాడి చేశారు. సనాతన ధర్మానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున అంబేడ్కర్ మనుస్మృతిని దహనం చేశారు.

వ్యవసాయ చట్టాల ద్వారా శూద్ర వ్యవ సాయదారుల చేతులు కట్టేయాలని బీజేపీ భావించింది, కాని వారు పోరాడారు. ఇప్పుడు బీజేపీ శక్తులు సనాతన ధర్మ వ్యతిరేకమైన, శక్తిమంతమైన ద్రావిడ స్థావరంపై దాడి చేయాలనుకుంటున్నాయి. అందుకే సనాతన ధర్మంపై ఓ యువకుడి విమర్శను ఢిల్లీలో ద్విజ శక్తులు నరహంతకంగా వక్రీకరించి, దానిపై తీవ్రంగా దాడి చేశాయి. కేంద్రప్రభుత్వం మొత్తం దీనిపై దృష్టి సారించింది.

అధికార బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ఉద్దేశపూర్వకంగానే ఉదయనిధి ప్రసంగాన్ని, 80 శాతం మంది ప్రజలపై మారణహోమంగా వక్రీకరించారనేది సుస్పష్టం. శూద్ర, దళిత, ఆదివాసీలు కూడా వీరిలో భాగమనే అర్థంలో ఆయన వక్రీకరించారు.

ధర్మం అనే భావనను న్యాయం అనే అర్థంలో మలుచుకుంటున్నారు. ఇది ప్రాచీన గ్రీకు లేదా యూరోపియన్ కోణంలో చెప్పిన న్యాయానికి సమానం కాదు. అంటే వేదాలు పేర్కొన్న ఈ ధర్మం ప్రకారం బ్రాహ్మణులు రూపొందించిన కుల నియమాలను శూద్రులు తప్పక పాటించి బానిసలుగా, వ్యవసాయ పనివాళ్లుగా బతకాలి. ద్విజులు కలుషితమైనదిగా భావించే వ్యవసాయం చేయకూడదు. శూద్ర, దళిత, ఆదివాసీలను వదిలేయండి... సనాతన ధర్మంలో అన్ని కులాల మహిళలకు స్థానం లేదు. పైగా వారు సనాతన ధర్మం విధించిన అనాగరిక దోపిడీ, మూఢనమ్మకాల బంధితులు. జాతీయ పాలకులు బహిరంగంగా ఇలాంటి భావజాలాన్ని కలిగి ఉండి, ఆదిమ భావజాలంపై విమర్శ చేసేవారిపై దాడి చేస్తే దేశం అంధకారంలోకి జారిపోతుంది.

బీజేపీ/ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న శూద్ర, ఓబీసీ, దళిత ఆదివాసీలు ఈ కొత్త పరిణామాన్ని చాలా నిశితంగా పరిశీలించవలసి ఉంటుంది. సనాతన ధర్మాన్ని అంగీకరించడం ద్వారా వ్యవస్థపై ఎలాంటి సైద్ధాంతిక నియంత్రణ లేకుండానే అధికార స్థానాలను కొద్దిమంది అనుభవించవచ్చుగాక. కానీ ఉత్పాదక అత్యధిక ఉత్పాదక శక్తులతోపాటూ దేశం మొత్తం చీకటి యుగాల్లోకి నెట్టివేయబడుతుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

క్లుప్తంగా...

ఈ దశలో విచారణ అనవసరం: సుప్రీం కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీజేఐకు రాసిన లేఖను మీడియా ముందు బహిర్గతం చేశారంటూ దాఖలైన పిటిషన్‌పై ఈ దశలో విచారణ అనవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. న్యాయవాది సునీల్‌కుమార్ సింగ్ దాఖలు చేసిన ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బ్రహ్మప్రకాష్ శర్మ రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ప్రస్తావించబోతుండగా జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకొని.. 'చట్టం గురించి చెబుతున్నారు సరే కానీ ఈ అంశం 2020 నాటిది. ఆ తర్వాత ఎలాంటి ప్రకటనలూ రాలేదు కదా' అని అన్నారు. 'ఈ రకమైన అంశాలు ఒక్కోసారి తగినవి కాకపోవచ్చు. ఒక్కోసారి వ్యవస్థలపై ప్రభావం చూపొచ్చు. ఈ దశలో విచారణ ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. ఒక వేళ మెరిట్స్‌పై కావాలనుకుంటే పిటిషనర్‌తో చర్చించి రావాలి' అని న్యాయవాదికి సూచించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

మిలాద్ ఉన్ నబీకి బ్యాంకులకు సెలవు ప్రకటించండి

సాక్షి, అమరావతి: ముస్లింల పవిత్ర పండుగ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సెప్టెంబర్ 28న నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ కింద సెలవు ప్రకటించాల్సిందిగా బ్యాంకు యూనియన్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వైవీ సత్యనారాయణరావు నేతృత్వంలోని బ్యాంకు యూనియన్ నాయకులు సోమవారం అంజాద్ బాషాను కలిసి ఈ మేరకు విజ్ఞాపన అందజేశారు.

డెంగీ, మలేరియా కట్టడికి పటిష్ట చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకూ 57,96,239 మందికి పరీక్షలు నిర్వహించగా 4,311 మందిలో మలేరియా సోకినట్టు వెల్లడైందని పేర్కొన్నారు. 54 ప్రభుత్వ సెంటినల్ సర్వేలెన్స్ ఆస్పత్రుల్లో డెంగీ లక్షణాలున్న 60,850 మందికి పరీక్షలు చేయగా 3,962 మందికి పాజిటివ్‌గా తేలిందన్నారు. డెంగీ, మలేరియా బాధితులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా 25.94 లక్షల దోమ తెరలను పంపిణీ చేశామని తెలిపారు. నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో ఒక కోటి గంబూసియా చేపపిల్లలను విడుదల చేసినట్టు పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే, వెక్టర్ కంట్రోల్, హైజీన్ యాప్‌ల ద్వారా పర్యావరణ పరిశుభ్రత కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

3 రోజులు వర్షాలే

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. అలాగే దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ కొంకణ్ వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో అనేక చోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా ఈనెల 29న ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. ఆ తదుపరి 24 గంటల్లో అది అల్పపీడనంగా బలపడనుంది.

పోలీసు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై..
ఒకేరోజు విచారణ జరుపుతాం

రెండింటిలో ఒకేసారి ఉత్తర్వులు ఇస్తాం

- స్పష్టంచేసిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం
- తదుపరి విచారణ నేటికి వాయిదా
- చంద్రబాబు న్యాయవాదులపై తీవ్ర అసహనం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుపుతామని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే, చంద్రబాబును మరో ఐదు రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా అదేరోజు విచారణ జరుపుతామని తేల్చిచెప్పింది. ఈ రెండు వ్యాజ్యాలపై ఒకేసారి తీర్పు వెలువరిస్తామని కోర్టు తెలిపింది. వాస్తవానికి.. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం కోర్టు విచారణ జరపాల్సి ఉంది. అయితే, రెండ్రోజుల పోలీసు కస్టడీలో విచారణకు చంద్రబాబు ఏమాత్రం సహకరించకపోవడంతో మరో ఐదురోజుల పాటు ఆయనను కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ సమయంలో చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు ప్రమోద్‌కుమార్ దూబే, దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. తమ బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టాల్సిందేనని పట్టుబట్టారు. తాము బెయిల్ పిటిషన్ దాఖలు చేసి చాలా రోజులైందన్నారు. దీంతో సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానంద, హైకోర్టు అదనపు పీపీ దుష్యంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేసినప్పుడు ముందు దానిపైనే విచారణ జరపాల్సి ఉంటుందన్నారు. పోలీసు కస్టడీ పిటిషన్‌ను తేల్చిన తరువాత బెయిల్‌పై విచారణ జరపవచ్చని తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో ఆరు రోజులపాటు తమ పోలీసు కస్టడీపై ఏసీబీ కోర్టు విచారణ జరపలేని పరిస్థితి వచ్చిందన్నారు. పైగా.. చంద్రబాబు రెండ్రోజుల కస్టడీలో సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించలేదన్నారు. అందుకే ఆయనను మరో ఐదు రోజులపాటు కస్టడీ కోరుతున్నామని.. ముందు తమ పోలీసు కస్టడీ పిటిషన్‌పై తేల్చి, ఆ తరువాత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపవచ్చునని వారు సూచించారు. ఆ మేర మెమో దాఖలు చేశామన్నారు. పోలీసు కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు ముందు దానినే విచారించి ఆ తరువాత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును వారు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

బాబు లాయర్లపై కోర్టు ఘాటు వ్యాఖ్యలు..

అయితే, దీనిని చంద్రబాబు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ముందు తమ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలన్నారు. సీఐడీ దాఖలు చేసిన మెమోపై ఏదో ఒక నిర్ణయం వెలువరించాలని వారు పట్టుబట్టారు. మెమోను ఆమోదించడమో, తిరస్కరించాడమో చేస్తూ ఉత్తర్వులు జారీచేయాల్సిందేనన్నారు. దీనిపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టును ఇలాగే చేయాలని పట్టుబట్టలేరని వారికి తేల్చిచెప్పింది. ఈ కోర్టును కార్నర్ చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత ఏం చేయాలన్నది తమ విచక్షణపై ఆధారపడి ఉంటుందని వారికి కోర్టు తేల్చిచెప్పింది. మొదటి నుంచీ ఈ కేసులో ఇలాగే పట్టుపడుతున్నారని తెలిపింది. దీంతో బాబు న్యాయవాదులు వెనక్కి తగ్గారు. తమ ఉద్దేశం అది కాదన్నారు. అటు పోలీసు కస్టడీ, ఇటు బెయిల్ పిటిషన్‌పై ఒకేరోజు విచారణ జరుపుతామని న్యాయస్థానం వారికి తేల్చిచెప్పింది. రెండింటిలోనూ ఒకేసారి తీర్పు వెలువరిస్తానంటూ విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు న్యాయవాదులను ఆదేశించింది.

అశ్వవాహనంపై ఆనంద నిలయుడు



అశ్వవాహనంపై విహరిస్తున్న మలయప్ప స్వామి

- వైభవంగా మహా రథోత్సవం
- నేడు చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

తిరుమల: తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు సోమవారం శ్రీవేంకటేశ్వరుడు మహారథం (తేరు)పై భక్తులను అనుగ్రహించాడు. గుర్రాలు వంటి ఇంద్రియాలు మనస్సు అనే తాడుతో కట్టి రథం వంటి శరీరాన్ని రథికుడైన ఆత్మ ద్వారా అదుపు చేయాలనే తత్వజ్ఞానాన్ని స్వామివారు ఈ రథోత్సవం ద్వారా భక్తులకు సందేశమిచ్చారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గోవిందా.. గోవిందా.. అంటూ మహారథం మోకు (తాడు)ను లాగుతూ భక్తి తన్మయత్వం చెందారు. వాహన సేవ తర్వాత సుమారు గంట పాటు పండితులు నిర్వహించిన వేదగోష్ఠితో తిరుమల సప్తగిరులు పులకించాయి. టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి రథం లాగారు. రాత్రి చల్లటి గాలుల మధ్య మలయప్ప స్వామి అశ్వవాహనంపై భక్తులను పరవశింపజేశారు. బంగారు, వజ్ర, వైఢూర్య ఆభరణాలు, విశేష పుష్పాలంకరణానంతరం స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మరథం, గజ, అశ్వ, తురగ, చతురంగ బలాలు ముందుకు సాగగా జానపద కళాకారులు, భజన బృందాలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది.

నేడు చక్రస్నానం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 9వ రోజు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్నపన తిరుమంజనం వరాహస్వామి ఆలయంలో నిర్వహిస్తారు. ఇది ముగిశాక శ్రీవారి శంఖు, చక్రాలను పుష్కర జలాల్లో ముంచి లేపుతారు. ఈ కార్యక్రమం తెల్లవారుజాము 3 నుంచి ప్రారంభమై 9 గంటలకు ముగుస్తుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్యలో ధ్వజావరోహణం నిర్వహిస్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.


మరో 5 రోజులు మా కస్టడీకి ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

సీఐడీ వివరించింది. కోర్టు ఇచ్చిన కస్టడీ ఉత్తర్వులను చదివే పేరుతో గంటల కొద్దీ సమయాన్ని వృథా చేశారని తెలిపింది. 2 రోజుల కస్టడీకి మాత్రమే ఇవ్వడంతో ఆ గడువును ఆయన అడ్డంపెట్టుకుని ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారంది. ఆయన నుంచి పలు అంశాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని రాబట్టాల్సి ఉందని, అందువల్ల ఆయనను తమ కస్టడీకి అప్పగించడం అత్యావశ్యకమని తమ పిటిషన్‌లో కోర్టుకు నివేదించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుపుతామని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులను ఆదేశించింది.

మధ్యాహ్నం వరకు కోర్టు ఉత్తర్వులను చదువుతూనే ఉన్నారు

'చంద్రబాబును 5 రోజుల కస్టడీకి అప్పగించాలంటూ ఈ నెల 11న పిటిషన్ దాఖలు చేశాం. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పలు షరతులతో కేవలం 2 రోజుల కస్టడీకే అప్పగిస్తూ ఈ నెల 22న ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు షరతులకు లోబడి చంద్రబాబును విచారించాం. విచారణ సందర్భంగా ఆయన నుంచి పలు వివరాలు రాబట్టేందుకు ఈ కేసుకు సంబంధించిన విషయాలతో ప్రశ్నలను సిద్ధం చేశాం. మా ప్రశ్నల తీరు మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేశాం. మొదటి రోజు విచారణలో చంద్రబాబు మేం అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేశారు. కోర్టు ఇచ్చిన పోలీసు కస్టడీ ఉత్తర్వులను ప్రశ్నించారు. పోలీసు కస్టడీ ఉత్తర్వుల కాపీని తనకు అందచేస్తే తప్ప, ప్రశ్నలకు సమాధానం ఇచ్చేది లేదని కరాఖండిగా చెప్పారు. తనకు ఎలాంటి ఆధారాలు ఇవ్వకుండానే పోలీసు కస్టడీకి ఇచ్చారని, న్యాయవాదిని కలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని చంద్రబాబు చెప్పారు. కోర్టు ఇరుపక్షాల వాదనలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తరువాతనే మిమ్మల్ని పోలీసు కస్టడీకి ఇవ్వడం జరిగిందని దర్యాప్తు అధికారి ఆయనకు చెప్పారు. ఒకవేళ పోలీసు కస్టడీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే, న్యాయవాది ద్వారా ఆ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని కూడా చంద్రబాబుకు దర్యాప్తు అధికారి స్పష్టం చేశారు. మిమ్మల్ని విచారించేందుకు కోర్టు మాకు అనుమతినిచ్చిందని, మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ఆయనకు దర్యాప్తు అధికారి తేల్చి చెప్పారు. కస్టడీ ఉత్తర్వులను తీసుకున్న చంద్రబాబు వాటిని మధ్యాహ్నం 1 గంట వరకు చదివారు. దర్యాప్తు అధికారి గంట పాటు భోజన విరామ సమయం ఇచ్చారు. భోజన విరామం తరువాత వచ్చి కూడా 2 గంటల వరకు కోర్టు ఉత్తర్వులను చదువుతూనే ఉన్నారు. 2.20 గంటల సమయంలో మాకు కోర్టు కేవలం రెండు రోజుల కస్టడీ మాత్రమే ఇచ్చిందని చంద్రబాబుకు దర్యాప్తు అధికారి స్పష్టంగా చెప్పారు. చదవడం ఆపి, తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆయనను దర్యాప్తు అధికారి కోరారు. అయితే దీనిని చంద్రబాబు పట్టించుకోలేదు. అలా మరికొద్దిసేపు కోర్టు ఉత్తర్వులను చదువుతూనే ఉన్నారు.' అని సీఐడీ తన పిటిషన్‌లో పేర్కొంది.



15 రోజుల తరువాత విచారణకు ఆస్కారం లేదనే..

'మేం ఏ సరళిలో ప్రశ్నలు అడగాలనుకున్నామో మమ్మల్ని అలా చంద్రబాబు అడగనివ్వలేదు. అంతేకాక ఆయన చెప్పే విషయాలను రాసుకోవాలని దర్యాప్తు అధికారికి చెప్పారు. తనకు తెలిసిన విషయాలకు సంబంధించి కూడా ఆయన నోరు మెదపలేదు. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దాటవేశారు. చాలా సందర్భాల్లో దర్యాప్తు అధికారిని మాటలతో వంచించే వైఖరిని అవలంబించారు. తాను విచారణ సందర్భంగా ఇలానే వ్యవహరించాలని చంద్రబాబు ముందే ఓ నిర్ణయానికి రావడంతో, ఈ కేసులో కీలక నిందితులైన వికాస్ ఖన్వీల్కర్, షెల్ కంపెనీల డైరెక్టర్లు, ఇతర కుట్రదారులైన గంటా సుబ్బారావు (ఏ1), లక్ష్మీనారాయణ (ఏ2)ల వాంగ్మూలాలను ఆయన ముందుంచి వివరాలు రాబట్టే అవకాశం లేకుండా పోయింది. అలాగే కీలక సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా చంద్రబాబు నుంచి తగిన వివరాలు తెలుసుకోలేకపోయాం. ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ, కావాల్సిన సమాచారాన్ని రాబట్టనివ్వకుండా దర్యాప్తు సంస్థను నిరోధిస్తూ వచ్చారు. విచారణ సందర్భంగా తీసిన వీడియోను పరిశీలిస్తే చంద్రబాబు వేసిన కాలయాపన ఎత్తులు సులభంగా అర్థమవుతాయి. అరెస్ట్ చేసిన నాటి నుంచి 15 రోజుల తరువాత ఎలాంటి జ్యుడీషియల్ ఇంటరాగేషన్ ఉండదన్న ఉద్దేశంతోనే చంద్రబాబు కావాలనే దర్యాప్తు అధికారి కోరిన సమాచారాన్ని ఇవ్వలేదు.' అని సీఐడీ వివరించింది.

హైకోర్టు ఉత్తర్వుల వల్ల 5 రోజుల పాటు కస్టడీలోకి తీసుకోలేకపోయాం...

'కోట్లాది రూపాయల డబ్బు 2018-20 సంవత్సరాల మధ్య తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు దర్యాప్తులో గుర్తించాం. ఆ బ్యాంకు ఖాతాలకు తానే అథరైజ్డ్ సిగ్నేటరీ అన్న విషయాన్ని చంద్రబాబు కూడా అంగీకరించారు. భారీ స్థాయిలో వచ్చిన నగదు డిపాజిట్ల వివరాలను చంద్రబాబు ముందు ఉంచి, వాటి గురించి ఆయన్ను ప్రశ్నించాల్సి ఉంది. టీడీపీ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అన్ని వివరాలు అందించాలని హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ మేనేజర్‌ను కోరాం. ఆ వివరాలు రావాల్సి ఉంది. వచ్చిన తరువాత వాటిని విశ్లేషించి చంద్రబాబును విచారిస్తాం. తనపై మేం నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఈ నెల 13న విచారణ జరిపిన హైకోర్టు, 18వ తేదీ వరకు మా పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబును ఒత్తిడి చేయవద్దని ఉత్తర్వులిచ్చింది. ఈ ఆరు రోజులను మొదటి 15 రోజుల గడువు నుంచి మినహాయించాల్సిన అవసరం ఉంది. హైకోర్టు ఆదేశాల వల్ల మా కస్టడీ పిటిషన్‌పై ఈ ఏసీబీ కోర్టు విచారణ జరిపే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తగినంత గడువు లేకపోవడంతో మేం కోరుకున్న విధంగా చంద్రబాబును 5 రోజుల పోలీసు కస్టడీకి తీసుకోలేకపోయాం' అని సీఐడీ తన పిటిషన్‌లో తెలిపింది.

చంద్రబాబు సహాయ నిరాకరణ వల్ల అది సాధ్యం కాలేదు...

'ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో లోతైన కుట్ర దాగి ఉంది. ఈ కుట్ర వెనుక వాస్తవాలను వెలికితీసేందుకు చంద్రబాబును విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార దుర్వినియోగం, ప్రైవేటు వ్యక్తులకు చేకూర్చిన లబ్ధి గురించి ప్రశ్నించాల్సి ఉంది. సాక్షులు చెప్పిన వివరాలను ఆయన ముందుంచి వాటి ఆధారంగా వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థగా మాపై ఉంది. చంద్రబాబు సహాయ నిరాకరణ వల్ల పలు వివరాలను రాబట్టలేకపోయాం. కీలక ఫైళ్లు గల్లంతయ్యాయి. ఈ ఫైళ్ల గల్లంతు వ్యవహారంలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు, గంటా సుబ్బారావు, డాక్టర్ లక్ష్మీనారాయణ ప్రధాన లబ్ధిదారులుగా అనుమానిస్తున్నాం. గల్లంతైన ఫైళ్ల ఆచూకీ తెలుసుకునేందుకు చంద్రబాబు కస్టోడియల్ విచారణ అత్యావశ్యకం' అని సీఐడీ తన పిటిషన్‌లో పేర్కొంది.

ప్రధాన సూత్రధారి చంద్రబాబేనని దర్యాప్తులో తేలింది...

'ఈ స్కిల్ కుంభకోణం డబ్బు మొత్తం చివరకు నగదు రూపంలో చేరింది వికాస్ ఖన్వీల్కర్, షెల్ కంపెనీలకు. ఇందుకు ప్రధాన సూత్రధారి చంద్రబాబు అని దర్యాప్తులో తేలింది. షెల్ కంపెనీల ద్వారా డబ్బు మొత్తం తిరిగి ఆయనకే చేరింది. సుమన్ బోస్, వికాస్ ఖన్వీల్కర్, లక్ష్మీనారాయణ, గంటా సుబ్బారావు, సంజయ్ దాగాలు చెప్పిన వివరాల ఆధారంగా చంద్రబాబును ప్రశ్నించాల్సి ఉంది. ఈ కుంభకోణం అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ అని మా దర్యాప్తులో తేలింది. నిధుల మళ్లింపులో ఎవరెవరి పాత్ర ఏమిటన్న విషయాలు చంద్రబాబుకు పూర్తిగా తెలుసు. కుట్ర పన్నిన తీరు, ఇతర నిందితుల పాత్ర, ఇతర కీలక వివరాలన్నీ చంద్రబాబుకు తెలుసు. ఈ వివరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చంద్రబాబును 5 రోజుల పాటు మా కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం' అని సీఐడీ తన పిటిషన్‌లో తెలిపింది.


ఏ మద్యం తాగినా ఆరోగ్యానికి హానికరమే..

మద్యం బ్రాండ్ల మీద పురందేశ్వరి వ్యాఖ్యలపై కేజీహెచ్ వైద్యుల స్పష్టీకరణ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఏ బ్రాండ్ మద్యం తాగినా అది ఆరోగ్యానికి హానికరమేనని, కొన్ని బ్రాండ్ల మద్యం తాగడం కారణంగానే కాలేయ సంబంధ వ్యాధులు వస్తున్నాయనడంలో వాస్తవం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి ఈ నెల 23న కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డులో లివర్ సమస్యలతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రప్రదేశ్‌లో మద్యం బ్రాండ్లపై విమర్శలు చేశారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ వివరణ ఇస్తూ.. ఆల్కహాల్ సేవించే వారిలో 15 శాతం మందికి కాలేయ సంబంధ వ్యాధులొస్తున్నాయని, దీనికి బ్రాండ్లతో సంబంధం లేదని తేల్చి చెప్పారు. లివర్ వ్యాధి వల్ల కలిగే దుష్ఫలితాలు బయట పడేందుకు ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. 8 నుంచి 10 సంవత్సరాల పాటు ఆల్కహాల్ సేవిస్తున్న వారికి లివర్ క్యాన్సర్, లివర్ సిరోసిస్ వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. లివర్ సంబంధిత వ్యాధులపై దేశవ్యాప్తంగా చేసిన సర్వేలో 15 శాతం కేసులు మద్యపానం సేవించడం కారణంగానే పెరిగాయని తేలినట్లు వెల్లడించారు. ఇది ఒక్క ఏపీలోనే కాదని, దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా కూడా ఈ పెరుగుదల కనిపిస్తోందని వివరించారు. రాష్ట్రంలో ఉన్న బ్రాండ్ల మద్యం తాగి లివర్ వ్యాధితో నెలకు సుమారు అయిదుగురు చనిపోతున్నారని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కేజీహెచ్‌లో సుమారు 58 మంది చికిత్స పొందుతున్నారని అనడంలో వాస్తవం లేదని, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో 52 పడకలున్నాయని, ఇందులో ఆల్కహాల్ సేవించడం వల్ల లివర్ పాడై, పాంక్రియాస్ సంబంధిత రోగులు ఒక నెలకు 20 మంది వరకు అడ్మిట్ అవుతున్నారని, గత 10 సంవత్సరాల నుంచి ఇదే విధంగా గణాంకాలు ఉన్నాయన్నారు.

ఎస్సీలకు అగ్రతాంబూలం

- బాబు ఐదేళ్ల పాలనలో ఖర్చు చేసింది కేవలం రూ.35,250.46 కోట్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలోనే చేసిన ఖర్చు రూ.63,689 కోట్లు
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి : స్వాతంత్ర్యం వచ్చాక ఎస్సీల సంక్షేమం కోసం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం.. ఏపీ చరిత్రలో దళితుల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం దివంగత వైఎస్సార్ అయితే, ఆయనకంటే మిన్నగా ఎస్సీల సంక్షేమానికి అగ్రతాంబూలం ఇస్తున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ఎస్సీల కోసమే ఏకంగా రూ.63,689 కోట్లు ఖర్చు చేశామన్నారు. శాసనసభ సమావేశాల మూడో రోజు సోమవారం ఉదయం జరిగిన ప్రశ్నోత్తరాల్లో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి నాగార్జున సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాల్లో లబ్ధి ఎస్సీ, ఎస్టీలే ఎక్కువగా పొందుతున్నారని చెప్పారు. డీబీటీ ద్వారా.. వసతి దీవెన కింద రూ.834.96 కోట్లు, జగనన్న విద్యా దీవెన కింద రూ.2,081.54 కోట్లు, జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా రూ.14.97 కోట్లు, రైతు భరోసా కింద రూ.3,202.15 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాల కింద రూ.83.38 కోట్లు, ఉచిత పంటల బీమా ద్వారా రూ.393.06 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.160.23 కోట్లు, మత్స్యకార భరోసా రూ.6.10 కోట్లు, డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ పథకం కింద రూ.817.61 కోట్లు, పెన్షన్ కానుక రూపంలో రూ.13,410.52 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద రూ.3,353.37 కోట్లు, ఆసరా కింద రూ.3,721.92 కోట్లు, వైఎస్సార్ బీమా కింద రూ.449.40 కోట్లు, నేతన్ననేస్తం కింద రూ.10.61 కోట్లు, చేదోడు కింద రూ.71.19 కోట్లు, లా నేస్తం రూపంలో రూ.8.85 కోట్లు, వాహన మిత్ర కింద రూ.244.91 కోట్లు, ఆరోగ్య ఆసరా కింద రూ.170.94 కోట్లు, ఆరోగ్యశ్రీ కింద రూ.1,425.81 కోట్లు, కళ్యాణమస్తు కింద రూ.102.25 కోట్లు.. ఇలా పలు పథకాల కింద మొత్తంగా రూ.60,530.71 కోట్లు ఖర్చుచేసినట్టు చెప్పారు. ఇతర సాంఘిక సంక్షేమ శాఖల ద్వారా చేసిన ఖర్చుతో కలుపుకుంటే ఇప్పటి వరకు రూ.63,689 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం 2014-19 మధ్యలో ఎస్సీల సంక్షేమానికి కేవలం రూ.35,250.46 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు.


- ▶ విద్యా దీవెన పథకాన్ని పీజీ స్థాయి వరకు వర్తింపజేస్తే.. ఎస్సీలకు మేలు జరుగుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు కోరారు.
- ▶ భూమిలేని ఎస్సీలకు కనీసం 50 సెంట్ల స్థలం ఇచ్చే ప్రతిపాదనను సీఎం పరిశీలించాలని గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్ కోరారు.
- ▶ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీల కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు.

పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ : మంత్రి కాకాణి



రాష్ట్రంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ప్రశ్నోత్తరాలలో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ తొలి దశలో రూ.1,250 కోట్లతో 9 సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 13 సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు పరిపాలనామోదం ఇచ్చినట్టు తెలిపారు. 34 కోల్డ్ స్టోరేజీలు నిర్మించగా.. ఇప్పటికే 29 కోల్డ్ స్టోరేజీలకు రూ.24.54 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. అలాగే రూ.117.29 కోట్లతో 1932 సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, రూ.1,069.59 కోట్లతో 44 ఇతర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు.

వైఎస్సార్ బీమా కింద 100 శాతం ప్రభుత్వమే చెల్లిస్తోంది.. : మంత్రి గుమ్మనూరు



కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పీఎంజేజేబీవై, ఏఏబీవై, పీఎంఎస్‌బీవై పథకాలను కేంద్రం నిలిపివేయడంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద పేద, దారిద్ర్యరేఖకు దిగువనున్న వారందరికీ 100 శాతం ప్రీమియంను భరిస్తూ బీమా కవరేజ్ కల్పిస్తోందన్నారు.

ఓటుపై వేటు!

▶ మొదటి పేజీ తరువాయి

సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ నాయకులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మెటా విష్ణువర్ధన్‌రెడ్డి, తలమంచి సురేంద్రబాబు, కోనం బ్రహ్మయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఐదు మండలాలలో..

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తను పోటీ చేసే నియోజకవర్గమైన సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కుట్రకు తెర తీశారు. నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలలో 11,291 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు తన అనుచరులతో ఫారం 7 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయించారు. అయితే వెరిఫికేషన్ సమయంలో అనుమానం వచ్చి అధికారులు పరిశీలించడంతో దాదాపు 11 వేల ఓట్లను తొలగించేందుకు పథకం వేసినట్లు వెలుగులోకి వచ్చింది.

వరుస పరాజయాలను భరించలేకనే..

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వరుసగా పరాజయాల భయంతోనే ఈ కుట్రకు తెర తీసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.



నెల్లూరు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఆయన ఇప్పటికే నాలుగు పర్యాయాలు ఓటమి చెందారు. సర్వేపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. సొంత నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకుని మంత్రి కాకాణి అభివృద్ధి పనులు చేయించారు. దీంతో మరోసారి ఓటమి తప్పదనే ఆందోళనతో సోమిరెడ్డి అడ్డదారులు తొక్కినట్లు తెలుస్తోంది.

విచారణకు ఆదేశించాం

సర్వేపల్లిలో ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన మద్దతుదారుల ఓట్ల తొలగింపునకు కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేశారనే ఫిర్యాదు అందింది. స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ద్వారా విచారణకు ఆదేశించాం. విచారణ అనంతరం చర్యలకు ఉపక్రమిస్తాం. అర్హత ఉన్న ఓట్లను తొలగించం.

-కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్ నెల్లూరు

పక్కాగా రీ వెరిఫికేషన్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు ఈ ఏడాది జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. 2,303 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపులపై దరఖాస్తులు స్వీకరించారు. వాటి పునః పరిశీలనకు ఈనెల 25 వరకు గడువు ఇచ్చారు. వచ్చే నెలలో ముసాయిదా జాబితా ప్రదర్శిస్తామని అధికారులు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా ఫారం-6 (చేర్పులు) కోసం 55,503 దరఖాస్తులు రాగా 36,836 అభ్యర్థనలను ఆమోదించారు. 5,144 దరఖాస్తులు తిరస్కరణ కాగా 14,720 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫారం-7 (తొలగింపులు) కింద 94,997 దరఖాస్తులు రాగా 55,016 విజ్ఞాపనలను ఆమోదించారు. 6,443 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా 36,156 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫారం-8 (సవరణలు) ద్వారా 1,33,719 దరఖాస్తులు 1,12,162 ఆమోదం పొందాయి. 2,459 దరఖాస్తులను తిరస్కరించగా 11,811 విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 19,25,089 మంది ఓటర్లు ఉండగా బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేను పారదర్శకంగా పూర్తి చేశారు. గడువులోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేశారు. బూత్ స్థాయి ఏజెంట్ల అభ్యంతరాలను పున:పరిశీలించి కలెక్టర్ పక్కాగా రీ వెరిఫికేషన్ చేశారు.

క్లుప్తంగా...

రూ.2,000 నోట్ల మార్పిడికి మరో 5 రోజులే

న్యూఢిల్లీ: రూ. 2000 నోట్ల మార్పిడికి గడువు సమీపిస్తోంది. మరో ఐదు రోజులే మిగిలి ఉంది. సెప్టెంబర్ 30లోగా రూ.2,000 కరెన్సీ నోట్లను మార్చుకోవచ్చు లేదా బ్యాంకుల్లో డిపాజిట్ చేయొచ్చు. ఈ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) మే 19న ప్రకటించిన సంగతి తెలిసిందే. నోట్ల మార్పిడికి ఆర్బీఐ విధించిన డెడ్‌లైన్ మరో ఐదు రోజుల్లో ముగియనుంది. ఈ నెల 28న దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు దినం. అంటే మరో నాలుగు రోజులే మిగిలి ఉంది. మరోవైపు, రూ.2,000 నోట్ల మార్పిడికి డెడ్‌లైన్‌ను ఆర్బీఐ పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కానీ, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఎన్డీఏను వీడిన అన్నాడీఎంకే

పళని స్వామి నేతృత్వంలో నిర్ణయం

సాక్షి, చెన్నై: ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చినట్లు ప్రధాన భాగస్వామ్య పక్షం అయిన అన్నాడీఎంకే ప్రకటించింది. తమిళనాడులో బీజేపీతో తమ స్నేహ బంధం ఇంతటితో ముగిసిందని ఆ పార్టీ తెలిపింది. సోమవారం చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో నేతలతో పార్టీ ప్రధాన కార్యదర్శి పళని స్వామి సమావేశమయ్యారు. కొంతకాలంగా తమిళనాడు బీజేపీ నేతలు దివంగత నేతలు అన్నాదురై, జయలలితకు వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు, ఇటీవల పళని స్వామి ఢిల్లీ పర్యటనలో ఎదురైన అనుభవం, పార్టీ నేతలకు హోం మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ లభించకపోవడం వంటి వాటిపై చర్చించారు. బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదని, బయటకు వచ్చేయాలని తీర్మానించారు. పార్టీ నేతలు మును స్వామి, జయ కుమార్, ఎస్పీ వేలు మణి, నత్తం విశ్వనాథన్, దిండుగల్ శ్రీనివాసన్ మీడియా తో మాట్లాడారు. ఏడాది కాలంగా పథకం ప్రకారం రాష్ట్ర బీజేపీ నేతలు అన్నాడీఎంకే నేతలే లక్ష్యంగా చేస్తున్న తీవ్ర వ్యాఖ్యలతో కోట్లాది కార్యకర్తల మనో భావాలు దెబ్బ తిన్నాయని, అందుకే ఆ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించామ న్నారు.

వాట్సాప్ చానల్‌లో మోదీకి 50 లక్షల మంది ఫాలోవర్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాట్సాప్ చానల్ సరికొత్త రికార్డు సృష్టించింది. వాట్సాప్ చానల్‌లో మోదీని అనుసరిస్తున్న వారి సంఖ్య కేవలం వారం రోజుల వ్యవధిలోనే 50 లక్షలకు చేరడం విశేషం. తన ఫాలోవర్లకు ప్రధాని మోదీ సోషల్ మీడియాలో కృతజ్ఞతలు తెలిపారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

కరోనా. ఈ పేరు వింటే చాలు ఇంకా ఉలిక్కిపడుతూనే ఉంది ప్రపంచం. ఆధునిక ప్రపంచ చరిత్ర ఒక రకంగా కరోనాకు ముందు, తర్వాత అన్నట్టుగా తయారైంది. మరి కోవిడ్‌ను మించిన వైరస్ మరోసారి ప్రపంచం మీదికి వచ్చిపడితే?

ఆ ఊహే భయానకంగా ఉంది కదా!

కానీ అది అతి త్వరలో నిజమయ్యే ఆస్కారం చాలా ఉందని స్వయానా ప్రపంచ ఆరోగ్య సంస్థే అంటోంది! ప్రస్తుతానికి ఎక్స్‌గా పిలుస్తున్న సదరు ప్రాణాంతక వైరస్ మన ఉసురు తీయడం ఖాయమట. తీవ్రతలో కోవిడ్ కంటే ఇది ఏడు రెట్లు ఎక్కువని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొనడం ఆందోళనలను మరింతగా పెంచుతోంది. ప్రస్తుతానికి ఎక్స్‌గా పిలుస్తున్న ఈ పేరు పెట్టని వైరస్ ప్రపంచవ్యాప్తంగా హీనపక్షం 5 కోట్ల మందిని బలి తీసుకోవడం ఖాయమని సైంటిస్టులను ఉటంకిస్తూ హెచ్చరిస్తోంది. అంత డేంజరస్ కరోనా కూడా నిజానికి మున్ముందు మానవాళిని కబళించబోయే మహా మహమ్మారులకు ట్రెయిలర్ మాత్రమేనని జోస్యం చెబుతోంది...!

కరోనాను మించిన వైరస్



కనీసం 5 కోట్ల మందిని బలి తీసుకుంటుంది: డబ్ల్యూహెచ్‌ఓ
కరోనా ట్రెయిలరే.. మున్ముందు మరిన్ని 'మహా'మ్మారులు!
కలకలం రేపుతున్న సైంటిస్టుల హెచ్చరికలు

కరోనా తాలూకు కల్లోలం నుంచి మనమింకా పూర్తిగా తేరుకోనే లేదు. డిసీజ్ ఎక్స్‌గా పేర్కొంటున్న మరో ప్రాణాంతక వైరస్ అతి త్వరలో ప్రపంచాన్ని మరోసారి అతలాకుతలం చేయనుందట. సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థే చేస్తున్న హెచ్చరిక ఇది! 2019లో వెలుగు చూసినా కరోనా డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటిదాకా కనీసం 70 లక్షల ప్రాణాలు తీసింది. కానీ కొత్త రోగం హీనపక్షం 5 కోట్ల మందిని కబళించవచ్చన్న అంచనాలు ఆందోళనలను మరింత పెంచుతున్నాయి. పైగా డిసీజ్ ఎక్స్ ఇప్పటికే తన ప్రభావం మొదలుపెట్టి ఉండొచ్చని కూడా డబ్ల్యూహెచ్‌ఓ సైంటిస్టులను ఉటంకిస్తూ డైలీ మెయిల్ పేర్కొంది.

> డిసీజ్ ఎక్స్‌తో పోలిస్తే కరోనా ప్రమాదకరమైనది కానే కాదని చెప్పాలి. ఎందుకంటే కరోనాకు ఇప్పుడు దాదాపుగా అంతా ఇమ్యూన్‌గా మారాం. కానీ కొత్త వైరస్ తట్టు అంత శరవేగంగా వ్యాపించే అంటురోగానికి కారణమైతే? సోకిన ప్రతి 100లో ఏకంగా 67 మందిని బలి తీసుకున్న ఎబోలా అంతటి ప్రాణాంతకంగా మారితే? ఇదే ఇప్పుడు సైంటిస్టులను తీవ్రంగా కలవర పెడుతున్న అంశం! ప్రపంచంలో ఏదో ఇక మారుమూలలో అదిప్పటికే సడీచప్పుడూ లేకుండా ప్రాణం పోసుకునే ఉంటుంది. అతి త్వరలో ఉనికిని చాటుకుంటుంది. ఇక అప్పటి నుంచీ నిత్య కల్లోలమే!
>
> **- డేమ్ కేట్ బిన్ హామ్, బ్రిటన్ వ్యాక్సిన్ టాస్క్‌ఫోర్స్ చీఫ్**

డిసీజ్ ఎక్స్ మనకిప్పటికే తెలిసిన వైరస్ నుంచే పుట్టుకొచ్చి ఉంటుందని బ్రిటన్ వాక్సిన్ టాస్క్ ఫోర్స్ చీఫ్ డేమ్ కేట్ బిన్ హామ్ చెబుతున్నారు. వినడానికి కఠోరంగా ఉన్నా, మనకు ముందున్నది కష్ట కాలమేనన్నది అంగీకరించాల్సిన నిజమని ఆమె అన్నారు! '1918–19 మధ్య ఫ్లూ కేవలం ఒక్క ఏడాదిలోనే ఏకంగా 5 కోట్ల మందికి పైగా బలి తీసుకుంది.

తెలిసిన వైరస్ నుంచే..?

ఇప్పుడు కూడా మనకు ఆల్రెడీ తెలిసిన వైరస్‌లలోనే ఒకటి కనీవినీ ఎరగని రీతిలో భయానకంగా మారి అలాంటి మహోత్పాతానికే దారి తీయవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం అసంఖ్యాకమైన వైరస్‌లు పరస్పరం పరివర్తనాలు చెందుతూ రూపు మార్చుకుంటున్నాయి. ఊహాతీత వేగంతో విస్తరిస్తున్నాయి. పైగా వీటి సంఖ్య ప్రస్తుతం భూమి మీద ఉన్న ఇతర అన్ని జీవరాశుల మొత్తం సంఖ్య కంటే కూడా చాలా ఎక్కువ' అని చెప్పుకొచ్చారు! 'వాటిలో అన్నీ మనకు అంతగా చేటు చేసేవి కాకున్నా కొన్ని మాత్రం చాలా డేంజరస్' అని వివరించారు.

లోతుగా పర్యవేక్షణ

జీవ రసాయన సైంటిస్టులు ప్రస్తుతం కనీసం 25 వైరస్ కుటుంబాలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. వీటిలో ఒక్కోదాంట్లో వేలాది విడి వైరస్‌లు ఉన్నాయి. వాటిల్లో ఏదో ఒకటి విపరీతమైన పరివర్తనాలకు లోనై మహా మహమ్మారిగా రూపుదాల్చే ప్రమాదం పొంచి ఉందట! పైగా జంతువుల నుంచి మనుషులకు సోకగల వైరస్ లను అధ్యయనంలో భాగంగా చేయలేదు. వాటినీ కలిపి చూస్తే మానవాళికి ముప్పు మరింత పెరుగుతుందని డేమ్ హెచ్చరిస్తున్నారు.

అప్పుడే వ్యాక్సిన్ తయారీ!

ఇంకా కొత్త రోగం పేరైనా తెలియదు. ఒక్కరిలో కూడా దాన్ని గుర్తించలేదు. అప్పుడే దానికి వ్యాక్సిన్ కనిపెట్టే ప్రయత్నాల్లో బ్రిటన్ సైంటిస్టులు తలమునకలుగా ఉన్నారు. ఏకంగా 200 మందితో కూడిన బృందం ఈ పనిలో తలమునకలుగా ఉందట! జంతువుల నుంచి ఎలుకల ద్వారా మనుషులకు సోకే, శరవేగంగా వ్యాపించే స్వభావమున్న బర్డ్ ఫ్లూ, మంకీ పాక్స్, హంట్ వైరస్‌లనే ప్రస్తుతానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు బ్రిటన్ హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ చీఫ్ ప్రొఫెసర్ డేమ్ జెన్నీ హారిస్ తెలిపారు. అయితే, పర్యావరణ మార్పుల వంటి మానవకృత విపత్తులకు ఇప్పటికైనా అడ్డుకట్ట వేస్తే ఎన్నో వైరస్‌లను కూడా అరికట్టినవాళ్లం అవుతామంటూ ఆయన ముక్తాయించారు! మున్ముందు మన పాలిట ప్రాణాంతకంగా మారే భయంకరమైన మహమ్మారులకు కరోనా కేవలం ఒక దారుణమైన ఆరంభం మాత్రమేనని సైంటిస్టులు ముక్త కంఠంతో చెబుతున్నారు!

అవును.. మరిన్ని మహమ్మారులు!

- ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- చైనా 'బ్యాట్ ఉమన్' షి జెంగ్ లీ జోస్యం

కోవిడ్ తరహా మరో మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని చైనా 'బ్యాట్ ఉమన్' షీ జెంగ్ లీ జోస్యం చెప్పారు. చైనాలో బెస్ట్ వైరాలజిస్ట్‌గా చెప్పే ఆమె జంతువుల నుంచి, ముఖ్యంగా గబ్బిలాల నుంచి మనుషులకు సోకే వైరస్‌లపై అపారమైన రీసెర్చ్ చేసినందుకు బ్యాట్ ఉమన్‌గా పేరుబడ్డారు. కరోనాకు పుట్టిల్లుగా నేటికీ ప్రపంచమంతా నమ్ముతున్న చైనాలోని వుహాన్ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో లీ బృందం 40 కరోనా జాతులపై లోతుగా అధ్యయనం చేసింది. వాటిలో సగానికి సగం మానవాళికి చాలా ప్రమాదకరమైనవని తేల్చింది. వీటిలో ఆరు ఇప్పటికే మనకు సోకాయని లీ చెప్పారు! గత జూలైలో ఇంగ్లిష్ జర్నల్ ఎమర్జింగ్ మైక్రోబ్స్ అండ్ ఇన్ఫెక్షన్స్ లో పబ్లిష్ అయిన ఈ అధ్యయనం ఇటీవలే ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అన్ని దేశాలూ మరింత అప్రమత్తంగా ఉండాలని చైనాకు చెందిన మరికొందరు ప్రముఖ వైరాలజిస్టులు కూడా సూచిస్తున్నారు. గబ్బిలాలు, ఎలుకల నుంచి ఒంటెలు, పంగోలిన్లు, పందుల వంటి జంతువుల ద్వారా సమీప భవిష్యత్తులో ఇవి మనకు మరింతగా సోకే ప్రమాదం చాలావరకు ఉందని వారు హెచ్చరిస్తున్నారు!

ఉర్దూస్తాన్, ఖలిస్తాన్..

- మతాల ప్రాతిపదికన భారత్‌ను విచ్ఛిన్నం చేసే కుట్ర
- ఖలిస్తాన్ ఉగ్రసంస్థ చీఫ్ పన్నాగం
- భారత నిఘా నివేదికలో విస్మయకర విషయాలు



న్యూఢిల్లీ: భారత్‌లో ప్రత్యేక ఖలిస్తాన్ కోసం వేర్పాటువాదం, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) ఉగ్రసంస్థ చీఫ్ గురుపత్వంత్ సింగ్ పన్నూ పెద్ద ప్రణాళికలే రచించాడు. సంబంధిత వివరాలు ఉన్న భారత నిఘా వర్గాల నివేదిక ఈ విషయాలను వెల్లడిస్తోంది. ఆ నివేదికలోని వివరాలను ఓసారి గమనిస్తే

- మతాల ప్రాతిపదికన భారత్‌ను విడగొట్టాలి అనేది పన్నూ ప్రధాన ఎజెండా.
- ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్‌సహా పలు రాష్ట్రాల్లో పన్నూపై పలు కేసులు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికాలో తల దాచుకుంటున్న పన్నూపై భారత్‌లో చాలా రాష్ట్రాల్లో పదహారుకు పైగా కేసులు నమోదవడాన్ని బట్టి ఎస్ఎఫ్‌జే కార్యకలాపాలు ఇండియాలో ఎంతగా విస్తరించాయో అర్థమవుతుంది.
- భారత భూభాగంలో ముస్లింల కోసం ప్రత్యేక దేశాన్ని ఏర్పాటుచేయాలనేది పన్నూ ఆలోచన. దీనికి ' డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ఉర్దూస్తాన్' అని పేరు కూడా ఖాయం చేసుకున్నాడు.
- దేశం నుంచి కశ్మీర్‌ను వేరుచేసేందుకు కశ్మీర్‌లోని ప్రజలను విప్లవకారులుగా తయారుచేయాలని కంకణం కట్టుకున్నాడు. అందుకోసం భారత్ పట్ల వ్యతిరేకభావన ఉన్న ప్రాంతాల్లో విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. కశ్మీర్‌లో అసంతృప్తితో రగిలిపోతున్న వారికి మరింత ఉద్రేకపరిచేందుకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఖలిస్తాన్ జెండా ఎగరేస్తానని పన్నూ గతంలో ప్రకటించాడు కూడా.

అసలు ఎవరీ పన్నూ ?

దేశ విభజన కాలంలో 1947లో పన్నూ కుటుంబం పాకిస్తాన్ నుంచి అమృత్‌సర్ దగ్గర్లోని ఖాన్‌కోట్ గ్రామానికి వలసవచ్చింది. అమృతసర్‌లో పుట్టిన పన్నూ.. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా పుచ్చుకున్నాడు. అమెరికాలో ఉంటున్న పన్నూ అక్కడే అటార్నీగా పనిచేస్తున్నాడు. భారత్‌లో ఖలిస్తాన్‌ను ఏర్పాటుకు కృషిచేస్తున్న ఎస్ఎఫ్‌జే సంస్థకు న్యాయ సలహాదారుగా ఉంటున్నట్లు పన్నూ చెప్పుకుంటున్నాడు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సాక్ష్యాధారాలతో గుర్తించిన కేంద్ర హోం శాఖ పన్నూను ఉగ్రవాదిగా ప్రకటించింది.

పన్నూ ప్రేలాపణలు..

భారత్‌లో ఖలిస్తాన్ వేర్పాటువాదంలో నిమగ్నమైన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇస్తుంటాడని పన్నూపై ఆరోపణలు ఉన్నాయి. తాను చెప్పిన పనులు చేసినా భారీ బహుమతులు ఇస్తానని గతంలో బహిరంగ ప్రకటనలుచేశాడు. ఢిల్లీలోని ప్రఖ్యాత ఇండియాగేట్ వద్ద ఖలిస్తాన్ జెండా ఎగరేస్తే 25 లక్షల డాలర్లు ఇస్తానని పిలుపునిచ్చాడు. 2021లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ మువ్వన్నెల జెండా ఎగరేయకుండా ఎవరైనా పోలీసు అడ్డుకుంటే అతనికి 10 లక్షల డాలర్లు ఇస్తానని ప్రకటించాడు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో మునిగిన పన్నూపై ఎన్ఐఏ కోర్టు 2021 ఫిబ్రవరిలో నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీచేసింది.

'ఖలిస్తాన్' సంబంధ 48 ప్రాంతాల్లో పంజాబ్ పోలీసుల దాడులు

జలంధర్: ఖలిస్తాన్ వేర్పాటువాద ఉగ్రవాది లఖ్బీర్ సింగ్ లాండా, అతని అనుచరులకు చెందిన 48 ప్రాంతాల్లో సోమవారం పంజాబ్ రాష్ట్ర పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఫిరోజ్‌పూర్, సమీప ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఫిరోజ్‌పూర్ పట్టణంలోని జీరా ప్రాంతంలో లఖ్బీర్‌సింగ్ ముఠా సభ్యులు బెదిరింపులు, నగదు వసూళ్లకు పాల్పడిన విషయం తెల్సిందే. ఇదే ప్రాంతంలో గతంలో ఒక వర్తకుడిపైకి ఇద్దరు ముసుగు మనుషులు కాల్పులు జరిపారు. నిషేధిత ఖలిస్తాన్ వేర్పాటువాద సంస్థ అయిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌లో సభ్యులైన పర్మీందర్ సింగ్ ఖైరా అలియాస్ పట్టూ, సత్నామ్ సింగ్ అలియాస్ సత్బీర్ సింగ్ అలియాస్ సట్టా, యద్వీందర్ సింగ్ అలియాస్ యద్దాల ఆచూకీ తెలియజేస్తే తలో రూ. 5 లక్షల నగదు బహుమతి ఇస్తామని పోలీసులు పేర్కొన్నారు. లఖ్బీర్, హర్వీందర్ సింగ్ సంధూ అలియాస్ రిండాల ఆచూకీ తెలపాలని పోలీసులు కోరడం తెల్సిందే. లఖ్బీర్, రిండాల సమాచారం అందిస్తే తలో రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని పోలీసులు గతంలోనే ప్రకటించారు. పంజాబ్‌లో శాంతి, సామరస్యాలకు ఆటంకం కల్గిస్తూ దేశవ్యతిరేక, ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వీరిపై కేసు నమోదుచేసింది. లఖ్బీర్, రిండాల కోసం గాలిస్తోంది. 'ఉగ్రవాదుల ఉపకరణాలు, మత్తుపదార్థాలను పంజాబ్‌కు తరలిస్తూ వీరిద్దరూ భారీగా నగదు కూడబెడుతున్నారు. ఈ నగదును ఖలిస్తాన్ ఉగ్రవాదం కోసం వినియోగిస్తున్నారు. పంజాబ్‌లో ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను బెదిరించి అక్రమ నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. పంజాబ్‌లో కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడిన కేసుల్లోనూ వీరు నిందితులుగా ఉన్నారు' అని గత వారమే ఎన్ఐఏ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.



బిలాస్‌పూర్‌లో రైలులో ప్రయాణిస్తూ రాహుల్ గాంధీ

అధికారంలోకి వస్తే కులగణన

- దళితులు, ఓబీసీల భాగస్వామ్యం పెంచుతాం: రాహుల్

బిలాస్‌పూర్: దళితులు, గిరిజనులు, మహిళలు, ఓబీసీల భాగస్వామ్యం పెరగాలంటే కులగణన ద్వారా మాత్రమే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతుందని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా చేపట్టిన కులగణన గణాంకాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కులగణన అంటే భయపడుతున్నారా అని ప్రధానిని నిలదీశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్పూర్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆవాస్ న్యాయ్ సమ్మేళన్‌లో రాహుల్ ప్రసంగించారు. రిమోట్ కంట్రోల్‌ను చూపుతూ ఆయన..'కాంగ్రెస్ పార్టీ ప్రజలందరి ముందు బహిరంగంగా ఈ రిమోట్‌ను నొక్కుతుంది. ఫలితంగా పేదలకు, అవసరమైన వారికి లబ్ధి అందుతుంది. ఇదే మీటను బీజేపీ చీకటిమాటున నొక్కుతుంది. దాంతో ఆదానీ(పారిశ్రామికవేత్త)కి పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే కాంట్రాక్టులు దక్కుతాయి' అని ఎద్దేవా చేశారు. సభ అనంతరం రాహుల్ గాంధీ తిరుగు ప్రయాణంలో బిలాస్‌పూర్ నుంచి రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు బిలాస్‌పూర్–ఇట్వారీ ఇంటర్ సిటీ రైలులో ప్రయాణించారు. ప్రయాణికులతో ముచ్చటించారు.

అదనపు వడ్డీ కట్టలేదని వివస్త్రను చేసి..

బిహార్‌లో దళిత మహిళకు దారుణ అవమానం

పట్నా: సభ్య సమాజం తలదించుకోవాల్సిన దారుణ ఘటన బిహార్‌లో జరిగింది. ఆపదలో అక్కరకొస్తాయని రూ.1,500 అప్పు తీసుకున్న పాపానికి దళిత మహిళ ఒకరు దారుణ అవమానానికి గురికావాల్సి వచ్చింది. విషయం తెల్సి నిందితులకు కఠిన శిక్ష పడేలాచూడాలని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పోలీసులను ఆదేశించారు. బిహార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్నా జిల్లాలోని ఖుస్రూపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామంలో ఈనెల 23వ తేదీ రాత్రి జరిగింది. కొన్ని నెలల క్రితం దళిత మహిళ భర్త.. ప్రమోద్ సింగ్ అనే వ్యక్తి వద్ద రూ.1,500 అప్పుగా తీసుకున్నారు. తర్వాత కొంతకాలానికి వడ్డీ తోసహా అసలు మొత్తాన్నీ ప్రమోద్‌కు చెల్లించేశారు. ఇది సరిపోదని, ఇంకా అదనంగా వడ్డీ కట్టాలని ప్రమోద్ వేధింపులు మొదలు పెట్టారు. అదనంగా ఇచ్చేదేమీలేదని దళిత వ్యక్తి భార్య కరాఖండీగా చెప్పేసింది. దీంతో ఆమెకు ఫోన్ చేసి ' అదనపు వడ్డీ కటకపోతే నిన్ను నగ్నంగా ఊరిలో ఊరేగిస్తా' అంటూ ప్రమోద్ చేసిన బెదిరింపులను ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆ గ్రామానికొచ్చి విచారించి వెళ్లారు. పోలీసులు వచ్చిన విషయం తెల్సి ప్రమోద్ కోపంతో ఊగిపోయాడు. ఈనెల 23వ తేదీన రాత్రి పదింటికి కొంత మందితో కలిసి దళితుడి ఇంటికొచ్చి అతని భార్యను బలవంతంగా తన ఇంటికి లాక్కెళ్లాడు. వివస్త్రను చేసి పిడిగుద్దులు కురిపిస్తూ కర్రలతో చావబాదాడు. ప్రమోద్ కుమారుడు అన్షుతో ఆమె నోట్లో మూత్రం పోయించాడు. ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకున్న మహిళ మళ్లీ పోలీసులుకు ఫిర్యాదుచేసింది. ప్రమోద్, కుమారుడు అన్షు పరారీలో ఉన్నారని పట్నా సీనియర్ ఎస్పీ రాజీవ్ మిశ్రా చెప్పారు.

ఒడెసా పోర్టుపై రష్యా భీకర దాడులు

కీవ్: ఉక్రెయిన్‌లోని ఒడెసా పోర్టుపై డ్రోన్లు, క్షిపణులతో సోమవారం రష్యా భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో పోర్టు మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. రష్యా ప్రయోగించిన 12 కాలిబర్ మిస్సైళ్లలో పదకొండింటిని, రెండు పీ–800 ఓనిక్స్ క్రూయిజ్ మిస్సైళ్లను కూల్చేసినట్లు ఉక్రెయిన్ రక్షణ శాఖ తెలిపింది. ఉక్రెయిన్ ధాన్యాన్ని నల్ల సముద్రం మీదుగా ఓడల ద్వారా తరలించే ఒప్పందం నుంచి రష్యా వైదొలిగింది. అప్పటి నుంచి ఒడెసా ఓడరేవు లక్ష్యంగా పదేపదే దాడులకు దిగుతోంది. ఫలితంగా ధాన్యం గోదాములు, ఆయిల్ డిపోలు, షిప్పింగ్, నిల్వ సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.



సీ–295 రవాణా విమానానికి పూజలు చేస్తున్న రాజ్‌నాథ్ సింగ్

ఐఏఎఫ్‌లోకి సీ–295 విమానం

ఘజియాబాద్: భారత వైమానిక దళం(ఐఏఎఫ్)లోకి మొదటి సీ–295 రకం రవాణా విమానం చేరింది. ఈ విమానాలు ఐఏఎఫ్ వ్యూహాత్మక రవాణా సామర్థ్యం పెంపులో కీలకంగా మారనున్నాయి. ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీ–295 విమానాన్ని ఐఏఎఫ్‌లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజ్‌నాథ్ సర్వ ధర్మపూజ నిర్వహించారు. వైమానిక దళ చీఫ్ వీఆర్ చౌదరితోపాటు సీనియర్ అధికారులు, విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ ప్రతినిధులు పాల్గొన్నారు. వడోదర ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి పనిచేసే స్క్వాడ్రన్ నంబర్ 11కు సీ–295ను అందజేయనున్నారు. కేంద్రం 56 సీ–295 రవాణా విమానాల్ని కొనుగోలు చేసేందుకు ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ సంస్థతో రూ.21,935 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా మొదటి సీ–295 విమానాన్ని ఈ నెల 13న ఐఏఎఫ్ చీఫ్ అందుకున్నారు. ఈ విమానాలను ప్రస్తుతమున్న పాతకాలం ఆవ్రో–748ల బదులు వినియోగించుకుంటారు. ఒప్పందంలో భాగంగా 16 విమానాల్ని ఎయిర్‌బస్ సంస్థ అందజేస్తుంది. మిగతా 40 విమానాల్ని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో కలిసి భారత్‌లోనే ఉత్పత్తి చేస్తుంది. వి డి భాగాల తయారీ పనులు హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

చంద్రయాన్–3 ప్రస్థానం ముగిసినట్లేనా!

- ల్యాండర్, రోవర్ నుంచి అందని సంకేతాలు
- అనుసంధానం కోసం ఇస్రో సైంటిస్టుల యత్నాలు

న్యూఢిల్లీ: చంద్రయాన్–3 ప్రయోగం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. చందమామ దక్షిణ ధ్రువంపై క్షేమంగా అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా రికార్డుకెక్కింది. చంద్రయాన్–3 మిషన్‌లో అంతర్భాగమైన ల్యాండర్ విక్రమ్ ఆగస్టు 23న జాబిల్లి దక్షిణ ధ్రువంపై సురక్షితంగా దిగింది. అందులో నుంచి రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వచ్చి, చంద్రుడి ఉపరితలంపైకి చేరుకుంది. అవి రెండూ 14 రోజుల పాటు నిర్విరామంగా పనిచేశాయి. జాబిల్లిపై పరిశోధనలు జరిపి, విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేశాయి. అనంతరం సెప్టెంబర్ 2న దక్షిణ ధ్రువంపై సూర్యాస్తమయం కావడంతో స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. మళ్లీ సూర్యోదయం కావడంతో ఈ నెల 22న తిరిగి మేల్కొవాల్సి ఉంది. ల్యాండర్, రోవర్‌ను మళ్లీ మేల్కొలిపేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ల్యాండర్, రోవర్ నుంచి సంకేతాలు అందడం లేదని సైంటిస్టులు చెబుతున్నారు. దీంతో చందమామపై వాటి ప్రస్థానం ముగిసిపోయినట్లేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ల్యాండర్, రోవర్‌తో అనుసంధానం కోసం ఇస్రో సైంటిస్టులు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

గాల్లో తలకిందులుగా 30 నిమిషాలు..

కెనడా పార్క్‌లో లాంబర్‌జాక్ రైడ్‌లో అపశృతి

టొరంటో: సరదాగా పార్కులో గడుపుదామనుకుని అక్కడికి విచ్చేసిన సందర్శకులకు చేదు అనుభవం ఎదురైంది. వారు ఎక్కిన లాంబర్‌జాక్ రైడ్ పైకి వెళ్లాక హఠాత్తుగా మధ్యలోనే ఆగిపోయింది. దీంతో అందులో చిక్కుకుపోయిన సందర్శకులు 30 నిమిషాలపాటు తలకిందులుగా వేలాడుతూ సాయంకోసం అర్థించారు. కెనడాలోని ఒంటారియా నగరంలోని వండర్ల్యాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. రైడ్‌లో భాగంగా అందులో కూర్చున్న వారంతా అలా గాల్లో తలకిందులుగా వేలాడుతూ హాహాకారాలు చేస్తున్న వీడియో ప్రసుత్తం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. ఎట్టకేలకు 30 నిమిషాలకు అందరినీ ఎలాగోలా కిందకు సురక్షితంగా తీసుకొచ్చారు. అంతసేపు తలకిందులుగా వేలాడటంతో కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు.

జవానును కట్టేసి వీపుపై నిషేధిత సంస్థ రాతలు

కొల్లాం(కేరళ): కేరళలో నిషేధిత ఇస్లామిక్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) సానుభూతిపరులు ఆర్మీ జవానును లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనను కట్టేసి వీపుపై పీఎఫ్ఐ అని పెయింట్‌తో రాశారు. కేరళలోని కొల్లాం జిల్లాలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం రాత్రి కడక్కల్‌లో జవాను షైన్ కుమార్ తన ఇంటి దగ్గర్లోని రబ్బరు తోటకు వెళ్లగా హఠాత్తుగా గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు ఆయనను బంధించారు. తాడుతో చేతులు కట్టేసి కొట్టారు. ఆయన వీపుపై ఆకుపచ్చ రంగుతో పీఎఫ్ఐ అని రాశారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ఐను నిషేధించిన విషయం తెల్సిందే. జవాను ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన కేరళ పోలీసులు దర్యాప్తును మొదలుపెట్టారు. జవాను ప్రస్తుతం రాజస్తాన్‌లోని జైసల్మీర్‌లోని భారత ఆర్మీకి చెందిన ఎలక్ట్రానిక్స్, ఇంజనీర్స్ కోర్‌లో పనిచేస్తున్నారు.

ఎన్డీయే కూటమిలో చేరే ప్రసక్తే లేదు: నితీశ్

పట్నా: విపక్ష 'ఇండియా' కూటమిలో కీలకంగా మారి మరిన్ని భావసారుప్య పార్టీలను కూటమిలోకి తెచ్చేందుకు కృషిచేస్తున్న బిహార్ సీఎం నితీశ్ కుమార్ మళ్లీ ఎన్డీయే కూటమిలో చేరనున్నారన్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. పాత ఎన్డీయేతో జట్టుకట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పా రు. దీనిపై బీజేపీ స్పందించింది. 'మాతో మళ్లీ చేతులు కలిపేందుకు ఆయన ఎంతగా ప్రాధేయపడినా సరే కలుపుకునేది లేదు' అని బీజేపీ తన వైఖరిని తేటతెల్లంచేసింది. సోమవారం పట్నాలో భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్తల్లో ఒకరైన దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకల్లో నితీశ్ పాల్గొనడమే ఈ ఊహాగానాలకు అసలు కారణం. విపక్ష 'ఇండియా' కూటమితో నితీశ్‌కు అంతగా పొసగట్లేదని, ఆయనను కూటమికి కన్వీనర్‌గా ఇంతవరకూ ప్రకటించకపోవడంతో ఆయన అలిగారని మీడియాతో వార్తలొచ్చిన సంగతి తెలిసిందే.



జన్‌సంఘ్ నేత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా

బిల్లుకు అయిష్టంగానే విపక్షాల ఆమోదం

- గత్యంతరం లేకే మద్దతిచ్చాయి
- మా పట్టుదల వల్లే పార్లమెంట్‌లో బిల్లు నెగ్గింది
- అహంకార కూటమికి అధికారం అప్పగిస్తే బిల్లు పరిస్థితి వెనక్కే
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- మధ్యప్రదేశ్, రాజస్తాన్ ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగం

భోపాల్/జైపూర్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా బిల్లుకు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు మరో గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితుల్లో అయిష్టంగానే మద్దతు ఇచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నారీశక్తిని అర్థం చేసుకొని, సంకోచిస్తూనే బిల్లుకు ఆమోదం తెలిపాయని అన్నారు. తమ పట్టుదల వల్లే బిల్లు పార్లమెంట్‌లో నెగ్గిందని వివరించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ బిల్లు పరిస్థితి ఏమిటో మనకు తెలిసిందేనని అన్నారు. ఒకవేళ కాంగ్రెస్, దాని మిత్రపక్షాల అహంకార కూటమికి అధికారం అప్పగిస్తే ఈ బిల్లు విషయంలో వెనక్కి మళ్లుతాయంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. బిల్లు పరిస్థితి వెనక్కి వెళ్లిపోతుందని పరోక్షంగా స్పష్టం చేశారు. జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్‌లో సోమవారం నిర్వహించిన 'కార్యకర్త మహాకుంభ్'లో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. ఆ పార్టీని తుప్పు పట్టిన ఇనుముతో పోల్చారు. బుజ్జగింపు రాజకీయాలు కాంగ్రెస్‌కు అలవాటేనని ఆక్షేపించారు. కాంగ్రెస్‌ను రాజకీయ నాయకులు నడిపించడం లేదని, పార్టీని అర్బన్ నక్సలైట్లకు ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ విధానాలను, నినాదాలను ఈ లీజుదారులే నిర్ణయిస్తున్నారని మోదీ ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గనుక గెలిపిస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తారని విమర్శించారు.



కాంగ్రెస్ దివాలా తీసింది

కాంగ్రెస్ దేశంలో ప్రతికూలతను వ్యాప్తి చేస్తోందని, దేశం సాధించిన ఘనతలను ఆ పార్టీ ఇష్టపడడం లేదని ప్రధానమంత్రి మోదీ ధ్వజమెత్తారు. దేశాన్ని 20వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలని కోరుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. డిజిటల్ పేమెంట్ వ్యవస్థను కాంగ్రెస్ వ్యతిరేకించిందని, కానీ, ప్రపంచ దేశాలు ఈ వ్యవస్థను ప్రశంసించాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ మనోబలం కోల్పోయిందని, దివాలా తీసిందని చెప్పారు. అందుకే అర్బన్ నక్సలైట్లకు పార్టీని లీజుకు ఇచ్చారని తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు ప్రజాబలం లేదన్నారు. మహిళలను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందుకే వారంతా అప్రమత్తంగా ఉండాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పేదలు ఎప్పటికీ పేదలుగా ఉండాలన్నదే కాంగ్రెస్ విధానమని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజస్తాన్‌లో కాంగ్రెస్‌ను గద్దె దించాలి

రాజస్తాన్‌లో సీఎం అశోక్ గహ్లోత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువత జీవితాల్లో ఐదేళ్ల విలువైన సమయాన్ని వృథా చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని అన్నారు. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'పరివర్తన్ సంకల్ప్ మహాసభ'లో మాట్లాడారు. పరిపాలన పరంగా కాంగ్రెస్ సర్కారుకు సున్నా మార్కులే వస్తాయన్నారు. కాంగ్రెస్ పాలనలో మాఫియాలు చెలరేగిపోతున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. మహిళల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక కాంగ్రెస్ పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చిందని చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం ׀ 26 ׀ సెప్టెంబర్ ׀ 2023

బెంగళూరులో 225 వార్డులు

- తుది గెజిట్ విడుదల

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె వార్డుల విభజన పూర్తికాగా రాష్ట్ర ప్రభుత్వం 225 వార్డులతో తుది గెజిట్‌ను విడుదల చేసింది. దీంతో బీబీఎంపీ ఎన్నికలకు సన్నాహాలు ఊపందుకోనున్నాయి. గతంలో బీజేపీ సర్కారు నగరంలో మొత్తం 198 వార్డులు ఉండగా వాటిని 243 వార్డులుగా విభజన చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ సవరణ చేయించింది. పునర్విభజన కమిటీ ఆగస్టు 14వ తేదీన ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాల స్వీకరణకు 15 రోజులు గడువిచ్చి తాజాగా 225 వార్డులతో గెజిట్‌ను విడుదల చేసింది.

న్యూస్‌రీల్

విహారయాత్రలో ఇద్దరు ఉద్యోగుల జలసమాధి


కృష్ణకుమార్, అరుణ్ (ఫైల్)

శివమొగ్గ: సరదాగా ఈతకు వెళ్లిన ఉద్యోగులకు అదే చివరిరోజు అయ్యింది. వ్యవసాయ శాఖ అధికారి, బ్యాంకు ఉద్యోగి నీటమునిగి మరణించిన ఘటన జిల్లాలోని సాగర తాలూకా జోగ్ ఫాల్స్ దగ్గర వడన్‌బైల్ అటవీ ప్రాంతం దేవిగుండిలో జరిగింది. సాగరకు చెందిన వ్యవసాయ అధికారి కె.టి. కృష్ణకుమార్ (35) కుటుంబం, అలాగే ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగి అరుణ్ (28) కలిసి ఆదివారం విహారానికి వచ్చారు. భోజనాలు అయ్యాక దేవిగుండి కొలనులో ఇద్దరూ ఈతకు దిగి లోతైన చోట మునిగి మృతి చెందారు. కార్గల్ పోలీసులు వచ్చి మృతదేహాలను బయటకి తీసి కేసు నమోదు చేశారు. ఈ ఘోరంతో ఇరుకుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయారు.

హార్న్ కొట్టాడని రాళ్ల దాడి

దొడ్డబళ్లాపురం: వినాయక నిమజ్జనం ఊరేగింపులో దారి ఇవ్వాలని హారన్ కొట్టాడనే కోపంతో యువకుడు ఒక డ్రైవర్‌పై దాడి చేశారు. చెన్నపట్టణ తాలూకా కూడ్లూరు గ్రామంలో చోటుచేసుకొంది. మెంగహళ్లికి చెందిన మనోజ్ నిత్యం చుట్టుపక్కల గ్రామాలలోని రైతుల నుంచి కూరగాయలను సేకరించి బెంగళూరు మార్కెట్‌లో విక్రయిస్తాడు. ఇదేమాదిరిగా ఆదివారం రాత్రి కూడా కూరగాయల లోడ్‌తో టెంపోలో వెళ్తుండగా కడ్లూరులో నిమజ్జనం ఊరేగింపు జరుగుతోంది. దారి ఇవ్వాలని మనోజ్ హారన్ కొట్టడంతో యువకుల గుంపు వాహనంపై రాళ్లు విసరడంతో మనోజ్‌కు గాయాలయ్యాయి. అతడు చెన్నపట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తిరిగొచ్చిన వర్షాలు

- పలు జిల్లాల్లో వర్షపాతం


సోమవారం బెంగళూరు రేస్‌కోర్స్ రోడ్డులో వర్షం

యశవంతపుర: కరువు సమయంలో మళ్లీ వానలు అక్కడక్కడ కురుస్తున్నాయి. సోమవారం దక్షిణ కన్నడ, బీదర్, కలబురగి, యాదగిరి జిల్లాల్లో వానలు కురిశాయి. ఈ నాలుగు జిల్లాలలో ఎల్లో అలర్ట్‌ను ప్రకటించినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రాయచూరు జిల్లా కురడి, తుమకూరు జిల్లా మధుగిరిలో 9 సెంటిమీటర్ల వర్షం కురిసింది. వచ్చే 48 గంటల్లో కరావళిలోని అనేక చోట్ల వానలు కురిసే అవకాశం ఉంది. కోలారు, చిక్కబళ్లాపుర, బీదర్, కలబురిగి, యాదగిరి, బెళగావి, రాయచూరు జిల్లాల్లో తేలికపాటి వానలు పడవచ్చని అధికారులు తెలిపారు. బెంగళూరు చుట్టుపక్కల మేఘావృతమై ఉంటుంది, రాత్రి పూట ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడవచ్చు. నగరంలోనూ పలుచోట్ల ఓ మోస్తరుగా వర్షం కురిసింది.

కరువు కాలంలో నీరు ఇచ్చేస్తారా?

- మండ్య ధర్నాలో విజయేంద్ర


ధర్నాలో మాట్లాడుతున్న విజయేంద్ర

మండ్య: మండ్య జిల్లా హక్కు అయిన కావేరి నీటిని తమిళనాడుకు వదుతున్నారని, ఇలా ప్రతిసారీ అన్యాయం జరుగుతోందని గతంలో కేంద్రమంత్రి అంబరీష్ రాజీనామా చేశారని బీజేపీ నేత, ఎమ్మెల్యే బీవై విజయేంద్ర అన్నారు. సోమవారం మండ్యలో రైతు హిత రక్షణ సమితి నిర్వహిస్తున్న కావేరి ఆందోళనలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కాపాడుకోవడానికి కావేరి నీరు మొత్తం తమిళనాడుకు వదులుతోందని, జిల్లా ప్రజలకు తాగు సాగు నీరు లేకుండా చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరువు ఏర్పడిందని, ఇప్పుడు నీటిని వదలడం ఏమిటని ప్రశ్నించారు. తమిళనాడులో డీఎంకేతో పొత్తు కోసం కాంగ్రెస్ పార్టీ జిల్లా రైతులను పట్టించుకోవడం లేదన్నారు.

అర్ధనగ్నంగా ర్యాలీ

బీజేపీ కార్యకర్తలు మండ్య నగరంలో అర్ధనగ్నంగా ఊరేగింపు చేశారు. బీజేపీ ఆఫీసు వద్దకు చేరుకోగా, విజయేంద్ర, మాజీ మంత్రి అశ్వథ నారాయణ ఆధ్వర్యంలో ఎద్దులబండ్లతో ర్యాలీగా వెళ్లారు. జేసీ సర్కి ల్ మీదుగా బెంగళూరు- మైసూరు హైవే మీదకు వచ్చి ధర్నా నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య, డిసిఎం డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రాజధానిలో ఉత్కంఠ

కావేరి జల పోరాటంలో భాగంగా కన్నడ, రైతు సంఘాలు ఐటీ సిటీలో మంగళవారం బంద్ నిర్వహించబోతున్నాయి. సీఎం, డిప్యూటీ సీఎం సహా ప్రభుత్వ పెద్దలు బంద్ వల్ల ఉపయోగం ఏమిటని తప్పుబట్టారు. అయినప్పటికీ తమ సమస్యను చాటడానికి బంద్‌నే సంఘాలు ఎంచుకున్నాయి. గతంలో కావేరి ఆందోళనల్లో గొడవల దృష్ట్యా ఈసారి సున్నిత ప్రాంతాల్లో గట్టి పోలీస్ పహరా ఏర్పాటవుతోంది. మరోవైపు వాటాళ్ నాయకత్వంలోని సంఘాలు 29వ తేదీ రాష్ట్ర బంద్‌కు సన్నాహాలు చేస్తున్నాయి. నగర బంద్‌కు తాము దూరమని ప్రకటించాయి. ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు రాజధాని బంద్‌కు బాసటగా ఉన్నందున విజయవంతం కావచ్చనే భావిస్తున్నారు. బంద్ ఫలితం ఎలా ఉంటుందనే ఉత్కంఠ అంతటా నెలకొంది.



ఫ్రీడంపార్క్ వద్ద పోరాట సంఘాల నాయకులు

- కన్నడ, రైతు సంఘాలచే నేడు బంద్
- కావేరి జలాల వివాదం సెగలు

శివాజీనగర: తమిళనాడుకు కావేరి జలాల విడుదలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పలు రైతు, కన్నడ సంఘాలు మంగళవారం జరిపే బెంగళూరు బంద్ పోరాటానికి కన్నడ ఒక్కూట మద్దతు తెలుపలేదు. కానీ తాము ఈ నెల 29న శుక్రవారం అఖండ కర్ణాటక బంద్ చేయనున్నట్లు ఒక్కూట నేతలు ప్రకటించారు. సోమవారం నగరంలోని హోటల్‌లో కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రైతు, కన్నడ సంఘాల నాయకులు మాట్లాడారు. బెంగళూరు బంద్ ఎలాంటి ప్రభావం చూపదు. అందుకే ఈ నెల 29న కర్ణాటక బంద్ చేసి ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ప్రభుత్వానికి చురుకు పుట్టిస్తామని అన్నారు. ఈ బంద్‌కు రాష్ట్రమంతటా 1200 కన్నడ సంఘాలు మద్దతిచ్చాయన్నారు. తాము బెంగళూరు బంద్‌లో పాల్గొనబోమన్నారు. అందరూ కలసికట్టుగా పోరాడుదామని కోరినా వారు వినలేదని వాటాళ్ ఆరోపించారు. ఆ రోజున కర్ణాటకలో రవాణాను స్తంభింపజేస్తామని తెలిపారు. ఆ తరువాత సీఎంను కలిసి కావేరి నది నీటిని బంద్ చేయాలని కోరుతామన్నారు.

నేటి బంద్‌కు తీర్మానం

మంగళవారం బెంగళూరు బంద్ జరుగుతుందని జల సంరక్షణా కమిటీ అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ తెలిపారు. బెంగళూరు బంద్‌కు పలు సంఘాలు మద్దతు ఇవ్వగా, కొన్ని సంఘాలు కర్ణాటక బంద్‌కు సంఘీభావం తెలిపాయి. ఫ్రీడంపార్క్ వద్ద శాంతకుమార్ ఆధ్వర్యంలో కన్నడ పోరాట సంఘాలు సమావేశమై బంద్‌ను తీర్మానించాయి. శాంతియుతంగా బంద్ నిర్వహిస్తామన్నారు.

సిటీలో పటిష్ట భద్రత

- బలవంతంగా షాపులు మూయిస్తే చర్యలు: సీపీ

బనశంకరి/ శివాజీనగర: తమిళనాడుకు కావేరి జలాల విడుదలను వ్యతిరేకిస్తూ వివిధ సంఘాలు మంగళవారం బెంగళూరు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద బందోబస్తు గురించి సమావేశం నిర్వహించారు. అదనపు పోలీస్ కమిషనర్, డీసీపీలు సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో భద్రతా జాగ్రత్తలు చేపట్టాలని ఆయన సూచించారు. 2016లో కావేరి నీటి కోసం గొడవ జరిగిన ప్రదేశాల్లోను, నగర పశ్చిమ, ఉత్తర విభాగాల్లో తీవ్ర నిఘా వహించాలని తెలిపారు. తమిళనాడు నుంచి బస్సులు సంచరించే మార్గాలు, బస్టాండ్‌లు, తమిళులు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. మైసూరు రోడ్డు, హోసూరు రోడ్డు, ఆర్.ఆర్.నగర, బ్యాటరాయనపుర, సిటీ మార్కెట్ తదితరాల్లో గట్టి బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. బంద్‌లో ఎవరైనా బలవంతంగా దుకాణాలు మూయించడానికి ప్రయత్నించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బంద్ సందర్భంగా భారీ భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. ర్యాపిడ్ యాక్షన్ బలగాలను, కేఎస్ఆర్‌పీ, సీఏఆర్ బలగాలను మోహరించామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు ఉంటాయన్నారు. బంద్‌లో ఎవరైనా పాల్గొనవచ్చునని, స్వచ్ఛందంగా షాపులను మూసుకోవచ్చని, ఒత్తిడి చేసేవారిపై చట్టపరంగా చర్యలు తప్పవని తెలిపారు.

పోరాటాలు పార్టీలకతీతంగా ఉండాలి

- డీసీఎం శివకుమార్

శివాజీనగర: రాష్ట్ర హితరక్షణ కోసం చేపట్టే ధర్నాలకు తాము సహకరిస్తాం. జలం, భూమి, భాషను అందరు కాపాడుకోవాలి. ఇందుకు పార్టీలకతీతంగా పోరాటం జరగాలి. ఎవరి పోరాటాలకు ప్రభుత్వం అడ్డు చెప్పదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ప్రజాస్వామ్య వ్యవస్థలో పోరాటం చేయటం హక్కు. ధర్నాకు తాము ఎలాంటి ఇబ్బంది కలిగించమని, శాంతియువత పోరాటాలు ఉండాలని అన్నారు. తాము హక్కును కాపాడుకోవటానికి పోరాటం చేస్తున్నామని, సుప్రీంకోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉందన్నారు. న్యాయస్థానంలో మాకు అనుకూలంగా తీర్పు వస్తే ఏమి చేస్తారని డీకే.శివకుమార్ మీడియాను ప్రశ్నించారు. ధర్నా, బంద్‌లచే చట్టపరంగా ఇబ్బంది కలగదా అని అడిగిన ప్రశ్నకు ఆయన ఇందుకు తాను సమాధానమివ్వను, న్యాయస్థానానికి, ప్రజలకు గౌరవమివ్వాలి. ప్రజలు సహరించకపోతే బంద్ అనే పోరాటానికి అర్థం ఉండదు. తాను మాత్రం సందిగ్ధంలో ఉన్నానని, సమాధానం ఇవ్వటానికి సాధ్యపడదన్నారు.

బీజేపీ-జేడీఎస్ పొత్తుతో అసంతృప్తికి గురైన రెండు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరే విషయంపై ముఖ్యమంత్రి, మంత్రులతో చర్చించి తీర్మానిస్తామన్నారు.

మేఘ మథనంపై త్వరలోనే నిర్ధారణ:

రాష్ట్రంలో కరువు పరిస్థితి ఉండటంతో మేఘ మథనం గురించి త్వరలోనే తీర్మానిస్తామని డీ.కే.శివకుమార్ తెలిపారు. గత 2–3 రోజుల నుండి బెంగళూరు నగర, చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షం కురిసింది. మేఘ మథనంతో వర్షం కురిసి పరిస్థితిని పరిష్కరించవచ్చని విశ్వాసముంది. దీంతో మంత్రి మండలి సమావేశంలో మేఘ మథనంపై తీర్మానిస్తామని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా జనతా దర్శన్

బనశంకరి: ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే ఆశయంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జనతా దర్శన్ నిర్వహించారు. జనతాదర్శన్ కార్యక్రమంలో ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లు, జిల్లా పంచాయతీ ముఖ్య కార్య నిర్వాహకులు, ఎస్పీలు పాల్గొని ప్రజా సమస్యలను ఆలకించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇకపై జిల్లా, తాలూకా స్థాయిలో 15 రోజులకు ఒకసారి జనతా దర్శన్ కార్యక్రమం నిర్వహిస్తారు.

ఐపీఎస్ అమృత్‌పాల్‌కు బెయిల్

బనశంకరి: ఎస్ఐ పోస్టుల కుంభకోణంలో నిందితుడైన ఐపీఎస్ అధికారి అమృత్‌పాల్‌కు హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో 35వ ఆరోపిగా ఉన్న అమృత్‌పాల్ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు. ఆయన బెయిల్ కోసం హైకోర్టులో వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పీఎం నవాజ్ విచారణ చేపట్టి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణకు సహకరించాలి, సాక్ష్యాలు నాశనం చేయరాదని ఆదేశించారు.

బ్యాచ్–2 ఏనుగుల రాక


సోమవారం మైసూరుకు చేరిన రెండవ బ్యాచ్ దసరా ఏనుగులు

- 14కు చేరిన మైసూరు దసరా గజరాజులు

మైసూరు: నాడహబ్బ దసరా మహోత్సవంలో పాల్గొనడానికి రెండవ విడత గజ పయనంలో ఏనుగుల బృందం సోమవారం మైసూరుకు చేరుకుంది. ఐదు గజరాజులు అడవుల్లోని శిబిరాల నుంచి లారీల్లో వచ్చాయి. వాటికి అరణ్య భవనలో పూజలు చేసి విడిది ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 14 గజరాజులు ఉత్సవాల్లో పాల్గొంటాయి. కొన్నివారాల కిందట గజపయనంలో 9 ఏనుగులు రావడం తెలిసిందే.

బరువు మోసిన అభిమన్యు

మరోవైపు కెప్టెన్ అభిమన్యు ఆధ్వర్యంలో ఏనుగులు రోజూ తాలీంలో పాల్గొంటున్నాయి. సోమవారం కెప్టెన్ అభిమన్యు 750 కిలోలకు పైగా బరువున్న ఇసుక మూటలను ఎత్తుకుని నడిచింది. దసరా రోజు అంబారీని మోయడానికి ఇలా శిక్షణనిస్తారు. ఇసుక మూటలను క్రేన్ సహాయంతో అభిమన్యు పైన పెట్టి పడిపోకుండా తాడుతో కట్టారు. సహచర ఏనుగులతో కలిసి ముందుకు సాగింది. మార్కెట్‌లో వెళుతున్నప్పుడు పూల వ్యాపారాలు హారాలను మావటీల పైకి విసిరారు. వాటిని తీసుకొని ఏనుగులకు అలంకరించారు.


లారీలో సాగిన రెండవ గజ పయనం

వందేభారత్‌కు మిశ్రమ స్పందన

- బెంగళూరు టు హైదరాబాద్‌కు 194 టికెట్లు మాత్రమే బుక్


హైదరాబాద్- బెంగళూరు వందేభారత్ రైలు

అనంతపురం సిటీ: ఐటీ హబ్‌లైన హైదరాబాద్- బెంగళూరు మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ హై స్పీడ్ రైలుకు తొలి రోజు మిశ్రమ స్పందన లభించింది. కాచిగూడ-యశవంతపుర రైలు సోమవారం యశవంతపుర నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు కాచిగూడకు బయలుదేరింది. మార్గమధ్యంలోని అనంతపురానికి సాయంత్రం 5.40కు వచ్చి 5.41కి బయలుదేరింది. మొత్తం ఎనిమిది కోచ్‌లలో 522 మంది కూర్చుని వెళ్లవచ్చు. కానీ 194 మంది టికెట్లు బుక్ చేసుకున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. అందులో కామన్ కోచ్‌లో 133 మంది, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 34 మంది ప్రయాణించారు. యశవంతపుర నుంచి అనంతపురానికి 18 మంది ఉండగా, అనంతపురం నుంచి కాచిగూడకు 16 మంది టిక్కెట్లు బుక్ చేసుకున్నారని తెలిపారు. రైలు ప్రయాణికుల్లో 110 మంది భోజనాలు ఆర్డర్ ఇచ్చారు. అయితే రైల్వే వెబ్‌సైట్లో ఈ రైలు సమాచారం ఇంకా అప్‌డేట్ కాలేదని పలువురు ప్రయాణికులు తెలిపారు. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో ఈ రైలు అందుబాటులోకి రానున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఇది సారాయి గ్యారెంటీ ప్రభుత్వం

- మాజీ సీఎం బొమ్మై ఎద్దేవా

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో కొత్తగా మద్యం దుకాణాన్ని తెరవటానికి సిద్ధం కావటం దురదృష్టకరమని బీజేపీ నేత, మాజీ సీఎం బొమ్మై అన్నారు. ట్విట్టర్‌లో స్పందిస్తూ ఒకవైపు గ్యారెంటీ పేరుతో మహిళలకు రూ.2 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అదే సొమ్మును ఆమె భర్తతో వసూలు చేయటానికి మద్యం అమ్మకం మార్గాన్ని వెతుక్కుందని, భార్య సొమ్ము భర్త ద్వారా పొంది రిటర్న్ పాలసీ చేసుకునే పథకం వేసిందని ఎద్దేవా చేశారు. పల్లెల్లో అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టేందుకు ప్రభుత్వం మద్యం దుకాణాలు ఓపెన్ చేయనున్నట్లు ఎక్సైజ్ మంత్రి చెప్పటం హాస్యాస్పదంగా ఉంది. అక్రమాలను అరికట్టకపోతే ఎక్సైజ్ శాఖ చేసేది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆదాయం కోసం మద్యం అమ్మకానికి సిద్ధమైతే గ్యారెంటీ పొందే మహిళలే వీరికి తగిన గుణపాఠం చెబుతారని ట్వీటర్‌లో తెలిపారు. కరువు కాలంలో నీరు ఇవ్వని ప్రభుత్వం సారాయి ఇవ్వటానికి సిద్ధం కావటం దురదృష్టకరమన్నారు. ఇది సారాయి గ్యారెంటీ ప్రభుత్వమని బొమ్మై విమర్శించారు.

కావేరిపై ప్రతిపక్షాల రాజకీయం: సీఎం

శివాజీనగర: కావేరి నీటి విషయంలో బీజేపీ, జేడీఎస్ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. సోమవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడిన ఆయన, తమిళనాడుకు కావేరి నీరు విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మంగళవారం సుప్రీంకోర్టులో మళ్లీ కావేరి కేసు విచారణకు రానుందన్నారు. నీటి విడుదల ఇక సాధ్యపడదని వాదన వినిపిస్తామన్నారు. అఖిల పక్ష సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు నేను రాజీనామా చేయాలని చెప్పలేదు కదా అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలుపవచ్చు, మేం అణచివేయం అని బెంగళూరు బంద్ గురించి స్పందించారు.


గణేశ నిమజ్జనోత్సవాల నేపథ్యంలో సోమవారం బెళగావిలో ర్యాపిడ్ యాక్షన్ బలగాల గస్తీ

భార్యకు ఫోన్ చేసి.. ఆత్మహత్య

మైసూరు: కబిని కుడి కాలువలో దూకి వ్యక్తి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లాలోని నంజనగూడులో జరిగింది. మృతుడు నంజనగూడు తాలూకాలోని సిందూవళ్ళి గ్రామానికి చెందిన శేషాద్రి (39). వివరాలు.. మైసూరులోని ఒక ప్రైవేటు సహకార సంఘంలో శేషాద్రి పనిచేసేవాడు. ఆదివారం గ్రామానికి వచ్చి తాను ధరించే బంగారు ఉంగరాలు, చైన్‌ను ఇంట్లో పెట్టేశాడు. ఇప్పుడే వస్తానని భార్యకు చెప్పి వెళ్లిపోయాడు. కొంతసేపటికి భార్యకు, కుమార్తెకు ఫోన్ చేసి తాను ఇక రానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి కబిని కాలువలో దూకడంతో నీటిలో కొట్టుకుపోయాడు. నంజనగూడు పోలీసులు వచ్చి శేషాద్రి గాలింపు జరపగా దొరకలేదు. చివరకు టి. నరిసిపుర తాలూకాలోని తలకాడులో వద్ద మాదాపుర గ్రామం కాలువలో శవం లభించింది.

కావేరి వివాదం.. ప్రభుత్వ వైఫల్యమే


సోమవారం మండ్యలో కావేరి ధర్నాలో పాల్గొన్న అలనాటి నటి లీలావతి, ఆమె తనయుడు వినోద్ రాజ్,


మైసూరులో ఓ వృద్ధురాలి ఆక్రోశం

- మాజీ ప్రధాని దేవెగౌడ
- జోక్యం చేసుకోవాలని ప్రధానికి లేఖ

శివాజీనగర: కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల మధ్య తలెత్తిన కావేరి జలాల వివాదంలో జోక్యం చేసుకోవాలని ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు జేడీఎస్ అధిపతి, మాజీ ప్రధాని దేవెగౌడ తెలిపారు. సోమవారం నగరంలో పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తీర్పు విషయంలో న్యాయస్థానంపై ఆరోపణ చేయనని, ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని మండిపడ్డారు. తమిళనాడు, కర్ణాటకలో వాస్తవాలను తెలుసుకునేందుకు నిపుణుల కమిటీని పంపాలని, కేంద్ర జలశక్తి నుంచి సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ వేయించాలని అన్నారు. అన్ని జలాశయాల పరిశీలించి నీరు విడుదలకు సాధ్యమా? పంటల స్థితిగతులు ఏమిటి? అని తెలుసుకోవాలి. ఇప్పటికే అన్యాయం జరిగిపోయింది. రాబోయే రోజుల్లోనైనా మరింత అన్యాయం జరగకుండా ప్రధాని జోక్యం చేసుకోవాలని దేవెగౌడ కోరారు.

కేఆర్ఎస్ ఫోటోను ప్రధానికి పంపాలి :

మంగళవారం బెంగళూరు బంద్‌కు పిలుపునిచ్చారు. మండ్య, మైసూరు ఇలా పలుచోట్ల శాంతియుతంగా ధర్నా చేపడుతున్నారని చెబుతూ కేఆర్ఎస్ జలాశయం ఖాళీ అయి ఎండిపోయి నేల కనిపించే ఫొటో ప్రదర్శించి కావేరి ప్రచారం గురించి జాతీయ మీడియాల్లో చర్చకు వచ్చింది. దయచేసి కేఆర్ఎస్ జలాశయం వాస్తవ స్థితిని ప్రతిబింబించే ఈ ఫొటోను ప్రసారం చేసి ప్రధానికి చేరేటట్లు చేయాలని దేవెగౌడ కోరారు. గత 60 సంవత్సరాల నుండి కావేరి విషయంలో రెండు జాతీయ పార్టీల వైఖరి గురించి వ్యాఖ్యానించను. రాజకీయ లబ్ధి కోసం మాట్లాడను. బెంగళూరు బంద్ విషయంలో కుమారస్వామి మద్దతునిచ్చారు. తాము ఎన్‌డీఏ చేరడానికి కారణాలపై మరో రెండు రోజుల్లో చెబతామని చెప్పారు.

ఉద్యమాల్లోనే నటులు గుర్తుకు వస్తారు

- ధర్నాలో సుదీప్ అసంతృప్తి

మైసూరు: కావేరి నీటి కోసం పోరాటం అన్న ప్రతిసారీ దర్శన్, సుదీప్, శివన్న, యశ్, అభి మాత్రం మీ కంటికి కనిపిస్తారు అని ప్రముఖ నటుడు దర్శన్ అన్నారు. మైసూరు జిల్లాలోని టి. నరిసిపుర తాలూకాలోని బన్నూరులో కావేరి ఉద్యమంలో దర్శన్ పాల్గొని మాట్లాడారు. నేను పుట్టినప్పటి నుంచి రైతును, నా మాటలు కొంచెం కష్టంగానే ఉంటాయి. సుప్రీంకోర్టు ఆదేశాలు వచ్చేవరకూ మన నాయకులు ఏమి చేస్తారో చూద్దాం. కావేరి పోరాటం అంటే నాతో సహా కొంతమంది నటుల గురించే మీరు మాట్లాడతారు. ఇంక ఎవరూ కనిపించరా? ఇటీవల ఒక డిస్ట్రిబ్యూటర్ రూ.6 కోట్లు పెట్టి తమిళ సినిమా ద్వారా రూ. 36 కోట్లు సంపాదించారు. తమిళ సినిమా చూసి కోట్ల రూపాయలు ఇచ్చే మీకు కన్నడ సినిమాలు కనిపించవు, కానీ పోరాటానికి మేము కావాలంటారు అని అసహనం వ్యక్తం చేశారు.

ధర్నాకు లీలావతి హాజరు

మండ్యలో జరిగిన ధర్నాలో అలనాటి కన్నడ నటి లీలావతి, ఆమె తనయుడు వినోద్ రాజ్ పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఆమె ప్రసంగిస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక మైసూరులో ధర్నాలో ఒక వృద్ధురాలు గట్టిగా నినాదాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది.

క్లుప్తంగా

మంత్రికి వినతుల వెల్లువ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మైసూరు: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్.సి.మహాదేవప్ప సోమవారం జడ్పీ ఆఫీసులో జనతా దర్శన్ నిర్వహించి ప్రజల సమస్యలను ఆలకించారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఇబ్బందులను ఏకరువు పెట్టారు. మంత్రిని కలిసి.. రేషన్ కార్డు కావాల, ఖాతా బదిలీ చేయాలని, ఇల్లు, స్థలం కావాలని, వీధిలో కరెంటు స్తంభాలు వేయించాలని, పొలంలో బోరు వేయించాలని ఇలా అనేక ఫిర్యాదులపై అర్జీలు ఇచ్చారు. ప్రతి పనికీ అధికారులు రోజుల తరబడి తిప్పుతున్నారని పలువురు మంత్రికి తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు మంత్రి సూచించారు.

వర్షాలు కురవడానికి, సర్కారుకు సంబంధం ఉందా?

- మంత్రి రామలింగారెడ్డి

దొడ్డబళ్లాపురం: తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం బెంగళూరు, రామనగర జిల్లాల బంద్‌కు పిలుపు నివ్వడంపై మంత్రి రామలింగారెడ్డి స్పందించారు. నేల, నీరు, భాషల విషయంలో అన్యాయం జరిగినప్పుడు బంద్‌లు జరగడం సాధారణమన్నారు. అయితే వర్షం కురవడానికి, ప్రభుత్వానికి సంబంధం ఉంటుందా అని ప్రశ్నించారు. గత ఏడాది మెండుగా వర్షాలు కురవడంతో తమిళనాడుకు 660 టీఎంసీల నీరు విడుదల చేశారన్నారు. ఈ ఏడాది వర్షాలు లేవని, ఈ విషయం మానిటరింగ్ వింగ్‌కు తెలుసన్నారు. సుప్రీంకోర్టు కూడా నీరు నిల్వ లేదని తెలిసినా జలాలు విడుదల చేయాలని తీర్పునిచ్చిందన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులకు ఈ విషయాలన్నీ తెలిసినా ప్రధానమంత్రికి చెప్పరని, అకారణంగా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. బంద్‌కు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే రెండు రోజులు బంద్ చేయడం సరి కాదన్నారు.

స్వచ్ఛతకు శ్రీకారం



శ్రమదానం చేస్తున్న స్వామీజీ తదితరులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వాముల మఠంలో స్వచ్ఛతకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ శ్రీపాదంగళ్ శ్రీకారం చుట్టారు. సోమవారం మంత్రాలయంలో బీజేపీ నేతలు అరవింద లింబావళి, సుబ్బ నరసింహల ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు చీపుర్లతో శ్రమదాన శిబిరంలో పాలు పంచుకున్నారు.

విదేశీ యూట్యూబర్‌పై కేసు

యశవంతపుర: నమ్మ మెట్రోలో టికెట్ లేకుండా ఎలా ప్రయాణించాలనే విషయంపై వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన విదేశీ యూట్యూబర్ ఫిడియాస్ పెనాయోట్‌పై కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటామని బీఎంఆర్‌సీఎల్ ఎండీ అంజుమ్ పర్వేజ్ తెలిపారు. ఫిడియాస్ పనాయోట్‌పై మెట్రో రైలు నిగమ క్రిమినల్ కేసును నమోదు చేసినట్లు వివరించారు. ఈ వీడియోలో మెట్రోలో ఎలా ఉచితంగా తిరగాలో, గేటు దాటి వెళ్లిన వీడియోను ఇతను వైరల్ చేశారు.

ఎస్‌ఐ అరెస్టుకు డిమాండ్

రాయచూరు రూరల్: మామూలు ఇవ్వలేదనే నెపంతో ఇటీవల ఓ వ్యక్తిపై దాడి చేసిన లింగసూగూరు తాలూకా మస్కి ఎస్‌ఐ మణికంఠను అరెస్ట్ చేయాలని హైదరాబాద్ కర్ణాటక వాల్మీకి నాయక్ సంఘం కార్యదర్శి రఘువీర్ నాయక్ డిమాండ్ చేశారు. నిరుపాది భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై డీఎస్పీ మంజునాథ్ సూచన మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ మణికంఠపై చర్యలు చేపట్టి ఆయనను సస్పెండ్ చేసి గూండా చట్టం కింద కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలన్నారు. గతంలో బళ్లారి జిల్లా కురుగోడు, సింధనూరుల్లో ఇలాంటి కృత్యాలకు పాల్పడిన అధికారిని తొలగించారన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలలో పాల్గొన్న పురుషులు

కోలారు: నగరంలోని ప్రభుత్వ అతిథి గృహం ముందు అఖండ భారత వినాయక మహాసభ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 10వ సంవత్సరపు వినాయక ఉత్సవ వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించారు. నగరంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి వివేకానంద సర్కిల్ వరకు మొత్తం 86 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. 9 మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈసారి ముగ్గుల పోటీల్లో నగర ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి పురుషులు కూడా పాల్గొనడం విశేషం. ముగ్గుల పోటీల్లో విజేతలకు 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ తదితర బహుమతులను అందించారు.

సమస్యల సుడిలో ప్రభుత్వ పాఠశాలలు

- వేధిస్తున్న ఇంగ్లీష్, హిందీ, కన్నడ ఉపాధ్యాయుల కొరత
- టెన్త్ పరీక్ష ఫలితాలపై దృష్టి పెట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



తరగతి గదిలో విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు తదితర మౌలిక వసతులు లేని దృశ్యం

సాక్షి,బళ్లారి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా జిల్లాలోని పాఠశాలల తీరు తయారైంది. భావి భారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఏటేటా తగ్గుముఖం పడుతున్నా కనీస చర్యలు తీసుకోకపోవడంతో గ్రామీణ పేద విద్యార్థులకు శాపంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు మెరుగైన విద్యనందించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో 116 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో ఇంగ్లిష్, హిందీ, కన్నడ భాషలను బోధించే 175 మంది ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. దీంతో ప్రతి ఏటా 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పూర్తిగా పడిపోతోంది. ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో 31వ స్థానానికి జిల్లా పడిపోయిందంటే జిల్లాలో అధికారులు, పాలకులు పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఏ మేరకు పాటుపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

జటిలంగా మారిన బోధనా సిబ్బంది లోటు

ముఖ్యంగా ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుల లోటు మరింత జఠిలంగా మారిందని తెలుస్తోంది. ప్రతి ఏటా 10వ తరగతి పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లోనే ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నిష్ణాతులైన ఇంగ్లిష్ టీచర్లను నియమించకపోతే వారికి ఆ సబ్జెక్ట్‌పై పట్టు సాధించలేని పరిస్థితులు ఉన్నాయి. 70 మంది కన్నడ, 40 మంది హిందీని బోధించే ఉపాధ్యాయుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. తాత్కాలిక ఉపాధ్యాయులను కొన్ని గ్రామాల్లో నియమించుకున్నా ఫలితాలు మెరుగు పరిచేందుకు సాధ్యం కావడం లేదని ఓ విద్యాధికారి అన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలని అప్పో సప్పో చేసి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు కనీస వసతుల కొరత తీర్చడంలో విఫలం కావడంతో పలు ప్రభుత్వ పాఠశాలలు నామమాత్రంగా మారాయి.

షరా మామూలుగా ఊకదంపుడు ఉపన్యాసాలు

జిల్లాలోని పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల కొరత తీర్చడంపై ఎందుకు పాలకులు దృష్టి పెట్టడం లేదని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. 10వ తరగతి పరీక్షలకు మరో ఐదు నెలల గడువు మాత్రమే ఉంది. పరీక్షల సమయం దగ్గరపడుతున్నా సిబ్బందిని నియమించడంపై దృష్టి సారించకపోతే ఈ ఏడాది కూడా ఆశించిన ఫలితాలు వస్తాయా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. తగినంత మంది అతిథి ఉపాధ్యాయులు లేకపోవడం కూడా మరింత సమస్యగా మారిందని బోధన సిబ్బంది అంటున్నారు. పర్మినెంట్ ఉపాధ్యాయులను నియమించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇకనైనా జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీర్చి గ్రామీణ పేద విద్యార్థులకు మంచి విద్యాబోధనను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

15 రోజులకొకసారి జనతా దర్శన్



వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

చిక్కబళ్లాపురం: జిల్లాలో జనతా దర్శన్‌ను తొలిసారిగా ఏర్పాటు చేశామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసి సుధాకర్ తెలిపారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో జనతా దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ఇకపై ప్రతి 15 రోజులకొకసారి తాలూకా కేంద్రాల్లో జనతా దర్శన్ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను అక్కడ విన్నవించుకుని పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా 337 దరఖాస్తులు రాగా కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఎన్ మంజుల, కలెక్టర్ రవీంద్ర, ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, జెడ్పీ సీఈఓ ప్రకాశ్, ఎస్పీ నాగేశ్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా హులికుంటె సమీపంలోని హులిగెరె గొల్లరహట్టి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ చిత్ర లింగేశ్వర స్వామి, శ్రీ వీరకృష్ణ స్వామి, శ్రీ వీర హొన్నణ్ణ స్వామి జాతర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు, దళవాయిలు పాల్గొన్ని పూజలు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని దేవతా మూర్తులను దర్శించుకున్నారు.

ఐటీ ఉద్యోగాలని ముంచేశారు

- 150 మంది నిరుద్యోగుల నుంచి భారీగా వసూళ్లు
- బెంగళూరులో ఉత్తుత్తి కంపెనీ చూపి టోపీ



అనంతపురం క్రైం: ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరిట నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన ఉదంతం అనంతపురంలో వెలుగు చూసింది. బాధితులు సోమవారం అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను 'స్పందన'లో కలసి జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాప్తాడుకు చెందిన టీడీపీ నేత కనుసన్నల్లో అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శశి, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గుర్రం వెంకటరామ్, భానుచంద్రతో పాటు మరికొంత మంది కేటుగాళ్లు.. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాల పేరిట బీటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వల వేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 150 మందికి పైగా నిరుద్యోగులను ముగ్గులోకి దింపారు. శాలరీ ప్యాకేజీని బట్టి ధర ఉంటుందంటూ ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేశారు. ఇలా రూ. 5 కోట్లకు పైగా దండుకున్నారు. ఆరు నెలల శిక్షణ కూడా ఇస్తామని, శిక్షణ కాలంలో రూ.10 వేల నుంచి రూ.18 వేల దాకా గౌరవ వేతనం కూడా చెల్లిస్తామని నమ్మబలికారు.

నకిలీ కంపెనీ పెట్టి...

బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో 'సార్టీస్ టెక్నాలజీ లిమిటెడ్' పేరుతో నకిలీ కంపెనీ ఏర్పాటు చేశారు. నిజమని నమ్మి డబ్బు కట్టిన వారు అదే ప్రాంతంలో అద్దెకు గదులు తీసుకుని ఆరు నెలల పాటు వారు చెప్పిన పని చేసుకుంటూ వచ్చారు. అయితే.. వారికి కంపెనీ పనులు పూర్తి కాలేదంటూ గౌరవ వేతనం కూడా చెల్లించలేదు. తీరా నిర్వాహకులు రాత్రికి రాత్రే కంపెనీకి తాళాలు వేసి అనంతపురానికి చేరుకున్నారు. దీంతో బాధితులు డబ్బు పోయి, ఉద్యోగం రాక మనోవేదనకు గురయ్యారు.

డబ్బడిగితే బెదిరిస్తున్నారు!

నిరుద్యోగులను వంచించిన వారు అనంతపురంలో జల్సాలు చేసుకుంటూ తిరుగుతున్నారు. వారిని బాధితులు కలసి తమ డబ్బు తిరిగివ్వాలని కోరితే... బెదిరింపులకు దిగుతున్నారు. 'మా వెనుక రాప్తాడుకు చెందిన టీడీపీ నేతలు ఉన్నారు. ఖబడ్దార్' అంటూ దాడులకు సైతం తెగబడుతున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా పరిషత్‌లోని చిత్రావతి అతిథి గృహం వద్దకు బాధితులను పిలిపించుకుని టీడీపీ నేతలు బెదిరింపులకు దిగారు. తన్నులు తింటారా అంటూ బెదిరించారు. డబ్బు తిరిగివ్వకపోగా బెదిరింపులు ఎక్కువ కావడంతో కొంత మంది బాధితులు సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారమే పరమావధి

- తుంగభద్రను కావేరి కానివ్వద్దు
- మంత్రి శరణ ప్రకాష్ పాటిల్



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు రూరల్: మీ సమస్యలే మావిగా భావించి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అన్నారు. సోమవారం మహాత్మగాంధీ క్రీడాంగణంలో జనతా దర్శన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లో నాలుగు పథకాలను జారీ చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు హంపనగౌడ, బసనగౌడ మాట్లాడుతూ జిల్లాలో కరువు నెలకొందన్నారు. 846 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కరువు సహాయక పనులు చేపట్టాలన్నారు. సాగు నీటి విషయంలో కావేరి మాదిరిగా కాకుండా తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చూడాలన్నారు. కరువు నష్టం అంచనా వేయడానికి కేంద్రం అధ్యయన కమిటీని నియమించాలన్నారు. మంత్రికి దివ్యాంగురాలు తన మొరను వినిపించడానికి రక్షక భటులను ఆశ్రయించి మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే కరెమ్మ, ఎమ్మెల్సీ శరణేగౌడ, అదనపు జిల్లాధికారి దురుగేష్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఎస్పీ నిఖిల్, ఏసీ మెహబూబిలున్నారు.

కావేరి జలాశయాల్లో నీళ్లు లేవు

కావేరి జలాశయం నుంచి తమిళనాడుకు నీరు వదలడానికి నదిలో నీటి లభ్యత తక్కువగా ఉందని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే బసన గౌడ కార్యాలయంలో తనను కలసిన విలేకరులతో మాట్లాడారు. కావేరి విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. మేకెదాటు పథకం విషయంలో సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామన్నారు. మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి రాజకీయ అవకాశవాది అన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



మృతుడు వీరేశ్(ఫైల్)

బళ్లారి రూరల్: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. నగరంలోని సత్యవాణినగర్‌కు చెందిన వీరేశ్(34) విమ్స్ పీజీ హాస్టల్‌లో వంటమనిషిగా పని చేస్తున్నాడు. ఆదివారం వంట పని పూర్తి చేసి 9.30 సమయంలో వర్షం పడుతుండగా తన బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో కరెంటు పోయింది. ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని నవజీవన క్రైస్తవ ఆశ్రమం వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి ట్రామాకేర్ సెంటర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన బాధితున్ని తరలించే లోపు ఢీకొట్టిన బైక్ వాహనదారుడు పరారయ్యాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీబీఎంపీ లారీని ఢీకొని యువకుడి మృతి



మృతుడు యశ్వంత్ (ఫైల్)

యశవంతపుర: నిలిపి ఉంచిన బీబీఎంపీ చెత్త లారీని వెనుక నుంచి ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని జయనగర మెట్రో స్టేషన్ వద్ద జరిగింది. మృతుడిని యశ్వంత్ (26)గా గుర్తించారు. ఇతనికి కొన్ని నెలల క్రితమే వివాహం జరిగింది. మెట్రో స్టేషన్ పక్కలో అనుమతి లేకుండా నిలిపిన బీబీఎంపీ చెత్త లారీని యశ్వంత్ ఢీకొన్నాడు. ఆదివారం అర్ధరాత్రి బనశంకరి నుంచి సౌత్‌ఎండ్ సర్కిల్ మార్గంలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బైక్ లారీ కింద చిక్కుకుని యశ్వంత్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యమకర్త సేవలను గుర్తించాలి



చంద్రయ్యను అభినందిస్తున్న దృశ్యం

కోలారు: యరగోళ తాగునీటిని కోలారుకు తీసుకు రావడానికి విశేషంగా శ్రమించిన చంద్రయ్యను ప్రభుత్వం గుర్తించి తగిన విధంగా సత్కరించాలని కర్ణాటక భీమ సేన ప్రధాన కార్యదర్శి ఎ.మోహన్ తెలిపారు. సోమవారం నగరంలోని నచికేత నిలయంలో యరగోళ డ్యాం కోసం శ్రమించిన ఉపాధ్యాయుడు చంద్రయ్యను సత్కరించి మాట్లాడారు. యరగోళ వద్ద వర్షం నీరు వృథాగా తమిళనాడు వైపునకు వెళుతున్న విషయాన్ని గుర్తించి చంద్రయ్య దీనిని పత్రికల ద్వారా జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చారన్నారు. ఇక్కడ డ్యాం నిర్మిస్తే కోలారు, మాలూరు, బంగారుపేట తాలూకాలకు తాగునీరు లభిస్తుందని డ్యాం నిర్మాణం కోసం విశేషంగా శ్రమించారని తెలిపారు. భవిష్యత్తులోనైనా ప్రభుత్వం చంద్రయ్య సేవలను గుర్తించి తగిన విధంగా గౌరవించాలన్నారు. ఉపాధ్యాయుడుగా సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహించి తమిళం, తెలుగు మాట్లాడే వారి సంఖ్య అధికంగా ఉన్న చోట కన్నడ భాషాభివృద్ధికి చంద్రయ్య విశేషంగా శ్రమించారన్నారు. సేన జిల్లా అధ్యక్షుడు గణేష్, దళిత నాయకుడు కురుబరపేట కుమార్, పీసీ కాలనీ గోవిందప్ప ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

శ్రీనివాసపురం: విద్యుత్ షాక్‌తో ఓ బాలుడు మరణించిన ఘటన తాలూకాలోని కోటపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో 10వ తరగతి చదువుతున్న ఆకాశ్ (16) అనే బాలుడు పశువులకు మేత కోసుకు రావడానికి వెళ్లినప్పుడు 11 కేవీ విద్యుత్ తీగ తగిలి షాక్‌తో మరణించినట్లు తెలిపారు. శ్రీనివాసపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

పథకాలు చిట్టచివరి వ్యక్తికీ చేరాలి



హొసపేటెలో వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

బళ్లారిటౌన్: ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తులకు కూడా చేరాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని అనంతపురం రోడ్డులోని జిల్లాధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అందిన వినతిపత్రాలపై ఎప్పటికప్పుడే పరిష్కరించే దిశలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటి జనతా దర్శన్‌లో ప్రజలు తమ సమస్యలను తెలుపుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి తాలూకాలోను చేపడతారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా వీటి సమస్యలు పరిష్కరించేందుకు స్థానికంగా 15 కౌంటర్లను ఏర్పాటు చేశారు. అందులో రెవెన్యూ, ఆహార పౌర సరఫరాలు, గనులు భూవిజ్ఞాన, పోలీస్, అగ్నిమాపక, ఎక్సైజ్, గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్, ఇంజనీయర్, గ్రామీణ తాగునీటి, అవినీతి నిరోధక, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గృహ మండలి, విద్యా తదితర శాఖలకు అధికారులు కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ త్రివేణి, ఉపమేయర్ బీ.జానకి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూరు, ఉప అరణ్య సంరక్షణాధికారి సందీప్ సూర్యవంశీ, అదనపు జిల్లాధికారి మహమ్మద్ ఝుబేర్, అధికారి మంజునాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి నెల 25న జనతా దర్శన్

హొసపేటె: వివిధ ప్రభుత్వ సౌకర్యాలు పొందేందుకు, ఫిర్యాదుల సమర్పణకు జిల్లా యంత్రాంగం ఇకపై ప్రతినెల 25న జనతా దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనతా దర్శన్‌లో జిల్లాకు సంబంధించిన ఏవైనా సమస్యలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 20 కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో 992 అర్జీలను స్వీకరించామని తెలిపారు. ఇప్పటికే స్థలంలోనే 6 మంది వితంతువులకు మాసిక పెన్షన్ వ్యవస్థను, ఇద్దరు పేద విద్యార్థులకు హాస్టల్ వ్యవస్థ తదితర సమస్యలను పరిష్కరించామన్నారు. మిగతా సమస్యలను కూడా త్వరగా నెరవేరుస్తామన్నారు. ఎమ్మెల్యేలు హెచ్‌ఆర్ గవియప్ప, శ్రీనివాస్, లతా, జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశి, ఎస్పీ శ్రీహరిబాబు, అదనపు జిల్లాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రెండు కార్ల మధ్య ఢీ.. నలుగురికి గాయాలు



బోల్తాపడిన రెండు కార్లు

శ్రీనివాసపురం: రెండ్లు కార్లు పరస్పరం ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం తాలూకాలోని మీసగానహళ్లి గేట్ వద్ద చోటు చేసుకుంది. బెళగావి నుంచి తిరుపతికి వెళుతున్న కారు వేగంగా ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. ఘటనలో రెండు కార్లు బోల్తాపడ్డాయి. రెండు కార్లలో ఉన్న నలుగురికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే కోలారు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. నిద్రమత్తులో ఉండడమే ఈ ఘటనకు కారణంగా తెలిసింది. శ్రీనివాసపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు. కేసు నమోదు చేసుకున్నారు.

భరత నాట్యంలో ఎంఏ డిగ్రీ



భరత నాట్యంలో ఎంఏ డిగ్రీ చేసిన మంజునాథ్

కోలారు: కళ ఏ ఒక్కరి సొత్తు కాదు. శ్రద్ధాభక్తులతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదు. ఇందుకు నగరంలోని పీసీ కాలనీకి చెందిన కెఎస్ మంజునాథ్ నిదర్శనం. బాల్యం నుంచి కళలపై ఆసక్తి కలిగిన మంజునాథ్ భరత నాట్యంపై ఆకర్షితుడై కఠిన పరిశ్రమతో జిల్లాలోనే మొట్టమొదటి సారిగా భరతనాట్యంలో ఎంఎ డిగ్రీ పొందిన మొట్టమొదటి వ్యక్తి అనిపించుకున్నాడు. మంజునాథ్ భరతనాట్యంలో జిల్లా వ్యాప్తంగా భరత నాట్య తరగతులను నిర్వహించి పలువురు విద్యార్థులకు భరత నాట్యంలో ప్రావీణ్యం కల్పించారు. భరతనాట్యంలో పీజీ చేసిన మంజునాథ్ సాధనను పలువురు అభినందిస్తున్నారు.

జనతా దర్శన్‌కు స్పందన భేష్

- తొలిరోజు 507 ఫిర్యాదుల స్వీకరణ




ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి భైరతి సురేష్

కోలారు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జనతా దర్శన్ కార్యక్రమానికి నగరంలో సోమవారం మంచి స్పందన లభించింది. నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు చేయడానికి ప్రజలు తరలి వచ్చారు. కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భైరతి సురేష్ మాట్లాడుతూ జనతాదర్శన్‌కు ప్రజల నుంచి స్పందన బాగుందన్నారు. తొలిరోజున కార్యక్రమం ప్రారంభమైన మూడు గంటలలో 507 ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయన్నారు. పలు ఫిర్యాదులకు స్థలంలోనే పరిష్కరించారు. మరికొన్నింటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో అధికారులు తాలూకా , గ్రామ పంచాయతీ స్థాయిలో కూడా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత అనుకూలం అవుతుందని తెలిపారు. కలెక్టర్ అక్రం పాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ప్రతినెలా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని రాబోయే రోజుల్లో తాలూకా స్థాయిలో ప్రతి 15 రోజులకోమారు నిర్వహిస్తారన్నారు. రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి గాను ఈ-ఆఫీస్ వ్యవస్థను ఏర్పాటు చేసి జిల్లా, తాలూకా స్థాయి రెవిన్యూ కార్యాలయాలలో దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎంపీ ఎస్ మునిస్వామి, బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, సీఈఓ పద్మ బసవంతప్ప, తహసీల్దార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

కేజీఎఫ్: బాలికపై లైంగిక దాడి చేసిన ఘటన కేజీఎఫ్‌లో చోటు చేసుకుంది. కేజీఎఫ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని బాగలకోటె జిల్లా ముధోళ తాలూకాకు చెందిన లోకాపుర గ్రామానికి చెందిన సచిన్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని నమ్మించి కేజీఎఫ్ బస్టాండు వద్దకు తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఘటనపై విద్యార్థిని తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రక్తస్రావంతో బాధపడుతున్న విద్యార్థినిని స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కోలారు ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాబర్ట్‌సన్ పేట పోలీసులు నిందితుడు సచిన్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీల మధ్య వాగ్వాదం



ఎమ్మెల్యే, ఎంపీల మధ్యన వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

కోలారు: నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రభుత్వ జనతా దర్శన్ ప్రారంభోత్సవంలో ఎంపీ ఎస్.మునిస్వామి, బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీ మునిస్వామి వేదికనుద్దేశించి మాట్లాడుతుండగా మంత్రి భైరతి సురేష్ అడ్డు తగిలి భూ కబ్జాదారులను పక్కన పెట్టుకుని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అనడంతో తోక తొక్కిన తాచులా లేచిన బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి ఎవరు భూ కబ్జాదారులు అంటూ ఎంపీ వైపునకు ఆవేశంగా ఊగిపోతూ దూసుకువెళ్లారు. తానేమి తక్కువ కాదంటూ ఎంపీ కూడా అదే దూకుడుతో నారాయణస్వామి వైపునకు వచ్చారు. ఒక దశలో ఇద్దరు పరస్పరం చేయి చేసుకునేదాకా వెళ్లారు. అయితే అక్కడే ఉన్న పోలీసులు ఇద్దరిని వారించారు. దీన్నంతా చోద్యంగా చూస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి భైరతి సురేష్, కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌లు ఇద్దరినీ సమాధాన పరిచారు.

క్లుప్తంగా

నారాయణగురు ఆదర్శనీయులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: సమాజ సంక్షేమానికి ఈడిగ వర్గం కుల గురువైన నారాయణగురు శ్రమించారని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. అభిలాష్ సినిమా హాలులో తాలూకా ఈడిగ సంఘం నిర్వహించిన నారాయణగురు 169వ జయంతి, విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రదానంలో పాల్గొన్నారు. సమాజంలోని మౌఢ్యాన్ని తొలగించడానికి నారాయణగురు ప్రయత్నించారు, తమ వర్గం వారికి దేవాలయాలలో ప్రవేశం లేనందున ఆయనే స్వయంగా అనేక దేవాలయాలను నిర్మించారన్నారు. కార్యక్రమంలో తిమ్మేగౌడ, బసవణ్ణ, నాగరాజు,సూరజ్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

మైసూరు: కారు ఆటోను ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందగా, ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. జిల్లాలోని హుణసూరు తహసీల్దార్ కారాయలయం ఎదురుగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ శ్రీనివాస్ (55), ప్రయాణికులను తీసుకుని వెళ్తుండగా మైసూరు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఆటో కొంతదూరం వరకూ పల్టీలు కొట్టింది. డ్రైవర్ శ్రీనివాస్ తీవ్రగాయాలతో మరణించగా, ఇద్దరు ప్రయాణికులకు గాయాలు తగిలాయి. కారు నిలపకుండా వెళ్లిపోయింది. హుణసూరు పోలీసులు పరిశీలించి కారు కోసం గాలింపు చేపట్టారు.

సమాజ సేవకు ముందుకు రావాలి



ఆడియో విడుదల చేస్తున్న సంతోశ్ హెగడే

కృష్ణరాజపురం: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విశ్రాంత లోకాయుక్త సంతోశ్ హెగడె అన్నారు. సోమవారం నగరంలోని మహాదేవపురలోని హాలులో భారతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాన కోకిల కుమారు జ్ఞాన గురురాజ్ పాడిన కన్నడ సినిమా గురు కృపాంజలి ఆడియోను విడుదల చేసి మాట్లాడారు. నేటి యువత సేవాభావంతో ఉండాలన్నారు.

బస్సులో నుంచి పడి వృద్ధుడి మృతి

యశవంతపుర: ప్రయాణిస్తున్న బస్సులో నుంచి పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా కడబలో ఆదివారం సాయంత్రం జరిగింది. మృతుడిని అచ్యుత్ గౌడ (63)గా గుర్తించారు. కడబ నుంచి ఉప్పినంగడికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో అచ్యుత్‌గౌడతో పాటు చంద్రశేఖర్ అనే వ్యక్తి పక్కపక్కనే కూర్చున్నారు. కడబ పేటె సమీపంలో మలుపు వద్ద బస్సులో నుంచి అచ్యుత్ గౌడ, చంద్రశేఖర్ కిందపడిపోయారు. తీవ్రగాయాలతో ఉన్న ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా అచ్యుత్ మృతి చెందాడు.

ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గౌరిబిదనూరు: ప్రముఖుల పుట్టిన రోజు నాడు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని తాలూకా బీజేపీ నాయకుడు రవినారాయణరెడ్డి తెలిపారు. సోమవారం తాలూకా బాదిమరళూరు గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు పురస్కరించుకుని పండ్ల మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు మార్కెట్ మోహన్, మండల అధ్యక్షుడు రమేశ్‌రావ్, అశ్వత్థ, హరీశ్ ఈశ్వర్, ముద్దుకృష్ణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కన్నడ సంఘాల ర్యాలీ



బొమ్మనహళ్లి: తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయరాదంటూ ఆనేకల్ తాలూకాలో ఇరు రాష్ట్రాల సరిహద్దుల వద్ద కన్నడ సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించారు. కరవే హెచ్.శివరామెగౌడ బృందానికి చెందిన కార్యకర్తలు బెంగళూరు– చెన్నై జాతీయ రహదారిలో పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. తక్షణం నీటిని బంద్ చేయాలని నినాదాలు చేశారు.

చారిత్రక పుణ్యక్షేత్రం
బాదామి బనశంకరి ఆలయం

- రాహుకాలంలో కూడా పూజించే అమ్మవారి ఆలయం
- బాదామి చాళుక్య రాజులు నిర్మించిన గుడి

బనశంకరి: కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లా బాదామి సమీపంలో ఉన్న బనశంకరి అమ్మవారి ఆలయం పార్వతీదేవికి అంకితం చేయబడిన అత్యంత చారిత్రక పుణ్యక్షేత్రం. ఈ పురాతన ఆలయాన్ని 7వ శతాబ్దంలో కళ్యాణి చాలుక్య రాజులు నిర్మించారు. ప్రస్తుత నిర్మాణం 18వ శతాబ్దంలో నిర్మించబడింది. అదిష్ఠానదేవతను బనశంకరి లేదా శాకంబరి అని పిలుస్తారు. తిలకారణ్యంలో ఉన్నందున స్థానికులు వనశంకరి దేవాలయం అని కూడా పిలుస్తారు. (వన అంటే అడవి శంకరి అంటే శివుని భార్య) బాగల్‌కోట్ జిల్లాలోని బాదామి నుంచి గదగ్ వెళ్లే మార్గంలో 5 కిలోమీటర్ల దూరంలో చోళచగూడలో బనశంకరి ఆలయం ఉంది. బనశంకరి దేవస్థానం మొదట ద్రావిడ నిర్మాణశైలిలో నిర్మించబడింది. ప్రస్తుతం పునఃనిర్మించిన నిర్మాణం విజయనగర నిర్మాణ శైలిలో ఉంది. ముఖమంటపం, అర్ధమంటపం, విమాన (గోపురం) పైబాగంలో ఉన్న గర్భగుడిని కలిగి ఉంది. ప్రధాన గర్భగుడిలో నల్లరాతిశిల్పంలో బనశంకరిదేవి చిత్రం చూడవచ్చు. బనశంకరీదేవీ 8 చేతులతో



బనశంకరి జాతర, రథోత్సవం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు (ఫైల్)

ప్రతిష్ఠించబడి తన పాదాల కింద రాక్షసుడిని తొక్కే సింహంపై కూర్చుంది. ఆమె త్రిశూలం, డమరుకం, కపాలపత్రం, యుద్ధగంట, వేదగ్రంధాలు, ఖడ్గం, డాలు పట్టుకుని చిత్రీకరించబడింది. ఆలయం చుట్టూ ఉన్న అడవులు కొబ్బరితోటలు, తమలపాకులు తోటలు కలిగి ఉంది. అందువల్ల తీవ్రమైన కరువు సమయంలో దేవత ప్రజలు జీవించడానికి కూరగాయలు, ఆహారాన్ని అందించిందని అందువల్ల దేవతకు శాకంబరి అని పేరుపెట్టారని చెబుతారు. అమావాస్య రోజున బనశంకరి సన్నిధిలో అమ్మవారిని దర్శించుకోవడానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. మంగళ, శుక్ర, ఆది



బనశంకరీ అమ్మవారి మూల విరాట్

వారం అమ్మవారికి పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకుంటారు. అదేవిదంగా బనశంకరిదేవస్థానంలో రాహుకాల పూజలు కూడా నిర్వహిస్తారు. బనశంకరి జాతర, ఆలయవార్షిక పండుగ, జనవరి–ఫిబ్రవరి నెలలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. బనశంకరీదేవి ఉత్సవాల్లో బాగంగా అమ్మవారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడంతో లక్షలాది భక్తులు తరలివస్తారు. బోట్ ఫెస్టివల్, అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బనశంకరి ఆలయం బాదామి నుంచి గదగ వెళ్లే దారిలో 5 కిలోమీటర్లు దూరంలో ఉంది. బాదామి రైల్వేస్టేషన్ సమీప రైలుకేంద్రం. ఆలయాన్ని చేరుకోవడానికి 125 కిలోమీటర్లు దూరంలో ఉన్న హుబ్లీ విమానాశ్రయం కలదు. బెంగళూరు నుంచి బాదామి 454 కిలోమీటర్లు.



అంత్యంత పురాతనమైన బాదామి గుహలు



బాదామి బనశంకరి ఆలయ ముఖద్వారం

అక్రమాలు బయట పెట్టండి



మాట్లాడుతున్న పాండు

మండ్య: మండ్య తాలూకా హెచ్.మల్లిగెరె ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘంలో రూ. కోట్ల గోల్‌మాల్ జరిగిందని, వెంటనే దర్యాప్తు చేసి మండలిని సూపర్‌సీడ్ చేయాలని లేదంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని మాజీ డైరెక్టర్ బీసీ పాండు హెచ్చరించారు. సోమవారం మండ్య నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఈ గోల్‌మాల్‌లో పరిపాలన మండలికి కూడా భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా కార్యదర్శిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వెంటనే ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టాలన్నారు.

ఘాటి సన్నిధిలో హీరో శ్రీకాంత్



ఘాటి దేవాలయంలో శ్రీకాంత్

దొడ్డబళ్లాపురం: తెలుగు సీనియర్ హీరో శ్రీకాంత్ ఘాటి సుబ్రమణ్యస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం దేవాలయానికి విచ్చేసిన శ్రీకాంత్‌ను దేవాలయం ఈఓ కృష్ణప్ప, సిబ్బంది స్వాగతించారు. అనంతరం శ్రీకాంత్ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా భక్తులు ఆయనతో సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

రోడ్డు వివాదం, వ్యక్తిపై దాడి



గాయపడిన వ్యక్తి

చింతామణి: రోడ్డు వివాదానికి సంబంధించి ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన తాలూకాలోని కంచార్లపల్లి పరిధిలో చోటుచేసుకుంది. లాయర్ భాస్కర్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన గ్రామస్తులు దాడి చేసి గాయపరిచారు. వివరాలు...భాస్కర్ రెడ్డి తనకు చెందిన భూమిలో రోడ్డు వేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం అధికారులు కొలతలు వేయడానికి రాగా వారి సమక్షంలోనే గ్రామస్తులు శ్రీరామరెడ్డి, సతీష్‌రెడ్డి, లక్ష్మణరెడ్డిలు దాడులు చేసుకున్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన భాస్కర్ రెడ్డిని చింతామణి ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కోలారు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి అరికెరె వార్డు న్యానప్పనహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి సోమవారం విశేష పూజలు చేశారు. సమాజ సేవకుడు, అరికెరె వార్డు బీజేపీ అధ్యక్షుడు ఎం. మంజునాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గొడవ ఆపడానికి వెళ్లి హత్య

యశవంతపుర: తాగిన మత్తులో అన్న, తమ్ముడు గొడవ పడుతుండగా ఆపడానికి వెళ్లిన ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బెంగళూరు సుబ్రమణ్యపుర పోలీసుస్టేషన్ పరిధిలోని సార్వభౌమనగరలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఆస్పత్రిలో మేల్ నర్సుగా పని చేస్తున్న గణేశ్ నాయక్ (45) హత్యకు గురయ్యాడు. అన్న మహేశ్ తమ్ముడుతో కలిసి ఆదివారం రాత్రి వరకు మద్యం తాగారు. అందులో గణేశ్ కూడా పాల్గొన్నాడు. తమ్ముడి ఇంటిలో గణేశ్ అద్దెకు ఉంటున్నాడు. మద్యం మత్తులో గొడవ ప్రారంభమైంది. అద్దె ఇవ్వని వారిని ఇంటిలో పెట్టుకుంటావా అంటూ అన్న తమ్ముడిపై ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇద్దరు గొడవ పడుతుండగా గణేశ్ విడిపించటానికి వెళ్లగా ఆక్రోశంతో మహేశ్ కర్ర తీసుకుని గణేశ్ తలపై కొట్టాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితులు పరారీలో ఉన్నట్లు డీసీపీ డీసీపీ రాహుల్ కుమార్ తెలిపారు.

ఏనుగు దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

మైసూరు: ఏనుగు దాడిలో రైతు తీవ్రంగా గాయపడిన ఘటన సరగూరు తాలూకాలోని హెగ్గడి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దండనాయక (37) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దండనాయక తన పొలంలో పంటకు నీరు పెడుతున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చిన ఏనుగు అతనిపై ఒక్కసారిగా దాడి చేసింది. అతని కేకలు విన్న సహచర రైతులు అక్కడికి చేరుకోవడంతో ఏనుగు అడవిలోకి పారిపోయింది. బాధితుడిని హుటాహుటిన మైసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వేడుకగా నిమజ్జనం



నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: తాలూకా మంచేనహళ్లిలో బండిరా మనహళ్ళి గెళెయర బళగ (స్నేహితుల కూటం) ఆధ్వర్యంలో విశేష పూజలందుకున్న గణనాథుడికి సోమవారం భక్తులు వీడ్కోలు చెబుతూ నిమజ్జనోత్సవం నిర్వహించారు. యువత డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

కళలపై ఆసక్తి పెంచుకోవాలి



నాట్యం చేస్తున్న కళాకారిణులు

బొమ్మనహళ్లి: పిల్లలకు కళల పట్ల మక్కువ కలిగేలా తల్లిదండ్రులు వారిలో ఉత్సాహం కలగజేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు నెల నరేంద్ర బాబు అన్నారు. నగరంలోని మల్లత్తహళ్లి కళాగ్రామంలోని సభా భవనంలో నాట్య కళాసిరి సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాట్య సంభ్రమ–2023 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారుల నృత్యాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో నాట్య సన్నిధి సంస్థాపకులు మోనిషా, నవీన్, విలేకరి సుధీంద్రరావ్ తదితరులు పాల్గొన్నారు.

రాచనగరిలో నిరసనలు



మైసూరు: వారసత్వ నగరంతో పాటు జిల్లాలో కావేరి జలాల పోరాటం ఉధృతమైంది. సోమవారం నగరంలోని మూడు వేర్వేరు చోట్ల పోరాట సంఘాలు, రైతులు ధర్నాలు నిర్వహించారు. జిల్లా కన్నడ చళువళి సంఘం ఆధ్వర్యంలో శివకుమార్ నేతృత్వంలో కాడా కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కొబ్బరి చిప్పలను పట్టుకొని కావేరి నీటి నిర్వహణ ప్రాధికార, రాష్ట్ర ప్రభుత్వం, తమిళనాడు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలు, రైతులు ఇబ్బందులు పట్టించుకోరా అంటూ మండిపడ్డారు.

మేకెదాటు పథకం అమలు చేయాలి

- జల మండలి ఎదుట బీజేపీ భారీ ధర్నా

బనశంకరి: బెంగళూరు మహా నగరంలో భవిష్యత్‌లో తాగునీటి కష్టాలు రాకుండా ఉండాలంటే వెంటనే మేకెదాటు పథకం అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. సోమవారం కేజీ రోడ్డులోని కావేరి భవన్‌లో జలమండలి ఎదురుగా బీజేపీ భారీ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సీటీ రవి మాట్లాడుతూ...మేకెదాటు విషయంలో నిర్లక్ష్యం తగదని అన్నారు. ఇక్కడ నీటి సమస్య తలెత్తకుండా మేకెదాటు పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఇక కావేరి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడుకు సహాయ సహకారాలు అందిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పెద్దల మెప్పు పొందడానికి సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివ



మాట్లాడుతున్న మాజీ మంత్రి సీటీ.రవి

కుమార్‌లు రాష్ట్ర సంక్షేమాన్ని పక్కన పెట్టారని మండిపడ్డారు. మంగళవారం బంద్‌కు బీజేపీ మద్దతు ఇస్తుందని తెలిపారు. ధర్నాలో జయనగర ఎమ్మెల్యే సీకే.రామమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అశ్వత్థ నారాయణ, సిద్ధరాజు, రాష్ట్ర కార్యదర్శి జగదీశ్‌హిరేమని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు స్పందన



బొమ్మనహళ్లి: నగరంలోని డాన్ బాస్కో ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్రంతో పాటు దక్షిణాది ప్రాంతాల నుంచి నిరుద్యోగులు వచ్చారు. డిగ్రీ, పీజీ వారికి ఉద్యోగాలు కల్పించారు. మేళాను వ్యాస్ మ్యాక్ ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యదర్శి రాఘవ భైలప్ప ప్రారంభించారు.

హోసూరు వార్తలు..

హాస్టల్ వార్డెన్ సస్పెండ్



హాస్టల్‌లో మంత్రి ఉదయనిధి తనిఖీలు

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో నిర్వహిస్తున్న గిరిజన విద్యార్థుల హాస్టల్లో అవకతవకలపై రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. సోమవారం క్రిష్ణగిరి జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉదయనిధి ఆదివారం రాత్రి క్రిష్ణగిరికి చేరుకొన్నారు. ఈ సమయంలో క్రిష్ణగిరిలోని గిరిజన విద్యార్థుల హాస్టల్‌కు వెళ్లారు. విద్యార్థుల హాజరు పట్టిక, భోజన వసతి, సరుకుల నిల్వను పరిశీలించారు. విద్యార్థులకు అందజేసే ఆహార పదార్థాలు, హాజరు పట్టికలో అవకతవకలు చోటుచేసుకొన్నట్లు రుజువు కావడంతో వార్డెన్ మురుగన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ మహిళా కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా అధ్యక్షురాలు

హోసూరు: హోసూరు పట్టణంలోని బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యాలయంలో సోమవారం మహిళా విభాగ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు మంజుల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం.నాగరాజ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ దేశ ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. దీంతో పాటు తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తదితర తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఇంద్రాణి, శివలత, ప్రియ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీటి తొట్టె

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం పట్టణ పంచాయతీలోని సంత మైదానంలో పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన తొట్టె ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. ఈ సంతకు వందలాది రైతులు పశువులను తోలుకు వస్తుంటారు. వాటికి నీటివసతి కోసం తొట్టె ఉంది, అయితే చెత్తతో నిండిపోయింది, దీనిని శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేశారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని సమ్మె

- చిన్న పరిశ్రమల మూత

హోసూరు: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం హోస్టియా, హోస్మియా సంఘాలు ఒక్క రోజు సమ్మె నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహిస్తున్న సుమారు 200కుపైగా చిన్నపాటి పరిశ్రమలు మూతపడ్డాయి. గత 15 ఏళ్లుగా చిన్నసన్నకారు పరిశ్రమల్లో తయారు చేసే ఉత్పత్తులకు ఒకే ధరను నిర్ణయించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విద్యుత్ చార్జీలు పెంచి మరింత భారాన్ని మోపిందని పరిశ్రమల యాజమానులు మండిపడ్డారు. హోసూరు ప్రాంతంలో పెద్ద ఎత్తున కార్మికులు చిన్నసన్నకారు పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనోపాధి గడిస్తున్నారని, పరిశ్రమల్లో తయారు చేసిన ఉత్పత్తులకు పెద్ద



హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో మూతపడిన పరిశ్రమలు

తరహా పరిశ్రమలు బిల్లులు చెల్లించడం ఆలస్యమైనా, తాము ముందుగానే జీఎస్టీ చెల్లించాల్సి ఉందని ప్రస్తుతం పరిశ్రమలు నిర్వహించకపోయినా విద్యుత్ బిల్లును తప్పనిసరిగా చెల్లించాలని డిమాండ్ చేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షేమ ఫలాలు అందజేత

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 3293 మంది లబ్ధిదారులకు రూ. 41.54 కోట్ల విలువ చేసే సంక్షేమ ఫలాలను క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ అందజేశారు. కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆహార భద్రతా శాఖ మంత్రి చక్రపాణి, జిల్లా ఎంపీ సెల్లకుమార్, ఎమ్మెల్యేలు వై. ప్రకాష్ టి. రామచంద్రన్, మదియళగన్‌లు నేతృత్వం వహించారు. కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ... తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బీద, బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులకు పలు సంక్షేమ ఫలాలను ప్రవేశపెట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేపనపల్లి సమితి కుందారపల్లి గ్రామంలో జరిగిన సంక్షేమ ఫలాలందజేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొని 500 మంది లబ్ధిదారులకు ప్రతినెలా ప్రభుత్వం అందజేసే రూ. 1000 ఆర్థిక సాయం అందుకొనేందుకు ఏటీఎం కార్డులను



లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలందజేస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

పంపిణీ చేశారు. సూళగిరి సమీపంలోని సిప్‌కాట్‌లో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంతో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల ద్వారా 5000 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్, అదనపు కలెక్టర్ వందనా కార్గ్, జిల్లా అటవీశాఖాధికారిణి కార్తికేయిని, అధికారులు అరుళ్‌జ్యోతి, భవనంతి, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య, మణిమేఘలైనాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా విక్రేతలకు జరిమానా

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి ప్రాంత గ్రామాల్లో ఆరోగ్య శాఖాధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి గుట్కా ఉత్పత్తులను స్వాధీన పరుచుకొన్నారు. ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో ఆరోగ్య శాఖాధికార్లు సుందరం, కదిరవన్ తదితరులు తళి సమీపంలోని ఎర్రండపాళ్యం, దేవగానపల్లి తదితర ప్రాంతాల్లో చిల్లర అంగళ్లలో సోదాలు చేశారు. అక్రమంగా విక్రయిస్తున్న పాన్, గుట్కా ఉత్పత్తులను స్వాధీన పరుచుకొని విక్రేతలకు జరిమానా విధించారు. నిషేధిత గుట్కా ఉత్పత్తులను విక్రయంచేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వివాహిత అదృశ్యం

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలో ఏడాదిన్నర బాలికతో తల్లి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని మహిళ కోసం గాలిస్తున్నారు. వివరాల మేరకు క్రిష్ణగిరి డ్యాం సమీపంలోని పచ్చముత్తునగర్ ప్రాంతానికి చెందిన అశోక్ భార్య పూజ. వీరికి గత కొద్ది సంవత్సరాల క్రితం పెళ్లి జరిగి ఏడాదిన్నర కూతురు ఉంది. పూజ ఆదివారం ఉదయం చంటిబిడ్డతో ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియకపోవడంతో భర్త అశోక్ కేఆర్‌పీ డ్యాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళా సాధికారతలో దేశంలోనే ఏపీ నంబర్ వన్

4 ఏళ్లలో మహిళలకు రూ.2.53 లక్షల కోట్ల పంపిణీ

- మహిళా సీఎంలు ఉన్న చోట కూడా మహిళల కోసం ఇన్ని పథకాల్లేవు
- రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్



సాక్షి, అమరావతి : మహిళా సాధికారతలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ చెప్పారు. శిశు, బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్య దశలన్నింటిలోనూ మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేయిస్తున్నారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలో మహిళా సాధికారతపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆమె సమాధానమిచ్చారు. సంపూర్ణ పోషణ్, అమ్మ ఒడి, కల్యాణమస్తు, షాదీ తోఫా, చేయూత, ఆసరా, వృద్ధాప్య పెన్షన్లు తదితర పథకాలను అమలు చేయిస్తూ మహిళా సాధికారతను సీఎం జగన్ సాకారం చేశారని కొనియాడారు. ఈ నాలుగేళ్లలో మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,53,862 కోట్లను వెచ్చించిందన్నారు. జగనన్న అమ్మ ఒడికింద 44 లక్షల మంది తల్లులకు ప్రభుత్వం సాయం అందిస్తోందని తెలిపారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ స్కూళ్లను మూసివేయిస్తే.. సీఎం జగన్ వాటన్నింటినీ తెరిపించడమేగాక, బాలికల కోసం ప్రత్యేకంగా స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటు చేశారని చెప్పారు. చంద్రబాబు హయాంలో బాలికలకు కనీసం మరుగుదొడ్లు కూడా లేవని, ఇప్పుడు నాడు–నేడు కింద ప్రతి స్కూల్లో వారికోసం ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మించామన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద కోట్లాది రూపాయలు అందిస్తూ.. బాలికలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. పేద పిల్లలకు



పూర్తి రీయింబర్స్‌మెంట్ అందించడంతో పాటు వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అదే చంద్రబాబు.. విద్యార్థులకు నైపుణ్యం పేరిట ఇవ్వాల్సిన నిధుల్లో కుంభకోణం చేసి వాటిని స్వాహా చేశారన్న విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చంద్రబాబు మోసం చేయగా.. వైఎస్ జగన్.. డ్వాక్రా రుణమాఫీని నాలుగు దశల్లో చేసేలా నిధులు విడుదల చేయిస్తున్నారని తెలిపారు. బ్యాంకులు, అమూల్ వంటి పరిశ్రమలు, ఇతర సంస్థలతో ఒప్పందాలు చేయిస్తూ మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా సీఎం జగన్ తీర్చిదిద్దుతున్నారని, సున్నా వడ్డీకి బాబు స్వస్తి పలికితే.. సీఎం జగన్ దానిని అమలు చేయడమే కాకుండా అధిక నిధులిస్తున్నారని మంత్రి వివరించారు. దా దాపు 30.76 లక్షల మంది మహిళల పేరిట ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, జగనన్న శాశ్వ త భూ హక్కు ద్వారా మహిళలకు భూ హ క్కులు కల్పించామన్నారు. దిశ చట్టంతో పాటు, ప్రత్యేకంగా మహిళా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటుచేశామని మంత్రి ఉషా శ్రీచరణ్ వివరించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం

రాజ్యాంగానికి సవరణ చేస్తూ 'మహిళా రిజర్వేషన్ బిల్లు–2023'ను ఆమోదించిన భారత ప్రభుత్వానికి శాసనసభలో మంత్రి ఉషశ్రీ చరణ్ కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లు–2023ను ఆమోదించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మహిళలకు ఆర్థికంగా, రాజకీయంగా సాధికారత కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019లో క్రియాశీలక చర్యలు తీసుకుంది. నామినేటెడ్ వర్క్స్ కాంట్రాక్టులు, సర్వీస్ కాంట్రాక్టుల్లో మహిళలకు అవకాశం కల్పించేందుకు నామినేటెడ్ వర్క్స్‌లో 50 శాతం రిజర్వేషన్ కల్పించింది. పట్టణ, స్థానిక సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల్లో అన్ని నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 50 రిజర్వేషన్ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన క్రియాశీలక చర్యలను భారత ప్రభుత్వానికి తెలియచేస్తున్నాం' అని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు.

టీడీపీ నోమోర్.. జగనన్న వన్స్‌మోర్

- వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కొట్టుకుపోవడం ఖాయం
- అసెంబ్లీలో మంత్రి ఆర్కే రోజా



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ సముద్రంలా ఉప్పొంగి సునామీలా విరుచుకుపడితే టీడీపీ, జనసేన సహ ఇతర పార్టీలన్నీ కొట్టుకుపోవడం ఖాయమని మంత్రి ఆర్కే రోజా అన్నారు. మహిళా సాధికారతపై రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులపై ఘాటైన పంచులతో విరుచుకుపడ్డారు. మంత్రి రోజా ఏమన్నారంటే ఆమె మాటల్లోనే.. జగన్‌ను ఇంటికి పంపిస్తామన్నోడు ప్రస్తుతం జైలులో ఉన్నాడు. జగన్‌కు భయం ఎలా ఉంటుందో చూపిస్తానన్న వాడు భయపడి ఢిల్లీకి పారిపోయాడు. జగనన్న పార్టీని లేకుండా చేస్తామన్నోడు అడ్రస్ లేకుండా పోయాడు. వాళ్లకు ఒక్కటే చెబుతున్నా జగనన్న కంట్లో భయం, ఒంట్లో బెదురు ఉండదు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు జగన్ కొట్టే దెబ్బకు తిరుగుండదు. అర్థమైందా రాజా!. 2024 జగనన్న వన్స్‌మోర్.. టీడీపీ నోమోర్.. జనసేన పరార్. గతంలో ఏ సీఎం, ఎక్కడా స్త్రీలకు సగం అవకాశాలు ఇచ్చిన వారు లేరు. దేశంలో మహిళలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సమాన హక్కులు కల్పిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్. భవిష్యత్తుకు గ్యారంటీ, బాబు ష్యూరిటీ అంటూ మైకు పట్టుకొని ఊళ్లు తిరిగిన చంద్రబాబుకు ఇప్పుడు భవిష్యత్తు కనిపించడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలకు, నేతలకు సవాల్ విసురుతున్నాం. వైఎస్ జగన్ ఈ 40 నెలల్లో అమలుచేసిన పథకాలు 14 ఏళ్లలో మీరు అమలు చేశారా? చర్చకు రాగలరా?

అసెంబ్లీలో ఇకపై 58 మహిళా ఎమ్మెల్యేలు

కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తూ మద్దతిస్తున్నా. మహిళా రిజర్వేషన్ బిల్లును మొదట స్వాగతించింది ఏపీయే. ఈ బిల్లుకన్నా ముందే ఏపీలో మహిళలకు రాజకీయంగా అత్యధిక అవకాశాలు కల్పించారు. కేబినెట్లో నలుగురు మహిళలు. అసెంబ్లీలో 14 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. రానున్న కాలంలో 58 మంది మహిళా ఎమ్మెల్యేలు వస్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా తీర్మానం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాం. తెలుగుదేశం పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లును కనీసం స్వాగతించకపోవడం చాలా దారుణం. రాష్ట్ర మహిళలంతా ఆ పార్టీని బాయ్‌కాట్ చేస్తున్నారు.

గతంలో ఎప్పుడూ లేనంతగా మహిళలకు రాజకీయ ప్రాధాన్యం



సాక్షి, అమరావతి: మహిళలకు తల్లి జన్మనిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారికి సాధికారతతో జీవితాన్ని ఇచ్చారని మాజీ మంత్రి పుష్పశ్రీవాణి అన్నారు. సోమవారం అసెంబ్లీలో మహిళా సాధికారతపై చర్చలో ఆమె మాట్లాడుతూ.. మహిళలకు గతంలో ఎవ్వరూ ఇవ్వనంత రాజకీయ ప్రాధాన్యం వైఎస్ జగన్ ఇచ్చారు. 50 శాతం కన్నా అధికంగా మహిళలకు పదవులు ఇచ్చారు. ఇన్ని పదవులు ఇచ్చిన నేత దేశంలో వేరొకరు లేరు. దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని చంద్రబాబు ఎగతాళి చేస్తే.. వైఎస్ జగన్ దళిత మహిళను హోమ్ మంత్రిని చేశారు. గిరిజన మహిళనైన నన్ను డిప్యూటీ సీఎం చేసి ఆదరించారు. కేంద్రం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నాం.

గత ప్రభుత్వం మహిళలను ఆదుకోలేదు



పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మహిళలు చాలా కష్టాలు పడ్డారు. ఆ ప్రభుత్వం మహిళలను ఆదుకోలేదు. వైఎస్సార్ ఆశయం ప్రతి ఆడబిడ్డను లక్షాధికారిని చేయాలన్నది. దాన్ని సాధించేలా సీఎం జగన్ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. కులం, మతం, పార్టీ అనేది చూడకుండా పథకాలు అందరికీ అందిస్తున్నారు. మేనిఫెస్టోలో చెప్పినవన్నీ పూర్తి చేయించారు. మహిళల్లో ఆత్మస్థయిర్యాన్ని పెంచారు. మహిళలు ఎవరివద్దా తల దించుకోవలసిన పనిలేకుండా నిలబెట్టారు.

నిజమైన మహిళా సాధికారత



పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళలు బాగుంటేనే కుటుంబాలు, రాష్ట్రం బాగుంటాయని భావించి ఆదిశగా సీఎం వైఎస్ జగన్ మహిళకు సముచిత స్థానం, గౌరవం కల్పించారు. మహిళలకోసం దిశ చట్టం, యాప్‌లను రూపొందించారు. 30 లక్షలకు పైగా ఇళ్లను మహిళల పేరిట ఇస్తున్నారు. ఇదే నిజమైన మహిళా సాధికారత. జగనన్న అంటే ఒక బ్రాండ్. శతాబ్దాల చరిత్రకల పార్టీలను భూస్థాపితం చేసిన ఫైర్. మహిళలకు ఎంతో సాయం చేస్తున్నందున ప్రతిపక్షాలకు దిక్కుతోచడం లేదు. వైఎస్ జగన్ సునామీలో వారంతా కొట్టుకుపోవడం ఖాయం

మళ్లీ సీఎంగా జగనన్నే ఉండాలి



రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం ఇప్పుడు బిల్లును ఆమోదించినా రాష్ట్రంలో రెండున్నరేళ్ల క్రితమే వైఎస్ జగన్ అమలు చేశారు. రాజకీయ పదవుల్లో, కాంట్రాక్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ప్రోత్సహించారు. రిజర్వేషన్ల అమలు మాత్రమే కాకుండా అక్కాచెల్లెమ్మలందరికీ నేరుగా పథకాలు ఇస్తున్నారు. రాష్ట్రంలోని మహిళలు మళ్లీ సీఎంగా జగనే ఉండాలని కోరుకుంటున్నారు. మహిళలను మోసం చేసిన గత ప్రభుత్వ పెద్దలకు ఆ మహిళే ఇపుడు న్యాయదేవతగా శిక్షలు కూడా వేస్తోంది.

చంద్రబాబు జీవితమే అక్రమ రాజకీయం

- మోసాలు, అన్యాయాలతోనే ఆయన రాజకీయాలు
- రాజకీయాలను డబ్బుమయం చేసింది చంద్రబాబే
- అధికారంలోకి వచ్చిన వెంటనే బాబు, ఆయన కుటుంబ సభ్యులు ప్రజా ధనాన్ని లూటీ చేశారు
- ఇక్కడ రాజకీయ కక్ష సాధింపునకు ఆస్కారమే లేదు
- అసెంబ్లీలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: చంద్రబాబు జీవితాంతం అన్యాయాలు, అక్రమాలు, మోసాలతోనే రాజకీయాలు చెలాయించారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సోమవారం ప్రశ్నోత్తరాల అనంతరం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో రాజకీయాలను డబ్బుమయం చేసిన వ్యక్తి చంద్రబాబేనని మండిపడ్డారు. ఇక్కడ దొరికినవి ఒకట్రెండు స్కామ్‌లేనని.., అధికారంలోకి రాగానే ప్రజా ధనాన్ని దోచుకోవడానికి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు అనేక తప్పిదాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజా ఖజానా నుంచి డబ్బును విపరీతంగా దోచుకున్నారని చెప్పారు. అందుకే ఇప్పుడు చంద్రబాబు కుటుంబ సభ్యులూ ఏం మాట్లాడట్లేదన్నారు. కొడుకు ఢిల్లీలో కూర్చుంటే.. మద్దతిస్తానని వచ్చిన వ్యక్తి ఎక్కడున్నారో తెలీదని, చంద్రబాబుకు మద్దతే కరవైందని ఎద్దేవా చేశారు. న్యాయస్థానం తగిన ఆధారాలతోనే చంద్రబాబు వేసిన ప్రతి పిటిషన్‌ను తిరస్కరిస్తోందని, కేసులో బలం, తీవ్రతకు ఇది అద్దం పడుతోందని చెప్పారు. దీనిద్వారా స్కిల్ స్కామ్‌పై ఆధారాలతో సహా దొరికిన దొంగ ఇక తప్పించుకోలేరన్న విషయం ప్రపంచానికి అర్థమైందన్నారు. ప్రభుత్వానికి రాజకీయంగా కక్ష సాధించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల విచారణలో సీఐడీకి చంద్రబాబు సహకరించలేదని, కోర్టుకు మాత్రం సహకరించానంటూ అసత్యాలు చెబుతున్నారని అన్నారు. అంతకుముందు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నోత్తరాలు ముగిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రశాంత వాతావరణంలో సంపూర్ణంగా ప్రశ్నోత్తరాలు పూర్తవడం సంతోషంగా ఉందన్నారు. ప్రశ్నలు అడిగిన సభ్యులు సభలో ఉన్నా, లేకున్నా.. ప్రజలకు సమాధానాలు అందించడంలో సభ తన కర్తవ్యాన్ని నిష్పాక్షికంగా నెరవేర్చిందన్నారు. దీనికి మంత్రి అంబటి స్పందిస్తూ.. ప్రశ్నోత్తరాలు ప్రశాంతంగా జరగడం శుభ పరిణామమన్నారు. అయితే ప్రధాన ప్రతిపక్షం సభలో లేకపోవడం బాధాకరమన్నారు. స్కిల్ స్కామ్‌పై చర్చించాల్సి వస్తుందనే భయంతోనే టీడీపీ సభ్యులు అసెంబ్లీలో రెండు రోజులు చిత్రవిచిత్ర విన్యాసాలు చేసి ఈలలు ఊదుకుంటూ పారిపోయారని అన్నారు.

త్వరలో ఇంటర్ విద్యార్థులకూ గోరుముద్ద

- ప్రస్తుతం 1–10వ తరగతి వరకు అమలు చేస్తున్నాం
- త్వరలో ఇంటర్‌కూ వర్తింపు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది
- ఈ పథకానికి రూ.2,729 కోట్లు మాత్రమే బాబు సర్కార్ ఖర్చు పెట్టింది
- మా ప్రభుత్వం నాలుగేళ్లలోనే రూ.6,268 కోట్లు వ్యయం చేసింది
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: 'జగనన్న గోరుముద్ద' దేశానికే ఆదర్శంగా నిలిచిందని.. ఈ పథకాన్ని పొరుగు రాష్ట్రాలు సైతం అనుసరిస్తుండటమే ఇందుకు నిదర్శనమని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కొనియాడారు. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు అమలు చేస్తోన్న ఈ పథకాన్ని త్వరలో ఇంటర్‌మీడియట్‌కు వర్తింప చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సందర్భంగా సోమ వారం పలువురు సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి బొత్స బదులిచ్చారు. సీఎం వైఎస్ జగన్ పగ్గాలు చేపట్టాక విద్యా వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక మార్పు లు తీసుకొచ్చామని గుర్తు చేశారు. మన విద్యా విధానంలోని మార్పులకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని చెప్పా రు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. అమ్మఒడి పథకంతో డ్రాప్ అవుట్స్ గణనీయంగా తగ్గాయని వెల్లడించారు. గోరుముద్దతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులంతా బడిబాటపట్టారన్నారు. నాడు– నేడుతో పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో విద్యా బోధన అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు.

డీఎస్సీపై త్వరలో నిర్ణయం..

మధ్యాహ్న భోజన పథకం కింద చంద్రబాబు హయాంలో కేవలం రూ.2,729 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి బొత్స గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఈ నాలుగేళ్లలోనే రూ.6,268 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మరో రూ.1,500 కోట్లకుపైగా ఖర్చు చేయబోతున్నామని వెల్లడించారు. మండలానికి కనీసం రెండు ఉన్నత పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీంతో 1–10 తరగతి వరకు చదివే విద్యార్థులకు అమలు చేస్తున్న గోరుముద్ద పథకాన్ని అదే కాంపౌండ్‌లో చదివే ఇంటర్ విద్యార్థులకు కూడా వర్తింప చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. త్వరలోనే శుభవార్త వస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,960 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. వాటిలో 505 మంది సమగ్ర శిక్ష ద్వారా పార్ట్ టైమ్ విధానంలో పనిచేస్తున్నారని తెలిపారు. మిగిలిన పోస్టులను త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే డీఎస్సీ నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆట స్థలాలు లేని కార్పొరేట్ పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొలుత ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. అదే బాటలో సీఎం జగన్ నడుస్తూ రూ.వేల కోట్లు విద్యకు ఖర్చు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు కింద పాఠశాలలన్నీ కొత్తరూపు సంతరించుకుంటున్నాయన్నారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో యోగాను నిర్బంధ సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టాలని సూచించారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ గతంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కింద ఉడికి ఉడకని అన్నం, నీళ్ల సాంబారు పెట్టేవారని.. దీంతో 10 శాతం కూడా భోజనం చేసేవారు కాదన్నారు. కానీ నేడు 16 రకాల మెనూతో మంచి రుచికరమైన భోజనం పెడుతుండడంతో నూటికి నూరు శాతం పిల్లలు పాఠశాలల్లోనే భోజనం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు అక్షరాస్యత పెరుగుతుండటే దానికి కారణం అమ్మఒడి, నాడు–నేడు, గోరుముద్ద వంటి పథకాలేనన్నారు.

మీడియా పాయింట్

ప్రతిపక్షానికి బాధ్యత లేదు

- ప్రజా సంబంధ అంశాలపై మాట్లాడకుండా సభ నుంచి పారిపోయారు
- చంద్రబాబు అరెస్టుతో అశాంతిని సృష్టించి లాభం పొందాలనుకుని టీడీపీ భంగపడింది
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



సాక్షి, అమరావతి: నిర్మాణాత్మకమైన సూచనలు చేయాల్సిన ప్రతిపక్షం సభకు రాకపోవడం దురదృష్టకరమని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ.. 'ప్రతిపక్షానికి బాధ్యత లేదు. ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించకుండా సభ నుంచి పారిపోయింది. తప్పుచేశారు కాబట్టే చంద్రబాబును న్యాయస్థానం జైలుకి పంపింది. చంద్రబాబు అరెస్టుతో అశాంతిని సృష్టించి లాభం పొందాలని చూసి టీడీపీ భంగపడింది. బీసీల మీద ప్రేమ ఉందని చెప్పే టీడీపీ.. బీసీలకు సంబంధించిన అంశం చర్చకు వచ్చినప్పుడు సభలో లేదు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలను మోసం చేశారు. బీసీలకు టీడీపీ క్షమాపణ చెప్పాలి. అచ్చెన్నాయుడికి అధ్యక్ష పదవి ఇచ్చారే కానీ పార్టీలో ప్రాధాన్యత, కనీస గౌరవం లేవు. అచ్చెన్న పనికిరాడనే పవన్‌ను తెచ్చుకున్నాడు. చంద్రబాబు నాయకత్వానికి చీకటి రోజులు వచ్చాయి. చంద్రబాబు చేసిన ద్రోహాన్ని బీసీలు ఇప్పటికైనా తెలుసుకోవాలి. అసైన్డ్ భూముల చట్టం ద్వారా ప్రభుత్వం పేదలకు భూమిపై హక్కు కల్పించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలు సమాజానికి వెన్నెముక అని భావించారు. బీసీల అభిమానం, ప్రేమ, ఆదరణ పొందిన పార్టీ వైఎస్సార్‌సీపీనే' అని చెప్పారు.

ప్రజాధనాన్ని లూటీ చేసిన బాబును అరెస్ట్ చేస్తే తప్పేంటి?

- ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



స్కిల్ స్కామ్‌లో రూ. 371 కోట్లు నొక్కేసి, సాక్ష్యాధారాలతో పట్టుబడిన చంద్రబాబు జైల్లో ఉన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన బాబును అరెస్ట్ చేస్తే తప్పేమిటి? ఒక్కొక్కరికి కోటిన్నర ఇచ్చి లాయర్లను రప్పించి వాదనలు వినిపించినా వారు ఎంతసేపటికీ సాంకేతిక అంశాలను ప్రస్తావిస్తారు తప్ప చంద్రబాబు అవినీతి చేయలేదని చెప్పలేకపోయారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? ఆయన అవినీతి చేయలేదని టీడీపీ కార్యకర్తలు సైతం నమ్మరు. ఎన్టీఆర్ కుటుంబం నమ్మదు. ప్రజలు కూడా నమ్మే పరిస్థితి లేదు. సీఎం వైఎస్ జగన్ పరిపాలన దేశంలోని మిగతా రాష్ట్రాలకంటే మెరుగ్గా ఉంది. పేదరికం 11 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ముందున్నాం.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చాలా బాగుంది

- ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం చాలా బాగుంది. క్రిటికల్ వైద్యం కూడా పేదలకు అందుతోంది. ఈ పథకం కింద గతంలో 1,400 జబ్బులుంటే, ఇప్పుడు వాటి సంఖ్య 3,325కు చేర్చారు. వైద్యులపై దాడులను నియంత్రించేందుకు వైఎస్సార్ గతంలో డాక్టర్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తెచ్చారు. ఈ చట్టాన్ని 16 రాష్ట్రాలు కాపీ చేశాయి. ఇటీవల కేరళ కూడా అమల్లోకి తెచ్చింది. వైద్యులపై దాడులకు పాల్పడిన వారికి శిక్షను ఏడేళ్లకు మార్చాలని కౌన్సిల్‌లో కోరాం. మా విజ్ఞప్తిని సీఎం వైఎస్ జగన్ తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నాం. డాక్టర్ నిర్లక్ష్యంతో రోగి చనిపోతే డాక్టర్‌పై నమోదు చేసే కేసును మూడేళ్ల బెయిలబుల్ కేసుగా చట్ట సవరణను తీసుకువచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

డీఎస్సీ అభ్యర్థులకు సీఎం జగన్ వరం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: పాతికేళ్లుగా ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థు లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మాట ఇస్తే నిలబెట్టుకుంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 98 డీఎస్సీలో అర్హత సాధించిన 4,070 మందికి సీఎం జగన్ ఉద్యోగాలు కల్పించడమే కాకుండా వారందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపజేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారన్నారు. 98 డీఎస్సీలో అర్హత సాధించి ఇంకా మిగిలి ఉన్న అందరికీ వీలైనంత త్వరగా ఉద్యోగాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆర్థికంగా చేనేత కార్మికులు బలోపేతం

- శాసన మండలిలో వివిధ ప్రశ్నలకు సంబంధిత మంత్రుల సమాధానం
- రెండు బిల్లులకు ఆమోదం



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, అదే విధంగా మహిళా సాధికారత కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి ముందుకెళ్తున్నట్లు సోమవారం శాసన మండలిలో పలువురు మంత్రులు తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు వారు సమాధానమిచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు భద్రత కల్పించే ఎస్ఎస్‌జీ–2023 బిల్లు, సంక్షేమ పథకాలకు ఆధార్ అనుసంధానాన్ని అనుమతిస్తూ ప్రవేశపెట్టిన బిల్లును మండలి ఆమోదించింది.

'చేనేత'కు ఆపన్నహస్తం



మగ్గం నేసే చేనేత కార్మికునికి వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏటా రూ.24,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం. 2019 నుంచి ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రూ.969.77 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమచేశాం. ఈ పథకం ద్వారా ఏటా రూ.80,686 చేనేత కార్మిక కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. అలాగే, వైఎస్సార్ పింఛను కానుక ద్వారా 93,412 నేత కార్మికులకు ప్రతీనెలా రూ.2,750 పింఛన్ రూపంలో అందిస్తున్నాం. ఈ విధంగా 2019 నుంచి ఇప్పటివరకు రూ.1,254.42 కోట్లు వారికి అందించాం. వీటితోపాటు సహకార బ్యాంకుల ద్వారా చేనేతలకు రూ.209.29 కోట్లను రుణాలుగా ఇప్పించడంతోపాటు ముద్ర పథకం ద్వారా మరో రూ.128.52 కోట్ల రుణాలు ఇచ్చాం. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద రూ.39 కోట్లతో 30 క్లస్టర్లను అభివృద్ధి చేయడంతో పాటు చేనేత కార్మికులను ప్రోత్సహించడానికి గడిచిన నాలుగేళ్లల్లో 23 ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేసి రూ.21.62 కోట్ల విక్రయాలు చేశాం. కేవలం మగ్గం నేసే కార్మికులే కాకుండా దీనిపై ఆధారపడిన అనుబంధ వృత్తుల వారికి కూడా ఆర్థిక సాయం అందించే అంశంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, ఐటీ, చేనేత శాఖ మంత్రి

నిర్మాణంలో 21.75 లక్షల గృహాలు..



2019 నుంచి 2023 వరకు పీఎంఏవై (పట్టణ), పీఎంఏవై (గ్రామీణ), పీఎంఏవై–పట్టణ ఏహెచ్‌పీ (ఏపీటిడ్కో)ల ద్వారా 21,75,820 గృహాలు కేటాయించగా ఆ మొత్తం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇస్తున్న నగదు సరిపోవడం లేదనుకుంటున్న వారికి బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయిస్తున్నాం. భీమవరంలోని లెప్రసీ కాలనీలోని 100 ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వీటిని పునరుద్ధరించాల్సిందిగా చైర్మన్ మోషేన్‌రాజు లేవనెత్తిన సమస్యను అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తా.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

మహిళలపై నేరాలు తగ్గుతున్నాయి..



దిశ చట్టం ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోయినా చట్టంలోని అంశాలను అమలుచేస్తున్నాం. దీంతో రాష్ట్రంలో మహిళలపై నేరాలు తగ్గుతున్నాయి. దిశ చట్టం బిల్లు ఆమోదానికి కేంద్రం లేవనెత్తుతున్న అభ్యంతరాలకు ఎప్పటికప్పుడు సమాధానమిస్తున్నాం. దిశా యాప్‌ను 1.43 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు 1,500 మందిని కాపాడగలిగాం.

– తానేటి వనిత, హోంశాఖ మంత్రి

చంద్రబాబు ఆలయాలు కూలిస్తే... జగన్ నిర్మిస్తున్నారు

- సనాతన హిందూ ధర్మాన్ని భావితరాలకు అందించేలా ప్రభుత్వం కృషి
- భక్తులకు సౌకర్యాలు, ఉద్యోగుల ప్రయోజనాల కోసం చర్యలు
- మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టీకరణ
- రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధిపై శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ



సాక్షి, అమరావతి: గోదావరి పుష్కరాల్లో సినిమా షూటింగ్ పెట్టి 31మంది మృతికి కారకుడైన చంద్రబాబు... కృష్ణా పుష్కరాల సమయంలో అత్యంత దారుణంగా విజయవాడలో 23 ఆలయాలను కూల్చివేశారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. చంద్రబాబు ఆలయాలను కూల్చితే... సీఎం జగన్ పునర్ నిర్మిస్తున్నారని, త్వరలోనే విజయవాడలో కొత్త ఆలయాలు ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. 'దేవాలయాల అభివృద్ధి–ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు'పై శాసన మండలిలో సోమవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. సభ్యులు ప్రస్తావించిన పలు అంశాలతోపాటు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి కొట్టు సత్యనారాయణ వివరించారు. హిందూ ధర్మం ఒక మతం కాదని, మన జీవనశైలి అని అన్నారు. సనాతన సంప్రదాయాలు, హిందూ ధర్మాన్ని భావితరాలకు అందించాలనే మహోన్నత ఆశయంతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దేవదాయశాఖ పరిధిలో ఉన్న 23,001 దేవాలయాలు, 1,742 ధార్మిక సంస్థలు, 133 మఠాల పవిత్రతను కాపాడేందుకు, ఆస్తులను పరిరక్షించేందుకు సీఎం జగన్ విప్లవాత్మక చర్యలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలోని 32 ప్రముఖ ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశామని, భక్తులకు సౌకర్యాల కోసం అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల కాలనీల్లో రూ.296.20కోట్లతో 2,962 నూతన ఆలయాలను రెండు దశల్లో నిర్మిస్తున్నట్లు వివరించారు. టీటీడీలో 6,700 మంది ఉద్యోగులు ఉండగా, ఇప్పటికే 3,518 మందికి రూ.313కోట్లతో ఇళ్ల పట్టాలను సీఎం జగన్ చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. తిరుమలలో సన్నిధి గొల్లలకు వంశపారంపర్య హక్కును పునరుద్ధరించామన్నారు. టీడీపీ హయాంలో దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని, చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడం కోసం ఏకంగా దుర్గగుడిలో తాంత్రిక పూజలు చేయించారని తెలిపారు. కనకదుర్గమ్మకు భక్తులు సమర్పించిన చీరలను సైతం మాయం చేశారని పేర్కొన్నారు.

దేవదాయ భూముల పరిరక్షణకు పెద్దపీట

''ఒక్కసారి దేవదాయ భూమిగా ప్రకటించిన తర్వాత వాటిని విక్రయించే అవకాశం ఉండదు, రాష్ట్రంలోని దేవదాయ భూముల రక్షణ కోసం 1987లో సెక్షన్–83ని సవరిస్తూ ఇప్పటికే ఆర్డినెన్స్ అమల్లోకి తీసుకొచ్చాం. దీనికి సంబంధించిన బిల్లును త్వరలోనే ప్రవేశపెడుతున్నాం. కొత్తగా గుర్తిస్తున్న దేవదాయ భూములను ఎప్పటికప్పుడు నిషేధిత జాబితాలో చేరుస్తున్నాం. తిరుమల నడకదారిలో వెళ్లే భక్తులకు పూర్తి రక్షణ కల్పించే విధంగా పలు చర్యలు తీసుకున్నాం''. అని మంత్రి తెలిపారు. ఈ చర్చలో ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, సత్యనారాయణరాజు, కల్పలత, పాకలపాటి రఘువర్మ, తోట త్రిమూర్తులు మాట్లాడారు.

ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి

● బిహారీ బహూ జెస్సికా





మన దేశంలో పుట్టిన చాలామందికి హిందీ మాట్లాడటం రాదు. కొంతమందికి అర్థమైనప్పటికీ మాట్లాడలేరు. అమెరికా నుంచి వచ్చిన జెస్సికా మాత్రం హిందీలో అనర్గళంగా మాట్లాడేస్తుంది. ఇలా పలకాలి అని హిందీ పాఠాలు కూడా చెబుతోంది. మనదేశానికి వచ్చే విదేశీయులకు హిందీతోపాటు సంస్కృతీ సంప్రదాయాలను పరిచయం చేస్తూ నెటిజనుల మన్ననలను అందుకుంటోంది ఈ 'బిహారీ బహూ'. పదిహేడేళ్లుగా ఇండియాతో చక్కని బంధాన్ని కొనసాగిస్తోన్న జెస్సికా గురించి ఆమె మాటల్లోనే...

''నేను చికాగోలో పుట్టాను. అమ్మానాన్న ఇరు కుటుంబాలకు చెందిన తాత, బామ్మలతో కలిసి ఉండే ఉమ్మడి కుటుంబం మాది. అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములతో కలిసి స్కూలుకు వెళ్లి చదువుకునేదాన్ని. ఆదివారం వచ్చిందంటే... కుటుంబమంతా కలిసి గడుపుతాం. నాన్న అంతర్జాతీయ వ్యాపారి కావడంతో తరచూ చైనా, కొరియాలు వెళ్తుండేవారు. ఆయన్ని చూసి నేను కూడా అలా తిరగాలని అనుకునేదాన్ని. కాలేజీ చదువుకోసం 18 ఏళ్ల వయసులో చికాగో నుంచి వేరే రాష్ట్రానికి వెళ్లాను. నాలుగేళ్లపాటు హాస్టల్‌లో ఉన్నాను. 'చైనా, ఇండియాలలో ఆర్థికమాంద్యం వస్తుంది' అని కాలేజీలో ఎక్కువ మంది విద్యార్థులు మాట్లాడుకునేవారు. అది విన్న నాకు ఇండియా వెళ్లి అక్కడి పరిస్థితులు చూడాలనిపించేది.



● పిల్లలతో జెస్సికా, అభిషేక్

ఏడాదిలో తిరిగి వచ్చేస్తాను అనుకున్నా..

కాలేజీ చదువు పూర్తయిన తరువాత తెలిసిన వాళ్ల ఐటీ కంపెనీ హరిద్వార్‌లో ఉంటే.. అక్కడ ఇంటర్న్‌షిప్ చేయడానికి ఇండియా వచ్చాను. ఇంటర్న్‌షిప్‌తోపాటు భారతీయులు, వారి భాషల గురించి తెలుసుకోవచ్చని అనుకున్నాను. అనుకున్నట్టుగానే ఇరుగు పొరుగు నుంచి కూరగాయలు విక్రయించేవాళ్ల వరకు అందరితో పరిచయం ఏర్పడింది. అందరూ చక్కగా కలిసి పోయేవారు. ఏడాదిలో ఇంటర్న్‌షిప్ పూర్తయిన తరువాత అదే కంపెనీలో ఉద్యోగంలో చేరాను. అలా ఏడాదిలో తిరిగి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయాను. కొంతమంది స్నేహితుల ద్వారా అభిషేక్ పరిచయం అయ్యాడు. నేను ఇక్కడ ఉంటే.. అభిషేక్ అమెరికాలో చదువుకుంటున్నాడు. ఇద్దరం మంచి స్నేహితులుగా మారాం. నేను మా ఇంటికి వెళ్లినప్పుడల్లా అభిషేక్‌ను కలిసేదాన్ని. అలా మా ఇద్దరి స్నేహం ప్రేమగా మారి పెళ్లి వరకు వచ్చి బిహార్ కోడలిని అయ్యాను.

అత్తమామల అనురాగం చూసి...

హరిద్వార్‌లో ఉండే రోజుల్లో ఇక్కడి అత్తమామలు కుటుంబ పెద్దలుగా కోడళ్లు, మనవళ్లను చూసే విధానం నాకు బాగా నచ్చింది. అభిషేక్‌ను పెళ్లిచేసుకోవడానికి అది కూడా ఒక కారణం. మేము పెళ్లి చేసుకుంటామని మా నాన్నని అడిగాం. 'చదువుకున్నాడు, సంపాదిస్తున్నాడు. నిన్ను బాగా చూసుకుంటాడు కాబట్టి పెళ్లిచేసుకో' అని నాన్న చెప్పారు. అభిషేక్ కుటుంబ సభ్యుల్లో సగం మంది అమెరికాలో నివసిస్తుండడంతో వారి గురించి బాగా అర్థం చేసుకోవడం కూడా నాన్న ఒప్పుకోవడానికి ఒక కారణం. అభిషేక్ తల్లిదండ్రులు విదేశీ అమ్మాయిని కోడలుగా ఒప్పుకోవడానికి మొదట్లో భయపడ్డారు. ఎలాంటి అమ్మాయో అని సందేహించినప్పటికీ మా కుటుంబం గురించి తెలుసుకుని పెళ్లికి సమ్మతించడంతో 2010లో మా వివాహం జరిగింది.

ఇండియా విత్ జెస్సికా

ఇక్కడ ఉండే భారతీయులకు, విదేశాల్లో ఉండే ఇండియన్స్‌కు హిందీ నేర్పిస్తున్నాను. అమెరికా, కెనడాలలో స్థిరపడిన ఎంతోమంది భారతీయుల పిల్లలకు హిందీలో మాట్లాడడం తెలీదు. ఇది వాళ్లకు పెద్ద సమస్య. అందుకే నేను హిందీ నేర్పిస్తున్నాను. నాలుగున్నరేళ్ల క్రితం 'ఇండియా విత్ జెస్సికా' పేరిట యూట్యూబ్ ఛానల్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచాను. వీటిద్వారా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిచయం చేస్తున్నాను. కొన్నిసార్లు వివిధ రకాల అంశాలపై మాట్లాడడానికి అతిథిగా కూడా వెళ్తున్నాను. అమెరికా అమ్మాయి ఇండియా గురించి మాట్లాడడం, అందులో హిందీలో అనర్గళంగా మాట్లాడుతుంది అని తెలిసిన వాళ్లంతా ఆశ్చర్యంగా నా క్లాసులు వినడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది డబ్బుల కోసం లిప్‌సింక్ వీడియోలు పోస్టు చేస్తుంటారు. నేను అవేమీ చేయడం లేదు. కేవలం తెలియని సమాచారం ఇవ్వడమే నా లక్ష్యం. అందుకే ఫాలోవర్స్ గురించి కూడా పట్టించుకోను. కొంతమంది మెసేజీలకు జవాబులు చెప్పడం లేదని తిడుతుంటారు. నన్ను సెలెబ్రిటీలా చూస్తున్నారు. కానీ నేను సెలబ్రిటీని కాదు. ఇద్దరు పిల్లలకు తల్లిని. వాళ్లకు నేర్పించాలి. వంట చేయాలి. ఇంటిని చూసుకోవాలి. నాకంటూ వ్యక్తిగత జీవితం ఉంది. నేను అందరిలానే సామాన్యమైన వ్యక్తిని" అని ఎంతో నిరాడంబరంగా చెబుతోంది జెస్సికా.

జీవితాంతం ఆధారపడాల్సిందే...

పెళ్లి అయిన తరువాత అమెరికాలో కొన్నిరోజులు, ఇండియాలో కొన్ని రోజులు ఉండేవాళ్లం. ఆరేళ్ల తరువాత బిహార్‌కి వచ్చి స్థిరపడ్డాం. మాకు ఇద్దరు పిల్లలు బాబు, పాప. ప్రపంచంలో కూతురికంటే కొడుకులనే మరింత ప్రేమగా చూసుకుంటారు. ఇండియాలో ఇది కాసింత ఎక్కువే. అమ్మాయిలకు ఇంట్లో పనులన్నీ చక్కబెట్టేలా అన్నీ నేర్పిస్తారు. అబ్బాయిలకు మాత్రం ఏమీ నేర్పించరు. కొంతమంది తల్లులు అయితే 'మా అబ్బాయికి కప్పు టీ పెట్టడం కూడా రాదు' అని గర్వంగా చెబుతుంటారు. ఇలా అయితే వాళ్ల స్వయంసమృద్ధిని సాధించలేరు. జీవితాంతం ఇతరుల మీద ఆధారపడి జీవించాల్సిందే. అందుకే నేను నా పిల్లలకు లింగభేదం లేకుండా అన్నీ నేర్పిస్తున్నాను.

నేర్చుకుని నేర్పిస్తున్నా...

హరిద్వార్‌లో ఉన్నప్పుడే హిందీ నేర్చుకున్నాను. కోర్సు కూడా చేశాను. బిహార్‌కి వచ్చిన తరువాత నా హిందీ బాగా మెరుగుపడింది. బిహారీలు మాట్లాడే హిందీ సరిగాలేదని, వారి మాటలు విని నవ్వుతుంటారు చాలామంది. కానీ ఇక్కడ మాట్లాడే హిందీలో సంస్కృతం, భోజ్‌పూరి, మైథిలి, ఆంగిక వంటి భాషలు కూడా కలుస్తాయి. అందుకే బిహారీలు మాట్లాడే హిందీ కొంచెం విభిన్నంగా ఉంటుంది. బిహారీలు మాట్లాడే హిందీపై చాలామందికి ఉండే చిన్నచూపు, వివక్ష పోవాలని నా వీడియోల్లో.. బిహారీ స్టైల్ హిందీనే మాట్లాడుతున్నాను.

న్యూస్ మేకర్



● అపర్ణ అయ్యర్

డైనమిక్ అయ్యర్

సవాలును తలకెత్తుకోవడం అంటే 'తలకు మించిన భారం' అనుకుంటారు కొందరు. సవాలును స్వీకరించడం అనేది తమను తాము నిరూపించుకునే అపూర్వ అవకాశం అనుకుంటారు మరికొందరు.

అపర్ణ అయ్యర్ రెండో కోవకు చెందిన వ్యక్తి.

'సీఏ పరీక్ష పాస్ కావడం అంటే మాటలు కాదు' లాంటి ప్రతికూల మాటలు అదేపనిగా వినిపించినా 'సీఏ' పై ఆసక్తిని ఎప్పుడూ కోల్పోలేదు. ఆ ఆసక్తే ఆమెను సీఏ బంగారు పతక విజేతను చేసింది. సవాలును చిరునవ్వుతో స్వీకరించే ఆమె ధైర్యం 'విప్రో' లాంటి పెద్ద సంస్థలో సీఎఫ్‌వో (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్)గా బాధ్యతలు స్వీకరించేలా చేసింది....

లీడర్ అంటే ఎవరు?

దారి తెలిసిన వారు, ఆ దారిలో ఆటంకాలు లేకుండా ప్రయాణించే వారు, అవసరమైతే కొత్త దారి చూపించేవారు. ఇలాంటి నాయకత్వ లక్షణాలు ఎన్నో అపర్ణ అయ్యర్‌లో దండిగా ఉన్నాయి కాబట్టే ఆమె మల్టీనేషనల్ ఐటీ కార్పొరేషన్ విప్రోలో ఎన్నో ఉన్నతస్థానాల్లో పనిచేసింది. విప్రోతో ఆమెది రెండు దశాబ్దాల అనుబంధం.

సీనియర్ ఇంటర్నల్ ఆడిటర్‌గా విప్రోలోకి అడుగు పెట్టిన అపర్ణ అక్కడి ఫైనాన్స్ టీమ్‌తో పని చేస్తూ ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ సీఎఫ్‌వో స్థాయికి చేరింది.

ఫైనాన్షియల్ రిస్క్ మేనేజ్‌మెంట్, క్యాపిటల్ అలోకేషన్, ఫండ్ రైజింగ్, బిజినెస్ స్ట్రాటజీ అండ్ గ్రోత్... మొదలైన సబ్జెక్‌లలో అపర్ణ నిపుణురాలు. సబ్జెక్ట్‌లో నైపుణ్యం ఉండగానే సరిపోదు. వివిధ సందర్భాలలో ఆ నైపుణ్యాన్ని సృజనాత్మకంగా అన్వయించి మంచి ఫలితాలు సాధించగలగాలి. ఈ విషయంలో ఎప్పుడూ వెనకబడిపోలేదు అపర్ణ అయ్యర్.

ఇంటర్నల్ ఆడిట్, బిజినెస్ ఫైనాన్స్, ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ ఎనాలటిక్స్, కార్పోరేట్ ట్రెజరీ....ఇలా కంపెనీకి సంబంధించి ఎన్నో విభాగాలలో కీలకపాత్ర పోషించింది.

ముంబై నర్సీ మోంజీ కాలేజి నుంచి కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన అపర్ణ 2002 సీఏ (చార్టెట్ ఎకౌంటెంట్) గోల్డ్ మెడలిస్ట్.

'అపర్ణ అయ్యర్‌లో అద్భుతమైన నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. తన ముందుచూపు, సాహసోపేతమైన నిర్ణయాలతో సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది' అంటున్నాడు విప్రో సీయివో డెలాపోర్ట్.

'కీలకమైన సమయంలో సీఎఫ్‌వోగా బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మరిన్ని విజయాలు సాధించే లక్ష్యంతో మా ప్రయాణం కొనసాగుతుంది' అంటుంది అపర్ణ అయ్యర్.

బ్యూటిప్స్

బౌల్ మసాజ్‌తో మెరిసిపోండి



కొబ్బరి నూనె, ఫేస్ ఆయిల్, మాయిశ్చరైజర్... వీటిలో ఏదైనా ఒకటి ముఖానికి రాయాలి. ఇప్పుడు చిన్న స్టీల్ గిన్నెను తీసుకుని ముఖమంతా మర్దన చేయాలి. నుదురు, కనుబొమ్మలు, బుగ్గలు, మెడ భాగంలో గిన్నెను గుండ్రంగా తిప్పుతూ ముఖానికి రాసిన నూనె లేదా మాయిశ్చరైజర్ చర్మంలోకి పూర్తిగా ఇంకిపోయేంత వరకు మర్దన చేయాలి.



ఇలా చేస్తే...


- ముఖం మీద ముడతలు తగ్గుతాయి.
- చర్మం మృదువుగా మారుతుంది.
- రక్తప్రసరణ మెరుగుపడి చర్మం కాంతిమంతంగా మెరుస్తుంది.
- కండరాల మీద ఒత్తిడి తగ్గి చర్మానికి విశ్రాంతి దొరుకుతుంది.

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 27 వరకు
హస్త కార్తె: 28 నుంచి

రొయ్యల రైతుకు చేదోడు చైన్ డ్రాగింగ్ బోట్!

- చైన్ డ్రాగింగ్ బోట్‌తో ఆక్వా రైతులకు సమయం, ఖర్చు ఆదా
- బోట్‌పై మనిషి కూర్చొని నడపొచ్చు.. అర గంటలో పదెకరాల్లో చైన్ డ్రాగింగ్ పూర్తి..
- ఏఎన్‌యూ అధ్యాపకుడు డా. తౌసీఫ్ అహ్మద్ ఆవిష్కరణ
- 'ఆంగ్రూ' ప్రోత్సాహంతో రైతులకు అందుబాటులోకి తేనున్న ఆవిష్కర్త



● 'చైన్ డ్రాగింగ్ బోట్' ఆవిష్కర్త డాక్టర్ తౌసీఫ్ అహ్మద్

సబ్సిడీ కోసం ప్రయత్నిస్తున్నాం

చైన్ డ్రాగింగ్ బోట్ వాడకం వల్ల రొయ్యల నాణ్యత, సర్వయివల్ రేటు పెరుగుతుంది. 'ఆంగ్రూ' సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఆక్వా రైతులకు ఈ బోట్లను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. తౌషా టెక్నాలజీ ఇన్నోవేషన్ అనే స్టార్టప్ ద్వారా రైతులకు వారం రోజుల్లో తయారు చేయించి ఇస్తున్నాం.

– డా. తౌసీఫ్ అహ్మద్ (98852 09780), ఆవిష్కర్త, నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు

'చైన్ డ్రాగింగ్ బోట్'.. రొయ్యల సాగులో రైతులకు ఉపయోగపడే ఒక ఆవిష్కరణ ఇది. ఆక్వా సాగులో శారీరక కష్టం, ఖర్చు, వ్యాధుల బెడద తగ్గించడంతో పాటు రొయ్యల నాణ్యత పెంపొందించేందుకు ఈ చైన్ డ్రాగింగ్ బోట్ ఉపయోగపడుతుంది.



● 'చైన్ డ్రాగింగ్ బోట్'ను రొయ్యల చెరువులో ఉపయోగిస్తున్న దృశ్యం

చైన్ డ్రాగింగ్ అంటే?

రొయ్యల పట్టుబడి పూర్తయిన తర్వాత చెరువును ఎండగడతారు. ఎండి నెర్రెలు బారిన ఆ చెరువులో మళ్లీ రొయ్యల సాగు ప్రారంభించడానికి చెరువులో నీరు నింపిన తర్వాత.. నేలను సిద్ధం చేసే క్రమంలో ఇనుప గొలుసులు చెరువు అడుగున వేసి, ఇద్దరు మనుషులు నడుములోతు నీటిలో నడుస్తూ లాగుతారు. దీన్నే చైన్ డ్రాగింగ్ అంటారు. తద్వారా చెరువు అడుగు మట్టిలో వ్యర్థాలు, విషవాయువులు బయటకు వెళ్లిపోవటంతో పాటు రొయ్యలకు సహజ ఆహారమైన ప్లవకాలు వృద్ధి చెందుతాయి. అయితే, మనుషులు నీటిలో నడుస్తూ చైన్ డ్రాగింగ్ చేయటం వ్యయ ప్రయాసలతో కూడిన పని.

ఈ పనిని సులువుగా, తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో చేయడానికి ఉపయోగపడే వినూత్నమైన పడవకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ రూపుకల్పన చేశారు. ఈ 'చైన్ డ్రాగింగ్ బోట్' ఆక్వా రైతులకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తోంది. గుంటూరు జిల్లా నిజాంపట్నం ప్రాంతంలోని ఆక్వా రైతుల కోరిక మేరకు నాలుగేళ్ల క్రితం డాక్టర్ తౌసీఫ్ పరిశోధనలు ప్రారంభించారు. ఈ క్రమంలో యూనివర్సిటీలోని త్రీడీ ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్‌లో 'చైన్ డ్రాగింగ్ బోట్'ను డిజైన్ చేశారు. ఈ ఆవిష్కరణకు భారతీయ పేటెంట్ సంస్థ 2020లో డిజైన్ పేటెంట్‌ను మంజూరు చేసింది.

'చైన్ డ్రాగింగ్ బోట్' లీటరు పెట్రోల్‌తో 2 గంటలు పనిచేస్తుంది. దీనితో అర గంట సమయంలోనే 10 ఎకరాల్లోని రొయ్యల చెరువుల్లో చైన్ డ్రాగింగ్ పనిని పూర్తి చేయవచ్చని డా. తౌసీఫ్ తెలిపారు. మనుషులు చేసిన దానికంటే అధిక సామర్థ్యంతో స్లడ్జ్ వంటి వ్యర్థాలను తొలగించటం, చెరువు అడుగు నేలను గుల్లబరచటంలో ప్రయోజనకారిగా నిలుస్తోందన్నారు.

'ఆంగ్రూ' ప్రోత్సాహం

'చైన్ డ్రాగింగ్ బోట్'కు సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలోని త్రీడీ ఎక్స్‌పీరియన్స్ ల్యాబ్‌లో ప్రత్యేక డిజైన్‌ను రూపొందించిన డా. తౌసీఫ్ అహ్మద్.. అందుకు అనుగుణంగా మూడు ప్రత్యేక స్టీల్ ఫ్రేమ్‌లతో కూడిన బోట్‌ను తయారు చేయించారు. దానికి జీఎక్స్ 160 హోండా ఇంజన్‌ను, వెనుక చైన్‌ను అమర్చారు. పెట్రోల్‌తో నడిచే ఈ బోట్‌పై ఒకరు కూర్చుని నడపవచ్చు. దీని తొలి బోట్‌ను రైతులకు ఇచ్చి వాడిన తర్వాత వారి సూచనల మేరకు తగు మార్పులు చేశారు. చైన్ డ్రాగింగ్ బోట్ ప్రాజెక్టుకు తిరుపతి లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) పోషన్ ఇంక్యుబేషన్ సెంటర్ రూ. 5 లక్షలను అందించింది. ఈ ఆవిష్కరణను న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి కిసాన్ మేళాలో కూడా ఇటీవల ప్రదర్శించారు.

రొయ్యలు పెరిగే కాలంలో కూడా..

'చైన్ డ్రాగింగ్ బోట్'కు ఆక్వా రైతుల నుంచి ఆదరణ లభిస్తోంది. డా. తౌసీఫ్ అహ్మద్ రెండు బోట్లను తయారు చేసి నిజాంపట్నం ప్రాంతంలోని ఆక్వా రైతులకు అందజేశారు. ఒకొక్క బోట్ తయారీ వ్యయం రూ. 80 నుంచి 90 వేలు ఉంటుందని, ఆర్డర్ ఇచ్చిన వారం రోజుల్లో తయారు చేసి ఇవ్వగలం. ఆక్వా రైతులకు అవగాహన కల్పించేందుకు ఒక బోట్‌ను విజయవాడలోని కృష్ణా నదీ తీరంలో ప్రదర్శనకు పెట్టారు.

బోట్‌ను మనిషి గట్టు మీద నుంచే రిమోట్ పద్ధతిలో విద్యుత్తు బ్యాటరీ లేదా సౌర విద్యుత్తు ద్వారా నడిపించేందుకు పరిశోధనలు కొనసాగిస్తున్నానని డా. తౌసీఫ్ తెలిపారు. రొయ్యల సాగు ప్రారంభ దశలోనే కాకుండా, రొయ్యల పెంపకం జరిగే కాలంలో కూడా చైన్ డ్రాగింగ్ బోట్‌ను నడిపేందుకు ఆయన పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పనిలో పనిగా డైనమిక్ ఎయిరేషన్ వ్యవస్థను కూడా ఈ బోట్‌కు అనుసంధానం చేస్తున్నామన్నారు. రొయ్య పిల్లలకు హాని కలగకుండా ఉండేలా అల్యూమినియం ప్రొపెల్లర్‌కు బదులు ఫైబర్ ప్రొపెల్లర్‌ను వినియోగించనున్నామని వివరించారు.


– దాళా రమేష్ బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు
ఇన్‌పుట్స్: డా.ఎస్.అశోక్ కుమార్, సాక్షి, ఏఎన్‌యూ

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

● పెరటి కోళ్ల పెంపకం

అరెకరంలో అధికాదాయం

● అరెకరంలో నాటు కోళ్ల పెంపకం, పంటల ద్వారా ఏటా రూ. లక్ష ఆర్జిస్తున్న గిరిజన మహిళా రైతులు



పెరట్లో నాటు కోళ్ల పెంపకం ద్వారా చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు, ముఖ్యంగా మహిళా రైతులకు, ఏడాది పొడవునా స్థిరంగా ఆదాయంతో పాటు కుటుంబ స్థాయిలో పౌష్టికాహార లభ్యతను సైతం పెంపొందించవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి వాసన్ తదితర స్వచ్ఛంద సంస్థలు గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు ద్వారా నిర్ధారణైంది. పెరటి కోళ్ల పెంపకం కొత్తేమీ కాదు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 70% కుటుంబాలు అన్నో ఇన్నో పెరటి కోళ్లు పెంచుకుంటూనే ఉంటాయి. అయితే, కోళ్లు పరిసర ప్రాంతాల్లో తిరిగి రావటంతో పాటు రాత్రుళ్లు చెట్ల మీదో, పందిళ్ల మీదో నిద్రించటం వల్ల కుక్కలు, పిల్లుల బారిన పడి మరణిస్తూ ఉంటాయి. ఈ సమస్యలను అధిగమించడానికి వాసన్ సంస్థ దేశవాళీ పెరటి కోళ్లను అరెకరం విస్తీర్ణంలో చుట్టూ ప్రత్యేకంగా కంచె వేసి అందులో స్థానికంగా లభించే జాతుల నాటు కోళ్ల పెంచటంపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల తోడ్పాటుతో అమలు చేస్తోంది. కోళ్లు రాత్రి పూట భద్రంగా విశ్రమించడానికి షెడ్డు నిర్మించటం.. చిరుధాన్యాలు, అజొల్లా, చెద పురుగులను మేపటం.. వ్యాక్సిన్లు వేయటం ద్వారా నాటు కోడి పిల్లల మరణాలను తగ్గించి, ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం కల్పించటం.. ప్రతి 25 కుటుంబాలకు ఒకటి చొప్పున స్థానిక మహిళా రైతు ద్వారానే బ్రీడింగ్ ఫామ్‌ను ఏర్పాటు చేయించటం.. వంటి చర్యల ద్వారా చక్కటి ఫలితాలు వస్తున్నాయని వాసన్ చెబుతోంది. అరెకరం పెరటి కోళ్ల నుంచి రూ. 70–80 వేలు, ఆ అరెకరంలో పండ్లు, కూరగాయలు, దుంప పంటల ద్వారా మరో రూ. 20 వేల వరకు రైతు కుటుంబానికి ఆదాయం వస్తున్నట్లు తమ అధ్యయనంలో తేలినట్లు వాసన్ తెలిపింది. ఏపీ గిరిజన ప్రాంతాల్లో మహిళా రైతుల అనుభవాలు దేశవ్యాప్తంగా అమలు చేయదగినవిగా ఉన్నాయని వాసన్ చెబుతోంది. ఈ అనుభవాలపై చర్చించేందుకు ఈ నెల 27వ తేదీన విశాఖలో వాసన్, ఏపీ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి చర్చాగోష్ఠి జరగనుంది. ఈ సందర్భంగా అరెకరంలో నాటు కోళ్లను పెంచుతూ ఏడాదికి దాదాపు రూ. లక్ష ఆదాయం గడిస్తున్న చిన్నమ్మి, చంద్రయ్య గిరిజన దంపతుల అనుభవాలను ఇక్కడ పరిశీలిద్దాం.



● పెరటి కోళ్లతో చిన్నమ్మి, చంద్రయ్య దంపతులు

చిన్నమ్మి నాటు కోళ్ల బ్రీడింగ్ ఫామ్

కుండంగి చిన్నమ్మి(58), చంద్రయ్య గిరిజన దంపతులది మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట మండలం చినరామ గ్రామం. వీరికి ముగ్గురు పిల్లలు. కుమారుడు రవికుమార్ డిగ్రీ వరకు చదువుకొని తల్లిదండ్రులతో కలసి గ్రామంలోనే వ్యవసాయం చేస్తున్నాడు. వారికి 70 సెంట్ల మాగాణి, ఎకరంన్నర మెట్ట పొలంతో పాటు 2 ఎకరాల కొండ పోడు భూములు ఉన్నాయి.

రెండేళ్ల క్రితం వాసన్ సంస్థ తోడ్పాటుతో అరెకరం పెరట్లో నాటు కోళ్ల పెంపకం చేపట్టారు. భర్త, కుమారుడు ఇతర పొలాల్లో పనులు చూసుకుంటూ ఉంటే చిన్నమ్మి పెరటి కోళ్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉంటుంది. మరో 25 కుటుంబాలకు కూడా కోడి పిల్లలను అందించే బ్రీడింగ్ ఫామ్‌ను చిన్నమ్మి నిర్వహిస్తుండటం విశేషం.

అరెకరం స్థలంలో చుట్టూ 4 అడుగుల ఎత్తు గ్రీన్ మెష్‌తో పాటు కొండ చీపురు గడ్డి, వెదరు బొంగులతో గట్టి కంచెను ఏర్పాటు చేసుకున్నారు. 50 కోళ్లతో ప్రారంభించారు. ఇప్పుడు 80 కోళ్లు ఉన్నాయి. కొన్ని పందెం కోళ్లు కూడా పెంచుతున్నారు. 18×24 అడుగుల స్థలంలో 200 కోళ్లు రాత్రిళ్లు నిద్రించడానికి సరిపోయే రేకుల షెడ్‌ను 3 సెంట్లలో నిర్మించారు. వాసన్ అందించిన రేకులు తదితర సామగ్రిని ఉపయోగించారు. కోళ్లు ఆరుబయట తిరిగి మేస్తూ ఉంటాయి. అదనంగా తమ పొలాల్లో పండించిన చోళ్లు తదితర చిరుధాన్యాలు కోళ్లకు వేస్తున్నారు. చిన్న కుంటలో పెంచిన అజొల్లాను కోళ్లకు, మట్టి కుండల్లో పెంచిన చెద పురుగులను కోడి పిల్లలకు మేతగా వేస్తుండటంతో అవి బలంగా పెరుగుతున్నాయి. వారం కోడి పిల్లలకు విధిగా లసోట వాక్సిన్‌తో పాటు రెండు నెలలకోసారి ఇతర వాక్సిన్లు వేస్తున్నారు. ఈ అరెకరంలో కోళ్ల పెంపకంతో పాటు అదనపు ఆదాయం కోసం 43 రకాల పండ్లు, కూరగాయలు, దుంప పంటలను 5 దొంతర్లలో పండిస్తుండటం విశేషం. పసుపు, అల్లం, సీతాఫలాలు, బొప్పాయి, చింతపండుతో పాటు ఆగాకర తదితర తీగ జాతి కూరగాయలను సైతం పండిస్తున్నారు. కోడి మాంసం, గుడ్లు, కూరగాయలు, పండ్లను తాము తినటంతో పాటు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఏడాదికి రూ. 70–80 వేల వరకు నాటుకోళ్లు, గుడ్ల ద్వారా, మరో రూ. 20 వేలు పంటల ద్వారా ఈ అరెకరం నుంచి ఆదాయం పొందుతున్నామని రవి(94915 42102) తెలిపారు. చిన్నమ్మి శ్రద్ధగా పని చేస్తూ ఆదర్శ నాటుకోళ్ల బ్రీడింగ్ ఫామ్ రైతుగా గుర్తింపు పొందటం విశేషం.



బోపన్న జోడీకి షాక్

ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. కచ్చితంగా స్వర్ణ పతకం సాధిస్తారనుకున్న రోహన్ బోపన్న-యూకీ బాంబ్రీ జోడీ రెండో రౌండ్‌లోనే ఓడిపోయింది. సెర్గీ ఫోమిన్-సుల్తనోవ్ (ఉజ్బెకిస్తాన్) జంటతో జరిగిన రెండో రౌండ్‌లో బోపన్న-యూకీ ద్వయం 6-2, 3-6, 6-10తో ఓటమి చవిచూసింది.

వుషులో పతకం ఖాయం



మహిళల వుషు క్రీడాంశంలో భారత క్రీడాకారిణి నోరెమ్ రోషిబినా దేవి సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. 60 కేజీల సాండా ఈవెంట్ క్వార్టర్ ఫైనల్లో రోషిబినా 2-1తో ఐమన్ కర్షాగ్యా (కజకిస్తాన్)పై గెలిచింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో దీపక్



పురుషుల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత బాక్సర్లు దీపక్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. తొలి రౌండ్‌లో దీపక్ 5-0తో అబ్దుల్ ఆరిఫిన్ (మలేసియా)పై, నిశాంత్ 5-0తో దీపేశ్ లామా (నేపాల్)పై గెలుపొందారు.



స్వర్ణ పతకాలతో భారత మహిళా క్రికెటర్లు

బోణీలోనే బంగారం

- భారత మహిళల క్రికెట్ జట్టుకు స్వర్ణ పతకం
- ఫైనల్లో శ్రీలంకపై విజయం

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో గతంలో రెండుసార్లు (2010, 2014) మాత్రమే క్రికెట్ క్రీడాంశంగా ఉంది. అయితే ఆ రెండుసార్లూ భారత క్రికెట్ జట్లు బరిలోకి దిగలేదు. దాంతో మహిళల విభాగంలో పాకిస్తాన్ రెండుసార్లు స్వర్ణం సాధించగా... పురుషుల విభాగంలో బంగ్లాదేశ్ (2010), శ్రీలంక (2014) ఒక్కోసారి బంగారు పతకం గెల్చుకున్నాయి. మూడోసారి మాత్రం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మనసు మార్చుకొని ఆసియా క్రీడల్లో భారత జట్లను పంపించాలని నిర్ణయం తీసుకుంది. బీసీసీఐ నిర్ణయం సరైందేనని నిరూపిస్తూ భారత మహిళల జట్టు బరిలోకి దిగిన తొలిసారే బంగారు పతకాన్ని తమ ఖాతాలో జమ చేసుకుంది. టి20 ఫార్మాట్‌లో జరిగిన ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళల జట్టు చాంపియన్‌గా అవతరించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. శ్రీలంకతో సోమవారం జరిగిన ఫైనల్లో భారత్ 19 పరుగుల తేడాతో గెలిచింది. రెండు మ్యాచ్‌ల నిషేధం ముగియడంతో ఫైనల్లో రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సారథ్యంలో భారత్ పోటీపడింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. స్వర్ణ పతకం నెగ్గిన భారత జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బారెడ్డి అనూష సభ్యురాలిగా ఉంది. అయితే ఆమెకు మ్యాచ్‌లు ఆడే అవకాశం రాలేదు.

టిటాస్ సాధు కట్టడి...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 116 పరుగులు సాధించింది. స్మృతి మంధాన (45 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (40 బంతుల్లో 42; 5 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. అనంతరం 117 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 97 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. భారత టీనేజ్ పేస్ బౌలర్ టిటాస్ సాధు 4 ఓవర్లలో 6 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి శ్రీలంకను దెబ్బ తీసింది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టుకు కాంస్య పతకం లభించింది. కాంస్య పతక మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది.

ఆసియా క్రీడల్లో సోమవారం భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జాతీయ గీతం రెండుసార్లు మోగింది. షూటింగ్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో... మహిళల క్రికెట్‌లో టీమిండియా స్వర్ణ పతకాలతో సత్తా చాటుకుంది. భారత్‌కు షూటింగ్‌లోనే రెండు కాంస్యాలు, రోయింగ్‌లో మరో రెండు కాంస్యాలు లభించాయి. ఓవరాల్‌గా రెండోరోజు భారత్ ఖాతాలో ఆరు పతకాలు చేరాయి. ఈ మూడు క్రీడాంశాల్లో మినహా ఇతర ఈవెంట్స్‌లో భారత క్రీడాకారులు నిరాశపరిచారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) ప్రబోధని (బి) రణవీర 46; షఫాలీ వర్మ (స్టంప్డ్) సంజీవని (బి) సుగంధిక 9; జెమీమా (సి) విష్మీ (బి) ప్రబోధని 42; రిచా ఘోష్ (సి) సంజీవని (బి) రణవీర 9; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని (బి) ప్రబోధని 2; పూజ వస్త్రకర్ (సి) విష్మీ (బి) సుగంధిక 2; దీప్తి శర్మ (నాటౌట్) 1; అమన్‌జోత్ కౌర్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 116. వికెట్ల పతనం:** 1-16, 2-89, 3-102, 4-105, 5-108, 6-114, 7-116. **బౌలింగ్:** ఒషాది 2-0-11-0, ఉదేశిక ప్రబోధని 3-0-16-2, ఇనోషి 3-1-11-0, సుగంధిక 4-0-30-2, చమరి ఆటపట్టు 2.5-0-19-0, కవిశ 1.1-0-7-0, ఇనోక రణవీర 4-0-21-2.

శ్రీలంక ఇన్నింగ్స్: చమరి ఆటపట్టు (సి) దీప్తి (బి) టిటాస్ సాధు 12; అనుష్క సంజీవని (సి) హర్మన్ (బి) టిటాస్ సాధు 1; విష్మీ (బి) టిటాస్ సాధు 0; హాసిని పెరీరా (సి) పూజ (బి) రాజేశ్వరి 25; నీలాక్షి (బి) పూజ 23; ఒషాది (సి) టిటాస్ సాధు (బి) దీప్తి 19; కవిశ (సి) రిచా (బి) దేవిక 5; సుగంధిక (స్టంప్డ్) రిచా (బి) రాజేశ్వరి 5; ఇనోషి (నాటౌట్) 1; ఉదేశిక ప్రబోధని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 97. వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-14, 4-50, 5-78, 6-86, 7-92, 8-96. **బౌలింగ్:** దీప్తి శర్మ 4-0-25-1, పూజ 4-1-20-1, టిటాస్ సాధు 4-1-6-3, రాజేశ్వరి 3-0-20-2, అమన్‌జోత్ కౌర్ 1-0-6-0, దేవిక వైద్య 4-0-15-1.

'పసిడి' బుల్లెట్...

- పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణం
- కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన రుద్రాంక్ష్, ఐశ్వరీ, దివ్యాంశ్ త్రయం
- వ్యక్తిగత విభాగంలో ఐశ్వరీకి కాంస్యం
- పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్యం



దివ్యాంశ్ ఐశ్వరీ ప్రతాప్ రుద్రాంక్ష్ పాటిల్



కాంస్య పతకాలతో ఆదర్శ్, విజయ్‌వీర్, అనీశ్

హాంగ్జౌ: తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా భారత యువ షూటర్లు ఆసియా క్రీడల్లో తమ గురికి పదును పెట్టారు. పోటీల రెండో రోజు భారత షూటర్లు ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు అందించారు. ఈ క్రమంలో కొత్త ప్రపంచ రికార్డు కూడా సృష్టించారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, దివ్యాంశ్ సింగ్ పన్వర్‌లతో కూడిన భారత జట్టు 1893.7 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ ఏడాది ఆగస్టు 23న చైనా జట్టు 1893.3 పాయింట్లతో సాధించిన ప్రపంచ రికార్డును భారత త్రయం తిరగరాసింది. క్వాలిఫయింగ్‌లో ఆయా దేశాల షూటర్లు చేసిన స్కోరును లెక్కించి టాప్-3లో నిలిచిన జట్లకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను అందజేస్తారు. క్వాలిఫయింగ్‌లో భారత్ నుంచి రుద్రాంక్ష్ 632.5 పాయింట్లు, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ 631.6 పాయింట్లు, దివ్యాంశ్ 629.6 పాయింట్లు సాధించారు. టాప్-8లో నిలిచిన ఈ ముగ్గురూ ఫైనల్‌కు అర్హత సాధించారు. అయితే నిబంధనల ప్రకారం ఒక దేశం నుంచి గరిష్టంగా ఇద్దరు షూటర్లకు మాత్రమే ఫైనల్లో ఆడేందుకు అనుమతి ఉంది. దాంతో దివ్యాంశ్ కంటే ఎక్కువ పాయింట్లు స్కోరు చేసిన రుద్రాంక్ష్, ఐశ్వరీ ప్రతాప్ భారత్ తరఫున ఫైనల్లో పోటీపడ్డారు. ఎనిమిది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో రుద్రాంక్ష్ 208.7 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో నిలువగా... ఐశ్వరీ ప్రతాప్ సింగ్ 228.8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. లిహావో షింగ్ (చైనా; 253.3 పాయింట్లు) కొత్త ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా... హాజున్ పార్క్ (దక్షిణ కొరియా; 251.3 పాయింట్లు) రజత పతకాన్ని గెల్చుకున్నాడు. మరోవైపు పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ (582 పాయింట్లు), ఆదర్శ్ సింగ్ (576 పాయింట్లు), అనీశ్ (560 పాయింట్లు)లతో కూడిన భారత జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. భారత త్రయం మొత్తం 1718 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. ఇండోనేసియా కూడా 1718 పాయింట్లు సాధించినా... 10 పాయింట్ల షాట్‌లు భారత్‌కంటే (45) ఇండోనేసియా (37) తక్కువగా కొట్టడంతో టీమిండియాకు కాంస్యం ఖరారైంది. క్వాలిఫయింగ్‌లో విజయ్‌వీర్ సిద్ధూ ఆరో ర్యాంక్‌లో నిలిచి వ్యక్తిగత విభాగం ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో విజయ్‌వీర్ 21 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో కాంస్య పతకానికి దూరమయ్యాడు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	39	21	9	69
దక్షిణ కొరియా	10	10	13	33
జపాన్	5	14	12	31
ఉజ్బెకిస్తాన్	4	4	6	14
హాంకాంగ్	3	4	7	14
భారత్	2	3	6	11
చైనీస్ తైపీ	2	1	3	6
ఇండోనేసియా	1	1	4	6
థాయ్‌లాండ్	1	0	2	3
మకావు	1	0	1	2

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

ఏషియాడ్‌లో నేటి భారతీయం

మెడల్ ఈవెంట్స్

ఈక్వెస్ట్రియన్: హృదయ్, అనూష్, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలా (వ్యక్తిగత డ్రెస్సేజ్, టీమ్ ఈవెంట్... ఉ. గం. 5:30 నుంచి). **షూటింగ్:** దివ్యాంశ్-రమితా జిందాల్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్; ఉదయం గం. 8:15 నుంచి). **సెయిలింగ్:** అద్వైత్ మీనన్ (లేజర్ 4.7), నేహా ఠాకూర్ (లేజర్ రేడియల్ 4.7), ప్రీతి కొంగర, సుధాన్షు శేఖర్ (మిక్స్‌డ్ 470... ఉదయం గం. 8:30 నుంచి). కేసీ గణపతి, వరుణ్ ఠక్కర్ (49 ఈఆర్... ఉదయం గం. 11:30 నుంచి).

రెండు కాంస్యాలతో ముగింపు



భారత రోయింగ్ జట్టు హెడ్ కోచ్ ఇస్మాయిల్ బేగ్‌తో క్వాడ్రాపుల్ డబుల్ స్కల్ కాంస్య పతక విజేతలు సుఖ్‌మీత్ సింగ్, పర్మిందర్ సింగ్, జకర్ ఖాన్, సత్నామ్ సింగ్

రోయింగ్‌లో మెరుగైన భారత్ ప్రదర్శన

హాంగ్జౌ: గత ఆసియా క్రీడల్లో మూడు పతకాలు సాధించిన భారత రోయర్లు ఈసారి ఐదు పతకాలు గెలిచి తమ ప్రదర్శనను మెరుగుపర్చుకున్నారు. సోమవారం నాలుగు ఫైనల్స్‌లో భారత క్రీడాకారులు పోటీపడగా... రెండు ఈవెంట్స్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం భారత రోయర్లకు రెండు రజతాలు, ఒక కాంస్యం లభించాయి. సోమవారం పురుషుల ఫోర్ ఈవెంట్‌లో జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్, ఆశిష్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం నెగ్గింది. భారత బృందం 2000 మీటర్ల దూరాన్ని 6ని:08.61 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. పురుషుల క్వాడ్రాపుల్ డబుల్ స్కల్స్ ఈవెంట్‌లో సత్నామ్ సింగ్, పర్మిందర్ సింగ్, జకర్ ఖాన్, సుఖ్‌మీత్ సింగ్‌లతో కూడిన భారత జట్టు కాంస్యం గెల్చుకుంది. భారత బృందం 2000 మీటర్ల దూరాన్ని 6ని:10.81 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచింది.

నాడు తండ్రి... నేడు తనయుడు...

2002 బుసాన్ ఆసియా క్రీడల్లో ఇందర్‌పాల్ సింగ్ సభ్యుడిగా ఉన్న భారత జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. 21 ఏళ్ల తర్వాత ఇందర్‌పాల్ సింగ్ తనయుడు పర్మిందర్ సింగ్ తండ్రి ఘనతను అందుకున్నాడు. పర్మిందర్ సభ్యుడిగా ఉన్న భారత జట్టు ఈసారి క్వాడ్రాపుల్ డబుల్ స్కల్స్‌లో కాంస్యం గెలిచింది.

'వీసా' వచ్చేసింది...

రేపు హైదరాబాద్‌కు పాకిస్తాన్ జట్టు

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో పాల్గొనే పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు ఎట్టకేలకు వీసా సమస్య తీరింది. సోమవారం సాయంత్రం జట్టు సభ్యులు, సహాయక సిబ్బందికి భారత వీసాలు మంజూరైనట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ధారించింది. పాక్ బృందానికి వీసాలు ఇచ్చేందుకు భారత ప్రభుత్వం ఆమోదముద్ర వేసినట్లు వెల్లడించింది. 48 గంటల్లో భారతదేశానికి బయల్దేరాల్సి ఉన్నా... ఇంకా తమకు వీసాలు రాకపోవడంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ అసంతృప్తిని వెల్లడించింది. సోమవారం ఉదయం ఈ విషయంపై పాక్ బోర్డు ఐసీసీకి లేఖ రాసింది. చివరకు సాయంత్రానికి పరిస్థితి చక్కబడింది. వరల్డ్ కప్‌కు ముందు దుబాయ్‌లో రెండు రోజుల పాటు తమ జట్టుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయాలని భావించిన పాక్ వీసా సమస్య కారణంగా దానిని రద్దు చేసుకుంది. ఇప్పుడు తాజా షెడ్యూల్ ప్రకారం బుధవారం తెల్లవారుజామున లాహోర్ నుంచి బయల్దేరే పాక్ టీమ్ దుబాయ్ మీదుగా సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటుంది. శుక్రవారం ఆ జట్టు ఉప్పల్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో తొలి వామప్ మ్యాచ్ ఆడుతుంది.



రారండోయ్ వేడుక చూద్దాం...

వన్డే ప్రపంచకప్ మరో 9 రోజుల్లో



టి20ల జోరులో వన్డేలకు కాలం చెల్లిందంటూ అంతటా వినిపిస్తున్న సమయంలో ఇప్పుడు ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఊపు తెచ్చే మెగా ఈవెంట్‌కు రంగం సిద్ధమైంది. మన దేశంలో ఫార్మాట్‌తో సంబంధం లేకుండా క్రికెట్‌ను విపరీతంగా అభిమానించడం దాదాపు అన్ని చోట్లా కనిపించేదే. అలాంటి చోట వరల్డ్ కప్ అంటే సహజంగానే ఆసక్తి రెట్టింపు అవుతుంది. పుష్కర కాలం తర్వాత వన్డే ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యం ఇస్తుండటంతో ఈ టోర్నీ మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ 12 ఏళ్లలో వన్డే క్రికెట్ ఎంతో మారింది... నిబంధనలు మాత్రమే కాదు, టి20ల కారణంగా ఆటలో వేగం పెరిగింది. నాలుగేళ్ల క్రితం ఇంగ్లండ్ గడ్డపై జరిగిన వరల్డ్‌కప్ తుది పోరును ఎవరూ మరచిపోలేరు... ఇప్పుడూ అదే తరహా జోష్‌ను ఈ టోర్నీ కూడా అందిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. గతంలో మూడుసార్లు ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిచ్చినా... ఇతర దేశాలతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన భారత్ ఈసారి మాత్రం మరో దేశంతో జత కట్టకుండా పూర్తి స్థాయిలో విడిగా నిర్వహిస్తుండటం విశేషం. 2011 తర్వాత భారత్ రెండు టి20 వరల్డ్‌కప్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. 2016లో మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే జరగ్గా... 2021లో పేరుకు మనదే ఆతిథ్యం అయినా కరోనా కారణంగా మ్యాచ్‌లకు యూఏఈ వేదికైంది. ఇప్పుడు మరోసారి పూర్తి స్థాయి క్రికెట్ పండగ భారత్‌లో కనిపించనుంది. అభిమానుల కోణంలో చూస్తే నెలన్నర పాటు పండగ వాతావరణం ఖాయం. అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లో గత టోర్నీ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరిగే మ్యాచ్‌తో వరల్డ్‌కప్ సంబరానికి తెర లేవనుంది. నవంబర్ 19న అదే అహ్మదాబాద్ ఆఖరి పోరాటానికి వేదిక కానుంది. 10 దేశాలు, 10 వేదికలు, 46 రోజులు, 48 మ్యాచ్‌లు... మన దేశంలోని శీతల వాతావరణ సమయంలోనూ క్రికెట్ సమరాలు వేడెక్కించడం ఖాయం.

–సాక్షి క్రీడా విభాగం

సినిమా

ఒక సామాన్యుడి ఘర్షణ



సందీప్, దామోదర ప్రసాద్

సందీప్ కిషన్ హీరోగా సోమవారం కొత్త చిత్రం ఆరంభమైంది. సందీప్ కిషన్‌తో త్వరలో రిలీజ్‌కు రెడీ కానున్న 'ఊరు పేరు భైరవకోన' చిత్రం రూపొందించిన ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని కూడా నిర్మించనుంది. 'మాయవన్' చిత్రం తర్వాత సందీప్ కిషన్, దర్శకుడు సీవీ కుమార్ కాంబినేషన్‌లో 'మాయవన్'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందనుంది. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వెంకట్ బోయనపల్లి కెమెరా స్విచాన్ చేయగా, దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. పి. కిరణ్ దర్శకత్వం వహించారు. ''ఒక సూపర్ విలన్‌తో ఓ సామాన్యుడి ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. రెగ్యులర్ షూటింగ్‌ని నవంబర్‌లో ఆరంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, కెమెరా: కార్తీక్ కె. తిల్లై, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికిపాటి (జీకే).

యువతకు మురళీధరన్ స్ఫూర్తి

- వీవీఎస్ లక్ష్మణ్



కృష్ణప్రసాద్, లక్ష్మణ్, మురళీధరన్, మధుర్ మిట్టల్

''మురళీధరన్ గొప్ప క్రికెటర్ అని అందరికీ తెలుసు. కానీ, అంతకంటే గొప్ప మనసున్న వ్యక్తి, నిగర్వి. ఈ తరం యువతకు రోల్ మోడల్, స్ఫూర్తి. అతనిలాంటి స్నేహితుడు ఉండటం అదృష్టం. తనకు క్రికెట్టే జీవితం'' అని క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నారు. క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ముత్తయ్యగా మధుర్ మిట్టల్, ఆయన భార్య మది మలర్‌గా మహిమా నంబి యార్ నటించారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో మూవీ ట్రైన్ మోషన్ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో అక్టోబర్ 6న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన '800' ప్రీ రిలీజ్ వేడుకకి వీవీఎస్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో ముత్తయ్య మురళీధరన్ మాట్లాడుతూ– ''క్రికెట్ అంటే రికార్డులు కాదు... స్నేహితుల్ని చేసుకోవడం. లక్ష్మణ్ నాకు క్లోజ్ ఫ్రెండ్. ఇండియన్ సెలబ్రిటీలతో క్రికెట్ టీమ్ ఏర్పాటు చేయాల్సి వస్తే హీరో వెంకటేశ్‌ని కెప్టెన్ చేయాలి.. ఆయనకు క్రికెట్ అంటే చాలా ఇష్టం'' అన్నారు. ''కన్నీళ్లు పెట్టుకునే సన్నివేశాలు ఎన్నో ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''ఈ సినిమాలో మురళీధరన్ క్రికెట్ గురించి మాత్రమే కాదు. ప్రజలకు తెలియని ఆయన జీవితం ఎంతో ఉంది'' అన్నారు మధుర్ మిట్టల్.

బలమైన పాత్ర చేశాను

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన ప్రగతి శ్రీవాస్తవ విలేకరులతో మాట్లాడుతూ – ''మను చరిత్ర' సినిమా తర్వాత కోవిడ్ వల్ల గ్యాప్ రావడంతో ముంబై వెళ్లిపోయా. 'పెద కాపు 1'కి చాన్స్ రావడంతో, ఆడిషన్ ఇచ్చాను. సెలక్ట్ అయ్యాను. శ్రీకాంత్ అడ్డాలగారి గత సినిమాల్లో హీరోయిన్ పాత్రలు బలంగా ఉంటాయి. అలా ఈ సినిమాలో నా పాత్ర కూడా చాలా బలంగా ఉంటుంది. ఇందులో నాది రూరల్ క్యారెక్టర్.. చాలెంజింగ్ రోల్. ఈ పాత్రను బాగా చేయగలిగానంటే దానికి కారణం శ్రీకాంత్‌గారే. ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకూ మంచి సస్పెన్స్‌తో ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు.



ప్రగతి

వినోదం.. సందేశం



వెంకట రమణ, సుమన్

సుమన్, అజయ్ ఘోష్, కిశోర్, వెంకట రమణ, ప్రగ్యా నైనా ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జనం'. పి. పద్మావతి సమర్పణలో వెంకట రమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో సుమన్ మాట్లాడుతూ– ''జనం' షూటింగ్ ఒంగోలులో చేశాం. 'నేటి భారతం' షూటింగ్ అక్కడే జరిగింది. అదే కోవలో వస్తోన్న చిత్రం 'జనం'. సందేశంతో పాటు మంచి వినోదం ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమాలో సుమన్‌గారు పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా నటించారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నాం. త్వరలో పార్ట్ 2 చిత్రీకరణ ప్రారంభమవుతుంది'' అన్నారు వెంకట రమణ. డైరెక్టర్ వి. సముద్ర, నటుడు అజయ్ ఘోష్, నిర్మాతలు టి. రామ సత్య నారాయణ, సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	15	66,024
నిఫ్టీ	0	19,675

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,239	▲	27
డోజోన్స్	33,906	▼	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,624	▼	60
డాక్స్	15,405	▼	152
షాంఘై	3,116	▼	17
నికాయ్	32,679	▲	276

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,670
బంగారం (22 క్యారెట్)	55,880
వెండి (కిలో)	79,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.30	83.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.11	103.48
€	యూరో	ఎస్‌బీఐ	86.98	90.08
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.19	56.90
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.34	54.64
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.91	61.83
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.25	12.33

రెలిగేర్ వాటాకు ఓపెన్ ఆఫర్

26 శాతానికి బర్మన్ కుటుంబం రెడీ



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ వాటాదారులకు బర్మన్ కుటుంబం ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. తద్వారా ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా ప్రమోటర్లు రెలిగేర్‌లో 26 శాతం వాటాను అదనంగా కొనుగోలు చేయనున్నారు. షేరుకి రూ. 235 ధరలో 9 కోట్లకు పైగా షేర్లను సొంతం చేసుకోనున్నారు. ఇందుకు రూ. 2,116 కోట్లు వెచ్చించనున్నారు. దీంతో రెలిగేర్‌లో బర్మన్ కుటుంబ వాటా ప్రస్తుత 25 శాతం నుంచి 51 శాతానికి జంప్ చేయనుంది. వెరసి రెలిగేర్ బర్మన్ కుటుంబ నియంత్రణలోకి చేరనుంది. తద్వారా ఫైనాన్షియల్ సర్వీసుల విభాగంలోకి డాబర్ కుటుంబం ప్రవేశించనుంది. డాబర్ గ్రూప్ ఇప్పటికే యూకే కంపెనీ అవైవా ఇంటర్నేషనల్ హోల్డింగ్స్‌తో భాగస్వామ్యం ద్వారా లైఫ్ ఇన్సూరెన్స్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాగా.. గతేడాది డాబర్ ఇన్వెస్ట్ కార్ప్ నుంచి అవైవా పీఎల్‌సీ 25 శాతం అదనపు వాటాను కొనుగోలు చేసింది. దీంతో అవైవా లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియాలో వాటాను 74 శాతానికి పెంచుకుంది.

ఓపెన్ ఆఫర్ వార్తల నేపథ్యంలో రెలిగేర్ షేరు బీఎస్‌ఈలో 7 శాతం పతనమై రూ. 253 వద్ద ముగిసింది.

అన్‌లిస్టెడ్ కంపెనీలకు కఠినతర నిబంధనలు

కంపెనీ లా కమిటీ పరిశీలన



న్యూఢిల్లీ: బడా అన్‌లిస్టెడ్ కంపెనీలకు కఠినతరమైన నిబంధనలను కంపెనీ లా కమిటీ ప్రతిపాదించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద స్టార్టప్స్ ఆర్థిక వ్యవహారాలపై ఒక కన్నేసి ఉంచేందుకు.. అన్‌లిస్టెడ్ కంపెనీలు మూడు నెలలకోసారి ఆర్థిక ఫలితాలను సమర్పించడం తప్పనిసరి చేయొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో పాటు కంపెనీల చట్టానికి సవరణలు చేసే అంశంపై అంతర్‌మంత్రిత్వ శాఖల స్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు వివరించాయి. ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో అవకతవకల ఆరోపణలు, ఆడిటర్లు రాజీనామా చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది.

ఒడిదుడుకుల ట్రేడింగ్

అక్కడక్కడే ముగిసిన సూచీలు

ముంబై: తీవ్ర హెచ్చుతగ్గుల్లో సాగిన సోమవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు అక్కడికక్కడే ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని బలహీనతలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ప్రతికూల ప్రభావం చూపాయి. రోజంతా 462 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 15 పాయింట్ల లాభంతో 66,024 వద్ద ముగిసింది. దీంతో సెన్సెక్స్ నాలుగు రోజుల వరుస నష్టాలకు ముగింపు పడినట్లైంది. నిఫ్టీ ఎలాంటి లాభ, నష్టాలకు లోనవకుండా 19,675 వద్దే స్థిరపడింది. బ్యాంకులు, ఫైనాన్స్, వినిమయ, రియల్టీ షేర్లు రాణించగా..., ఐటీ, ఆటో, ఇంధన, ఫార్మా, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వడ్డీరేట్ల పెంపు ఆందోళనలు, బాండ్లపై అధిక రాబడుల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి.

- గృహ రుణాలపై వడ్డీ రాయితీ కల్పించేందుకు కేంద్రం రూ.60 వేల కోట్లతో కొత్త పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు వార్తలు వెలుగులోకి రావడంతో రియల్టీ రంగ షేర్లకు డిమాండ్ నెలకొంది. శోభ లిమిటెడ్ షేరు అత్యధికంగా 5% ర్యాలీ చేసింది.
- డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ నుంచి పెద్ద మొత్తంలో పన్ను నోటీసు అందడంతో డెల్టా కార్ప్ షేరు 18% నష్టపోయి రూ.143 వద్ద స్థిరపడింది.
- బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ ప్రణాళికలో ఉన్నట్లు వార్తలు రావడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 5% ర్యాలీ చేసి రూ.7819 వద్ద స్థిరపడింది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు బలహీనపడి 83.13 స్థాయి వద్ద స్థిరపడింది. క్రూడ్ ధర పెరగడం, డాలర్ బలపడటంతో దేశీయ కరెన్సీ కోతకు గురైంది.



ఎఫ్‌అండ్‌వో సమయం పెంపు!

- ఎన్‌ఎస్‌ఈ తాజా ప్రణాళికలు
- అనుమతుల కోసం సెబీకి దరఖాస్తు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో దశలవారీగా ట్రేడింగ్ సమయాన్ని పెంచే ప్రణాళికలకు తెరతీసింది. తద్వారా ప్రపంచ సమాచార ప్రభావంతో ఏర్పడే ఓవర్‌నైట్ రిస్కులకు చెక్ పెట్టాలని యోచిస్తోంది. రోజువారీ ట్రేడింగ్ సమయం(ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.30 వరకూ) ముగిశాక కొంత విరామమిచ్చి ప్రత్యేక ఎఫ్‌అండ్‌వో సెషన్‌ను అనుమతించాలని భావిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి 9 వరకూ ట్రేడింగ్‌కు తెరతీయాలని ప్రణాళికలు వేసినట్లు వెల్లడించారు. అయితే సాయంత్రం నమోదయ్యే లావాదేవీలను మర్నాడు నిర్వహించే సాధారణ ట్రేడింగ్‌లో కలపాలనుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కాలపరిమితిపై వ్యక్తమయ్యే స్పందన ఆధారంగా క్రమంగా రాత్రి 11.55వరకూ ట్రేడింగ్ సమయాన్ని పెంచే యోచనలో ఉన్నట్లు తెలియజేశారు. కమోడిటీ డెరివేటివ్స్ బాటలో ఈక్విటీ ఎఫ్‌అండ్‌వోను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

తొలుత ఇండెక్స్‌తో..

తొలి దశలో ఇండెక్స్ డెరివేటివ్స్‌తో ప్రారంభించి, ఆపై సింగిల్ స్టాక్ ఆప్షన్స్, తదితరాలను ప్రవేశపెట్టనున్నట్లు కృష్ణన్ వివరించారు. ఈ అంశాలపై అనుమతుల కోసం సెబీకి ప్రతిపాదనలు అందించినట్లు వెల్లడించారు. సెబీ నుంచి త్వరలోనే అనుమతులు లభించగలవని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా ట్రేడింగ్ కమ్యూనిటీ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు ఎఫ్‌అండ్‌వో గడువు పెంపు ప్రక్రియకు తెరతీసినట్లు పేర్కొన్నారు. సెబీ అనుమతిస్తే ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ సిద్ధం చేయనున్నట్లు కృష్ణన్ వివరించారు. కాగా.. ట్రేడింగ్ వేళలను పెంచడం ద్వారా దేశీయంగా మరింతమంది స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడంతోపాటు.. విదేశీ ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలకు ఈక్విటీ ఎఫ్అండ్‌వో ద్వారా హెడ్జింగ్ చేపట్టేందుకు వీలుంటుందని, ఇది మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకట్టుకుంటుందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలకు జోష్!

- అమ్మకాలకు పండుగలు, వన్డే ప్రపంచకప్ దన్ను
- 20 శాతం వృద్ధికి అవకాశం
- రూ.70,000 కోట్ల వ్యాపారం



న్యూఢిల్లీ: గృహోపకరణాలు, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ పరిశ్రమ ఈ ఏడాది అమ్మకాలపై బలమైన అంచనాలను పెట్టుకుంది. పండుగల సీజన్‌కుతోడు, వన్డే ప్రపంచ క్రికెట్ కప్ పోటీలు ఉండడంతో అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయని, క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తోంది. ఏటా పండుగల సీజన్‌లో అధిక విక్రయాలు నమోదవుతుండడం సాధారణమే. కాకపోతే ఈ ఏడాది క్రికెట్ పోటీలు కూడా రావడం అమ్మకాలకు కలిసొస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 1987 తర్వాత పండుగల సీజన్ సమయంలో క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంట్ రావడం ఇదే మొదటిసారి కానుంది. దీంతో టీవీలు, ముఖ్యంగా పెద్ద తెరల సెట్లు, ఆడియో ఉత్పత్తులు, సౌండ్ బార్లు, హెడ్‌ఫోన్లు, ఇయర్‌బడ్స్ అధికంగా అమ్ముడుపోతాయనే అంచనాలు నెలకొన్నాయి. సంప్రదాయ, చిన్న తెరల టీవీల స్థానంలో 55 అంగుళాల పెద్ద టీవీలను వినియోగదారులు కొనుగోలు చేసే అవకాశాలు ఉంటాయని కంపెనీలు భావిస్తున్నాయి. ప్రీమియం, అల్ట్రా ప్రీమియం అయిన క్యూఎల్ఈడీ, ఓఎల్ఈడీ టీవీలకు సైతం డిమాండ్ ఉంటుందని అంచనాతో ఉన్నాయి. వన్డే వరల్డ్‌కప్ అక్టోబర్ 5న ప్రారంభం అవుతుండగా, నవంబర్ 9న ముగియనుంది.

ఆకర్షణీయమైన ఆఫర్లు

గత సీజన్ల మాదిరే ఈ ఏడాది కూడా వడ్డీ రహిత రుణ సదుపాయం, కొత్త మోడళ్ల ఆవిష్కరణ, విస్తృత ప్రచారంతో అమ్మకాలు పెంచుకోవాలని ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల కంపెనీలు యోచిస్తున్నాయి. ప్రస్తుత పండుగల సమయంలో అమ్మకాలు గతేడాది స్థాయిలోనే ఉండొచ్చు. కాకపోతే ఈ ఏడాది ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని అంచనా వేస్తున్నాం. వీటి అమ్మకాలు 30% పెరగొచ్చు. కాకపోతే మాస్ విభాగం (తక్కువ ధరల ఉత్పత్తులు) ఒత్తిడిని ఎదుర్కొనవచ్చు. ఈ ఏడాది ఆరంభం నుంచి ద్రవ్యోల్బణ ప్రభావం కొనసాగుతోంది. దీంతో విచక్షణారహిత వినియోగంపై ఒత్తిడి నెలకొంది. రుతుపవనాల్లో వ్యత్యాసం, కొన్ని రాష్ట్రాల్లో సరైన వర్షాలు కురవకపోవడం వ్యవసాయ ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. ఇవి మాస్ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రభావం పడేలా చేస్తాయి. కనుక ఈ విభాగంలో అమ్మకాలు ఏమంత మెరుగ్గా ఉంటాయని భావించడం లేదు''అని గోద్రేజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది వివరించారు.

బలమైన అంచనాలు..

హోమ్ అప్లయెన్సెస్, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు ఈ సీజన్‌లో రూ.70,000 కోట్లుగా ఉండొచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. వాతావరణంలో అస్థిరతల వల్ల ఎయిర్ కండీషనర్ల అమ్మకాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నాయి. ''వర్షాలు తక్కువగా ఉండడంతో వర్షాకాలంలోనూ డిమాండ్ బలంగా ఉంది. ముఖ్యంగా దక్షిణాది, ఉత్తరాది, పశ్చిమ, ఈశాన్య ప్రాంతాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలతో ఈ ధోరణి నెలకొంది. దీంతో ఏసీలకు డిమాండ్ కొనసాగుతోంది''అని కమల్ నంది తెలిపారు. రెండంకెల అమ్మకాల వృద్ధి ఉంటుందని పానాసోనిక్ ఇండియా అంచనా వేస్తోంది. ముఖ్యంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ల అమ్మకాలపై బలమైన అంచనాలతో ఉంది. ''గతేడాది పండుగల సీజన్‌లో అమ్మకాల పరిమాణం కంటే అమ్మకాల విలువ ఎక్కువగాఉంది. ఈ ఏడాది కూడా అదే కొనసాగుతుందని భావిస్తున్నాం. వినియోగదారులు విలువ ఆధారిత ఫీచర్ల కోసం చూస్తున్నారు''అని పానాసోనిక్ మార్కెటింగ్ ఇండియా ఎండీ ఫుమియసు ఫుజిమోరి తెలిపారు. ఓనమ్ పండుగ సమయంలో 20 శాతం అమ్మకాలు పెరిగినట్టు ఎల్‌జీ ఇండియా తెలిపింది. ఈ ఏడాది పండుగల సీజన్‌లో విలువ, పరిమాణం పరంగా ఈ ఏడాది మంచి వృద్ధి ఉంటుందని అంచనా వేస్తోంది.

ఐవోసీ గ్రీన్ హైడ్రోజన్ బస్



న్యూఢిల్లీ: చమురు రంగ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) భారత్‌లో తొలిసారిగా గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే బస్‌లను సోమవారం ఆవిష్కరించింది. హైడ్రోజన్ మండినప్పుడు ఉప ఉత్పత్తిగా నీటి ఆవిరిని మాత్రమే ఈ బస్ విడుదల చేస్తుంది. 30 కిలోల గ్రీన్ హైడ్రోజన్ సామర్థ్యం ఉన్న నాలుగు సిలిండర్లతో ఈ బస్ 350 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ప్రస్తుతానికి ఢిల్లీ రోడ్లపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఒక కిలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి 50 యూనిట్ల పునరుత్పాదక విద్యుత్, 9 కిలోల డీయోనైజ్డ్ నీరు అవసరం. చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి జెండా ఊపి రెండు బస్‌లను ప్రారంభించారు. 2023 చివరినాటికి ఐవోసీ ఖాతాలో బస్‌ల సంఖ్య 15కు చేరనుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామ్-2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డులో కేటగిరీ-1, కేటగిరీ-2 పోస్టులను భర్తీ చేయనున్నారు. సంబంధిత విభాగాల్లో పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
- » **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ(జియోలాజికల్ సైన్స్/జియాలజీ/అప్లైడ్ జియాలజీ/జియో ఎక్స్‌ప్లోరేషన్/మినరల్ ఎక్స్‌ప్లోరేషన్/ఇంజనీరింగ్ అప్లైడ్ జియోఫిజిక్స్/మెరైన్ జియోఫిజిక్స్/అప్లైడ్ జియోఫిజిక్స్/కెమిస్ట్రీ/అప్లైడ్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ/హైడ్రోజియాలజీ), ఎంఎస్సీ (టెక్)-అప్లైడ్ జియోఫిజిక్స్.
- » **వయసు:** 01.01.2024 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పరీక్ష విధానం:** స్టేజ్1 ప్రిలిమినరీ పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), స్టేజ్ 2 మెయిన్ ఎగ్జామినేషన్(డిస్క్రిప్టివ్ టైప్), స్టేజ్-3 పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2023
- » **దరఖాస్తుల ఉపసంహరణ తేదీలు:** 11.10.2023 నుంచి 17.10.2023 వరకు
- » **ప్రిలిమినరీ పరీక్ష తేది:** 18.02.2024.
- » **మెయిన్ పరీక్ష తేదీలు:** 22.06.2024.
- » **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఐడీబీఐ బ్యాంక్‌లో 600 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 600
- » **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- » **వయసు:** 31.08.2023 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఇస్తారు.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2023
- » **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 20.10.2023.
- » **వెబ్‌సైట్:** www.idbibank.in

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోలు

పాడేరులోని కలెక్టర్ కార్యాలయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో తాత్కాలిక ప్రాతిపదికన ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో (నీతి ఆయోగ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 03
- » **అర్హత:** పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. డేటా అనాలిసిస్, ప్రెజంటేషన్ స్కిల్, సోషల్ మీడియా తదితరాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు రూ.55,000 చెల్లిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** దరఖాస్తును పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆఫీస్, నార్త్ బ్లాక్, డిస్ట్రిక్ట్ కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.09.2023.
- » **వెబ్‌సైట్:** allurisitharamaraju.ap.gov.in

పశ్చిమ గోదావరి జిల్లాలో 57 మెడికల్, పారా మెడికల్ పోస్టులు

ఏపీ వైద్య విధాన పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన మెడికల్, పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 57
- » **పోస్టుల వివరాలు:** గైనకాలజిస్ట్-01, అనస్థీటిస్ట్-06, పీడియాట్రీషియన్-01, ఫిజీషియన్-04, జనరల్ సర్జన్-01, కార్డియాలజిస్ట్-01, మెడికల్ ఆఫీసర్-16, స్టాఫ్ నర్స్-20, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్-2, ఆప్టోమెట్రిషియన్-01, సోషల్ వర్కర్-01, ల్యాబ్ టెక్నీషియన్-01, న్యూట్రిషనల్ కౌన్సిలర్-01, అటెండర్ కమ్ క్లీనర్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ, ఎంబీబీఎస్, డీజీవో, ఎండీ, పీజీ, ఎంఫిల్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఏలూరులోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందజేయాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 27.09.2023.
- » **వెబ్‌సైట్:** eluru.ap.gov.in

డిగ్రీతో కేంద్ర బ్యాంక్‌లో కొలువు

- » 450 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఆర్‌బీఐ నోటిఫికేషన్
- » ప్రిలిమ్స్, మెయిన్స్, లాంగ్వేజ్ టెస్ట్ ద్వారా ఎంపిక
- » ప్రారంభంలో నెలకు రూ.47,849 వేతనం
- » బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రించే, పర్యవేక్షించే కేంద్ర బ్యాంక్. ఆర్‌బీఐ తీసుకునే నిర్ణయాలు బ్యాంకింగ్ రంగంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థనూ ప్రభావితం చేస్తాయి. ఇంతటి కీలకమైన ఆర్‌బీఐ.. ఏటా పలు పోస్టులకు నియామకాలు చేపడుతోంది. తాజాగా 450 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.47,849 వేతనం అందించనుంది! ఈ నేపథ్యంలో.. ఆర్‌బీఐ అసిస్టెంట్ పోస్టుల వివరాలు, ఎంపిక విధానంతో పాటు పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

మొత్తం 450 పోస్టులు

ఆర్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా 18 ప్రాంతీయ కార్యాలయాల్లో మొత్తం 450 పోస్టులను భర్తీ చేయనుంది. ప్రాంతీయ కార్యాలయాల వారీగా పోస్టుల సంఖ్య వివరాలు.. అహ్మదాబాద్ 13 పోస్టులు, బెంగళూరు 58, భోపాల్ 12, భువనేశ్వర్ 19, చండీగఢ్ 21, చెన్నై 13, గువహటి 26, హైదరాబాద్ 14, జైపూర్ 5, జమ్ము 18, కాన్పూర్ అండ్ లక్నో 55, కోల్‌కత 22, ముంబై 101, నాగ్‌పూర్ 19, న్యూఢిల్లీ 28, పాట్నా 10, తిరువనంతపురం అండ్ కొచి 16 పోస్టులు. వీటితోపాటు 11 బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు.

విద్యార్హతలు

సెప్టెంబర్ 1 ,2023 నాటికి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీస ఉత్తీర్ణత మార్కులు సాధిస్తే సరిపోతుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న కార్యాలయం ఉన్న రాష్ట్రానికి సంబంధించిన భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. అదేవిధంగా కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉండాలి.

వయసు

సెప్టెంబర్ 1, 2023 నాటికి 20 – 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆకర్షణీయ వేతనం

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభమవుతుంది. రూ.20,700-రూ.55,700 వేతన శ్రేణిలో ప్రారంభంలో నెలకు రూ.47,849 స్థూల వేతనం లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఆర్‌బీఐ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష, మెయిన్ ఎగ్జామ్. దీంతోపాటు లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ కూడా ఉంటుంది.

వంద మార్కులకు ప్రిలిమినరీ

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ పరీక్షను మూడు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు కేటాయించే సమయం ఒక గంట. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది.

మెయిన్‌కు 200 మార్కులు

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున రెండో దశ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. దీన్ని అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40ప్రశ్నలు-40 మార్కులు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ40 ప్రశ్నలు-40 మార్కులు,టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్40ప్రశ్నలు-40 మార్కులు, టెస్ట్ ఆఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకు మెయిన్ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటల 15 నిమిషాలు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. ప్రిలిమినరీ, మెయిన్ రెండు పరీక్షల్లోనూ నెగెటివ్ మార్కింగ్ (0.25 మార్కులు)నిబంధన అమల్లో ఉంది.

లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్టుకు ఇద్దరిని చొప్పున(1:2 నిష్పత్తి)ఎంపిక చేసి.. మలి దశలో లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్ ఆయా రాష్ట్రాల అధికారిక భాషలో ఉంటుంది.హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో ఖాళీలకు సంబంధించి తెలుగులో లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ విభాగాలు ఉంటాయి. ఇందులోనూ ప్రతిభ చూపితే..మెయిన్ ఎగ్జామ్,లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ మార్కులను క్రోడీకరించి.. తుది విజేతల జాబితా రూపొందిస్తారు. ఇందులో చోటు సాధించిన వారికి నియామకం ఖరారు చేస్తారు.

చీఫ్ మేనేజర్ స్థాయికి

ఆర్‌బీఐ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వారు భవిష్యత్తులో చీఫ్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. సర్వీస్ నిబంధనలను అనుసరించి తొలుత ఆఫీసర్/ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఎ హోదాకు పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత మేనేజర్ గ్రేడ్-బి(స్కేల్-2), సీనియర్ మేనేజర్ గ్రేడ్-సి(స్కేల్-3), చీఫ్ మేనేజర్ గ్రేడ్-డి (స్కేల్-4) హోదాలకు పదోన్నతి పొందొచ్చు.

ప్రాక్టీస్‌తోనే సక్సెస్

- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ అంశాల్లో అవగాహన పెంచుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో మంచి స్కోర్ కోసం బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- న్యూమరికల్ ఎబిలిటీకి సంబంధించి.. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా అర్థమెటిక్ సంబంధిత అంశాల(రేషియోస్, పర్సంటేజెస్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, రిలేషన్స్ తదితర)పై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్‌ను మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. వీటితోపాటు ఆర్థిక, సామాజిక అంశాలు, జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం, ఇండియన్ ఎకానమీ, గ్లోబలైజేషన్, భారత సామాజిక విధానం, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు, ఆర్‌బీఐ విధులు, దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ తదితరాలపై అవగాహన పెంచుకోవాలి.
- కంప్యూటర్ నాలెడ్జ్‌కు సంబంధించి.. కంప్యూటర్ ఫండమెంటల్స్ ముఖ్యంగా ఆపరేటింగ్ టూల్స్ గురించి తెలుసుకోవాలి. కీ బోర్డ్ షార్ట్ కట్ మెథడ్స్, ఎంఎస్ ఆఫీస్ అప్లికేషన్స్, డాక్యుమెంట్ క్రియేషన్, ఎక్సెల్ షీట్ క్రియేషన్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 04.10.2023
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీ:21, 23.10.2023
- ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: డిసెంబర్ 02, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rbi.org.in

మార్చి చివరికల్లా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీ పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీ పోస్టులను వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా భర్తీ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయా వర్గాల నిరుద్యోగుల ఉద్యోగాల కల త్వరలో నెరవేరనుంది.

ఏపీ కార్ల్ భవనంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు


పులివెందుల ఏపీకార్ల్‌లో ఏర్పాటు చేసిన వ్యవసాయ కళాశాల

పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఏపీకార్ల్ భవనంలో ప్రభుత్వ వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా అడ్మిషన్ల కోసం ఏపీఈఏపీ సీఈటీ–2023 రాసిన విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నట్లయితే ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వెబ్ సైట్‌ను సందర్శించి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.బి.ఎస్.నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు తెలిపారు. ఇతర వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్ సైట్ https://angrau.ac.in లో సందర్శించాలని కోరారు.

మెడికల్ సీట్ల వెబ్ ఆప్షన్లకు నేటితో ముగియనున్న గడువు

సాక్షి, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్‌ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కోటా, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో బి, సి కేటగిరి ఎంబీబీఎస్ సీట్ల మాప్–అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్‌ల నమోదు గడువు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనుంది. రెండు విడతల కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లు భర్తీ కోసం మాప్ అప్ రౌండ్–1 కౌన్సెలింగ్‌కు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు అవకాశం కల్పించారు. https://ugmq.ysuhs.com/ వెబ్‌సైట్‌లో విద్యార్థులు ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

జీఎన్ఎం కోర్సు దరఖాస్తుకు రేపే తుది గడువు

సాక్షి, అమరావతి: జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కోర్సు(మేల్, ఫీమేల్)లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులకు బుధవారంతో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు బుధవారం సాయంత్రం 5 గంటల్లోపు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. 30వ తేదీలోపు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి డీఎంహెచ్‌వోలు ఎంపిక జాబితా విడుదల చేస్తారు. అక్టోబర్ మూడో తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)డాక్టర్ నరసింహం తెలిపారు.

రాష్ట్రానికి 8 కేంద్రీయ విద్యాలయాల మంజూరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఎనిమిది కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 87 కేంద్రీయ విద్యాలయాల్లో ఎనిమిది ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. ఇందులో అనకాపల్లి జిల్లా అనకాపల్లి, అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లి, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం, పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని తాళ్లపల్లి, నరసారావుపేట జిల్లా రొంపిచర్ల, ఎన్టీఆర్ జిల్లా నందిగామ, ఏలూరు జిల్లా నూజివీడు, నంద్యాల జిల్లా డోన్ ఉన్నాయి.

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

సాక్షి, అమరావతి: నిత్య జీవితంలో చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే మేలును అందరూ తెలుసుకోవాలని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప రెడ్డి అన్నారు. చిరుధాన్యాలలో అధిక పోషక విలువలు ఉండటం వల్ల మంచి ఆరోగ్యం కలుగుతుందని, రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. విజయవాడలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు చిరుధాన్యాల ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. చిత్తూరు జిల్లాకు చెందిన పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.ఆకాష్ ప్రథమ బహుమతి గెలుచుకుని వచ్చే నెలలో జరిగే జాతీయ సెమినార్‌కు ఎంపికయ్యాడు. పోటీలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అభినందించారు.

ప్రైజ్‌మనీ పేరుతో రూ.70 లక్షలు స్వాహా

ఒంగోలు టౌన్: అత్యాశతో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి సైబర్ నేరగాళ్ల చేతిలో నిలువుదోపిడీకి గురయ్యాడు. ప్రైజ్‌మనీ పేరుతో వచ్చిన మెసేజ్‌ను నమ్మి రూ.70లక్షలు చెల్లించి మోసపోయాడు. బాధితుడు సోమవారం ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ మలికా గర్గ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. ఒంగోలుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకట్రావు తరచూ ఈ–కామర్స్ సంస్థ 'మీషో'లో దుస్తులు కొనుగోలు చేస్తుంటాడు. ఆయనకు ఇటీవల మీషో ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. 'కంపెనీ తరఫున మీరు రూ.12.50 లక్షల ప్రైజ్ మనీకి ఎంపికయ్యారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, సెంట్రల్ పన్నులు కలిపి రూ.50 వేలు ఫోన్ పే చేయండి' అనేది ఆ మెసేజ్ సారాంశం. దీంతో రూ.12.50లక్షలు వస్తాయనే ఆశతో వెంకట్రావు రూ.50 వేలను ఫోన్ పే చేశాడు. అనంతరం 'మీ ప్రైజ్ మనీ రెట్టింపు అయ్యింది. అయితే అది హాంకాంగ్ కరెన్సీ బాత్‌లలో ఉంది. మన కరెన్సీలో దాని విలువ రూ.2.68 కోట్లకు పైగానే ఉంటుంది. ఆ డబ్బుల కోసం కొన్ని పన్నులు చెల్లించాల్సి ఉంది' అని వెంకట్రావుకు మరో మెసేజ్ వచ్చింది. అప్పటికే ప్రైజ్ మనీ మాయలో పడిపోయిన వెంకట్రావు తన వద్ద అంత డబ్బులు లేకపోయినా అందినకాడల్లా అప్పు చేసి సైబర్ నేరగాళ్లు చెప్పిన ప్రకారం దశలవారీగా రూ.70లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. ఆ తర్వాత సైబర్ నేరగాళ్లు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన వెంకట్రావు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

• తెలంగాణ

'రాజకీయ' ఎమ్మెల్సీలు వద్దు

- దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలకు నిర్దేశిత అర్హతలు లేవు
- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసిన గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను నామినేట్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. రాజ్యాంగంలోని 171(3), 171(5) ఆర్టికల్‌లలో నిర్దేశించిన మేరకు సాహిత్యం, వైజ్ఞానిక శాస్త్రం, కళలు, సహకార ఉద్యమం, సమాజ సేవ రంగాల్లో ప్రత్యేక ప్రావీణ్యతగానీ, ఆచరణాత్మక అనుభవంగానీ వీరికి లేదని.. అందువల్ల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. దాసోజు శ్రవణ్ రాజకీయాలు, వ్యాపారం, విద్యా రంగాల్లో.. కుర్ర సత్యనారాయణ రాజకీయాలు, పారిశ్రామిక కార్మిక సంఘం కార్యకలాపాల్లో క్రియాశీలకంగా ఉన్నట్టు ప్రతిపాదనల సారాంశం వెల్లడిస్తోందని గవర్నర్ వివరించారు. దీనిపై ఈ నెల 19న ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి గవర్నర్ తమిళిసై రాసిన లేఖలు సోమవారం బయటికి వచ్చాయి. చట్టాన్ని అనుసరించే తాను నిర్ణయం తీసుకున్నట్టు గవర్నర్ ఆ లేఖల్లో స్పష్టం చేశారు. ఇద్దరు ఎమ్మెల్సీల నియామక ప్రతిపాదనలతో ఇతర వివరాలు, ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం జత చేయలేదని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. మంత్రివర్గం, సీఎం సంబంధిత రికార్డులన్నింటినీ పరిశీలించినట్టు ధ్రువీకరించే కేబినెట్ నోట్ ఫైల్‌ను పంపలేదని.. ఎమ్మెల్సీలుగా వీరి అభ్యర్థిత్వాన్ని పరిశీలించడానికి ప్రభుత్వం అనుసరించిన పద్ధతిని కూడా తెలియజేయలేదని తప్పుపట్టారు. వీటికి తోడు అర్హతలను ధ్రువీకరించే ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో వీరిద్దరినీ ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయడం సముచితం కాదని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి తిప్పిపంపుతున్నట్టు ప్రకటించారు. ఇకపై సెక్షన్ 171(5) కింద నామినేట్ పదవుల కోసం రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తులను పరిగణనలోకి తీసుకోవద్దని సీఎంకు, మంత్రివర్గానికి విజ్ఞప్తి చేశారు.

మంగళూరు తీరంలో
అరుదైన తిమింగలం

తొలిసారిగా భారత సముద్ర జలాల్లో ఒమూరా వేల్ ఉనికి గుర్తింపు

- గోవా తీరంలో బ్లెయిన్‌విల్లి తిమింగలాలు
- ఏడాదిలో 10,483 డాల్ఫిన్లు, 4 జాతుల తిమింగలాల జాడ
- మత్స్యసంపదపై మొదలైన ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా గణన
- మీడియాతో ఎఫ్ఎస్ఐ డైరెక్టర్ జనరల్ జయభాస్కరన్




జయభాస్కరన్

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఒమూరా వేల్ (తిమింగలం) ఉనికిని కర్ణాటకలోని మంగళూరు తీరంలో గుర్తించామని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) డైరెక్టర్ జనరల్ ఆర్.జయభాస్కరన్ వెల్లడించారు. తాము చేపట్టిన సర్వేలో భాగంగా మంగళూరు తీరంలో వీటి సంతతిని ఇటీవల కనుగొన్నామన్నారు. ఒమూరా జాతి తిమింగలానికి దంతాలు ఉండవన్నారు. భారత సముద్ర జలాల్లో వీటి లభ్యత ఇదే తొలిసారని చెప్పారు. సోమవారం ఆయన విశాఖలోని ఎఫ్ఎస్ఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మరో అరుదైన బ్లెయిన్‌విల్లి (మిసోప్లొడాన్ డెన్సిరోస్ట్రిస్) జాతికి చెందిన తిమింగలాల జాడ కూడా పశ్చిమ తీరంలోని గోవా ప్రాంతంలో లభ్యమైందని తెలిపారు. అయితే ఒమూరా జాతికి భిన్నంగా ఈ తిమింగలాలు పొడవైన దంతాలను కలిగి ఉంటాయన్నారు. దేశంలో 2.02 మిలియన్ చదరపు కిలోమీటర్ల పరిధిలో సముద్ర క్షీరదాలపై ఎఫ్ఎస్ఐ సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. ఏడాది కాలంలో తూర్పు, పశ్చిమ తీరాల్లో 10,483 డాల్ఫిన్లు 18 రకాలు, నాలుగు జాతులకు చెందిన 27 తిమింగలాల జాడ కనుగొన్నామని చెప్పారు.

విశాఖ ప్రాంతంలోనూ వివిధ రకాల డాల్ఫిన్లు

విశాఖ పరిసరాల్లోని సముద్ర జలాల్లోనూ వివిధ రకాల డాల్ఫిన్లు సంచరిస్తున్నాయని జయభాస్కరన్ చెప్పారు. ప్రతి ఐదేళ్లకోసారి మత్స్య సంపద గణన చేపడతామని, ప్రస్తుతం ఈ గణన కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం మత్స్య షికారి, మత్స్య దర్శిని వెస్సల్స్‌తో ఎఫ్ఎస్ఐ సర్వే చేస్తోందన్నారు. ఈ వెసల్స్ పాతవి కావడంతో కొత్త వెసల్స్ మంజూరు చేయాలని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలాను కోరామని, ఇందుకు ఆయన సమ్మతించారని డీజీ వివరించారు. విశాఖ ఎఫ్ఎస్ఐలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంలో రసాయనాల్లో భద్రపరచిన అరుదైన చేప జాతులను ప్రదర్శనకు ఉంచామని, ఇందులో విద్యార్థులు, పరిశోధకులతో పాటు ప్రజలను ఉచితంగా అనుమతిస్తామన్నారు. ఈ మ్యూజియంలో అత్యంత అరుదైన సముద్రపు ఆవు (సీ కౌ)ను ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. ఆయన వెంట విశాఖ ఎఫ్ఎస్ఐ మెకానికల్ మెరైన్ ఇంజినీర్ భామిరెడ్డి పాల్గొన్నారు.

జస్టిస్ సోమయాజులు పదవీ విరమణ



పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ సోమయాజులు దంపతులను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం. చిత్రంలో సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ఘనంగా వీడ్కోలు పలికిన హైకోర్టు

- ఓ మంచి న్యాయమూర్తి సేవలను కోల్పోయామన్న సీజే
- వృత్తి జీవితం ఎంతో తృప్తినిచ్చిందన్న జస్టిస్ సోమయాజులు
- ఘనంగా సన్మానించిన హైకోర్టు న్యాయవాదుల సంఘం

సాక్షి, అమరావతి: హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జస్టిస్ సోమయాజుల కుటుంబ సభ్యులు, విశ్రాంత న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎన్. హరినాథ్ మాట్లాడారు.

అన్ని రకాల కేసులను పరిష్కరించారు : సీజే

తొలుత.. సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థకు జస్టిస్ సోమయాజులు అందించిన సేవలను కొనియాడారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా విజయవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. కుటుంబం నుంచి న్యాయ వారసత్వాన్ని కొనసాగించారని తెలిపారు. జిల్లా కోర్టులో న్యాయవాదిగా ఉంటూ న్యాయమూర్తి అయిన తొలి వ్యక్తి రాష్ట్రంలో సోమయాజులేనన్నారు. ఆయన పదవీ విరమణతో న్యాయవ్యవస్థ ఓ మంచి న్యాయమూర్తి సేవలను కోల్పోయిందన్నారు. ఆయన విశ్రాంత జీవితం ప్రశాంతంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని సీజే ఆకాంక్షించారు.

మంచి వాదనలతోనే మంచి తీర్పులు : జస్టిస్ సోమయాజులు

అనంతరం.. జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ, ఓ న్యాయమూర్తిగా కక్షిదారులకు న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేశానన్నారు. న్యాయమూర్తిగా తన ఇన్నేళ్ల ప్రస్థానంలో తనకు సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు వినిపించే మంచి వాదనలతోనే మంచి తీర్పులు ఇవ్వడం సాధ్యమైందన్నారు. జస్టిస్ సోమయాజులు దంపతులను హైకోర్టు న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. వారికి శాలువా కప్పి చిత్రపటం బహూకరించారు.

శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే

72 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి


జోరుగా ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు

చింతలపూడి (ఏలూరు జిల్లా): తెలంగాణలోని ఖమ్మం నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని దేవరపల్లి వరకు చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెండేళ్లలో హైవే నిర్మాణం పూర్తి చేయడానికి పనుల వేగాన్ని పెంచారు. హైదరాబాద్–విశాఖపట్నం మధ్య దూరం తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్– విశాఖపట్టణం మధ్య 56 కిలోమీటర్ల దూరం తగ్గడమేకాక ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. 162 కిలోమీటర్ల నిడివి గల ఈ రహదారిలో 8 నుంచి 10 ఇంటర్ చేంజ్ పాయింట్లు ఉంటాయి. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో కార్లు, 100 కిలోమీటర్ల వేగంతో భారీ వాహనాలు ప్రయాణించేలా హైవే నిర్మాణం చేపడుతున్నారు. కేంద్ర ఉపరితల రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు గత ఏడాది ఫిబ్రవరిలో విజయవాడలో జిల్లాలో రెండు ఫేజ్‌లలో చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లాలో 72 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. 70 మీటర్ల వెడల్పుతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ రహదారిని వర్గీకరించారు.

2024 చివరికల్లా అందుబాటులోకి..

రెండు దశల్లో నిర్మించినున్న ఈ ప్రాజెక్టును పూనెకు చెందిన బెకం ఇన్‌ఫ్రా సంస్థ చేపట్టింది. 2024 చివరికి ఈ రహదారి అందుబాటులోకి రానుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలను వివరించడమే కాక తెలంగాణ రాష్ట్రంతో కాకినాడ పోర్ట్ అనుసంధానం కీలకమైందని కేంద్రం పెద్దలను ఒప్పించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సైతం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు మెరుగైన పరిహారం అందించడంలో కీలకంగా వ్యవహరించారు. ఖమ్మం జిల్లా కృష్ణాపురం, తుంబూరు వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ఈ జాతీయ రహదారి ప్రవేశిస్తుంది. చింతలపూడి మండలం, రేచర్ల నుంచి గుర్వాయిగూడెం వరకు 4 లేన్ల రహదారి నిర్మాణానికి 569.37 కోట్లు, గుర్వాయిగూడెం నుండి దేవరపల్లి వరకు రూ.711.94 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. దీంతో దశాబ్దాలుగా వెనుకబడిన మెట్ట ప్రాంతంలో నేషనల్ హైవే అందుబాటులోకి రానుండడంతో రవాణా సదుపాయాలు మెరుగయ్యే అవకాశం ఉంది. రహదారి కోసం మొత్తం 1,411 ఎకరాల భూమి అవసరమవుతుంది. అందులో 114 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 1,297 ఎకరాలు రైతుల నుంచి సేకరించనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 4,609 కోట్ల అంచనాలతో మొత్తం ఆంధ్ర, తెలంగాణలో కలిపి 5 దశల్లో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు.

మెట్టకు మంచి రోజులు



గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే జిల్లాలోని మెట్టప్రాంతమైన చింతలపూడి, పోలవరం, నియోజకవర్గాలకు రవాణా పరంగా మంచి రోజులు వస్తాయి. హైదరాబాద్, విశాఖపట్నానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో అటు జిల్లా కేంద్రం ఏలూరు నుండి చింతలపూడి, ఏలూరు, జంగారెడ్డిగూడెం పట్టణాల మీదుగా ఆర్టీసీ మరిన్ని బస్సులు నడిపే అవకాశం ఉంది. దీంతో రవాణతో పాటు వ్యాపారాలు కూడా పెరిగి ఆర్థికంగా, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

– ఉన్నమట్ల ఎలీజా, శాసన సభ్యులు, చింతలపూడి

భూహక్కు పత్రాల పంపిణీ


అండలూరులో భూహక్కు పత్రాలు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు


తరటవలో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మీ

- ఫేజ్–2లో 1.18 లక్షల ఎకరాల సర్వే
- 12 మండలాల్లోని 53 గ్రామాల్లో రీ సర్వే
- ఇప్పటికే 13,180 భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి

భీమవరం(ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో చేపట్టిన భూముల రీ సర్వే వేగంగా సాగుతోంది. సర్వే భూములకు సంబంధించి రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారు. అందులో భాగంగా ఫేజ్–2 రీ సర్వే పూర్తి చేసి రైతులకు ఫేజ్–2 భూహక్కు పత్రాలు అందజేస్తున్నారు. ఫేజ్–2లో జిల్లాలో 12 మండలాల్లో 53 గ్రామాల్లో 1,18,950 ఎకరాలు సర్వే చేశారు. అందులో ప్రైవేటు భూమి 1.15 లక్షల ఎకరాలు కాగా, ప్రభుత్వ భూమి 3,950 ఎకరాలకు సర్వే పూర్తి చేశారు.

30,212 మంది రైతులకు భూహక్కు పత్రాలు

ఫేజ్ 2 భూముల రీసర్వేలో 30,212 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా 28,812 మందికి భూ హక్కు పత్రాలు సిద్ధం చేశారు. ఇంతవరకు 13,180 పత్రాలు రైతులకు పంపిణీ చేశారు. మిగిలిన పత్రాల పంపిణీ వేగంగా జరుగుతుంది. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల పర్యవేక్షణలో వీఆర్వోలు రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్నారు.

ఫేజ్–1లో 6 వేల మందికి భూహక్కు పత్రాలు

ఫేజ్–1 భూ రీసర్వే జిల్లాలో 16 మండలాల్లో 16 గ్రామాల్లో సర్వే చేశారు. 6 వేల మంది రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పత్రాలు అందించారు.

రైతుల హర్షం

భూములను ఉచితంగా సర్వే చేసి భూహక్కు పత్రాలు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూముల విస్తరణం, సరిహద్దుల విషయంలో రైతుల మధ్య గొడవలు రావడం, కోర్టుల్లో కేసులు వరకు వెళ్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూ రీసర్వే తీసుకువచ్చి ఎవరికి ఇబ్బంది లేకుండా ఆధునిక పరికరాలతో పక్కగా సర్వే చేయించి రాళ్లు కూడా పాతించడం చాలా గొప్ప కార్యక్రమమని రైతులు చెబుతున్నారు.

ఫేజ్–3 లో 104 గ్రామాల్లో రీ సర్వే

జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా ఇంతవరకు రెండు దశల్లో 69 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేశారు. ఫేజ్–3లో 20 మండలాల్లోని మరో 104 గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టారు. డిసెంబరు నాటికి జిల్లాలో రీ సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

30,212 మంది రైతులకు పత్రాల పంపిణీ



పశ్చిమగోదావరి జిల్లాలో ఫేజ్–2 రీ సర్వే పూర్తి చేసి 30,212 మంది రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ఫేజ్–1,ఫేజ్–2 రీ సర్వే పూర్తి చేసి 69 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్నాం. ఫేజ్–3లో 20 మండలాల్లో 104 గ్రామాలే లక్ష్యంగా భూ సర్వే జరుగుతుంది. సర్వే పరికరాలు, అధికారులు, సిబ్బంది అంతా సిద్ధం చేసుకుని దశల వారీగా వేగంగా సర్వే పూర్తి చేసి వెంటనే భూహక్కు పత్రాలు రైతులకు అందిస్తున్నారు.

– పి.ప్రశాంతి, కలెక్టర్

పథకం పన్ని.. పసి మొగ్గను మట్టుబెట్టి..

- సాన్నిహిత్యానికి అడ్డంగా ఉందనే బాలిక హత్య?
- సమీప బంధువు ఘాతుకం!
- పరారీలో నిందితుడు
- గాలిస్తున్న పోలీసులు
- పట్టించిన వారికి రూ.10 వేల పారితోషికం




పెద్దాపురం: తనను తీసుకువెళ్తున్నది మేకవన్నె పులి అని.. అభం శుభం తెలియని ఆ చిన్నారి మనస్సుకు అర్థం కాలేదు.. నిలువెల్లా కాపట్యం నిండిన ఆ క్రూరుడు తనను కబళించేస్తాడని ఏ మాత్రం అనుకోలేదు.. బంధువే కదా అనుకుంటూ ఆ దుర్మార్గుడిని నమ్మింది.. మాయమాటలు విని, అతడితో వెళ్లింది.. చివరకు ఆ దౌర్భాగ్యుడి చేతుల్లో అత్యంత క్రూరంగా హతమారిపోయింది. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో సంచలనం రేపిన బాలిక హత్యకు కారకుడిని పోలీసులు గుర్తించారు. నిందితుడి కోసం వేట మొదలుపెట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపురం కొండయ్యపేటకు చెందిన దంపతులు ద్రోణ వీర్రాజు, జ్యోతి కొన్నాళ్ల కిందట మనస్పర్థల కారణంగా విడిపోయారు. దీంతో జ్యోతి తన పదేళ్ల కుమార్తె ప్రవీణ కుమారి అలియాస్ మానస, తన తల్లి సునీతతో కలసి పట్టణ శివారులోని ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన బత్తిన నాని జ్యోతికి సమీప బంధువు. వరుసకు మేనల్లుడు అవుతాడు. ఐదేళ్లుగా వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడి, కొనసాగుతోంది. అయితే, తన కుమార్తె ఎదుగుతోందని, ఇంటికి రావడం సరికాదని అంటూ కొన్నాళ్లుగా నానిని జ్యోతి దూరం పెడుతోంది. అది తట్టుకోలేని నాని తమ సాన్నిహిత్యానికి అడ్డంగా ఉన్న మానసను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. దీనికి ప్రణాళిక సిద్ధం చేశాడు. అందులో భాగంగా బయటకు తీసుకువెళ్తానని ఈ నెల 19వ తేదీన మానసకు చెప్పాడు. బంధువే కావడంతో అతడి మాటల్ని మానస నమ్మింది. ఆమెను తన బైక్‌పై ఎక్కించుకున్న నాని, స్థానిక కట్టమూరు పుంత రోడ్డులోకి తీసుకువెళ్లి, ముందే వేసుకున్న పథకం ప్రకారం హతమార్చాడని పోలీసులు చెబుతున్నారు.

బయటకు వెళ్లిన మానస ఎంతకూ ఇంటికి రాకపోవడంతో జ్యోతి ఈ నెల 20వ తేదీన పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు ఆరంభించిన పోలీసులు అనుమానితుడిగా ఉన్న నానిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టేందుకు ప్రయత్నించారు. చివరకు అతడు పరారీలో ఉన్నాడని గుర్తించారు. మరోవైపు బాలిక ఆచూకీ కోసం కూడా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కట్టమూరు పుంతలో బాలిక మృతదేహాన్ని ఆదివారం రాత్రి గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఆ బాలిక మృతదేహం పూర్తిగా పాడైపోయింది. కుక్కలు ఈడ్చుకు రావడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. చివరకు దుస్తుల ఆధారంగా ఆ మృతదేహం మానసదేనని గుర్తించారు. చిన్నారి మృతదేహానికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించి, సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మానస హత్యకు కారకుడైన నాని ఫొటోను పోలీసులు విడుదల చేశారు. అతడిని పట్టించిన వారికి రూ.10 వేల పారితోషికం అందిస్తామని ప్రకటించారు. డీఎస్పీ లతాకుమారి నేతృత్వంలో సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై సురేష్‌లు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టుకు ఆందోళన

మానసను హత్య చేసిన నానిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ స్థానిక కొత్తపేట పెట్రోల్ బంక్ గుర్రాల సెంటర్ వద్ద మానస కుటుంబ సభ్యులు, ఎన్టీఆర్ నగర్ వాసులు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐ నబీ, ఎస్సై సురేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడి కోసం గాలింపు మొదలు పెట్టామని, త్వరలోనే అరెస్టు చేసి, కోర్టుకు అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గాన గంధర్వుడికి ఘన నివాళి


ఎస్పీబీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ చరణ్

తిరువళ్లూరు: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ ప్రముఖులు సోమవారం ఘన నివాళులర్పించారు. తామరపాక్కంలోని ఆయన సమాధి వద్దకు వచ్చిన ఆయన కుమారుడు చరణ్‌తో పాటు బీజేపీ మైనారిటీ విభాగం జాతీయ కార్యదర్శి వేలూరు ఇబ్రహిం నివాళి అర్పించారు. అనంతరం ఎస్పీ బాలసుబ్రమణ్యం కుమారుడు చరణ్ మీడియాతో మాట్లాడుతూ మణిమండపం నిర్మాణం 80 శాతం పూర్తయినట్లు వెల్లడించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

మంత్రికి వినతుల వెల్లువ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మైసూరు: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్.సి.మహదేవప్ప సోమవారం జడ్పీ ఆఫీసులో జనతా దర్శన్ నిర్వహించి ప్రజల సమస్యలను ఆలకించారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఇబ్బందులను ఏకరువు పెట్టారు. మంత్రిని కలిసి.. రేషన్ కార్డు కావాల, ఖాతా బదిలీ చేయాలని, ఇల్లు, స్థలం కావాలని, వీధిలో కరెంటు స్తంభాలు వేయించాలని, పొలంలో బోరు వేయించాలని ఇలా అనేక ఫిర్యాదులపై అర్జీలు ఇచ్చారు. ప్రతి పనికీ అధికారులు రోజుల తరబడి తిప్పుతున్నారని పలువురు మంత్రికి తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు మంత్రి సూచించారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య



దురుగేష్(ఫైల్)

రాయచూరు రూరల్: అప్పు బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సింధనూరు తాలూకాలో చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం గాంధీనగర్ జీపీ మాజీ అధ్యక్షుడు దురుగేష్(40) అప్పుల బాధ, కుటుంబ బాధ్యతల దృష్ట్యా ఆత్మహత్య చేసుకున్నట్లు ఫేస్‌బుక్‌లో వీడియో అప్‌లోడ్ చేశారు. తన మరణానికి తానే బాధ్యుడనని ఐ మిస్ యూ అంటూ సందేశాన్ని షేర్ చేశారు. తన పిల్లలకు బాధ కలిగించానని, తన నుంచి ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే క్షమించాలని సందేశం పంపాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి: రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన శక్తినగర్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మడ్డిపేట నివాసి రాముడు(45) వ్యక్తిగత పనిపై శక్తినగర్ నుంచి తిరుగు ప్రయాణం అవుతూ ద్విచక్ర వాహనంలో వస్తుండగా అదుపు తప్పి ప్రమాదం సంభవించడంతో అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు తెలిపారు.

స్వచ్ఛతకు శ్రీకారం



శ్రమదానం చేస్తున్న సుబుధేంద్ర తీర్థ స్వామీజీ తదితరులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వాముల మఠంలో స్వచ్ఛతకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ శ్రీపాదంగళ్ శ్రీకారం చుట్టారు. సోమవారం మంత్రాలయంలో బీజేపీ నేతలు అరవింద లింబావళి, సుబ్బ నరసింహుల ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు చీపుర్లతో శ్రమదాన శిబిరంలో పాలు పంచుకున్నారు.

ఎస్ఐ అరెస్టుకు డిమాండ్



మాట్లాడుతున్న రఘువీర్

రాయచూరు రూరల్: మామూలు ఇవ్వలేదనే నెపంతో ఇటీవల ఓ వ్యక్తిపై దాడి చేసిన లింగసూగూరు తాలూకా మస్కి ఎస్ఐ మణికంఠను అరెస్ట్ చేయాలని హైదరాబాద్ కర్ణాటక వాల్మీకి నాయక్ సంఘం కార్యదర్శి రఘువీర్ నాయక్ డిమాండ్ చేశారు. నిరుపాది భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై డీఎస్పీ మంజునాథ్ సూచన మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ మణికంఠపై చర్యలు చేపట్టి ఆయనను సస్పెండ్ చేసి గూండా చట్టం కింద కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలన్నారు. గతంలో బళ్లారి జిల్లా కురుగోడు, సింధనూరుల్లో ఇలాంటి కృత్యాలకు పాల్పడిన అధికారిని తొలగించారన్నారు.

పరశురామప్పకు రాష్ట్ర స్థాయి ప్రశస్తి



ప్రశస్తిని అందుకుంటున్న పరశురామప్ప

కంప్లి: కళాకారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కళాకారులకు తగిన గుర్తింపు కావాలని సంగీత భారతి సంస్థాపక అధ్యక్షులు హెచ్‌పీ కల్లంభట్ పేర్కొన్నారు. పట్టణంలోని సంగత్రాయ సంస్కృత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రగార పరశురామప్పకు రాష్ట్ర స్థాయి ప్రశస్తిని అందించి ఆయన మాట్లాడారు. ప్రశస్తిని స్వీకరించిన పరశురామప్ప చిత్రగార మాట్లాడుతూ కళాకారులను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నారు. ఈక్రమంలో హొసపేటె సంగీత భారతి సంస్థ తనను ప్రశస్తితో గౌరవించడం ఆనందంగా ఉందన్నారు.

సమస్యల సుడిలో ప్రభుత్వ పాఠశాలలు

- వేధిస్తున్న ఇంగ్లిష్, హిందీ, కన్నడ ఉపాధ్యాయుల కొరత
- టెన్త్ పరీక్ష ఫలితాలపై దృష్టి పెట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



తరగతి గదిలో విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు తదితర మౌలిక వసతులు లేని దృశ్యం

సాక్షి,బళ్లారి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా జిల్లాలోని పాఠశాలల తీరు తయారైంది. భావి భారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఏటేటా తగ్గుముఖం పడుతున్నా కనీస చర్యలు తీసుకోకపోవడంతో గ్రామీణ పేద విద్యార్థులకు శాపంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు మెరుగైన విద్యనందించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో 116 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో ఇంగ్లిష్, హిందీ, కన్నడ భాషలను బోధించే 175 మంది ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. దీంతో ప్రతి ఏటా 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పూర్తిగా పడిపోతోంది. ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో 31వ స్థానానికి జిల్లా పడిపోయిందంటే జిల్లాలో అధికారులు, పాలకులు పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఏ మేరకు పాటుపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

జటిలంగా మారిన బోధనా సిబ్బంది లోటు

ముఖ్యంగా ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుల లోటు మరింత జటిలంగా మారిందని తెలుస్తోంది. ప్రతి ఏటా 10వ తరగతి పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లోనే ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నిష్ణాతులైన ఇంగ్లిష్ టీచర్లను నియమించకపోతే వారికి ఆ సబ్జెక్ట్‌పై పట్టు సాధించలేని పరిస్థితులు ఉన్నాయి. 70 మంది కన్నడ, 40 మంది హిందీని బోధించే ఉపాధ్యాయుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. తాత్కాలిక ఉపాధ్యాయులను కొన్ని గ్రామాల్లో నియమించుకున్నా ఫలితాలు మెరుగు పరిచేందుకు సాధ్యం కావడం లేదని ఓ విద్యాధికారి అన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలని అప్పో సప్పో చేసి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు కనీస వసతుల కొరత తీర్చడంలో విఫలం కావడంతో పలు ప్రభుత్వ పాఠశాలలు నామమాత్రంగా మారాయి.

షరా మామూలుగా ఊకదంపుడు ఉపన్యాసాలు

జిల్లాలోని పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల కొరత తీర్చడంపై ఎందుకు పాలకులు దృష్టి పెట్టడం లేదని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. 10వ తరగతి పరీక్షలకు మరో ఐదు నెలల గడువు మాత్రమే ఉంది. పరీక్షల సమయం దగ్గరపడుతున్నా సిబ్బందిని నియమించడంపై దృష్టి సారించకపోతే ఈ ఏడాది కూడా ఆశించిన ఫలితాలు వస్తాయా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. తగినంత మంది అతిథి ఉపాధ్యాయులు లేకపోవడం కూడా మరింత సమస్యగా మారిందని బోధన సిబ్బంది అంటున్నారు. పర్మినెంట్ ఉపాధ్యాయులను నియమించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇకనైనా జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీర్చి గ్రామీణ పేద విద్యార్థులకు మంచి విద్యాబోధనను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పథకాలు చిట్టచివరి వ్యక్తికీ చేరాలి



మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర. చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

బళ్లారిటౌన్: ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తులకు కూడా చేరాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని అనంతపురం రోడ్డులోని జిల్లాధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అందిన వినతి పత్రాలపై ఎప్పటికప్పుడే పరిష్కరించే దిశలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటి జనతా దర్శన్‌లో ప్రజలు తమ సమస్యలను తెలుపుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి తాలూకాలోను చేపడతారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా వీటి సమస్యలు పరిష్కరించేందుకు స్థానికంగా 15 కౌంటర్లను ఏర్పాటు చేశారు. అందులో రెవెన్యూ, ఆహార పౌర సరఫరాలు, గనులు భూవిజ్ఞాన, పోలీస్, అగ్నిమాపక, ఎక్సైజ్, గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్, ఇంజనీయర్, గ్రామీణ తాగునీటి, అవినీతి నిరోధక, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గృహ మండలి, విద్యా తదితర శాఖలకు అధికారులు కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ త్రివేణి, ఉపమేయర్ బీ.జానకి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూరు, ఉప అరణ్య సంరక్షణాధికారి సందీప్ సూర్యవంశీ, అదనపు జిల్లాధికారి మహమ్మద్ ఝుబేర్, అధికారి మంజునాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి నెల 25న జనతా దర్శన్

హొసపేటి: వివిధ ప్రభుత్వ సౌకర్యాలు పొందేందుకు, ఫిర్యాదుల సమర్పణకు జిల్లా యంత్రాంగం ఇకపై ప్రతినెల 25న జనతా దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనతా దర్శన్‌లో జిల్లాకు సంబంధించిన ఏవైనా సమస్యలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 20 కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో 992 అర్జీలను స్వీకరించామని తెలిపారు. ఇప్పటికే స్థలంలోనే 6 మంది వితంతువులకు మాసిక పెన్షన్ వ్యవస్థను, ఇద్దరు పేద విద్యార్థులకు హాస్టల్ వ్యవస్థ తదితర సమస్యలను పరిష్కరించామన్నారు. మిగతా సమస్యలను కూడా త్వరగా నెరవేరుస్తామన్నారు. ఎమ్మెల్యేలు హెచ్ఆర్ గవియప్ప, శ్రీనివాస్, లతా, జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశి, ఎస్పీ శ్రీహరిబాబు, అదనపు జిల్లాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం అంటూ రూ.10 లక్షల వంచన

హుబ్లీ: ఇంట్లోనే కూర్చొని పని చేయవచ్చు. దాని వల్ల అధిక లాభాలు గడించవచ్చు అంటూ మాటలతో నమ్మించి ఓ వ్యక్తి రూ.10.16 లక్షలను వంచించిన ఘటన నగరంలోని సోమవారం వెలుగు చూసింది. పాత హుబ్లీకి చెందిన బీ.శ్రీనివాస అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి వర్క్ ఫ్రం హోం ద్వారా తాము ఇచ్చే టాస్కులను పూర్తి చేసి పంపించే లింక్‌ను ఓపెన్ చేసి రెసార్ట్, హోటల్ రేటింగ్ చేయాలని సూచించాడు. ఆమేరకు స్క్రీన్ షాట్ తీసి పంపిస్తే ప్రతి టాస్కుకు రూ.100 చొప్పున ఇస్తామని నమ్మించారు. దీన్ని నమ్మిన బాధితుడు మొదటిలో ఆ వ్యక్తి చెప్పిన విధంగా రూ.400 పొందారు. టెలిగ్రామ్ ద్వారా మరో కొన్ని టాస్కులను ఇవ్వడం ద్వారా డబ్బులను వేయడానికి బ్యాంక్ వివరాలను సేకరించి విడతల వారీగా బాధితుడు ఖాతా నుంచి రూ.10.16 లక్షల నగదును బదలాయించుకున్నట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆకట్టుకున్న ప్రతిభా కారంజి

కంప్లి: పిల్లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రతిభా కారంజి వేదిక అని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు గుండప్పనవర నాగరాజ్ తెలిపారు. తాలూకాలోని బాదనహట్టిలో ఎస్‌డీఎం పాఠశాల వారు ఏర్పాటు చేసిన గెణికెహాళ్ క్లస్టర్ స్థాయి ప్రతిభా కారంజి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ప్రతిభను ప్రదర్శించేందుకు ప్రతిభాకారంజి దోహదపడుతుందన్నారు. అనంతరం వేదికపై విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

హాస్టల్ నిర్మాణానికి భూమిపూజ



పాల్గొన్న హోంమంత్రి పరమేశ్వర్

తుమకూరు: తుమకూరు నగరంలోని సత్యమంగళంలో రూ.6.5 కోట్ల వ్యయంతో సంక్షేమ శాఖ మెట్రిక్ అనంతరం చదివే విద్యార్థుల కోసం హాస్టల్ భవనాన్ని నిర్మించనుంది. ఇందుకు హోంమంత్రి జీ.పరమేశ్వర్ సోమవారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ శ్రీనివాస్, నగర ఎమ్మెల్యే జ్యోతి గణేష్, మేయర్ ప్రభావతి పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులు, లేఔట్‌వాసులు

తుమకూరు: తుమకూరు నగరంలోని వెంకటాద్రి లేఔట్‌లోని బెళగుంబలో వెంకటాద్రి గజసేనా యువకుల బృందం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. ఘనంగా శ్రీ విద్యా గణపతి నిమజ్జన ఉత్సవం జరిగింది. పిల్లలూ పెద్దలూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే పరమావధి

- తుంగభద్రను కావేరి కానివ్వద్దు
- మంత్రి శరణ ప్రకాష్ పాటిల్



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు రూరల్: మీ సమస్యలే మావిగా భావించి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అన్నారు. సోమవారం మహాత్మగాంధీ క్రీడాంగణంలో జనతా దర్శన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లో నాలుగు పథకాలను జారీ చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు హంపనగౌడ, బసనగౌడ మాట్లాడుతూ జిల్లాలో కరువు నెలకొందన్నారు. 846 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కరువు సహాయక పనులు చేపట్టాలన్నారు. సాగు నీటి విషయంలో కావేరి మాదిరిగా కాకుండా తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చూడాలన్నారు. కరువు నష్టం అంచనా వేయడానికి కేంద్రం అధ్యయన కమిటీని నియమించాలన్నారు. మంత్రికి దివ్యాంగురాలు తన మొరను వినిపించడానికి రక్షక భటులను ఆశ్రయించి మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే కరెమ్మ, ఎమ్మెల్సీ శరణేగౌడ, అదనపు జిల్లాధికారి దురుగేష్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఎస్పీ నిఖిల్, ఏసీ మెహబూబిలున్నారు.

కావేరి జలాశయాల్లో నీళ్లు లేవు

కావేరి జలాశయం నుంచి తమిళనాడుకు నీరు వదలడానికి నదిలో నీటి లభ్యత తక్కువగా ఉందని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే బసన గౌడ కార్యాలయంలో తనను కలసిన విలేకరులతో మాట్లాడారు. కావేరి విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. మేకెదాటు పథకం విషయంలో సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామన్నారు. మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి రాజకీయ అవకాశవాది అన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



మృతుడు వీరేశ్(ఫైల్)

బళ్లారి రూరల్: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. నగరంలోని సత్యావాణినగర్‌కు చెందిన వీరేశ్(34) విమ్స్ పీజీ హాస్టల్‌లో వంటమనిషిగా పని చేస్తున్నాడు. ఆదివారం వంట పని పూర్తి చేసి 9.30 సమయంలో వర్షం పడుతుండగా తన బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో కరెంటు పోయింది. ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని నవజీవన క్రైస్తవ ఆశ్రమం వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి ట్రామాకేర్ సెంటర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన బాధితున్ని తరలించేలోపు ఢీకొట్టిన బైక్ వాహనదారుడు పరారయ్యాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఐఐఐటీలో నీటి కొరత పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవింద బెల్లద

హుబ్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత ఏడాది ప్రారంభించిన ఐఐఐటీలో నీటి కొరత తలెత్తింది. విద్యార్థులు ఈ విషయమై ఆందోళనకు ఉద్యమిస్తున్నారు. ధార్వాడ శివారు ఇటగట్టి వద్ద ఉన్న ఈ ఉన్నత విద్యా సంస్థ క్యాంపస్‌లో ఆందోళన చేపట్టిన విద్యార్థులు గత వారం రోజులుగా నీటి ఎద్దడితో అల్లాడిపోతున్నారని స్థానిక ఎమ్మెల్యే అరవింద బెల్లద అన్నారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ బాధ్యతగా నీటిని సరఫరా చేయడం లేదని ఈ విషయంలో యాజమాన్యం కూడా ప్రత్యామ్నాయం చేయలేదని రిజిస్ట్రార్‌పై విద్యార్థులు ఆక్రోశం వెళ్లగక్కారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను పరిష్కరించడానికి కృషి చేశామన్నారు. ఎల్‌అండ్‌టీ అధికారులకు ఫోన్ చేశానని, అయినా అధికారులు తన ఫోన్‌ను స్వీకరించలేదన్నారు. ఇది అధికారుల నిర్లక్ష్య వైఖరిని చూపుతోందని మండిపడ్డారు. జలమండలి అధికారుల ఆధ్వర్యంలో ఉన్నప్పుడు ఇలాంటి సమస్య ఎదురు కాలేదన్నారు. నీరు అత్యంత అవశ్యకం, ఆ క్యాంపస్‌లో నీటి సమస్యపై జిల్లాధికారితో పాటు సంబంధిత అధికారులను నిలదీస్తానని ఆయన హెచ్చరించారు. 2022లో రాష్ట్రపతి ప్రారంభించిన ఈ భవనంలో తాగునీటి కొరత ఏర్పడితే విద్యార్థుల చదువుకు అటంకం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని అన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీల మధ్య వాగ్వాదం



ఎమ్మెల్యే, ఎంపీల మధ్యన వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

కోలారు: నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రభుత్వ జనతా దర్శన్ ప్రారంభోత్సవంలో ఎంపీ ఎస్.మునిస్వామి, బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీ మునిస్వామి వేదికనుద్దేశించి మాట్లాడుతుండగా మంత్రి భైరతి సురేష్ అడ్డు తగిలి భూ కబ్జాదారులను పక్కన బెట్టుకుని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అనడంతో తోక తొక్కిన తాచులా లేచిన బంగారుపేటె ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి ఎవరు భూ కబ్జాదారులు అంటూ ఎంపీ వైపునకు ఆవేశంగా ఊగిపోతూ దూసుకువెళ్లారు. తానేమి తక్కువ కాదంటూ ఎంపీ కూడా అదే దూకుడుతో నారాయణస్వామి వైపునకు వచ్చారు. ఒక దశలో ఇద్దరు పరస్పరం చేయి చేసుకునేదాకా వెళ్లారు. అయితే అక్కడే ఉన్న పోలీసులు ఇద్దరిని వారించారు. దీన్నంతా చోద్యంగా చూస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి భైరతి సురేష్, కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌లు ఇద్దరినీ సమాధాన పరిచారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..



షాట్‌పుట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

బళ్లారి రూరల్: గెలుపైనా, ఓటమైనా విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని మేయర్ త్రివేణి తెలిపారు. సోమవారం ఆర్‌వైఎంఈసీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా పీయూ కళాశాలల విద్యార్థుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజం అని, పాల్గొనడమే ప్రధానమని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపును తేవాలన్నారు. క్రీడాపోటీల్లో భాగంగా బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, కురుగోడు, సండూరు తాలూకాల్లోని వివిధ కళాశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపమేయర్ జానకి, జిల్లా క్రీడాశాఖాధికారి రహమతుల్లా, బెస్ట్ కళాశాల ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్ కుమార్, జిల్లా ప్రిన్స్‌పాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైల్, ఉపన్యాకుల సంఘ అధ్యక్షుడు ఎం.రామణ్ణ, బెస్ట్ ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సంబరంగా గణేష్ ఊరేగింపు



వీహెచ్‌పీ గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: వినాయక చవితి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ గణపతికి స్థానిక సెంటినరి హాల్‌లో ఏడు రోజుల పాటు పూజలు నిర్వహించి సోమవారం సాయంత్రం రాయల్ సర్కిల్ మీదుగా బెంగళూరు రోడ్డు, తేరు వీధి, మోతీ సర్కిల్ మీదుగా నిమజ్జనానికి తరలించారు. ఈ గణపతి ఉత్సవంలో మహారాష్ట్రకు చెందిన బ్యాండు వాయిద్యాలు, డోలు తదితర బృందాలతో పాటు భారీ ఎత్తున స్పీకర్లను ఏర్పాటు చేసి స్థానిక యువకులు ఉత్సాహంగా చిందులు వేస్తూ ఆనందోత్సవాల మధ్య విశ్వ హిందూ గణపతిని నగరవాసులు ఐకమత్యంగా అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో విశ్వ హిందూ పరిషత్ పదాధికారులు అశోక్, నగర ప్రముఖులు పోలా రాధాకృష్ణ, ఐనాథ్ రెడ్డి, మురారీ యజమాని, ఉజ్వల తదితరులతో పాటు వీహెచ్‌పీ సమితి సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న బసవరాజ్ నాయక్

రాయచూరు రూరల్: రాయచూరును కరువు జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బసవరాజ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రజలు వలసలు వెళుతుంటే వ్యవసాయ, రెవిన్యూ శాఖాధికారులు సమీక్షలు జరిపి సర్కార్‌కు కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ నివేదికలు పంపాలన్నారు. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించాలన్నారు. సాగు నీటి వాటాల విషయంలో కోడిహళ్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం హాసన్ జిల్లా అరసికెరె నుంచి బెంగళూరు వరకు పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు.

పేదలకు భూ వసతి కల్పించాలి



మాట్లాడుతున్న ఆంజనేయ

రాయచూరు రూరల్: జిల్లాలో పేదలకు భూ వసతిని కల్పించాలని పోరాట సమితి జిల్లాధ్యక్షుడు ఆంజనేయ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలోని పోరంబోకు, చౌడు, ఇనాం, సర్కారీ మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. మరో వైపు ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలన్నారు. గాణదాళ, జె.మల్లాపుర, బాపురల్లో పేదలు భూములను వ్యవసాయం చేస్తుంటే ఈ భూములు తమవేనంటూ భూస్వాములు అడ్డు తగలడాన్ని ఖండించారు.

సమాన హక్కులతో సదృఢ సమాజం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సదృఢ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలబుర్గి విశ్వవిద్యాలయ సిండికేట్ మాజీ సభ్యురాలు ప్రతిభ చాయ పేర్కొన్నారు. సోమవారం కలబుర్గి వీజీ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళలకు హక్కులు, విధులు, సమానత్వం, విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధనకు వీలవుతుందన్నారు. మహిళా స్వేచ్ఛకు హద్దులుండాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతల గురించి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో వీజీ మహిళా కళాశాల పిన్సిపాల్ రాజేంద్ర కొండా, ఉమా రేవూర్, చంద్రకళా పాటిల్, మంగళ, సుష్మా, శరణమ్మ, శివలీల, నాగేంద్ర, జ్యోతి ప్రకాష్, రేణుక పాల్గొన్నారు.

తుమకూరులో జనతాదర్శన్

తుమకూరు: ప్రజల నుంచి ఎలాంటి అర్జీలు వచ్చినా కూడా వాటిని ఎవరు తిరస్కరించకుండా పరిష్కరించాలని, ప్రభుత్వంలో పని చేసే ప్రతి ఒక్కరూ ప్రజల కోసం పని చేయాలని హోం మంత్రి జీ. పరమేశ్వర్ అన్నారు. సోమవారం తుమకూరు గ్లాస్ హౌస్ వద్ద ఉన్న అమానికెరె పార్కులో జనతా దర్శన్‌ని నిర్వహించారు. ప్రజల నంచి అర్జీలను స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి సమస్యలను వినిపించారు.

శరణుల ఆదర్శాలు అనుసరణీయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం ప్రముఖులు

కంప్లి: శరణుల ఆదర్శాలు అనుసరణీయాలని రాష్ట్రీయ బసవ దళ సంపన్మూల వ్యక్తి వచనాంబిక అన్నారు. పట్టణంలోని అక్కమహాదేవి మహిళా మండలి తరపున సంగత్రాయ సంస్కృత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వగురు బసవణ్ణ సంస్మరణ శరణ సంగమ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. రైస్ మిల్లర్ల సంఘ తాలూకా అధ్యక్షులు కే.హేమయ్యస్వామి మాట్లాడుతూ బసవణ్ణ విచారధారలు నేటికీ అమలులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బసవ ధ్వజారోహణం, 12వ శతాబ్దపు శరణుల అనుభవాలు, బసవతత్వ చింతనల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు ముక్కంది శివగంగమ్మ, పదాధికారులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

కేజీఎఫ్: బాలికపై లైంగిక దాడి చేసిన ఘటన కేజీఎఫ్‌లో చోటు చేసుకుంది. కేజీఎఫ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని బాగలకోటె జిల్లా ముధోళ తాలూకాకు చెందిన లోకాపుర గ్రామానికి చెందిన సచిన్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని నమ్మించి కేజీఎఫ్ బస్టాండు వద్దకు తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఘటనపై విద్యార్థిని తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రక్తస్రావంతో బాధపడుతున్న విద్యార్థినిని స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కోలారు ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాబర్ట్‌సన్ పేట పోలీసులు నిందితుడు సచిన్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.